# Telaṅgāṇa navalalu - vr̥tti jīvana citraṇa

Thesis submitted to the University of Hyderabad in partial fulfilment of the Degree of Doctor of Philosophy)


Researcher

Janardan Godicharla

13HTPH15



Department of Telugu

School of Humanities

University of Hyderabad

Hyderabad – 500046

Telangana


June – 2019

# తెలంగాణ నవలలు – వృత్తి జీవన చిత్రణ

**(పిహెచ్.డి. పట్టా కోసం హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి సమర్పించిన**

**పరిశోధన గ్రంథం)**


పరిశోధన

**జనార్ధన్ గాడిచర్ల**

13HTPH15

పర్యవేక్షణ

**ఆచార్య ఎస్. శరత్ జ్యోత్స్నా రాణి**

తెలుగుశాఖ

మానవీయశాస్త్రాల విభాగం

హైదరాబాద్ విశ్వవిద్యాలయం

హైదరాబాద్ – 500046

తెలంగాణ


జూన్ – 2019

# DECLARATION

I, JANARDAN GODICHARLA hereby declare that this Thesis entitled "Telaṅgāṇa navalalu - vr̥tti jīvana citraṇa" Submitted by me under the guidance and supervision of **Prof. S. Sarat Jyotsna Rani** is a bonafide research work. I also declare that it has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma. I hereby agree that my thesis can be deposited in Shodganga/ INFLIBNET

Date: JANARDAN GODICHARLA

Place: Hyderabad Regd. No.13HTPH15

# CERTIFICATE

This is to certify the Thesis entitled "**Telaṅgāṇa navalalu - vr̥tti jīvana citraṇa**" submitted by **Mr. Janardan Godicharla** bearing **Regd. No. 13HTPH15** in partial fulfilment of the requirements for the award of Doctor of Philosophy in the School of Humanities, Department of Telugu is a bonafide work carried out by him under my supervision and guidance.

The thesis is free from plagiarism and has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma.

**A. Published in the following publications:**

Parts of this thesis have been: (NOT EXACT PARTS. Issues discussed in the following papers have been presented elaborately in the chapter-4 of the thesis.)

1. **"Telaṅgāṇa navalalu - gauḍa vr̥tti jīvana citraṇa"** (ISBN 978-93-87540-42-2), 4th Chapter. Pg.NO. 288 - 293, 2018. "**Vyāsa dīpika (sāhitya vyāsālu)**" Edited by P. Usharani. Principle S.G.V.O. College. Timmasamudram.
2. **" 'Saṅkeḷḷu tegāyi' navala - maṅgali vr̥tti jīvita citraṇa"** (ISSN 2456 - 4702), Pg.No.35, 36, December, 2018. "Bhāva vīṇa" Editor by Kolla Sri Krishnarao. Published by Kolla Sri Krishnarao, Guntur.

and

**B. Presented in the following conferences:**

(Issues presented in the following papers have been discussed elaborately in the chapter - 4 of the thesis.)

1. **"Aitā candrayya'Talli bhārati' navala - dēśa bhakti bhāvana"** (National), By JYOTSNA KALA PITHAM HYDARABAD & CHITKALA VAHINI HYDERABAD. On 19th- 20th January, 2018.
2. **"Guvvala cennā' navala - padmaśālīla jīvana citraṇa"** (International), Seminar Director by Dr. V. Triveni. Department of Telugu, Telangana University. On 05 - 07 March, 2019.

Further, the Student has passed the following courses towards fulfillment of coursework requirement for Ph.D. Progrmme as detailed below.

| **Course Code** | **Name** | **Credits** | **pass/fail** |
|---|---|---|---|
| 1. HT700 | Research Methodology | 4.00 | PASS |
| 2. HT701 | History of Telugu Research | 4.00 | PASS |
| 3. HT702 | Society and Literature | 4.00 | PASS |
| 4. HT703 | Studies in specialized Area | 4.00 | PASS |

Prof. S. SARAT JYOTSNA RANI Prof. G. ARUNA KUMARI Prof. Prof. S. SARATH JYOTSNA RANI

**Research Supervisor** **Head, Telugu** **Dean, Humanities**

# విషయసూచిక


**కృతజ్ఞతలు** i - ii

**ముందుమాట** iii - vi

**అధ్యాయం — 1**

**తెలంగాణ నవల పరిచయం** **1 — 12**

1. సాహిత్యం – నవల 1

1.1. నవల నిర్వచనం 1

1.2. నవలా లక్షణాలు 2

1.3. తెలంగాణ నవల సాహిత్యం 3

1.3.1. తెలంగాణ ఉద్యమ నవలలు 10

1.3.2. తెలంగాణ చారిత్రక నవలలు 11

1.3.3. తెలంగాణ మాండలిక నవలలు 12

**అధ్యాయం - 2**

**తెలంగాణ వృత్తి నవలలు — ఇతివృత్త విశ్లేషణ** **13 - 57**

2. తెలంగాణ నవల – వృత్తి 13

2.1. వర్ణ కుల వ్యవస్థ ఆవిర్భావం 13

2.1.1. వర్ణవ్యవస్థ ఆవిర్భావం 14

2.2. వర్ణశబ్ద నిర్వచనాలు 14

2.3. కులవ్యవస్థ ఆవిర్భావం 15

2.3.1. కుల నిర్వచనాలు 16

2.4. పెరటి చెట్టు (1954) 17

2.5. సంఘము (1955) 22

2.6. సుషుప్తి(1975) 26
2.7. మోహిని (1994) 33
2.8. సంకెళ్లు తెగాయి (1994) 38
2.9. కక్క (2000) 41
2.10. బతుకుతాడు (2004) 46
2.11. గువ్వల చెన్నా(2005) 48
2.12. కల్లు మండువ(2006) 53

**అధ్యాయం –3**

**తెలంగాణ వృత్తి నవలలు – పాత్ర చిత్రణ 58 -126**

3.1. పాత్రలు – పాత్రల రకాలు – పాత్ర చిత్రణ 58
3.2. తెలంగాణ వృత్తి నవలలు వర్గీకరణ – పాత్రల పేర్లు 71
3.2.1. ప్రధాన పాత్రలు 71
3.2.1.1. రాజాగౌడ్ (పెరటిచెట్టు) 71
3.2.1.2. దుర్గాప్రసాద్ (సంఘము) 72
3.2.1.3. గోవింద్ (సుషుప్తి) 73
3.2.1.4. చిప్పమల్లయ్య (గువ్వల చెన్నా) 76
3.2.1.5. నారాయణ (సంకెళ్ళు తెగాయి) 77
3.2.1.6. నారాయణగౌడ్ (బతుకుతాడు) 79
3.2.1.7. మోహిని (మోహిని) 81
3.2.1.8. కక్క (కక్క) 82
3.2.1.9. ధర్మభిక్షం (కల్లుమండువ) 84
3.2.2. ఆదర్శ పాత్రలు 85
3.2.2.1. బాలాగౌడ్ (పెరటిచెట్టు) 85

3.2.2.2. జోగేంద్ర (సంఘము) 86
3.2.2.3. నర్సయ్య (సంఘము) 86
3.2.2.4. దేవకి (సుషుప్తి) 87
3.2.2.5. శంకరయ్య (గువ్వల చెన్నా) 88
3.2.2.6. శ్రీరాం (గువ్వలచెన్నా) 89
3.2.2.7. వేదప్రకాశ్ (సంకెళ్ళు తెగాయి) 89
3.2.2.8. ఈరయ్య (సంకెళ్ళు తెగాయి) 90
3.2.2.9. బాలయ్య (సంకెళ్ళు తెగాయి) 90
3.2.2.10.. శ్రీనివాస్ గౌడ్ (బతుకుతాడు) 91
3.2.2.11. కాటమయ్య (మోహిని) 92
3.2.2.12. చైతన్య (మోహిని) 93
3.2.2.13. వెంకటయ్య (కల్లుమందువ) 93
3.2.2.14. ఫకీరయ్య (కక్క) 94
3.2.3. ప్రతినాయక పాత్రలు 95
3.2.3.1. రామారావు(పెరటిచెట్టు) 95
3.2.3.2. భుజంగ రావు (సంఘము) 95
3.2.3.3. రామలింగం (సంఘము) 96
3.2.3.4. రాజేశ్వరరావు (సంకెళ్ళు తెగాయి) 96
3.2.3.5. రామేశ్వరరావు (సంకెళ్ళు తెగాయి) 96
3.2.3.6. లక్ష్మణరావు పటేలు (బతుకుతాడు) 97
3.2.3.7. పెద్ద పటేలు (కక్క) 98
3.2.4. స్త్రీ పాత్రలు 98
3.2.4.1. గంగమ్మ (పెరటిచెట్టు) 98
3.2.4.2. ఎల్లమ్మ (పెరటిచెట్టు) 99
3.2.4.3. బుచ్చమ్మ (సంఘము) 99

| | | |
|---|---|---|
| 3.2.4.4. | శ్యామల (సంఘము) | 100 |
| 3.2.4.5. | ఎంకమ్మ (సుషుప్తి) | 100 |
| 3.2.4.6. | చుక్క (సుషుప్తి) | 102 |
| 3.2.4.7. | లింగమ్మ (గువ్వల చెన్నా) | 103 |
| 3.2.4.8. | మల్లీశ్వరి (గువ్వల చెన్నా) | 103 |
| 3.2.4.9. | రంగమ్మ (సంకెళ్ళు తెగాయి) | 103 |
| 3.2.4.10. | అనల (సంకెళ్ళు తెగాయి) | 104 |
| 3.2.4.11. | లింగమ్మ (బతుకుతాడు) | 105 |
| 3.2.4.12. | లక్ష్మి (బతుకుతాడు) | 105 |
| 3.2.4.13. | సుందరమ్మ (మోహిని) | 106 |
| 3.2.4.14. | అనసూయ (మోహిని) | 106 |
| 3.2.4.15. | కలెమ్మ (కక్క) | 107 |
| 3.2.4.16. | లస్మి (కక్క) | 107 |
| 3.2.4.17. | సీతమ్మ (కల్లుమండువ) | 108 |
| 3.2.4.18. | స్వరాజ్యం (కల్లుమండువ) | 108 |
| 3.2.5. | అప్రధాన పాత్రలు | 109 |
| 3.2.5.1. | ముత్యం (సుషుప్తి) | 109 |
| 3.2.5.2. | ఎల్లమ్మ (సుషుప్తి) | 109 |
| 3.2.5.3. | వీరయ్య (గువ్వల చెన్నా) | 110 |
| 3.2.5.4. | రాజేశం (గువ్వల చెన్నా) | 110 |
| 3.2.5.5. | రాజలింగం (గువ్వల చెన్నా) | 111 |
| 3.2.5.6. | భారతి (సంకెళ్ళు తెగాయి) | 111 |
| 3.2.5.7. | సుశీల (సంకెళ్ళు తెగాయి) | 111 |
| 3.2.5.8. | అనంత శర్మ (సంకెళ్ళు తెగాయి) | 112 |
| 3.2.5.9. | ఆనందరావు (సంకెళ్ళు తెగాయి) | 112 |

3.2.5.10. లింగప్ప, సోమయ్య (సంఘము) 112
3.2.5.11. ఎల్లాగౌడ్ (పెరటి చెట్టు) 113
3.2.5.12. మెహిత్మం (పెరటిచెట్టు) 113
3.2.5.13. రాంభట్ల కృష్ణమూర్తి (కల్లుమందువ) 113
3.2.5.14. కిరణ్ (కల్లుమందువ) 114
3.2.6. సేవక పాత్రలు 114
3.2.6.1. నాజరు (కక్క) 114
3.2.6.2. గఫ్రూసాబ్ (సంఘము) 114
3.2.6.3. దావూద్ (సుషుప్తి) 115
3.2.7. వ్యాపారవర్గ పాత్రలు 116
3.2.7.1. శివలింగం సేటు (పెరటి చెట్టు) 116
3.2.7.2. నాగనాథం (సంఘము) 116
3.2.7.3. రంగమ్మ (సుషుప్తి) 116
3.2.8. సహాయక పాత్రలు 117
3.2.8.1. సుభాష్ (మోహిని) 117
3.2.8.2. రాముల (సుషుప్తి) 117
3.2.8.3. మీనయ్య (సుషుప్తి) 118
3.2.8.4. లక్ష్మీరాజం (గువ్వల చెన్నా) 119
3.2.8.5. రమేశ్ (గువ్వల చెన్నా) 119
3.2.8.6. అయ్యమ్మ (కక్క) 120
3.2.8.7. వెంకయ్య (సంఘము) 120
3.2.8.8. ధర్మయ్యగౌడ్ (బతుకుతాడు) 120
3.2.8.9. భూమయ్యగౌడ్ (బతుకుతాడు) 122
3.2.8.10. లక్ష్మణ్ గౌడ్ (బతుకుతాడు) 123
3.2.8.11. మారయ్య (కల్లుమందువ) 125

3.2.8.12. వీరన్న (కల్లుమండువ) 125

**అధ్యాయం - 4**

**తెలంగాణ నవలలు — వృత్తి జీవన చిత్రణ** **127 - 199**

4.1. సామాజిక సంబంధాలు 128
4.1.1. వృత్తి నవలల్లో కుటుంబ జీవన చిత్రణ 129
4.1.1.1. భార్య భర్తల సంబంధం 130
4.1.1.2. స్త్రీలపై వేదింపులు 132
4.1.1.3. తండ్రి, కొడుకల సంబంధం 134
4.1.2. ప్రకృతి — వృత్తి సంబంధం 136
4.1.3. గ్రామీణ వ్యవస్థ 139
4.1.4. వృత్తులకు మధ్యగల సంబంధం 141
4.1.5. వృత్తులపై వివక్ష మరియు దౌర్జన్యాలు 143
4.2. వెట్టి 149
4.3. ఆర్థిక వ్యవస్థ 153
4.3.1. వ్యాపార వ్యవస్థ 160
4.3.2. ముస్తాజుదారులు (కాంట్రాక్టర్లు) 163
4.4. సేవకులు (జవానులు, బంట్రోతులు) 167
4.5. రాజకీయ రంగం 170
4.5.1. గ్రామ / కుల పంచాయితీలు 170
4.5.2. ఎన్నికలు 173
4.6. అధికారుల వేదింపులు 175
4.7. సహకార సంఘాలు 180

4.8. విద్యావ్యవస్థ 184

4.9. సాంస్కృతిక సంబంధాలు 187

4.9.1. వివాహం 188

4.9.2. పండుగలు 190

4.9.3. బతుకమ్మ పండుగ 191

4.9.4. కులపురాణాలు 193

4.10. ముగింపు 198

**ముగింపు** **200 -202**

**ఉపయుక్త గ్రంథ సూచి** **203 - 207**

**పుస్తకాల్లో, మ్యాగజిన్‌లలో ముద్రితమైన వ్యాసాలు** **208 -209**

**జాతీయ,అంతర్జాతీయ సదస్సుల్లో సమర్పించిన పరిశోధన పత్రాల ధ్రువ పత్రాలు210 -224**

# కృతజ్ఞతలు

కష్టాల కడలిలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంటూ నన్ను ఉన్నతున్ని చేయాలనే ఆశతోప్రతిక్షణం నా గురించి ఆలోచించే నా తల్లిదండ్రులు గౌడిచర్ల అనసూయ,అంజయ్యలకు పాదాభివందనాలు.

పరిశోధనకు అవకాశం కల్పించిన తెలుగుశాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయం వారికీ,

నా పరిశోధనకు అన్ని వేళల్లోను అండగా ఉంటూ, విలువైన సూచనల్ని అందించి పరిశోధన చేయించిన సహృదయులు, ప్రస్తుత స్కూల్ ఆఫ్ హ్యూమనిటీస్ డీన్, గురువులాంటి మా అమ్మ ఆచార్య యస్. శరత్ జ్యోత్స్నారాణి గారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు.

తెలుగుశాఖ ప్రస్తుత అధ్యక్షులు ఆచార్య అరుణకుమారి గారికీ, ఆచార్య తుమ్మల రామకృష్ణ గారికీ, ఆచార్య రేమిల్ల వేంకట రామకృష్ణ శాస్త్రి గారికీ, ఆచార్య పిల్లలమర్రి రాములు గారికీ, ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారికీ,ఆచార్య గోనా నాయక్ గారికీ, ఆచార్య యెండ్లూరి సుధాకర్ గారికీ, డా. పమ్మి పవన్ కుమార్ గారికీ, డా.డి. విజయలక్ష్మి గారికీ, డా. బి. భుజంగరెడ్డి గారికీ, డా. విజయకుమారి గారికీ హృదయపూర్వక కృతజ్ఞతలు.

ఎప్పుడు కలిసిన ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు అడిగే పెద్దలు శ్రీ.వి.వి. రమణ గారికీ,

యు.జి.సి. పరీక్షకు సన్నద్ధమవుతున్నప్పుడు మొదటి పేపర్ బోధించిన ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ గారికీ, మరియు ఆచార్య వి. సత్తిరెడ్డి గారికీ, ఆచార్య పగడాల చంద్రశేఖర్ గారికీ,

నా పరిశోధనకు విలువైన సలహాలు అందించిన వేముల ఎల్లయ్య గారికీ, సంగిశెట్టి శ్రీనివాస్ గారికీ, పత్తిపాక మోహన్ గారికీ, కాలువ మల్లయ్య గారికీ,

స్నేహితులు రామయ్య, కరుణాకర్, డి. శ్రీను, ఇంద్రగౌడ్, ఇ. శ్రీనివాస్, ఎ. శ్రీను మరియు బాల్యం నుండి నేటివరకు నాతో పాటుగా చదువుకున్న మిత్రులందరికీ,

పరిశోధక మిత్రులు  అంజన్న, నారాయణ, భగ్గన్న, మోహన్, పులివర్తి రమేష్ చిరంజీవి, రాయమల్లు, లింగమల్లయ్య, శ్రీనివాసరావు, శోభన్ బాబు, లింగరాజు, దేవయ్యలకూ,

ప్రేమాభిమానాలకు మారుపేరైనా అక్కబావలు చిలువేరురమాదేవి అంజయ్య, చెల్లెబావ మెతుకు రజిత వీరన్నలకు మరియు అల్లుండ్లు, కోడలికీ,

నా పరిశోధనను అందంగా డి.టి.పి చేసి నాకు సహకరించిన ఆప్తులు కళ్యాడపు రమేష్, గరిగె రాజేష్, మల్లేష్ మరియు అశోక్ అన్నకూ,

తెలుగుశాఖ కార్యాలయ సిబ్బందికీ,

ఇందిరాగాంధీ మెమోరియల్ గ్రంథాలయం హైదరాబాదు విశ్వవిద్యాలయం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కేంద్ర గ్రంథాలయం వారికీ,

నాకు తెలిసి కొందరు, తెలియకుండా మరికొందరు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన వారందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

– గౌడిచర్ల జనార్ధన్

# ముందుమాట

## పరిశోధన లక్ష్యం

ఈనాడు మనం సాహిత్యాన్ని ప్రాచీన సాహిత్యమని, ఆధునిక సాహిత్యమని రెండు రకాలుగా చెప్పుకుంటున్నాం. క్రీ.శ. 11 వ శతాబ్దం నుండి తెలుగు సాహిత్యం ఉన్నట్లు తెలుస్తుంది. క్రీ.శ. 11 శతాబ్దం నుండి 19వశతాబ్దం పూర్వార్ధం వరకు వెలువడిన సాహిత్యాన్ని ప్రాచీన సాహిత్యం అంటున్నాము. ప్రాచీన సాహిత్యంలో ఇతిహాసాలు, పురాణాలు, కావ్యాలు, ప్రబంధాలు, రూపకాలు, శతకాలు ప్రధాన సాహిత్య ప్రక్రియలు. 19వ శతాబ్దం ఉత్తరార్ధం నుండి నేటి వరకు ఆధునిక సాహిత్యం అంటున్నాం. ఆధునిక సాహిత్యంలో నవల, నాటిక, కథ, కవిత్వం,గేయం, విమర్శ, వ్యాసం, స్వీయ, జీవిత చరిత్రలు ప్రధాన సాహిత్య ప్రక్రియలు.

నేటి ఆధునిక నవలలో స్త్రీ జీవిత చిత్రణ, దళిత జీవిత చిత్రణ, ప్రాంతీయ చిత్రణలతో పాటు వివిధ వృత్తుల చిత్రీకరణ జరుగుతుంది. అంతేకాకుండా విలువల విధ్వంసం, అమానవీయత, మానవ సంబంధాలు, ఉమ్మడి కుటుంబాల విచ్ఛత్తి, గ్రామీణ జీవితాలలో వస్తున్న మార్పులు, నగర జీవన సంక్షోభం, పర్యావరణం, ప్రపంచీకరణ మొదలైన సామాజిక విషయాలను నవల నేడు మునుపెన్నడు లేని విధంగా గాఢంగా స్పృశిస్తోంది. నూతన పరిణామాలను ఆహ్వానిస్తుంది. వివిధ సంఘటనలకు, ఉద్యమాలకు, పోరాటాలకు నేటి నవలకారుడు స్పందిస్తున్నాడు. తెలంగాణలో నేడు నవలా వృత్తి జీవన చిత్రణలో భాగంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను ఇలా ఎన్నో అంశాలను తెలుసుకోవడమే ఈ పరిశోధన లక్ష్యం.

## పరిశోధన ఉద్దేశ్యం

తెలుగు సాహిత్యంలో భిన్న ప్రక్రియలపై ఎన్నో పరిశోధనలు జరిగాయి, జరుగుతున్నాయి. కాని నవలా సాహిత్యంలో అందునా తెలంగాణ నవలా సాహిత్యంపై

ఎవరూ దృష్టి పెట్టలేదు. విశ్వవిద్యాలయాల్లో అంతగా విస్తృత స్థాయిలో ఎవరూ పరిశోధించినట్టు కనబడలేదు. నా ఈ 'తెలంగాణ నవలలు – వృత్తి జీవన చిత్రణ' అనే పరిశోధన వల్ల ఆ దిశగా మరిన్ని పరిశోధనలు వచ్చే అవకాశం ఉంది.

**పరిశోధన పరిధి**

సాహిత్యం సమాజానికి ప్రతిబింబం. సమాజంలోని మంచి, చెడుల్ని దాని ఉత్థాన పతనాల్ని అర్థం చేసుకోవడానికి సాహిత్యం ఒక ప్రధాన సాధనంగా ఉపయోగపడుతుంది. సమాజంలో ఉండే అంశాలే సాహిత్యంలో ప్రతిఫలిస్తుంటాయి.

తెలుగు నవలలో ఏదో ఒక సందర్భంలో కులవృత్తుల గురించి, వారి జీవితాలను సూచన ప్రాయంగా చిత్రించిన సందర్భాలు మనకు కనబడతాయి. తెలంగాణ నుండి పూర్తిగా వృత్తి నేపథ్యంగా వచ్చిన నవలలను (పెరటిచెట్టు, సంఘము, సుషుప్తి, మోహిని, సంకెళ్ళు తెగాయి, గువ్వల చెన్నా, కక్క, కల్లుమండువ) మాత్రమే నా పరిశోధనకు ప్రధాన ఆకరాలు.

పూర్వ పరిశోధనలు

తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియలపై భిన్నకోణాల్లో వివిధ విశ్వవిద్యాలయాల్లో ఎన్నో పరిశోధనలు జరిగాయి. "తెలుగులో ప్రసిద్ధ వైద్య వృత్తి ప్రతిపాదక నవలలు – సవిమర్శక సమీక్ష (1998)" అన్న అంశంపై కోసూరి దామోదరనాయుడు శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయానికి పిహెచ్.డి. పట్టా కోసం సిద్ధాంత గ్రంథం సమర్పించారు. 'జాతశ్రీ కథలు – వృత్తి జీవిత చిత్రణ (2013)' అనే అంశంపై బి. అంజయ్య హైదరాబాదు విశ్వవిద్యాలయానికి ఎం.ఫిల్. పట్టాకోసం పరిశోధన వ్యాసాన్ని సమర్పించారు. 'ఆధునిక సాహిత్యంలో వృత్తి చైతన్యం' అన్న అంశంపై లంకా వేంకటేశ్వర్లు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి పిహెచ్.డి. పట్టాకోసం సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. 'నేటి కథ (2000 – 2010) – వృత్తి జీవన చిత్రణ – అధ్యయనం' అనే అంశంపై గుడుగుంట్ల ఆంజనేయులు హైదరాబాదు విశ్వవిద్యాలయానికి పిహెచ్.డి. పట్టాకోసం సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. ఇలా అనేకమైన పరిశోధన గ్రంథాలు వచ్చినప్పటికీ తెలంగాణ నవల

ఆధారంగా వృత్తి జీవన చిత్రణ కోణంలో పరిశోధన లేదు. ప్రస్తుత నా పరిశోధనాంశం "తెలంగాణ నవలలు – వృత్తి జీవన చిత్రణ" అనే శీర్షికపై ఆ కోణంలో పరిశోధన చేశాను. ఇంతవరకూ ఈ అంశాన్ని ఎవరూ స్పృశించలేదు.

**అధ్యాయ విభజన**

పరిశోధనకు సంబంధించిన ప్రాథమిక సమాచారాన్ని సేకరించి, నా పరిశోధనలో భాగంగా మా పర్యవేక్షకుల సలహాలు, సూచనలు పాటిస్తూ, సేకరించిన సమాచారాన్ని సమీక్షించాను. క్షేత్రపర్యటనలో భాగంగా వివిధ విశ్వవిద్యాలయాలను, గ్రంథాలయాలను సందర్శించాను. సేకరించిన సమాచారాన్ని పరిశీలనా సౌలభ్యంకోసం నాలుగు అధ్యాయాలుగా వర్గీకరించాను. అవి

1. తెలంగాణ నవల పరిచయం
2. తెలంగాణ వృత్తి నవలలు – ఇతివృత్త విశ్లేషణ
3. తెలంగాణ వృత్తి నవలలు – పాత్ర చిత్రణ
4. తెలంగాణ నవలలు – వృత్తి జీవన చిత్రణ

మొదటి అధ్యాయంలో నవల నిర్వచనాలు, లక్షణాలు తెలపడం జరిగింది. తెలంగాణలో మొదటి నవల 'కంబుకందర'తో పాటుగా వచ్చిన నవలలను పేర్కొంటూ, ప్రముఖ రచయితల నవలలను పరిచయం చేయడం జరిగింది. తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో వచ్చిన నవలలను, తెలంగాణ చారిత్రక నవలలతోపాటుగా తెలంగాణ మాండలిక నవలలను పేర్కొనడం జరిగింది.

రెండవ అధ్యాయంలో కుల, వర్ణ నిర్వచనాలను వివరించడం జరిగింది. ప్రధానంగా నా పరిశోధనకు సంబంధించిన తెలంగాణ వృత్తి నవలల ఇతివృత్తాన్ని స్థూలంగా పరిచయం చేయడం జరిగింది. ఇప్పటికే కొన్ని నవలల ప్రచురణ ప్రతులు లభించడం లేదు. నవలలు పూర్తి స్థాయిలో అందుబాటులో లేకపోయినా కనీసం వాటి సారాంశాన్ని భద్రపరిస్తే రానున్న తరానికి ఉపయోగపడుతుందనే ఉద్దేశ్యంతో ఒక అధ్యాయంగా చేయడం జరిగింది.

మూడవ అధ్యాయంలో పాత్రలను పరిచయం చేసి, పాత్రల చిత్రణలో ఉన్న పద్ధతులను, పూర్వ పరిశోధకులు నవలల్లోని పాత్రలను వర్గీకరించిన విధానాలను పరిశీలించాక నేను తీసుకున్న నవలల్లోని పాత్రలను ఎనిమిది రకాలుగా వర్గీకరించాను. అవి ప్రధాన పాత్రలు, ఆదర్శ పాత్రలు, ప్రతినాయక పాత్రలు, స్త్రీ పాత్రలు, అప్రధాన పాత్రలు, సేవక పాత్రలు, వ్యాపారవర్గ పాత్రలు, సహాయక పాత్రలుగా విభజించి పాత్రల గుణ, రూప, స్వభావాలను, వ్యక్తిత్వాలను గురించి విశ్లేషించాను.

నాల్గవ అధ్యాయంలో భాగంగా వృత్తులకు సంబంధించిన నవలలను సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక అంశాలుగా విభజించాను. సామాజిక సంబంధాల్లో కుటుంబ చిత్రణ, భార్యాభర్తల సంబంధం, స్త్రీలపై జరిగే వేదింపులు, తండ్రికొడుకుల సంబంధాలు చర్చించాను. ఈ సంబంధాలలో వ్యక్తికి ఆత్మీయతను, సంతోషాలనందించేది కుటుంబ వ్యవస్థే. అందుకే సమాజంలో ఎదగడానికి కుటుంబ జీవనమే పునాది. ఈ నవలల్లో పనిలో భార్యాభర్తల ప్రాధాన్యం, కొడుకు భవిష్యత్తు గురించి ఆలోచించి చదువును ప్రోత్సహించే వారితోపాటు, తమ వృత్తి చేసుకొని బ్రతుకుతాడనే నమ్మి ..... ఇతివృత్తాలను పరిచయం చేయడం జరిగింది. ప్రకృతికి – వృత్తికి మధ్యగల సబంధం, గ్రామీణ వ్యవస్థ, వృత్తులకు మధ్యగల సంబంధం, వృత్తులపై దొరల దౌర్జన్యం, మరియు వెట్టి విధానం, ఆర్థిక దోపిడి, సేవకుల అరాచకాల్ని, కులపంచాయితీల తీర్పులను, ఎన్నికల్లో జరిగే అవకతవకల్ని, సహకార సంఘాలతోపాటుగా ముస్తాజుదార్ల దోపిడిని సవివరంగా వివరించాను. సాంస్కృతికాంశాల్లో వివాహం, పండుగలు, తెలంగాణకే సొంతమైన బతుకమ్మ గురించి, కులపురాణాల గురించి విశదపరిచాను. వృత్తుల్లో ఉండే ఆర్థిక సంఘర్షణను తెలియజేశాను. నేటి ఆధునికకాలంలో వస్తున్న మార్పులు వృత్తులపై ఎలాంటి ప్రభావాన్ని చూపుతున్నాయో వివరణాత్మకంగా విశ్లేషించాను.

# అధ్యాయం — 1

# తెలంగాణ నవల పరిచయం

## 1. సాహిత్యం — నవల

సాహిత్యం సమాజానికి ప్రతిబింబం. సాహిత్యం సమాజాన్ని ప్రతిబింబింపజేస్తుంది. సమాజం సాహిత్యాన్ని ప్రభావితం చేస్తుంది. ఈనాడు మనం సాహిత్యాన్ని ప్రాచీన సాహిత్యమని, ఆధునిక సాహిత్యమని రెండు రకాలుగా చెప్పుకుంటున్నాం. క్రీ.శ. 11వ శతాబ్దం నుండి తెలుగు సాహిత్యం ఉన్నట్లు తెలుస్తుంది. క్రీ.శ. 11వ శతాబ్దం నుండి 19వ శతాబ్దం పూర్వార్థం వరకు వెలువడిన సాహిత్యాన్ని ప్రాచీన సాహిత్యం అంటున్నాం. ప్రాచీన సాహిత్యంలో ఇతిహాసాలు, పురాణాలు, కావ్యాలు, ప్రబంధాలు, రూపకాలు, శతకాలు ప్రధాన సాహిత్య ప్రక్రియలు. 19వ శతాబ్దం ఉత్తరార్థం నుండి నేటివరకు ఆధునిక సాహిత్యం అంటున్నాం. ఆధునిక సాహిత్యంలో నవల, నాటకం, కథ, కవిత్వం, గేయం, విమర్శ, వ్యాసం, స్వీయ, జీవిత చరిత్రలు ప్రధాన సాహిత్య ప్రక్రియలు.

### 1.1. నవల నిర్వచనం

'నవల' అనే పదం Novel అనే ఆంగ్లపదం నుండి తెలుగులోకి వచ్చింది. Novel అనే ఆంగ్ల పదం Novelle అనే ఇటాలియన్ పదం నుండి వచ్చింది. సంస్కృతంలో 'నవలా' అనీ, మరాఠీ, కన్నడం భాషల్లో 'కాదంబరి' అనీ, బెంగాలీ, పంజాబీ, అస్సామీ, ఒరియా, హిందీ భాషల్లో 'ఉపన్యాస్' అనీ, ఉర్దూలో 'నవల' అనీ, గుజరాత్‌లో 'నవల్ కథా' అనీ, తమిళంలో 'పుదినం', 'కావల్' అని అంటారు. తెలుగులో మొదటగా వచన ప్రబంధం అని పిలిచేవారు. ఆ తర్వాత నవలగా స్థిరపడింది.

నవలకు నిర్వచనాలు విమర్శకులు చాలానే ఇచ్చారు.

"నవల ఇలాగే వుండాలి – ఇలా వుండకూడదు అని చెప్పే నిర్దేశిక సూత్రాలు అదృష్టవశాత్తు నవలకు లేవు. కాబట్టి నవలను వర్ణనాత్మక సూత్రాలతో మాత్రమే విశ్లేషించవలిసి వుంటుంది" (వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. 1994: 9).

"సాంఘిక జీవితానికి ప్రతిబింబంగా వ్యక్తుల జీవిత గమనాన్ని చిత్రిస్తూ, జనుల ఆచార వ్యవహారాలను వ్యక్తీకరించే గద్య ప్రబంధం 'నవల' అని నిర్వచించవచ్చు" (నాగభూషణశర్మ, మొదలి. 1971: 20)

"మనోరంజకమునతి విచిత్రమునైన జీవిత చిత్రణము నవల యనుట పండితార్థము" (వేంకట కుంటుంబరావు, బొడ్డుపాటి. 1971: 10)

"నవల మటే మనోరంజకత, అతి విచిత్రత, వాస్తవికత అను త్రిగుణములను కలిగియుండి యదార్థ జీవిత చిత్రణము వలన మనో నేత్రములకు గోచరించునట్లు భాసింపజేసేడి గద్యకావ్య ఖండికయే నవలగా సాహిత్యంలోకముచే నిర్వచింపబడుచున్నదని భావించవలసియుండును" (వెంకటేశ్వర్లు, పుల్లాభొట్ల. 1974: 48).

### 1.2. నవలా లక్షణాలు

- "నవల గద్య కావ్యం
- యుగ చిత్రణే దీనికి ప్రప్రథమ ధ్యేయం. అంటే సమకాలీన సమాజ మానవ జీవితాల చిత్రణే దీని లక్ష్యం.
- సహజమైన, స్వాభావికమైన శైలి దీనికి ప్రాణం.
- సర్వ మానవ జీవితానికి వ్యాపకమైన, విస్తృతమైన రూపం నవలలో ఉంటుంది.
- ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సర్వ విషయాల మీద రచయిత వ్యాఖ్యానానికి ఇందులో ఆస్కారం ఉంటుంది.
- కాల్పనిక సాహిత్యానికి సరళమైన, స్వాభావికమైన రూపం నవల.
- వ్యక్తుల కార్యాలు, చరిత్ర సంఘటనలకు బలం.
- మనో రంజకతతో పాటు విజ్ఞాన సముపార్జనం కూడా ఇందులో ఉంటుంది.
- యదార్థ జీవితంలో జరిగిన సత్యాల్ని నవలలో ప్రతిబింబిస్తాయి.
- వేదన, భావుకత ఈ రెండూ నవలకు ప్రేరణ శక్తులు.

- ఒక వ్యక్తి జీవితాన్ని గురించిగాని, జీవితంలో ఒక ముఖ్య భాగాన్ని గురించి గాని నవల చిత్రిస్తుంది.
- వివరణాత్మకము, వ్యాఖ్యానాత్మకము, నాటకీయము అయిన శైలీలో ఏ ఒక్క దానికి గాని, అన్నింటినిగాని నవలలో ప్రతిబింబింపజేయవచ్చు.
- నిద్రావస్థలో ఉన్న సర్వ విషయాలను, ఉద్వేగాలను వెలికి తెచ్చి వర్ణించడానికి తగిన సాధనం నవలే" (నాగభూషణశర్మ, మొదలి. 1971: 5, 6).

## 1.3. తెలంగాణ నవల సాహిత్యం

తెలంగాణ సాహిత్యానికి చారిత్రక, భౌగోళిక నేపథ్యం భిన్నమైంది. తెలంగాణ కథ, నవల, కవిత్వం పాటలలోని వస్తువు కూడా భిన్నంగా ఉంటుంది. తెలంగాణ రచయితలు యదార్థ జీవితాలను, ఉద్యమాలను తమ అనుభవాల ద్వారా తమదైన భాషలో వ్యక్తీకరిస్తున్నారు. వీరి రచనలో ప్రాంతీయత ఉట్టిపడుతుంది.

తెలంగాణ రచయితలు పూర్వం తమ యాసను, నుడికారంను అంతగా పట్టించుకోలేదు. కొందరు మాత్రమే వారి రచనలో తెలంగాణతనాన్ని చూపించారు. 1995 నుంచి తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వవాదం ప్రారంభమైంది. దాంతో పరిశోధకులు, విమర్శకులు 1956కి ముందు ఉన్న తెలంగాణ చరిత్రను, సాహిత్య ప్రక్రియలను వెతికి తమ అస్తిత్వ గౌరవాన్ని నిలుపుకున్నారు.

"తెలంగాణలో ఒకవిధంగా చూస్తే నవలా ప్రక్రియ 1860లోనే పుట్టింది. అది ఆశ్చర్యం కలిగించే విషయమే! నల్గొండ జిల్లా హుజూర్‌నగర్ ప్రాంతంలో పుట్టిన తడకమళ్ళ కృష్ణారావు 1860లో రచించిన 'కంబుకంధర చరిత్ర" తెలంగాణ నుంచి వచ్చిన మొదటి నవల. 1860లోనే ఆయన 'కామరూప కథ' అనే రచన కూడా చేశాడు. ఈ రెండు రచనల్లో ఆధునిక నవలా లక్షణాల బీజాలు కన్పిస్తాయి. తడకమళ్ళ కృష్ణారావు తన రచనలను 'వచన ప్రబంధం' అనే పేర్కొన్నాడు. వీటి వ్రాత ప్రతులను డా. సుంకిరెడ్డి నారాయణరెడ్డి మద్రాసులోని ప్రాచ్య లిఖిత భాండాగారంలో కనుగొన్నాడు" (సుజాతారెడ్డి, ముదిగంటి. 2011: ...). ఇలా నవలా రచనకు బీజాలు తెలంగాణలో బ్రిటీషాంధ్రలో కన్న ముందే కపడినా గ్రంథాలయోద్యమం, నిజాం వ్యతిరేక పోరాటం అక్షరాస్యత వంటి వివిధ కారణాల వల్ల నవలలు రాలేదు. అంతేగాక

ప్రచురణలు తక్కువగా ఉండడంవల్ల కథ, కవిత్వం, పాట వికసించినంతగా నవలా ప్రక్రియ వికసించలేదు.

1922లో శేషభట్టరు వేంకట రామానుజాచార్యులు 'ప్రాకృత దాంపత్యము' అనే నవల రాసి ప్రచురించారు. అది నల్గొండలోని ఉస్మానియా ముద్రణాలయంలో ముద్రించబడింది. కాసుల ప్రతాపరెడ్డి 'తెలంగాణ నవలలు' అనే వ్యాసంలో తెలిపారు. 1922 కంటే ముందు ఒద్దిరాజు సోదరులు నవలలు రాశారు. వీరిది వరంగల్ జిల్లా ఇనుగుర్తి గ్రామం. ఈ గ్రామం నుండే 1922లో 'తెనుగు పత్రిక' స్థాపించి ఆరేండ్లు విజయవంతంగా నడిపారు. వీళ్ళు 'రుద్రమదేవి', 'శౌర్యశక్తి', 'స్త్రీ సాహసము', 'భ్రమర', 'యుక్తలవ' మొదలగు నవలలను రచించారు. 'రక్తాంజలి', 'వీరావేశం', 'వరాహముద్ర' మొదలగు సామాజిక నవలలు రచించారు.

1910లో కొమర్రాజు లక్ష్మణరావు రాసిన కథ 'ఫూల్ జానీ బేగమ్'. దీన్ని శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి పెంచి నవలగా 1914లో ప్రచురించారు. ఈ నవల పేరు 'మిథునానురాగము'. తెలంగాణ నుంచి వచ్చిన మొదటి స్వతంత్ర పత్రిక 'హితబోధిని (1913 – 1915)'ని వెలువరించిన బండారు శ్రీనివాసరావు 1910లోనే 'ఆశాదోషం' అనే నవలను రాశారు. మహబూబ్‌నగర్ కోయిల్‌కొండ దుర్గానికి సంబంధించిన ఈ చారిత్రక నవల ముద్రణ రూపంలో అందుబాటులో ఉంది. ఖమ్మం జిల్లా భద్రాచలం ప్రాంతానికి చెందిన దేశ్ పాండ్య సోమరాజు రామానుజరాజు 1914లోనే 'మంజుమతి' అనే చారిత్రక నవల రాశారు. 1917లో సురవరం ప్రతాపరెడ్డి 'శుద్ధాంత కాంత' అనే నవలను, 1932లో 'ఆరె వీరులు' అనే మరొక నవల రాశారు.

తెలంగాణలో మహిళ రాసిన మొట్టమొదటి నవల శోభావతి. ఈ నవల 1924లో అచ్చయింది. ఇది నల్గొండ కవుల సంచికలో చోటు చేసుకుంది. రచయిత్రి సీట్ల పిరాటమ్మ. 1924లోనే విజ్ఞాన ప్రచారిణీ గ్రంథమాల వారు 'అనురాగ విపాకము' అనే నవల ప్రచురించారు. రచయిత్రి చాటాత్రి లక్ష్మీ నరసమాంబ.

తెలంగాణ విమోచనోద్యమ కాలంలోనూ ఆ తర్వాత కూడా తెలంగాణ నుంచి చాలా మంది నవలలు రచించారు. తెలంగాణలో ఏ సాహిత్య ప్రక్రియ అయిన నల్గొండ జిల్లా నుండె

వస్తుంది. 1930లో పైడిమర్రి వెంకట సుబ్బారావు 'కాల భైరవుడు' అనే నవల రాశారు. సోమయాజులు లక్ష్మీనరసింహశాస్త్రి 'గిరిజ', కొత్ర మల్లికార్జునశర్మ 'స్వర్ణలత' వంటి నవలలు రాశారు. పులాభొట్ల వెంకటేశ్వర్లు నవలలతో పాటు 'తెలుగు నవలా సాహిత్య వికాసం' అనే విమర్శనా గ్రంథం రాశారు.

తెలంగాణ చైతన్యానికి, పోరాటానికి అనునిత్యం పాటుపడ్డ వ్యక్తి వట్టికోట ఆళ్వారుస్వామి. ఈయన మొదటి నవల 'ప్రజల మనిషి'ని దేశోద్ధారక గ్రంథమాల తరపున 1955 జనవరిలో ప్రచురించారు. "చాలా భయంతో ఈ నవలను బయటికి తెస్తున్నాను. నవలలో తెలంగాణా సంభాషణల్లో రాశాను. మరి ఎంత వరకు సఫలుడినయ్యానో! ఇక నవల కథా విషయం. 1938లో హైదరాబాదులో స్టేటు కాంగ్రెసు పుట్టుకకు పూర్వం తెలంగాణ వాతావరణాన్ని ఆధారం చేసుకొని దాని ప్రభావం నుండి బయలుదేరిన ఒకరిని కథానాయకుడిగా తీసికొన్నాను. ఒక శిల్పం విషయం. ఇతివృత్తం, పాత్రలు, సంభాషణలు, వాతావరణం, జీవనతత్వం ఇవి ఏవిధంగా పోషించబడ్డాయో" అని మదనపడుతూనే నవలను ప్రచురించాడు. ఆళ్వారుస్వామి మరో నవల 'గంగు'. 'గంగు' నవల 'ప్రజల మనిషి'కి కొనసాగింపు. ఈ నవలలో 1940 – 45 సంవత్సరాల మధ్యకాలంలో గల తెలంగాణ రాజకీయ, ప్రజా ఉద్యమాలను చిత్రించాడు.

నిజామాబాదు జిల్లాకు చెందిన లోకమలహరి (1910 – 2010) 'జగ్గనియిద్దె', 'సంఘము' అనే రెండు నవలలు 1947 – 55 మధ్యకాలంలో రాశాడు. 1946 ప్రాంతంలో 'దున్నే వాడిదే భూమి' అనే నినాదం వచ్చింది. తెలంగాణ సాయుధ పోరాటం వచ్చింది. దీని స్ఫూర్తితో సిరిసిల్లకు చెందిన జి. రాములు (1926 – 2000) 'గీసే వానిదే చెట్టు' అన్నట్టుగా 'పెరటి చెట్టు' అనే ఒక నవలను వెలువరించాడు. ఈ నవల 1954లో తెలంగాణ రచయితల సంఘం తరపున ప్రచురించబడింది. అంతకు ముందు 1952లో దొరల దౌర్జన్యాన్ని వ్యతిరేకిస్తూ, ప్రజల భాషలో 'పిచ్చి శాయన్న' అనే నవల రాశారు. సి. నారాయణరెడ్డి లాంటి ఎంతో మందికి చదువు చెప్పిన పంతులు ఈయన.

దాశరథి రంగాచార్యులు తెలంగాణ పోరాటాన్ని చిత్రిస్తూ 'చిల్లర దేవుళ్ళు', 'మోదుగు పూలు', 'జనపదం' నవలలు 1970 దశకంలో రచించారు. ప్రజలు వెట్టిచాకిరికి వ్యతిరేకంగా

తిరగబడడం, దొరల దోపిడి, దౌర్జన్యాలను ప్రజలు చైతన్యంతో తిరుగుబాటు చేయడం లాంటి చారిత్రక విషయాలు ఈ నవలల్లో చిత్రించబడ్డాయి. బి.ఎన్. శాస్త్రి 'విప్లవ జ్వాల' నవలను రాశాడు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని చిత్రిస్తూ తిరునగరి రామాంజనేయులు 'సంగం', బి.ఎన్.రెడ్డి 'ఆయువుపట్టు', ముదిగంటి సుజాతారెడ్డి 'మలుపుతిరిగిన రథ చక్రాలు' వంటి నవలలు రచించారు. నిజాంకు వ్యతిరేకంగా జరిగిన సాయుధ పోరాటాన్ని చిత్రిస్తూ తెలంగాణ నుంచి పదివరకు నవలలు వచ్చాయి.

తెలంగాణ ప్రాంతమైనా, తెలంగాణ సాహిత్యమైనా ఉద్యమాలతో ముడిపడి ఉంది. అల్లం రాజయ్య 'కొలిమంటుకున్నా (1979)', 'అగ్నికణం(1983)', 'ఊరు(1982)' అనే నవలల్లో ప్రజలపై జరిగే అత్యాచారాలను, పోరాటాల చైతన్యాన్ని చిత్రించారు. అల్లం రాజయ్య, సాహు కలిసి నిజాంకు వ్యతిరేకంగా గిరిజన హక్కుల కోసం తిరిగుబాటు చేసిన కొమురం భీం పోరాటాన్ని చిత్రిస్తూ 'కొమురం భీం' అనే నవలను రాశారు. చెరబండరాజు 'మాపల్లె(1978)' జ్వాలాముఖి 'వేలాడిన మందారం (1979)', పవన్ కుమార్ 'నల్లవజ్రం(1989)', పులి ఆనంద్ మోహన్ 'వసంత గీతం (1990)', సాధన 'రాగో(1993)', 'సరిహద్దు(1993)', వసంతరావు దేశ్‌పాండే 'అడవి(1996)', కౌముది 'తెలంగాణ పల్లె(1996)', పులుగు శ్రీనివాస్ 'అన్నలు(1999)', 'అడవి తల్లి(1999)', పి. చంద్ 'శేషగిరి(2001)', కె. రమాదేవి 'నెత్తుటిధార(2005)', ఉదయగిరి 'విప్లవాగ్ని(2009) మొదలగు ఉద్యమ నవలలు తెలంగాణ నుండి వచ్చాయి.

దాశరథి రంగాచార్య తర్వాత తెలంగాణలో ఎక్కువ నవలలను రచించింది అంపశయ్య నవీన్. ఆయన విద్యార్థి దశలోనే 'అంపశయ్య' నవలను రాశాడు. ఈ నవల చైతన్య స్రవంతిలో సాగింది. ఈ నవలతో ఆయన పేరు అంపశయ్య నవీన్‌గా మారింది. నవీన్ ఎమర్జెన్సీ కాలం నాటి పోలీసుల దౌర్జన్యాన్ని చిత్రిస్తూ 'చీకటి రోజులు' అనే నవల రాశాడు. ఆ తరువాత 'కాలరేఖలు', 'బాంధవ్యాలు', 'చెదిరిన స్వప్నాలు' అనే మూడు సీక్వేల్ నవలలను రచించాడు. తిరుపతయ్య 1987లో 'బతుకు' అనే నవలను రాశాడు. ఆ తర్వాత రెండు దశాబ్దాలకు 'జీవన సమరం' అనే నవలను రచించాడు. ఈ నవలలో తెలంగాణ దళిత, బహుజనుల జీవితం వాళ్ళ సంస్కృతి, పండుగలను గురించి తెలంగాణ భాష, యాసలో రచించారు.

మాదిరెడ్డి సులోచన 1935సంవత్సరంలో హైదరాబాద్ సమీపంలోని శంషాబాద్ గ్రామంలో ఒక వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. ఈమె ఎం.ఏ., ఎంఎడ్. చేసి 1971 వరకు సుమారు పది సంవత్సరాల పాటు ఉపాధ్యాయురాలిగా పని చేశారు. మాదిరెడ్డి సులోచన 70కి పైగా నవలలు రాశారు. 'అగ్ని పరీక్ష', ' భిన్న ధృవాలు', 'పూల మనసులు', 'చంద్రగుప్త' 'పంతులమ్మ', 'వీడని నీడ', 'జననీ జన్మభూమిశ్చ', 'సుషుప్తి' మొదలైన నవలలు రాశారు.

బొమ్మ హేమాదేవి 1931లో నిజామాబాదు జిల్లాలో జన్మించారు. ఈమె బొమ్మ నారాయణరావుతో వివాహమయ్యాక హైదరాబాదులో స్థిరపడ్డారు. ఈమె 30 నవలలు రాశారు. 1. నవ ధాన్యాలు 2. తపస్వినీ 3. లవ్ స్టోరీ 4. ఉపాసన 5. కళావతి 6. కుంకుమపూలు 7. తరంగాలు 8. నవోదయం మొదలైన నవలలు రచించారు.

పోల్కంపల్లి శాంతాదేవి మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తికి చెందినవారు. ఈమె 63 నవలలు రాశారు. 'బాటసారి', 'చండీప్రియ', '.పుష్యమి', 'నిషా', 'కన్నెవాగు – కోడెనాగు', 'అష్టదశం', 'ప్రేమ పూజారి', 'రాగదీపం', 'ప్రేమబంధం', 'నైనా', 'మాయలేడి' మొదలైన నవలలు రాశారు.

నిజామాబాద్ జిల్లాకు చెందిన వై. లక్ష్మీవాసన్ 'రాజీవ' కలం పేరుతో 'నడుస్తున్న కథ', 'రాబోవు తరం స్త్రీ' నవలలు రాశారు. సినీకవి సుద్దాల అశోక్ తేజ 1980లో 'వెలుగు రేఖలు' అనే ఉద్యమానికి సంబంధించిన నవల రాశారు. మలయశ్రీ 12 నవలలు రచించారు. 1.తిరుగుబాటు 2.నిర్ణయం 3.తాగుబోతు 4.వెన్నెలవాన 5.వింత బతుకులు మొదలైన నవలలు రాశారు. నల్గొండ జిల్లాకు చెందిన బోయ జంగయ్య దళిత చైతన్యాన్ని చిత్రించే కథలేగాక 'జాతర', 'జగడం', 'పుట్టుమచ్చ' అనే నవలలు రాశాడు.

కాలువ మల్లయ్యది తెలంగాణ కథా, నవల సాహిత్యంలో ప్రత్యేక స్థానం. తెలంగాణ మాండలిక శైలిలో నవలలు రాశారు. తెలంగాణ గ్రామీణ జీవితాలను, ఉద్యమాలను వీరి నవలల్లో చిత్రించాడు. కాలువ మల్లయ్య భూమి పుత్రుడు(1991), సాంబయ్య చదువు(1995), మాట్లాడే బొమ్మలు(1999), బతుకు పుస్తకం(2000), డబ్బు – తృప్తి – దుఃఖం(2002), గువ్వల చెన్నా (2005), మాదిగ విజయం, అస్పృశ్యకోయిల, మెతుకు పుస్తకం మొదలగు నవలలు రచించారు. నేరెళ్ళ శ్రీనివాస్ గౌడ్ 'బతుకుతాడు' నవలలో కల్లుగీత కార్మికుల

జీవితంతో పెనవేసుకున్న రాజకీయాలు, సంస్కృతి, సామాజిక పరిణామాలను చిత్రించారు. పెద్దింటి అశోక్ కుమార్ 'ఎడారి మంటలు(2001), ఉప్పలం(2005), జిగిరి(2007), దాడి(2008), సంచారి(2010) అనే నవలలు రాశారు. నీళ్ళ గురించి దాడి నవల, ఎలుగుబంటిని ఆడిస్తూ బతికే జీవితాల గురించి 'జిగిరి', గల్ఫ్ దేశాల వలసల్లో పడే కష్టాల గురించి 'ఎడారి మంటలు' నవలల్లో చిత్రించారు.

ఖమ్మం జిల్లాకు చెందిన జాతశ్రీ 'బతుకు పశువు', 'వెదురు పొదలు', 'సింగరేణి మండుతోంది' నవలలను రచించారు. పసుపులేటి మల్లిఖార్జునరావు 'పంజరం', 'సమాంతర రేఖలు' అనే నవలలు రాశారు. ఐతా చంద్రయ్య 6 నవలలు రాశరు. 1.ఆడపిల్ల(1993) 2.ఇసుకు గోడలు(1990) 3.తల్లీ భారతి 4.బ్రహ్మముడి 5.సత్తికొండ(2006) మొదలగు నవలలు రాశారు. వీరి నవలల్లో దేశభక్తి, హిందూ సంస్కృతి జీవన విధానం ప్రత్యేకంగా కనిపిస్తాయి.

కసిరెడ్డి వెంకటరెడ్డి 12 నవలలు రాశారు. 1.మంగళ సూత్ర 2.రాగజ్వాల 3.నరజాతికి నీతి ఉన్నదా 4.వయసు వలుపు 5.మాపల్లె 6.సుడిగుండాల్లో సూరీడు 7. బ్రహ్మముడి ఇంకా ఆరు అముద్రిత నవలలు ఉన్నాయి. ముదిగంటి సుజాతారెడ్డి నల్గొండ జిల్లా ఆకారం గ్రామంలో జన్మించారు. ఈమె 'మలుపు తిరిగిన రథ చక్రాలు', 'ఆకాశంలో విభజన రేఖల్లేవు', 'సంకెళ్ళు తెగాయి' అనే మూడు నవలలు రాశారు. 'మలుపు తిరిగిన రథ చక్రాలు' నవలలో 1940 నాటి సాయుధ పోరాటాన్ని, కమ్యూనిస్టుల విప్లవాన్ని చిత్రించారు. సుజాతారెడ్డి తప్ప మహిళలు తెలంగాణ పోరాటాన్ని వస్తువుగా నవలలు ఎవరు రాయలేదు. 'ఆకాశంలో విభజన రేఖల్లేవు' నవలలో కొందరు స్త్రీవాదులమంటూ ద్వంద్వ ప్రమాణాలను ఆచరించటాన్ని వ్యతిరేకిస్తూ, స్త్రీ, పురుషలను సమానంగా జీవితాన్ని ప్రజాస్వామ్య మార్గంలో కొనసాగించినప్పుడే స్త్రీవాదం సాధింపబడుతుందని ఈ నవలలో చిత్రించింది. రాడికల్ ఫెమినిజం భావాలను ఖండించింది. 'సంకెళ్ళు తెగాయి' నవలలో మంగలి వృత్తి జీవితాలను చిత్రిస్తూ, యువకుడు విద్యతో ఉన్నతాధికారిగా ఎదగడాన్ని ఇతివృత్తంగా రాశారు.

నల్గొండ జిల్లాకు చెందిన భూతం ముత్యాలు 'ఇగురం', 'సూర', 'పురుడు' నవలలు రాశారు. వేముల ఎల్లయ్య 'కక్క', 'సిద్ది' నవలల్లో దళితుల భాషను, సంస్కృతిని, జీవితాలను

అపూర్వంగా చిత్రించారు. ఎలికట్టె శంకరరావు 'దేవుని రాజ్యం' అనే నవల రాశారు. దేవులపల్లి కృష్ణమూర్తి 'ఊరువాడ బతుకు', 'మూడుముక్కలాట' అనే నవలలు రాశారు. పరవస్తు లోకేశ్వర్ 'సలాం హైదరాబాద్' అన్న నవల రాశారు. ఇది బాగా ప్రాచుర్యం పొందింది. గుండెపంగు రవికుమార్ 'మహిళ' అనే నవల రాశారు.

తెలంగాణ నుంచి స్త్రీవాద నవలలు వచ్చాయి. గీతాంజలి రచించిన 'ఆమె అడివిని జయించింది' నవల అదిలాబాద్ యాసలో ఉంది. కుటుంబంలో స్త్రీలు, పురుషులు అభిరుచులకు అనుగుణంగా నడుచుకోవడం, వాళ్ళలో ఆత్మగౌరవం, ఆత్మాభిమానం, పట్టణాలలో స్త్రీలు కూడా ఎటువంటి స్వాతంత్ర స్వేచ్ఛ లేకుండా హింసలకు గురికావడాన్ని గీతాంజలి ఈ నవలలో చిత్రించారు. ఈమె అసలు పేరు భారతి. రచయితగా గీతాంజలి పేరుతో నవలలు, కథలు రాశారు. శాంతి ప్రబోధ 2004లో 'జోగిని' నవలను రచించారు. జోగిని స్త్రీల దుర్భర జీవితాలను, వారి మూఢనమ్మకాలను, కుటుంబ జీవితాన్ని సమాజంలో వారి స్థితిగతులను వివరించారు.

జానపదుల నిత్యజీవితం ఎలా ఉంటుందో 'హొయినం' నవలలో జాజుల గౌరి చిత్రించారు. ఈ నవలలో దళిత స్త్రీల జీవితం, పరిణామం, సంస్కృతి, తెలంగాణ భాష చిత్రించబడ్డాయి. అమృతలత 'సృష్టి తీయనిది' నవలను రచించారు. హాస్టల్లలో విద్యార్థుల జీవితాన్ని, వార్డెన్‌ల ప్రవర్తనల గురించి ఈ నవలలో చిత్రించారు. అలాగే స్నేహం విలువను ఈ నవలలో చిత్రించారు. నందిగం కృష్ణారావు 'చీకటి నల్ల పిల్లి' నవలలో విద్యార్థి జీవితాన్ని చిత్రించాడు. వావికొలను రాజ్యలక్ష్మి పొల్కంపల్లి శాంతాదేవి ఆడపడుచు. ఈమె 11 నవలలు రచించారు. హృదయ సుగంధం, ప్రేమ పుష్పం మొదలైన నవలలు రచించారు. ఈమె నవలలు కుటుంబ జీవితానికి సంబంధించినవి.

సాకేతపురి కస్తూరి 'బతుకమ్మ మునిగింది' అనే నవల రచించారు. డా. శంకరయ్య 'పడమటి కొండలు' నవల సి.పి. బ్రౌన్ అకాడమీ, నవ్య వార పత్రికలు సంయుక్తంగా నిర్వహించిన పోటీలో లక్ష రూపాయల బహుమతి అందుకొని నవ్య వారపత్రికలో ధారవాహికగా వెలువడింది.

### 1.3.1. తెలంగాణ ఉద్యమ నవలలు

1938 నాటినేపథ్యంతో 1951లో 'ప్రజల మనిషి', 1940 – 45 ల మధ్య కాలాన్ని చిత్రీకరిస్తూ గంగు' నవలను వట్టికోట ఆళ్వారుస్వామి రాశారు. 1947 నాటి పరిస్థితులను చిత్రిస్తూ 1956లో 'ఓనమాలు', 'దావానలం' నవలలను మహీదర రాంమోహనరావు రాశారు. 1964లో దాశరథి రంగాచార్య 'చిల్లర దేవుళ్ళు' నవలను రాశారు. 1942 – 48 మధ్య కాలాన్ని ఆధారంగా చేసుకొని 1971లో 'మోదుగుపూలు', 1948 – 68 మధ్య కాలాన్ని ఆధారంగా చేసుకుని 'జనపదం' నవలను రచించారు.

తిరునగరి రామాంజనేయులు 1948 నాటి తెలంగాణ పరిస్థితుల ఆధారంగా 'సంగం' నవలను రచించారు. 1946- 86ల మధ్య కాలం పరిస్థితుల ఆధారంగా ముదిగంటి సుజాతారెడ్డి 'మలుపుతిరిగిన రథ చక్రాలు' 1984లో నవలను రాశారు. 1986లో బి.ఎన్. శాస్త్రి 1947 – 48 మధ్య కాలాన నల్గొండలో జరిగిన పోరాటం ఆధారంగా 'విప్లవ జ్వాల' నవలను రచించారు. 1996లో కందిమళ్ళ ప్రతాపరెడ్డి విమోచనోద్యమాలు జరుపుకునే వరకు గల పరిణామాలను చిత్రీకరిస్తూ 'బందూక్' నవలను రాశారు. వీటిలో మహీధర రాంమోహనరావు 'రథ చక్రాలు' నవలను, భాస్కరభట్ల కృష్ణారావు 'యుగసంధి', సిరిపల్లి కృష్ణారెడ్డి 'ఉప్పెన' నవలను కూడా పేర్కొనవచ్చు. తెలంగాణ పోరాట చిత్రణలో 1947లోనే వెలువడిన మొదటి నవల 'మృత్యుంజయులు'.

తెలంగాణ ప్రాంతానికి సుదీర్ఘమైన చరిత్ర ఉంది. శాతావాహనులు 425 సంవత్సరాల పాటు తెలంగాణల కరీంనగర్ జిల్లా కోటిలింగాల, మహరాష్ట్రలోని పైఠాన్ రాజధానిగా సామ్రాజ్యాన్ని స్థాపించి పరిపాలించారు. "కొమర్రాజు లక్ష్మణరావు, సురవరం ప్రతాపరెడ్డి, ఆచార్య తిరుమల రామచంద్ర మొదల్కొని, బి.ఎన్. శాస్త్రి, పరబ్రహ్మశాస్త్రి, కీ.శే. సంగనభట్ల నరహరి, సంగనభట్ల నరసయ్య, ఈమని శివనాగిరెడ్డి, కుర్రా జితేంద్రబాబు, వి.వి. కృష్ణశాస్త్రి, టాగూర్, మలయశ్రీ మొదలైన ఎందరో చరిత్రకారులు, సాహితీవేత్తలు తెలంగాణ చరిత్రను, సంస్కృతిని వెలికితీసి మనముందుంచారు" (చెన్నయ్య, జె. 2013: 163).

1984లో అదే పోరాటాన్ని చిత్రీకరిస్తూ ముదిగంటి సుజాతారెడ్డి ‘మలుపు తిరిగిన రథ చక్రాలు’ నవల రచించారు. ఈ నవలల రచనాకాలం గమనించినప్పుడు ఈ నేపథ్యంలో నవల రావడానికి సుమారు నాలుగు దశాబ్దాల కాలం పట్టిందనే విషయాన్ని గమనించవచ్చు.

### 1.3.2. తెలంగాణ చారిత్రక నవలలు

నవలలో ఊహకు, కాల్పనికతకు అవకాశం ఉంటుంది. చరిత్రలో ఊహకు తావులేదు. జరిగిన వాస్తవమే చెప్పాలి. శాసనాలు, పురావస్తు ఆధారాలు, సాహిత్యాధారాలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. చారిత్రక నవలలో నాటి చరిత్రతోపాటు సమకాలీన జీవితాల స్థితిగతులు, రాజుల విధానాలు ప్రతిబింబిస్తాయి.

కాకతీయుల గురించి ఎక్కువగా నవలలు వచ్చాయి. ఒద్దిరాజు సీతారామచంద్రరావు ‘రుద్రమదేవి’ నవలను 1918లో రచించారు. ఈ నవలకు విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి, మద్రాసువారి బంగారు పథకం లభించింది. నోరి నరసింహశాస్త్రి ‘రుద్రమదేవి’ నవల, అడవిబాపిరాజు రాసిన ‘గోన గన్నారెడ్డి’ నవల కాకతీయ రుద్రమదేవి కాలపు చారిత్రక నవల. ఓరుగంటి ఇందిరాదేవి రాసిన నవల ‘ఆనంద ధార (రుద్రమదేవి పైన)’, కాళ్ళకూరి నారాయణరావు రాసిన ‘ప్రతాప రుద్రమదేవి’ నవలలు పేర్కొనదగినవి. ఆదిరాజు వీరభద్రరావు ‘భువనగిరి’, కోంపెల్లి వెంకట్ గౌడ్ రాసిన ‘సర్వాయి పాపడు’ నవల లేదా జీవిత చరిత్ర, వేదం వెంకటరాయ శాస్త్రి రాసిన ‘తానీషా’ నవల, చలమచర్ల రంగాచార్యులు ‘హలికుడు (పోతన్న గాథ), ‘పాల్కుర్కి సోమన్న’ అనే రెండు నవలలు రాశారు. ఎస్. ఎం. ప్రాణ్‌రావు ‘సర్వాయి పాపన్న’ నవల రాశారు.

ఒద్దిరాజు సీతారామ చంద్రయ్య ‘శౌర్యశక్తి’, ‘భ్రమర’, ‘బ్రహ్మణసాహసం’ అనే చారిత్రక నవలలను, ఒద్దిరాజు రంగారావు ‘పరహముద్ర’, ‘వీరావేశం’ అనే చారిత్రక నవలలు రాశారు. బిరుదురాజు రామరాజు ‘సదాశివరెడ్డి’ నవలను, తుమ్మలపల్లి రామలింగేశ్వరరావు ‘తిక్కన’ నవలను రాశారు. ముదిగొండ శివప్రసాద్ రాసిన నవలలు ‘ఆవాహన (కాకతీయుల గురించి)’, ‘చంద్రకళ (సమ్మక్క సారక్కల గురించి)’, ‘అనుభవ మండపం (బసవేశ్వరుని గురించి)’,

‘రెసిడెన్సి (హైదరాబాదులోని బ్రిటీషు రెసిడెంట్, కింగ్ కోఠి ప్రేమకథ)’ తెలంగాణ చరిత్రను చిత్రించాయి.

ఈవిధంగా నవలాకారులు తెలంగాణ చరిత్రను నవల రూపంలో మనముందుచారు.

### 1.3.3. తెలంగాణ మాండలిక నవలలు

తెలంగాణ ప్రత్యేక సంస్కృతే కాదు ప్రత్యేక మాండలికాన్ని కల్గివుంది. పోరంకి దక్షిణమూర్తి రాసిన ‘ముత్యాల పందిరి’ (1969), వట్టికోట అళ్వారుస్వామి ‘ప్రజల మనిషి’ (1955), దీనిలో సంభాషణాత్మక మాండలికం ఉంది. “చాలా నవలలు సంభాషణాత్మక మాండలికంలోనూ, తక్కువ సంఖ్యలో పూర్తి మాండలిక నవలలు వచ్చాయి. అవి లోక మలహరి ‘జగ్గని యిద్దె’(1955) దాశరథి రంగాచార్య ‘మోదుగుపూలు’ అల్లం రాజయ్య ‘కొలిమంటుకున్నది, ఊరు, అగ్నికణం’ (1978, 1982) బి.ఎస్. రాములు ‘బతుకు పోరు’ (1982) సాహు & అల్లం రాజయ్య ‘కొమురం భీం’ (1983), దాశరథి రంగాచార్య ‘చిల్లర దేవుళ్ళు’ (1987), సాకేతపురి కస్తూరి ‘బతుకమ్మ మునిగింది’ (1996), వసంతరావు దేశ్‌పాండే ‘అడవి’ (1996), ఐత చంద్రయ్య ‘ఆడపిల్ల’ (1996), వేముల ఎల్లయ్య ‘కక్క’ (2000), భూతం ముత్యాలు ‘సూర’ (2004), వేముల ఎల్లయ్య ‘సిద్ధి’ (2005), కాలువ మల్లయ్య ‘గువ్వల చెన్నా’ (2005), పరవస్తు లోకేశ్వర్ ‘సలాం హైదారాబాద్’ (2005), భూతం ముత్యాలు ‘పురుడు’ (2007), పెద్దింటి అశోక్ కుమార్ ‘దాడి’ (2008), కదిరె కృష్ణ ‘పొద’ (2010) , భూతం ముత్యాలు ‘ఇగురం’ (2012), జాజుల గౌరి ‘వొయినం’ (2012), మొదలైనవి”. (మల్లేష్, మంత్రి. 2018: 7,8).

ఈవిధంగా తెలంగాణ నవలా సాహిత్యంలో మొదటగా వచ్చిన నవలలను, ప్రముఖ రచయితల నవలలను పేర్కొని తెలంగాణ ఉద్యమ, చారిత్రక, మాండలిక నవలలను మరియు నాటి నుండి నేటివరకు తెలంగాణ నవలను సంక్షిప్తంగా పరిచయం చేశాను.

# అధ్యాయం – ౨

# తెలంగాణ వృత్తి నవలలు – ఇతివృత్త విశ్లేషణ

## ౨. తెలంగాణ నవల – వృత్తి

మానవ జీవితానికి ప్రాథమిక అవసరాలు కూడు, గూడు, గుడ్డ. వీటికి అనుబంధంగా ఎన్నో అవసరాలు ఉంటాయి. ఆదిమకాలంలో మానవులు అవసరానికి తగిన వాటిని మాత్రమే ఉత్పత్తి చేసుకొని జీవనం సాగించారు. ఒక్కొక్కరు ఒక్కొక్క వస్తువును ఉత్పత్తి చేసి, ఒకరికి మరొకరు వస్తు వినిమయం చెయ్యటం ద్వారా సంఘ జీవనం కొనసాగింది. ఈ వస్తూత్పత్తి ఒక వారసత్వంగా మారి కాలపరిణామ క్రమంలో వృత్తులుగా ఏర్పడ్డాయి. ధనం అనేది మారక ప్రమాణం అయిన తర్వాత వృత్తి ధనాన్ని సంపాదించే సాధనమైంది. ఇలా వృత్తి అనేది సామాజిక జీవితంలో ఉత్పత్తి పంపిణి విధానంలో అతి ముఖ్యమైన అంశంగా మారింది. ఈ వృత్తులే తరువాతి కాలంలో కులాలుగా మార్పు చెందాయి.

### ౨.1. వర్ణ కుల వ్యవస్థ ఆవిర్భావం

డాక్టర్ గోఖలే గారి అభిప్రాయం ప్రకారం జాతి, కులం అనే పదాలు సమానార్థకాలుగా వాడటం జరిగింది. సెనార్ట్ అనే చరిత్రకారుడు వర్ణం అంటే ఒక వర్గంగాని, సమూహంగాని సరైన విభజనకు లోనై, నిర్ధిష్టమైన కులంగా, వంశ పారంపర్య ప్రాతిపదికన నాలుగు వర్ణాల విభజన కంటే నిర్ధిష్టమైందని తెలిపాడు. వర్ణం అనేది ఆచారంతో సంబంధంలేనిదని, అది వ్యక్తిగతమైన నడవడి, కర్తవ్య నిర్వహణ వంటి వాటిమీద ఆధారపడి ఉంటుందని తెలుస్తుంది.

వివాహాది సంస్కారాలు, ఆచారాలు గల వర్గాన్ని జాతి అనవచ్చు. దీనినే కులం అని అనడం జరిగింది. కులానికి లౌకిక జీవితానికి ఉండే మర్యాదలు, పద్ధతులు సభ్యత ఉంటాయి. అందువల్ల కులానికి చెందిన వానిని రహస్యం అనే అర్థంలో చెప్పడం జరిగింది. తరువాతి రోజుల్లో వృత్తికి

కులానికి గల అన్యోన్యాశ్రయత్వంవల్ల వృత్తిని, కులాన్ని, జాతిని పర్యాయపదాలుగా వాడడం జరిగింది. కులం అనేది వ్యక్తిగతమైన ఆచారాలకు చెందిన వ్యవస్థ. దీనిలో ఆచార, విహార, వ్యవహారాలలో సమాజంలోని ఇతర కులస్తులతో సంబంధాలు ఏర్పర్చుకోవడంలో విధి నిషేధాలు ఉంటాయి. ఈ విధంగా వర్ణ, కులవ్యవస్థ ఆవిర్భావాన్ని గమనించవచ్చు.

### 2.1.1. వర్ణవ్యవస్థ ఆవిర్భావం

వర్ణం అనే పదాన్ని ప్రస్తుతం రంగు, జాతి, కులం అనే వాటికి పర్యాయపదాలుగా వాడుతున్నారు. భారతదేశంలో వర్ణవ్యవస్థ ఎలా ఏర్పడింది? దానికి గల కారణాలు ఏమిటి? అసలు వర్ణం అంటే ఏమిటి? మొదట ఎన్ని వర్ణాలున్నాయి? వాటి పర్యవసానాలు ఏమిటి? అనేవి చాలా ముఖ్య విషయాలుగా చెప్పుకోవచ్చు. ఈనాడు వేల కులాలుగా భారతదేశంలో ముక్కలు చెక్కలై ఛిన్నాభిన్నమవ్వటానికి కారణం ఈ వర్ణవ్యవస్థే.

"ఋగ్వేదంలో ద్రావిడులకు, కిరాతకులకు భేదం లేదు. వారిని నల్లనివారని, దస్యులు, దాసులు అని ఆర్యులన్నారు. జయించిన ఆర్యులు ఓడిపోయిన అనార్యులతో పొత్తు కుదుర్చుకోక పోవడం వలన వర్ణభేదం ఏర్పడింది. ఋగ్వేదంలో వర్ణం అంటే వర్గం అనే అర్థంలో వాడారు. పరాజితులైన అనార్యులు ఆర్థిక దోపిడికి, సాంఘికంగా నీచపు స్థాయికి దిగజార్చబడ్డారు"(సాంకృత్యాయన్, రాహుల్.1986:51).ఈ విధంగా సప్త సింధు ప్రాంతంలో నివసిస్తున్న ద్రావిడులకు, కిరాతకులకు మధ్య భేదం లేదు. కొత్తగా వచ్చిన ఆర్యుల రాకతోనే ఈ వర్ణ వ్యవస్థ ఆవిర్భవించిందని పై నిర్వచనం వల్ల తెలుస్తుంది.

## 2.2. వర్ణశబ్ద నిర్వచనాలు

వర్ణం అంటే రంగని బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర నాలుగు వర్ణాల వారు నాలుగు రంగులకు చెందిన వారని 'వర్ణం, వర్ణ్యంతే కపిలారుణ పితకృష్ణ వర్ణైః, నిరూప్యంతి యితి వర్ణాః

వర్ణనుతౌ' అని లింగబటట్టీయం, ఇదేవిధంగా వజ్రోపకోపనిషత్తు చెప్తున్నాయి. ఈ శ్లోకాలలో నాలుగు వర్ణాలకు రంగులను ఆపాదించడం జరిగింది.ఇక నిర్వచనాలను గమనిస్తే

"మొత్తం మీద దాస దస్యులకు, ఆర్యులకు ఉన్న రంగు తేడా మొదట వర్ణశబ్దం ఉపయోగించటానికి హేతువైంది. అయితే కేవలం ఇది రంగు భేదం మాత్రమే కాదు ఆచారాలతోనూ, మతాలతోనూ, ఆలోచనలతోనూ, ఆహార విహారాలతోనూ వీరికి వారికి ఉన్న తీవ్రమైన భేదం వర్ణ భేదానికి దారితీసింది" (కృష్ణారావు, వై.వి. 1998 : 348). ఇదే విధంగా

అలాగే "ఋగ్వేదంలో పురుష సూక్తంలో ఒక్క శ్లోకంలో తప్ప నాలుగు వర్ణాలు ఎక్కడా ప్రస్తావించలేదు. అధర్వణ వేదం మొదటి భాగంలో వర్ణాల ప్రస్తావన లేదు. అధర్వణ వేదం చివరి కాలంలో శూద్రులు సామాజిక వర్గంగా ఏర్పడి ఉండవచ్చునని తెలిపాడు" (ఆర్.యస్.శర్మ. 1992: 11). ఈ విధంగా వర్ణం అన్న పదానికి అనేక రకాలుగా అర్థాలను వివరించారు.

## ౨.3. కులవ్యవస్థ ఆవిర్భావం

వర్ణ విభేదాల్ని సూచించడానికి "'క్యాస్ట్' అనే పదాన్ని పోర్చుగీసువారు ప్రప్రథమంగా ఉపయోగించారు. ఈ 'క్యాస్ట్' అనే మాట 'క్యాస్టర్(స్వచ్ఛమైనది)' అనే పదం నుండి పుట్టింది" (Hutton, j.h. 1997: 47). అని అభిప్రాయం. ఆర్యేతర జాతులు ఎందరో ఉండేవారని వారిలో వివిధ తెగలవారు వివిధ వృత్తులు అవలంబించడం వల్ల సాంఘిక భేదాలు ఏర్పడ్డాయి. ఈ విధంగా వర్ణాలు, తెగలు, వృత్తులు సాంఘిక ప్రతిపత్తిలో అన్ని కలిసి ఎన్నోవేల కులాలుగా సమాజంలో ఆవిర్భవించడానికి దోహదం చేశాయి. అంటే ప్రారంభ దశలో వృత్తులే వున్నాయి. ఆ తరువాతి కాలంలో వృత్తిని బట్టి కులాలుగా మార్పు చెందాయని తెలుస్తుంది.

'కులం' అనేది ఒక సంక్లిష్టమైన సాంఘిక పరిణామం, పురాతన వేదకాలం నాటికి కుల వ్యవస్థ లేదని వేదాల అధ్యయనం వల్ల తెలుస్తుంది. ఆర్యుల చేత ఓడబడి దాసులుగా, బానిసలుగా చేయబడి తమ వృత్తి నైపుణ్యం చేత గౌరవింపబడి, నాలుగవ వర్ణం(శూద్రవర్ణం)గా గుర్తింపబడిన వారుగా చెప్పవచ్చు. తరువాత కాలంలో ఈ వర్ణమే అనేక కులాలుగా మారాయని తెలుస్తుంది.

### ౨.3.1. కుల నిర్వచనాలు

కులం పుట్టుక గురించి చరిత్రకారులు పలు రకాలుగా అభిప్రాయాలు వెలిబుచ్చారు. కులాన్ని నిర్వచిస్తూ రొమిలా థాపర్ 'భారతదేశ చరిత్ర క్రీ.శ. 1300 వరకు' అనే గ్రంథంలో "కులాల ఏర్పాటు వృత్తి అస్తిత్వాల వల్ల నిర్ణయించబడ్డాయి. వివిధ వృత్తి సంఘాలు ప్రధానంగా చేతిపనివారు క్రమంగా జాతులుగా సమ్మేళనం చెంది జాతి నిబంధనలను, వివాహ వారసత్వ విషయాలలో ఉమ్మడి ఆచారాలను అమలు పరుస్తూ ఒక ప్రాంతంలో సంబంధీకులమనీ భావిస్తూ కులాలుగా రూపొందారు. ఒక విధమైన మతవిశ్వాసాలు కలిగి జీవించడం చేత కాలక్రమంలో ఒక కులంగా మార్పుచెందారు" (కామేశ్వరరావు, కె.యన్(అను.). 1999 : 92).

"A Cast may be defined as a group of families internally united by particular rules for the observance of ceremonial purity especially in the matter of diet and marriage" (Mahajan, V.D. 1996:86). "ఆహార, వివాహ సంబంధమైన సాంఘిక ప్రత్యేకతయే కులం అని అర్థం"

ఇదే విధంగా "ఒక కులముగా పిలువబడిన సాంఘిక సమూహానికి రెండు ముఖ్య లక్షణాలున్నాయి అవి

1. తమ సమూహంలో పుట్టిన వారికి మాత్రమే సభ్యత్వం పరిమితం చేయబడింది. అలా పుట్టిన వారందరినీ తమ సమూహంలో చేర్చుకుంటుంది.
2. సభ్యులు తమ సముదాయంనకు బయటివారిని వివాహం చేసుకొనరాదని సడలింపు లేని సాంఘిక నిషేధం విధించబడింది" (Hutton, j.h.1997: 47).

"Caste system is not merely division of labour, It is also a division of labourers" (Ambedkar, B.R. 1978 : 49).ఈ విధంగా కుల నిర్వచనాలను తెలుసుకోవచ్చు.

నేటి ఆధునిక నవలలో స్త్రీ జీవిత చిత్రణ, దళిత జీవిత చిత్రణ, ప్రాంతీయ చిత్రణలతో పాటు వివిధ వృత్తుల చిత్రీకరణ జరుగుతుంది. అంతేకాకుండా విలువల విధ్వంసం, అమానవీయత, మానవ సంబంధాలు, ఉమ్మడి కుటుంబాల విచ్ఛిత్తి, గ్రామీణ జీవితాలలో వస్తున్న మార్పులు, నగర జీవన సంక్షోభం, పర్యావరణం, ప్రపంచీకరణ మొదలైన సామాజిక విషయాలను నవల నేడు మునుపెన్నడు లేని విధంగా గాఢంగా స్పృశిస్తోంది. నూతన పరిణామాలను ఆహ్వానిస్తుంది. వివిధ సంఘటనలకు, ఉద్యమాలకు నేటి నవలాకారుడు స్పందిస్తున్నాడు.

తెలుగు నవలలో ఏదో ఒక సందర్భంలో కుల వృత్తుల గురించి, వారి జీవితాలను సూచనగాప్రాయంగా చిత్రించిన సందర్భాలు మనకు కనబడతాయి. తెలంగాణ నుండి పూర్తిగా వృత్తి నేపథ్యంగా వచ్చిన నవలలను మాత్రమే నా పరిశోధనకు తీసుకోవడం జరిగింది. అవి

### 2.4. పెరటి చెట్టు (1954)

గౌడ వృత్తిపైన వచ్చిన నవల పెరటి చెట్టు నవల రాసింది కరీంనగర్ జిల్లాకు చెందిన జి. రాములు.  ఈ నవలలో మొత్తం తొమ్మిది అధ్యాయాలుగా ఉండి ఆసాంతం చదివేలా ఆసక్తిని కలిగిస్తుంది. ఈ నవల అన్యాయం దొరాయిది అన్యాయం అన్యాయం కాకపోతే న్యాయమూ, ధర్మమూ ఈ చేతగాని పిచ్చి పుల్లయ్యల మాటలు మాట్లాడకు నావద్ద ఇది ప్రజారాజ్యంరా దేవుడు కూడా మెజారిటీని ఒప్పుకోవలసి వస్తుంది తెలుసా!" అనే వాక్యంతో ప్రారంభమవుతుంది. ఈ సంభాషణ రాజాగౌడ్, సర్పంచ్ రామారావు మధ్య జరుగుతుంది సర్పంచ్ దొర రామారావు మాట్లాడుతూ నేటి ప్రపంచంలో అన్యాయందే పైచేయి అని వారి సంఖ్యయే ఎక్కువ అని న్యాయం కోసం మాట్లాడే వాళ్లను పిచ్చి పుల్లయ్యలుగా పిలుస్తాడు.

రాజాగౌడ్ భార్య గంగమ్మ, తల్లి ఎల్లమ్మ రాజాగౌడ్ తన తండ్రి ఉన్నప్పుడు ఆర్థికంగా బాగానే ఉన్నారు. తండ్రి చనిపోయిన తర్వాత రాజాగౌడ్ మామూలు (కల్లుగీత) లో ఆర్థికంగా నష్టపోతాడు. ఏపని చేయకుండా ఉంటూ భార్యను హింసిస్తూ ఉంటాడు. దానితో రాజాగౌడ్ మామ ఎల్లాగౌడ్ కులంలో పంచాయితి పెట్టి కూతురుని ఇంటికి తీసుకెళ్తాడు. తర్వాత కొన్ని రోజులకు రాజాగౌడ్ తన భార్య తనకు కావాలని దొర రామారావు దగ్గరకి వచ్చి అడిగే సందర్భంలో దొర అన్యాయందే పైచేయి అని పంచాయతిలో నీకు న్యాయం జరగాలంటే ప్రతిఫలంగా 50 రూపాయల లంచం

అడుగుతాడు. ఇది చాలా తక్కువని చెప్పడంతో రాజాగౌడ్ తన వద్ద అంతా లేదని చెప్పగా నీ దగ్గర ఉన్న బర్రెను ఇచ్చి పది రూపాయలు తీసుకెళ్ళు అనడంతో ఒప్పందం కుదురుతుంది.

గ్రామపంచాయతీలో సర్పంచ్ దొర రామారావు ఏది చెబితే అదే నడుస్తుంది. ఎల్లాగౌడ్‌ని పిలిపించి అడగగా గౌడ్ తను పంచాయితిలో పెట్టగా బిడ్డను తీసుకపొమ్మన్నారని, ధనం లేకున్నా భార్యాభర్తలు ప్రేమగా ఉండాలి. కాని అదికూడా లేదు అంటాడు. దానితో రామారావు రాజాగౌడ్ అడుగగా భార్యాభర్తలు అన్నప్పుడు కొట్టుకోవడం సాధారణమైన విషయం. బ్రహ్మ దేవుడికైనా తప్పదని తన భార్య తనకు కావాలంటాడు రాజాగౌడ్. వెంటనే రామారావు దొర ఎల్లాగౌడ్‌తో కులం వాళ్లకు లంచం ఇచ్చి చెప్పిన ఆ తీర్పు చెల్లదని అల్లునికి క్షమాపణ చెప్పి కూతురిని పంపమని తీర్పు ఇస్తాడు. ఈ తీర్పు లో ఎల్లగౌడ్‌కు అవమానం అనిపిస్తుంది. అల్లుడు దొరకేదో లంచం ఇచ్చి ఇలా చేశాడు అని అంటాడు. కూతురు గంగవ్వ "నాయనా! మనం పేదవాళ్లం దొర మాటకు విరుద్ధంగా పోతిమా ఈ గ్రామంలో ఉండుట కష్టమైపోతుంది. నీళ్లలో ఉండి మొసలితో వైరం పనికిరాదు. నాయొక్క సుఖాన్ని ఆశించి మీరు అగ్ని గుండంలో దూకడం నాకు ఇష్టంలేదు. నా అదృష్టము మంచిదాయేనా అదే సంసారం బాగుపడుతుంది. మీ అల్లుణ్ణి పిలిచి నన్ను చక్కగా పంపించండి. "అంది ఎల్లాగౌడ్‌తో" (పుట: 8, 9) ఇక్కడ దొరల అధికారం ఏవిధంగా ఉంటుందో అర్థమవుతుంది.

శివలింగం సేటు రాజాగౌడ్ తండ్రి మంచి మిత్రులు మామూలు పట్టి నడిపించేవారు. రాజాగౌడ్ తండ్రి చనిపోవడంతో రాజాగౌడ్ పరిస్థితి దయనీయంగా మారింది. రాజాగౌడ్ శివలింగంను ఇంటికివెళ్లి తన పరిస్థితిని చెప్పి తనకు కొన్ని చెట్లు ఇప్పించమని అభ్యర్థిస్తాడు. దానికి శివలింగం నీకే ఇవ్వాలి అని అంటూ కూలి చేసుకుని బ్రతుకు అనడంతో రాజాగౌడ్ మనసు కోపంతో రగులుతుంది.

ఒకసారి రాజాగౌడ్ రంగారావు పంతులుతో పట్టణం కు వెళ్తాడు అక్కడ అబ్కారి మోహత్కీం గారి ఇంటికి వెళ్తారు. మోహత్కీం, రంగారావు బంధువు మోహత్కీం ఉద్యోగంలో చేరి రెండు సంవత్సరాలవుతుంది. అతనికి కారు కొనాలనే కోరిక ఉంటుంది. కాని కొనలేదు. దానికి కావలసిన డబ్బును సంపాదించే ఉపాయం చెప్తానని రాజాగౌడ్ మరుసటిరోజు ఉదయం కొత్తూరుకు తీసుకెళ్లి అక్కడ నెంబర్ లేకుండా ఉన్న చెట్లను గీయడం చూసి మోహత్కీం ఆశ్చర్యానికి గురవుతాడు. ఇలా

ప్రభుత్వానికి పన్ను కట్టకుండా చేస్తున్నారని కోపగించి. ప్రస్తుతం తనకు సమయం లేదని రెండురోజుల తర్వాత వస్తానంటాడు.

ఈ విషయం తెలిసిన శివలింగం సేటు హడావుడిగా పట్టణం చేరుకొని రంగారావుతో కలిసి మోహత్మీం గారితో చర్చలు జరుపుతాడు. దానితో మోహత్మీం కారుకి కావలసిన డబ్బులో సగం అందుతుంది. అంతేగాక రాజాగౌడ్ కి ఒక గ్రామ దుకాణం, దానికి కావలసిన డబ్బు వడ్డీ లేకుండా ఇవ్వడానికి ఒప్పుకుంటాడు శివలింగం.

ఈ సంఘటనతో రాజాగౌడ్ ఆర్థికంగా ఎదగడమే కాదు చుట్టు ప్రక్కల ఉన్న గ్రామాలన్ని రాజాగౌడ్ ఆధీనంలోకి వస్తాయి. గొప్ప ముస్తాజర్ కావాలని రాజాగౌడ్ నాగపూర్, చందా ప్రాంతానికి వెళ్లి, అక్కడ కూడా ఆర్థికంగా బాగాసంపాదించి అక్కడే స్థిరపడతాడు. నాగపూర్ నుండి వచ్చే గీత కార్మికుల ద్వారా రాజాగౌడ్ గురించి తెలుసుకుంటుంది గంగమ్మ. తమ కష్టాలుపోయాయని సంతోషిస్తుంది. ఇదంతా తమ కొడుకు బాలాగౌడ్ అదృష్టంగా భావిస్తుంది. ఆ జీవితాన్ని గురించి ఎన్నో కలలు కంటుంది. ఇంతలో ఒక రోజు రాజాగౌడ్ వస్తాడు. అతనికి తన ఊరిని చూడగానే అసహ్యం కలుగుతుంది. రాజాగౌడ్ కారులో రావడం అతని వస్త్రధారణలోని మార్పుల కారణంగా అతన్ని గుర్తించలేక నిలబడి చూస్తుంది. తర్వాత గుర్తుపట్టి కొడుకు బాలాగౌడ్‌ని తీసుకొచ్చి ఇతడే నీ తండ్రి అని కొడుకుకి చెప్తుంది. రాజాగౌడ్ మాత్రం అసంతృప్తిగా ఉంటాడు. అక్కడ ఉన్న పలుకుబడికి భార్యను తీసుకెళ్తే బాగుండదని కొడుకుని మాత్రమే తీసుకెళ్తాడు. కనీసం తనతో మాట కూడా మాట్లాడకపోవటంతో గంగమ్మ బాధపడుతుంది.

కొన్నిరోజుల తర్వాత శివలింగం రాజాగౌడ్ దగ్గరకి వెళ్లి వచ్చాడని తెలుస్తోంది. అక్కడ రాజాగౌడ్ చదువుకున్న అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడని చెప్తాడు శివలింగం. దాంతో గంగమ్మ స్పృహ కోల్పోతుంది. శివలింగంభార్య నీల్లు చల్లి లేపుతుంది. మంచిరోజులు వస్తాయని ఆశించిన గంగమ్మకు ఈ విషయం తెలియడంతో చనిపోవాలని అనుకుంటుంది. అన్ని ప్రయత్నాలు చేస్తుంది. ఏ ప్రయత్నం కూడా ఫలించదు. దాంతో చివరకు అన్నము సన్నగా దంచి తింటే విషంగా మారి మరణిస్తారని తెలిసి ఆ ప్రయత్నం చేసి పడుకుంటుంది. గంగమ్మకు కలలో కొడుకు తిరిగి వచ్చినట్లు కలగని తాను తన కొడుకు కోసం బ్రతకాలని అనుకుంటుంది. తాను అన్నం నూరుకొని మ్రింగిన

విషయం ఎవరికి చెప్పదు భవిష్యత్ కోసం ఎదురుచూస్తుంది. చివరికి ఆమెకి ఎలాంటి అపాయం జరగదు.

గ్రామంలో దొంగల బెడద ఎక్కువగా ఉంటుంది. అదే సమయంలో ఒకరోజు రాత్రి తలుపు చప్పుడవుతుంది దాంతో గంగమ్మ, అత్త ఎల్లమ్మనులేపి తలుపు దగ్గరకు తీసుకెళ్తుంది. అమ్మా అన్న పిలుపు బాలగౌడ్‌కి వినబడుతుంది. తలుపు తీసి అతన్ని చూసి సంతోషిస్తారు. బాలాగౌడ్ రావడానికి గల కారణాలు అడుగగా దానికి సమాధానంగా బాలగౌడ్ చిన్నమ్మ సరిగ్గా చూడటం లేదని ఈ సంవత్సరం చదివితే తాను మెట్రిక్‌పాసయ్యే వాడినని చెప్తాడు. నాన్న, చిన్నమ్మ గీచిన గీత దాటడనీ, ఆమెను ఎవరెవరో వ్యక్తులు కలవడానికి వచ్చి పోయేవారని, వారితో సంతోషంగా మాట్లాడేది అని, నాన్నతో సంతోషంగా ఉండదని నాన్నకు చదువురాదని ఏమీ తెలియదని వాదించింది అని చెప్తాడు. ఒకరోజు ఒక వ్యక్తి కారులో వచ్చి సినిమాకు రమ్మని చిన్నమ్మను పిలిస్తే, నేను నాన్నా ఇంట్లో లేనప్పుడు పిలుస్తున్నారని అనగానే చిన్నమ్మ తనపై అప్పటినుండి కోపం పెంచుకొని నాన్నతో అన్ని కల్పించి చెప్పేది. దాంతో నాన్న తనను కొట్టేవాడని ఈ బాధలు భరించలేక స్నేహితుని దగ్గర డబ్బులు తీసుకొని ఇంటికి వచ్చానని చెప్తాడు.

గంగమ్మ కొడుకు వచ్చిన సంతోషంలో ఉంటుంది. బాలాగౌడ్‌కు గ్రామీణ వాతావరణం కొన్ని రోజులకు అలవాటుపడుతుంది. బాలాగౌడ్ కులస్థుల ఇండ్లలోకి వెళ్లి, వారితో పరిచయాలు పెంచుకుంటాడు. ఆవిధంగా గీతకార్మికుల కుటుంబ, వృత్తి పరమైన సమస్యలను తెలుసుకుంటాడు. బాలగౌడ్ వారికి గౌడ సంఘాల ఏర్పాటు గురించి వాటివల్ల కలిగే ప్రయోజనాలను తెలిపి వారిలో చైతన్యం తీసుకొస్తాడు. కొత్తూరులో 'గౌడ జనసంఘం' శాఖను ఏర్పాటు చేస్తాడు. బాలాగౌడ్ ప్రచారంలో చుట్టు పక్కల గ్రామాలలోని గౌడ కులస్థులు చైతన్యం పొందుతారు. అబ్కారి వాళ్లు, ముస్తాజర్లు బాలగౌడ్ విధివిధానాలను గమనిస్తుంటారు.

బాలాగౌడ్ కొన్ని రోజులకు ఒక కరపత్రం ముద్రిస్తాడు. అందులో గౌడసంఘం క్షీణించిపోతుందని, ఎందరో గీత కార్మికులు తిండిలేక ఉంటున్నారని, దీనికి ప్రధాన కారణం ప్రభుత్వమని, ఎన్ని సంవత్సరాలు కష్టపడ్డాగాని, తిండి దొరకడం కష్టంగా మారింది. ముస్తాజుదార్లు ఒక సంవత్సరంలో ధనవంతులుగా మారడాన్ని, అబ్కారి వాళ్లు లంచాలు తీసుకోవడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందని అంటాడు. ఈ సంవత్సరం మామూల్లు తీసుకోవద్దని ముస్తాజర్లు

చూపే ఆశలకు లొంగవద్దు. “దున్నేవాడికి దుక్కి లాగా” “గీచే వానిదే చెట్టు” అనే విధంగా సాధించాలనేది సారాంశం. దీనితో ప్రభుత్వంకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాడని బాలగౌడ్‌ని అరెస్ట్ చేస్తారు. ఈ సందర్భంలో తల్లిని, నానమ్మను దగ్గరికి పిలిచి గాంధీమహాత్ముడు, పండిత నెహ్రూ ఎన్నోసార్లు జైల్లో వేయబడ్డారని అప్పుడప్పుడు విన్నారు కదా! వాళ్లను ప్రజలు ఏమైనా దొంగలు అనుకున్నారా లేక మంచివాళ్ళు అంటున్నారా చెప్పండి?” అని అడిగాడు. (పుట: 32, 33). దాంతో గంగమ్మ, ఎల్లమ్మలకు ఏమి అర్థం కాకున్నా గాంధీ దేవుడని, నెహ్రూయే ఇప్పుడు రాజ్యం ఏలుతున్నాడు అని అంటారు. ఇక్కడ బాలాగౌడ్ అన్న మాటలలో పూర్వం దేశ స్వాతంత్రం కోసం గాంధీ, నెహ్రుతో జైలులోకి వెళ్లారు. నేడు తాను తన గౌడ కులస్థుల కష్టాలు తొలగించడానికి వెళ్తున్నానని బాధపడవద్దని తల్లికి, నానమ్మకు ధైర్యం చెప్పే సందర్భం. ఈ పరిణామంలో గంగమ్మ బాధపడుతుంది. గ్రామంలోని కులస్థులందరూ మేమందరం కలిసి బాలాగౌడ్‌ని విడిపిస్తామని చెప్పి బాధపడవద్దని ధైర్యం చెప్తారు.

కేంద్ర గౌడ సంఘం ఒత్తిడితో బాలాగౌడ్‌ని అక్టోబర్ రెండవ తేదీన ఎలాంటి షరతులు లేకుండా విడుదల చేస్తారు. బాలాగౌడ్‌ని ఊరేగింపుగా తీసుకొస్తుంటారు ప్రజలు. ఇంతలో పక్కింటి వెంకన్న గౌడ్ నాగపూర్ నుండి వచ్చిన విషయం తెలిసి అతన్ని రాజాగౌడ్ విషయాలు అడుగగా రెండవ భార్య వేరే వాడితో నగలు, డబ్బు తీసుకొని వెళ్లిపోయిందని, ఆస్తి అంతా పోయిందని, దానితో రాజాగౌడ్ ఎటు వెళ్ళాడో తెలియదని చెప్పడంతో ఎల్లమ్మ, గంగమ్మ బాధపడుతూ ఉంటారు.

బాలాగౌడ్ ఊరేగింపుగా వస్తుండగా కొంతదూరంలో జనం గుంపుగా చేరడాన్ని చూసిన బాలాగౌడ్ అక్కడికి వెళ్ళగా అక్కడ తనతండ్రి రాజాగౌడ్ గడ్డం, మీసాలు పెరిగి ఉండటంతో చూసి అతనికి నమస్కరించి బండిపై కూర్చోపెట్టుకొని ఊరేగింపుగా వస్తాడు. ఈ విషయం తెలిసిన ఎల్లమ్మ గంగమ్మ చాలా సంతోషపడతారు. బాలాగౌడ్, రాజాగౌడ్ తమతమ తల్లులను చేరుకుంటారు. అందరూ ‘గీచే వానిదే చెట్టు’ అని నినాదాలు ఇస్తారు.

గంగమ్మ తన భర్త రాజాగౌడ్ తగిలిన దెబ్బలకి కాపడం పెడుతుంది. ఆ సందర్భంలో పక్కింటి రంగమ్మ వచ్చి రాజా గౌడ్‌తో “ఏమి చింత వంతా పెట్టుకోకు ఇక్కడ మాత్రం నీకేదైనా లోటు ఉన్నదా? తల్లి, భార్య, బుద్ధిమంతుడైన కొడుకు, భూమి ఇంతకంటే ఎక్కువ ఇంకేమి కావాలి చెప్పు. అన్ని విధాలైన శ్రీమంతమొకఎత్తు, బుద్ధిమంతుడైన నీ కొడుకు ఒకఎత్తు ఇక్కడికి నీవే

అదృష్టవంతుడవు” అంటుంది. ధనం అనేది శాశ్వతం కాదని, కుటుంబం అనేది అన్ని సంతోషాలని కలిగిస్తుందనే అర్థంలో రంగమ్మ మాటలను మనం అర్థం చేసుకోవచ్చు.

బాలాగౌడ్‌కి ప్రక్క ఊరి నుండి పెళ్లి సంబంధం వస్తుంది. కానీ అతడు ‘గీచే వానిదే చెట్టు’ ప్రభుత్వం అమలు చేసేంత వరకు పెళ్లి చేసుకోను అనడంతో ఈ నవల ముగుస్తుంది.

**౨.5. సంఘము (1955)**

సంఘము నవలా రచయిత లోకమలహరి నిజామాబాద్ జిల్లాకు చెందినవాడు. ఇందులో మొత్తం పదకొండు భాగాలున్నాయి. పద్మశాలీల(చేనేత) జీవితాన్ని చిత్రించిన నవల ఇది.

“రామలింగంగారూ అది ప్యాదముండగాదండి! కొంచమైనా దయజేయాలి. ఇన్ని రూపాయలు అది ఎక్కడి నుండి తెస్తాది. వెనకాముందు దానికెవ్వరున్నారని, మొగన్ని పొగొట్టుకొని ఈ అగ్గివంటి కరువులో కడుపుగట్టుకొని ఆ రెండు బిచ్చాలను పాదు కొంటుంది. గద్ద వచ్చి కోడి పిల్లను తన్నుక పోయినట్టు ఆరేండ్ల పిల్లవాడు రామస్వామి తిరునాళ్ళకనిపోయినట్టు, మాయమైపోయి నాలుగేండ్లాయే, పాపము ఆ ముండ యేడ్చి యేడ్చి కండ్లు పాడు చేసుకున్నది...” అనే వాక్యంతో ప్రారంభమౌతుంది నవల. బుక్కరావుపేట గ్రామం, దాని పరిసర ప్రాంత చేనేతకారుల జీవితాన్ని చిత్రించింది ఈ నవల.

బుక్కరావుపేటలో బుచ్చమ్మ అనే పద్మశాలి స్త్రీ ఉంటుంది. ఆమెకు ఒక కొడుకు, ఒక కూతురు ఉన్నారు. కొడుకు జాతరకి వెళ్ళి తిరిగిరాడు. కొడుకు కోసం వెతికి ఏడ్వడంతో బుచ్చమ్మ చూపు తగ్గుతుంది. కుటుంబ పోషణకై బుచ్చమ్మ కోమటి, బ్రాహ్మణుల ఇండ్లల్లో పని చేస్తుంది. ఈ విషయం తెలిసిన కులస్థులు ఇతర కులస్థుల ఇంటిలో పని చేయడం నేరంగా భావించి, జరిమానా వేయాలని చూస్తారు. ఇలా పేద స్త్రీలకు జరిమానా వేయడం మంచిది కాదని పంచాయితీలలో వచ్చిన ఆదాయంతో పేద స్త్రీలను ఆదుకోవాలంటాడు నర్సయ్య. కాని కులపెద్దలు ఆమెకు ఇరవై రూపాయలు జరిమానా వేస్తారు. బుచ్చమ్మ ఆ జరిమానా కట్టడానికి నానా ఇబ్బందులు పడి కట్టుతుంది. ఆమె జీవించడానికి ఆ పని తప్ప వేరేది కనబడదు. ఆ పని చేస్తే కుల పెద్దలతో ఇబ్బందులు తప్పవని వేరేగ్రామానికి వెళ్తుంది.

ఈ గ్రామంలో ధనశెట్టి నాగనాథం అనే కోమటి ఉంటాడు. ఇరవై సంవత్సరాల క్రితం ఏమిలేనివాడిగా వచ్చి నేడు లక్షాధికారిగా మారుతాడు. అందరి అవసరాలకు అధిక వడ్డీ క్రింద డబ్బులు ఇస్తాడు. ఇతని దగ్గర గఫ్రూ అనే ముస్లిం వ్యక్తిని నియమించుకుంటాడు. వెంకయ్య అనే పద్మశాలీ మూడునెలల్లో అప్పు తీరుస్తానని నాగనాథం దగ్గర అప్పు తెచ్చుకుంటాడు. సమయానికి డబ్బులు చెల్లించకపోవడంతో గఫ్రూను పంపిస్తాడు నాగనాథం. గఫ్రూ వచ్చి వెంకయ్య ఇంటి ముందు కూర్చోని డబ్బులు ఇచ్చేవరకు కదిలేది లేదని అంటాడు. వచ్చేనెలలో అప్పు తీరుస్తానని సేటుకు చెప్తానన్న గఫ్రూ వినడు. ఇంతలో నర్సయ్య అక్కడికి వచ్చి విషయం తెలుసుకొని, నాగనాథం ఒకటికి రెండు చేసి పద్మశాలీలను దోచుకొని ధనవంతుడయ్యాడు అని అంటాడు. వెంకయ్యకు అప్పు తీర్చుకోవడానికి డబ్బు ఇచ్చి ఆదుకుంటాడు నర్సయ్య.

వెంకయ్య నర్సయ్యతో కులస్థుల దగ్గర అప్పులు చేయడం మంచిది కాదని, నేడు పద్మశాలీలు పనుల గిరాకీ లేక అందరూ బొంబాయికి వెళ్తున్నారు. బందరు కంటి రామయ్య, అతని బామ్మర్దులు వెళ్ళి వచ్చారని, తన కొడుకులిద్దరిని పంపిద్దామని అనుకుంటున్నానంటాడు. కాని దూర ప్రదేశం ఎలా బ్రతుకుతారో అని బాధపడ్డాడు. పిల్లలకు మిల్లు పని కూడా సరిగా రాదనడంతో నర్సయ్య నెలరోజులు చూస్తే అదే వస్తుందని చెప్తాడు. వీరి సంభాషణలో కుల పంచాయితీల గురించి వారు పన్నుల గురించి చర్చిస్తారు.

ఈ గ్రామ దొర భుజంగ రావు "అతని తండ్రి కొండలరావు దొర వుండగానే అన్ని యేర్పాట్లు జేసిపోయినాడు. తొందరగా ప్రసవం కాని గర్భవతులకు ఈ కొండల్ రావు పేరు చెప్పితేనే ప్రసవించేవారట" (పుట: 30) ఇక్కడ మనకు అర్ధమవుతుంది. వీరు ఎంతటి క్రూరులో కొండల్‌రావు అన్ని కులాలవారు ఏయే సేవలు చేయాలో హుకుం జారీచేశాడు. పద్మశాలీలకు కూడా. దొరలు వేంకటేశ్వర్లు సేవకు వెళ్ళినప్పుడు పెండ్లీలలో దివిటీలు పట్టడం, బధువులు వచ్చినప్పుడు, పండుగలకు, ప్రభుత్వ అధికారులు వచ్చినప్పుడు కోడిగ్రుడ్లు, కోళ్ళను అందించడం వాటిని అభివృద్ధి చేయడం లాంటి పనులు చేసేవారు. తండ్రిని అనుసరించి భజంగరావు ఉంటున్నాడు. గ్రామంలో ఎవరైన కొంత ఆర్థికంగా ఉండి మంచిగా ఉంటే వారిని నాశనం చేస్తాడు.

భుజంగరావు దొర ఒక రామలింగంతో పద్మశాలీలు చేసే పనులు సరిగా చేయడం లేదని, ముందు పిల్లిలావుండి, చాటుకు పులులలాగ తయారవుతున్నారని కమిటీలు ఏర్పాటు

చేసుకుంటున్నారని గట్టిగా అనగా రామలింగం తనకు ఏమి తెలియదని నర్సయ్య మొదలు పెట్టాడు అని చెప్పడంతో దొర కోపంతో నర్సయ్యను తీసుకరమ్మని సుంకరి ముత్తయ్యని పంపుతాడు. నర్సయ్య రావడం చూసి భజంగరావు "యేమోయి నర్సయ్య దొరగారూ! యేకండ్లకేమన్న దొరలు గనిపించేటట్టున్నారా? అన్నాడు మీసాలను మెలికేసి పైకి ఎక్కిస్తూ" (పుట:31) ఇక్కడ ఎవరైన కొంత ఆర్థికంగా ఎదిగి, పక్కవారికి సహాయం చేయడాన్ని భుజంగరావు ఒర్చుకోకపోవడం కనబడుతుంది.

నర్సయ్య తాను ఏమి తప్పు చెయ్యలేదంటాడు. దొర నర్సయ్యను నీ దగ్గర డబ్బుతోనే శాలోల్లదండు తయారు చేస్తున్నావని అంటాడు. దానికి నర్సయ్య తాను తనతోటి వారికి సహాయం చేస్తున్నాని, పద్మశాలీల పరిస్థితి ఘోరంగ వుందని ఒకపూట తిండికి కూడా కష్టంగా ఉందంటాడు. తమరు ఆదుకుంటే బాగుంటుందని, బుచ్చమ్మ విషయంలో కులస్థుల ప్రవర్తనను తెలిపి ఎవరో తనమీద వ్యతిరేకంగా చెప్పివుంటారు అంటాడు. ఈ మాటలు విన్న భుజంగరావు సాలోల్లకు కొత్తకొత్త పేర్లు పద్మశాలీలను సుంకర ముత్తయ్య చేతిలోని కఱ్ఱ తీసుకొని నర్సయ్యను కొట్టి, మిగతా కులాల వాళ్ళు అన్ని పనులు బందు చేయాలని హుకుం జారీ చేస్తాడు.

నర్సయ్యది సున్నిత మనస్తత్వం. ఈ జరిగిన సంఘటనతో వేరే ఊరికి వెళ్దామని, దొర నుండి ఆపదలు తప్పవని అనుకుంటాడు. ఒక రోజు అర్ధరాత్రి ఎవరో పశువుల పాకకు నిప్పంటించగా, గడ్డివాము, ఇల్లు తగలపడుతుంది ఈ సంఘటనలో దూడ, తన ఐదు నెలల కొడుకును పోగొట్టుకుంటాడు. కొందరు మంటలు ఆర్పే ప్రయత్నం చేయగా మరి కొందరు దొరికిన సొమ్ము తీసుకెళ్తారు. నర్సయ్య బొంబాయి వెళ్ళి అక్కడే పని చేస్తూ ఉంటాడు.

లింగప్ప, సోమన్న అనే ఇద్దరు వ్యక్తుల సంభాషణలలో నర్సయ్యలాంటి వారు ఇబ్బందులకు గురైయ్యారని, పేదలను దోచుకునే వారిని ఆదేవుడు కూడా ఏమి చేయలేడని, దుర్మార్గులను చూసి దేవుడే భయపడుతాడు అనే సందేహాన్ని వ్యక్తం చేస్తారు. నాగనాథం ఇంట్లో దొంగలు పడ్డారని, ఆ పని దొరదేనని తెలిసినా పోలీసులు ఏమి చేయరని దొర దగ్గర మంచి దావతులు తీసుకుంటారు అందుకే దొంగలు దొరకరని అంటాడు సోమన్న.

వీరిద్దరి సంభాషణలలోని బొంబాయికి వెళ్ళి బ్రతికే వారి జీవన విధానాన్ని చర్చిస్తారు. పద్మశాలీల నేతపనిని గూర్చి మాట్లాడుతూ మొగలాయిరాజు ఔరంగజేబు కూతురు

'జేబున్ని     గం' నేతచీర ఏడువరుసలు కట్టినా శరీరం కనబడేలా చీరెలు తయారు చేసిన పనితనం మనదని, నేటికి ఇలాంటి కార్మికులు ఉన్నారని అలాంటి వారికి తినడానికి తిండి కూడా దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తాడు లింగప్ప. పద్మశాలీలకు పూర్వ వైభవం రావాలంటే మిల్లులో పనిచేసే పద్మశాలీలందరు పని మానేస్తే బాగుంటుందనగా వెంకయ్య సేటు అన్ని కులాలవారు పని చేస్తున్నారని అది అసాధ్యమంటాడు.

జోగేంద్ర, దుర్గాప్రసాద్ ఇద్దరు మంచి స్నేహితులు. దుర్గాప్రసాద్ బుచ్చమ్మ కొడుకు. జాతర్ల తప్పిపోయి వీరివద్దకు చేరి లాయర్ అవుతాడు. ప్రసాద్ తన కుటుంబం కోసం వెతుకుతాడు గాని వాళ్ళ ఆచూకి దొరకదు. జోగేంద్ర ప్రసాద్‌తో మీ వాళ్ళు దొరికితే మీ చెల్లిని పెండ్లి చేసుకుంటానని దానితో అందరం ఒక దగ్గర ఉండొచ్చని అంటాడు. జోగేంద్ర డాక్టర్ మంచి పేరున్న వ్యక్తి. ఒకసారి జోగేంద్ర ప్రక్క గ్రామానికి వెళ్ళి వస్తుండగా కొన ఊపిరితో ఉన్న అమ్మాయిని తీసుకొచ్చి వైద్యం చేసి బ్రతికిస్తాడు. ప్రసాద్‌తో ఆ అమ్మాయి నీలాగే వుందని, నీకు కుడి కణతకు మచ్చ ఉంటే, ఆమెకు ఎడమ కణతకు ఉందంటాడు. వెంటనే ప్రసాద్ వెళ్ళి ఆమెను చూసి తన చెల్లెలిగా గుర్తిస్తాడు.

జోగేంద్ర ఆమెను వివరాలు అడుగగా తన పేరు శ్యామల, తమది బుక్కరాయ పేట, పద్మశాలీలమని చెప్పి చిన్నతనంలోనే తండ్రి చనిపోవడం అన్న జాతర్లో తప్పిపోవడం మొదలు అన్ని విషయాలు చెబుతుంది. ఇంద్రసాగరం గ్రామంలో దేశపాండ్య ఇంటిలో పని దొరికిందని, వారి కూతురు సరళాదేవితో సమానంగా చూసుకోవడంతోపాటుగా చదివించారని మెట్రిక్యులేషన్‌లో తను పాసుకావడం, సరళ తప్పడంతో జీవితం తారుమారైందని, ఇంతలో కలరా వ్యాధితో అమ్మ చనిపోయిందని చెప్తుంది. ప్రసాద్ చెల్లెలి దగ్గరకి వెళ్ళి దుఃఖించడంతో ఆమె ఎవరు అని అడుగగా జోగేంద్ర తను మీ అన్న అని చెప్తాడు. శ్యామల ఆరోగ్యం బాగైన తరువాత ముగ్గురు కలిసి వారి వారి విషయాలు మాట్లాడుకుంటారు. తన అన్నను చేరదీసింది తనను బ్రతికించింది జోగేంద్ర అని తెలిసి శ్యామల జోగేంద్రకు నమస్కరిస్తుంది.

తరువాత ప్రసాద్, జోగేంద్రల సంభాషణలో పద్మశాలీల జీవన పరిస్థితుల గురించి చర్చిస్తారు. గతంలో నిజాంలు, కరణాలు వారి తర్వాత నేడు డిపోదార్లు, పెట్టుబడిదార్లు, ఏజెంట్లు పెట్టే బాధలు ఎక్కువయ్యాయని అంటాడు ప్రసాద్. ప్రతిదానికి లంచాలు ఇచ్చామని, సన్నని దారం దొరకడంలేదు అనే సాకులు చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నారని అంటాడు. గ్రామాలలో ఈ దోపిడి

ఎక్కువగా ఉందని పద్మశాలీ సంఘాలు స్థాపించి అందరికి అవగాహన కల్పిస్తున్నామని గ్రామాలలో కూడా ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయని అంటాడు ప్రసాద్. మన జాతికి స్త్రీ విద్య అవసరం అంటాడు జోగేంద్ర. దానికి సమాధానంగా ప్రసాద్ స్త్రీ విద్య గురించి కూడా సమావేశాలు జరిగాయని శ్యామలాదేవి, ఉషాదేవి లాంటి వారి ఉపన్యాసాలు బాగున్నాయి అంటాడు. అప్పుడు జోగేంద్ర తనవంతు సహాయంగా ఐదువేల రూపాయల చెక్కును అందిస్తాడు. సహకార సంఘాలు ఏర్పడడంతో నేత కార్మికులకు ఉపాధి మార్గం సులభతరమవుతుంది. నరసయ్య ఆ సంఘానికి అధ్యక్షుడు. వెంకయ్య గ్రామ చేనేత కార్మికుల లిస్టు తీసుకొని వచ్చి నర్సయ్యకు ఇస్తాడు. దారిలో ప్రక్క గ్రామానికి చెందిన చేనేత కార్మికుడి కష్టాలు విని సహకార సంఘాల ద్వారా కలిగే లాభాలు తెలిపి అతని వెంటతీసుకుని వస్తాడు. నరసయ్యని కలిసిన సందర్భంలో "మిల్లుల ముందు మన పనికి ఏం విలువుంటుంది. మిల్లు గుడ్డలు నేత గుడ్డ కంటే అందంగా, చౌకగా ఉంటాయి. కాబట్టే మన నేత గుడ్డకు బజారు రేటు లేదు" (పుట: 54) వెంకయ్య అన్నాడు. ఇక్కడ మిల్లుల ద్వారా ఉత్పత్తి అయ్యే గుడ్డకు డిమాండ్ ఉందని నేత గుడ్డకు డిమాండ్ లేదని నేత గుడ్డని అందరూ ఆదరిస్తే చేనేత కార్మికులకు ఉపాధి కలుగుతుందని అంటాడు. లాయర్ ప్రసాద్ బుచ్చమ్మ కొడుకుని, తన ఇంటి స్థలాన్ని, ప్రక్కనే ఇంకొంత స్థలాన్ని కొన్ని చేనేత సంఘానికి చేయూతనిస్తున్నాడని నరసయ్య చెప్తాడు. ఈ విధంగా ప్రసాద్ చేనేత కుటుంబాలకు సహాయసహకారాలు అందిస్తున్నాడని తెలిసి అందరూ సంతోషిస్తారు. జోగేంద్రతో శ్యామలకు, ప్రసాద్ ఉషను వివాహం చేసుకోవడంతో ఈ నవల ముగుస్తుంది.

### ౨.౬. సుషుప్తి(౧౯౭౪)

కుమ్మరి వృత్తి జీవితాలను చిత్రించిన నవల సుషుప్తి. రచయిత్రి మాదిరెడ్డి సులోచన రంగారెడ్డి జిల్లాకు చెందినవారు. ఇందులో మొత్తం 21 భాగాలుగా ఉంది. ఇందులో గోవింద్ ప్రధాన పాత్ర. గోవింద్ తల్లిదండ్రులు ఎంకమ్మ, బాలయ్య. ఒకప్పుడు తన వృత్తిలో ఓ వెలుగు వెలిగాడు బాలయ్య. బాలయ్య చేసిన కూజాలంటే జిల్లాకంతా ప్రసిద్ధి. అలాగే అతను కూర చట్టీలు చేసి నార్సింగ్ సంతకు తీసుకొని వెళ్తే గంటలో అన్నీ అమ్ముడుపోయేవి.

"బాలయ్య పెరుగుతోడు పెట్టే ముంతలు ఎంత బాగ చేస్తాడో, 'జాడీలు కొనబుద్ది వెయ్యదు' అనేది నర్సింహరెడ్డి భార్య లక్ష్మమ్మ.

'బాలయ్యా! పూలకుండీలు నువ్వు చేస్తే మన్నుతాయి. చూడటానికి అందంగా ఉంటాయి.' డాక్టర్‌గారు స్వయంగా కుమ్మరి వాడకు వచ్చి తనకు కావలసినవి ఎన్నిక చేసుకునేవాడు.

'బాలయ్యా! మా యిల్లు కప్పవరకు వచ్చింది. ఓ పదివేలు పెంకు కావాలి. కొత్తగా పెంకుటిల్లు కట్టుకునేవారు, అడ్వాన్సులు ఇచ్చేవారు...

నోములకు కొత్త కుండలు కావాలి. కాస్త మధ్యస్తంగా చెయ్యవోయ్..' కోమటివాడ నుండి ఆర్డరు వచ్చేది.

ఇవన్నీ ఇప్పుడు కాదు, ఒకప్పుడు. బాలయ్య వయస్సులో ఉన్నప్పుడు..." అనే ప్రారంభ వాక్యంతో నవల మొదలవుతుంది.

ఈ ప్రారంభ వాక్యంలోని వృత్తిదారుల జీవనాన్ని, గత వర్తమానాలను మనముందుంచారు రచయిత్రి.

బాలయ్య కొడుకుని కేవలం స్కాలర్‌షిప్ కోసం మాత్రమే బడికి పంపేవాడు. బాలయ్య మాత్రమేకాదు, మిగతా వృత్తిదారుల పరిస్థితి కూడా అంతే. సరైన ఆహారం కూడా దొరకని పరిస్థితి బాలయ్యకుంటుంది. ఎంకమ్మ పెరుగు గురుగులు తీసుకొని అమ్మడానికి నార్సింగ్ సంతకు వెళ్తుంది. అక్కడకు వెళ్ళేసరికి అక్కడ స్టీలు సామాన్ల దుకాణం చూసి తిట్టుకుంటుంది. గతంలో తను సంతకు రాగానే తెచ్చిన వస్తువులు అమ్ముడుపోయేవి. నేడు స్టీలు సామాను రావడంతో మన్నుతో చేసిన వస్తువులు ఎవరు కొనక వారి జీవితం అగమ్యగోచరంగా మారింది. తన పరిస్థితే కాదు, బజ్జీలు, బోండాలు, రొట్టెలు అమ్మే గంగమ్మ పరిస్థితి కూడా అంతే; గాజుల బంగారు పని అంతే అయింది. గతంలో రంగు రంగుల గాజులు భుజానికి వేసుకొని తిరిగితే వీధిలోని వారు అందరూ పిలిచి గాజులు వేయించుకునేవారు. మంచిగాజులు అన్ని అయిపోయాయి అని తగువులాడుకునేవారు. నేడు ఆ సంతలో గాజులకొట్టు వెలిసింది. అందులో గిల్ట్ నగలు, రిబ్బన్లు, బొట్టు, కాటుక ఇలా రకరకాల వస్తువులు అమ్మడంతో అందరూ అక్కడే కొంటున్నారు. దాంతో బంగారుకు బేరమే లేకుండా పోయింది. ఇలా కులవృత్తి చేసుకునేవారి పరిస్థితి దిగజారిపోయింది.

అందులో తను ఒకరు అనుకుంది ఎంకమ్మ. గోవింద్ చదువు సరిగా చదవకపోవడం, తల్లిదండ్రులు కూడా శ్రద్ధ పెట్టరు. తను చేసే కులవృత్తియే తనకొడుకు చేసుకుంటూ జీవిస్తాడనేది బాలయ్య ఆలోచన. గోవింద్ తన తండ్రికి సహాయపడుతూ, కుమ్మరి వృత్తి చేస్తూ ఉంటాడు. వీరిది మరీ గ్రామీణ వాతావరణం కాదు. పట్టణానికి దగ్గరలోనే ఉంటుంది. ప్రతి అరగంటకు ఒక బస్సు కూడా ఉంటుంది.

గోవిందు గ్రామంలోని సినిమా థియేటర్‌లో తోటమాలి సినిమా చూస్తాడు. ఆ సినిమాలో మాదిరి తనుకూడా తోటపని చేస్తే, తనను యజమాని కూతురు వివాహం చేసుకుంటుందనే భ్రమలోకి వెళ్తాడు. ఎంకమ్మ ప్రతిరోజు ఇంటిపనితోపాటుగా వాముకు కావాల్సిన కంపమోపులను గాడిదమీద మట్టిని తేవాలి. ఇది ఆమె దినచర్య. గోవిందుకు వివాహం చేస్తే వచ్చే కోడలు తనకు పనులలో సహాయపడుతుందని బాలయ్యతో చెప్తుంది. దానికి బాలయ్య ఎంకమ్మ అన్న కూతురు ముత్యంను చేద్దామని అనుకుంటారు. ఎంకమ్మ షావుకారి పిలిచినపుడు వెళ్ళి అక్కడ ఇంట్లో పనిచేస్తూ అన్నం కూర పెట్టిస్తే తెచ్చి కొడుక్కి పెడుతుంది.

ఇంటి పనులలో ఆడ, మగ తేడా లేకుండా కలిసి పనిచేయడం క్రింది జాతులలో పనిచేస్తుంది. ఎంకమ్మకు చేయి గుంజుతుంటే, గోవిందు వచ్చి పచ్చడి నూరుతాడు. ఇలాంటి దృశ్యాలు అనేకం. బాలయ్యకు జ్వరం రావడంతో ఆము పెట్టడం ఆలస్యం అవుతుంది. గోవిందుకు అన్ని పనులు వచ్చు కానీ, ఆము పెట్టడం మాత్రం రాదు. ఆము పెట్టడం పూర్తవ్వగానే దావూద్ వస్తాడు. దావూద్ షావుకారి దగ్గర బంట్రోతుగా పని చేస్తాడు. షావుకారి దగ్గర బంట్రోతుగా పని చేస్తాడు. షావుకారి దగ్గర అప్పులు తీసుకున్న వారి దగ్గరి నుండి వసూలు చేయడం అతని పని. ఇతడు వెళ్ళినందుకు రోజుకు రూపాయి లేదా కల్లు పోస్తారు. పెద్ద వ్యవసాయదారులైతే రెండు రూపాయలు ఇచ్చి ఇంట్లో లేరని చెప్పమని అంటారు. ఈ విధంగా దావూద్ జీవనం గడుస్తుంది. ఇతనికి ఇద్దరు భార్యలు. ప్రభుత్వ ఉద్యోగం వచ్చినా వెళ్ళకుండా ఇదే పని చేస్తూ జీవనం సాగిస్తుంటాడు.

దావూద్ రావడంతో బాలయ్యలో ఆందోళన ఏర్పడుతుంది. దానికి గల కారణం. బాలయ్య షావుకారి దగ్గర అప్పు తెచ్చుకుంటాడు. షావుకారు కాలిన సరకును అప్పుకింద జమకట్టుకుంటాడు. ఈ సరుకును ఎక్కువ ధరకు అమ్మడం, తన దగ్గరికి అప్పుల కొరకు వచ్చే వారిలో అవసరం

ఉన్నవారికి అంటగట్టుతూ లాభాలు ఆర్జిస్తాడు. షావుకారు దగ్గరే కాకుండా, ఈడిగ రామస్వామి దగ్గర కూడా అప్పు ఉంటుంది బాలయ్యకు. ఈ రామస్వామి దగ్గర కల్లు తాగడంతోపాటు చిల్లర ఖర్చులకు అప్పు పెడతాడు. ఈ విధంగా బాలయ్య ఆదాయం రాకముందు, అప్పులు చేసి ఉంటాడు.

రెండవరోజు ఆము విప్పుతూ గోవిందు ప్యాంటు, షర్టుతోపాటుగా చెప్పులు కొనాలని అనుకుంటాడు. ఇంతలో దావూద్, రామస్వామి రావడంతో బాలయ్య ఏమీచేయలేక వారికి ఇచ్చేస్తాడు. దాంతో ఎంకమ్మ బాలయ్యతో గొడవపడుతుంది. బాలయ్య గట్టిగా అరవడంతో ఎంకమ్మ "ఎందుకు ముయ్యాలె? పోరడు రాత్రింబగల్లు కష్టపడ్డడు. ఆ ముత్రాసి వస్తువు అమ్ముకొని ఇగో నీ ఇష్టమొచ్చింది కొనుక్కో బిడ్డ అంట నాల్గు పైసలిస్తివా!(పుట:27) అంటుంది. బాలయ్యకు తాగుడు ఉంటే చాలు. ఆ తాగుడుకే అప్పులు చేస్తాడు. కనీసం ఇంట్లో ఉన్న కొడుకు పరిస్థితిని అర్థం చేసుకోమని తన ఆవేదనను తెలుపుతుంది.

గోవిందు తోటమాలి పని చేద్దామని నిశ్చయించుకున్న విషయాన్ని తల్లితో చెప్తాడు. తమ వృత్తి వల్ల బాగుపడింది ఏమి లేదని, ఏదో ఒక పని చేసుకొని సంతోషంగా జీవిస్తే చాలంటుంది. గ్రామంలోని షావుకారు, డాక్టర్ ఇండ్లలలోకి వచ్చాక అర్థమవుతుంది తోటమాలి ఎవరికి అవసరం లేదని. గోవిందు తన బాధను మీనయ్యతో చెప్పగా, సినిమాలోలాగా నిజజీవితంలో జరగవని చెప్తాడు.

గోవిందు పెళ్ళి మేనమామ కూతురు ముత్యంతో నిశ్చయమవుతుంది. పెళ్ళి రోజున వంటలు చేస్తున్న ఎంకమ్మ, రాములు దగ్గరికి వచ్చిన బాలయ్య "రాములు; ఏందే బాలయ్యన్న, ఒక్కసాలి ఈడ్కి రాసెల్లె' ఆ పిలుపులో ఆప్యాయతకి కరిగిపోతుంది రాములు." (పుట:30). క్రింది వర్గాలలోని మాటల్లోని ఆప్యాయతని ఇక్కడ చూడవచ్చు. బాలయ్య షావుకారి దగ్గర తెచ్చిన అప్పు తాళి, మెట్టెలు, బట్టలకే సరిపోతుంది. దాంతో పెళ్ళిపిల్లకు పెట్టాల్సిన కడియాలు, కమ్మలను రాములును అడుగుతాడు. రాములు కూతురి వివాహమై సంవత్సరమవుతుంది. ఆ అమ్మాయికి పెట్టిన నగలను ఇవ్వమని కొంతసేపు బతిమిలాడిన తర్వాత రాములు తెచ్చి ఇస్తుంది. ఈ సందర్భంలో పేదవారిలో ఉండే ఐక్యత మనకు కనపడుతుంది. వివాహ కార్యక్రమాలలో కంసాలి, బ్రాహ్మణుని పాత్రలను సూక్ష్మంగా మనముందుంచారు రచయిత్రి. ధనవంతుల పెళ్ళీలలో ఆర్భాటాలు, పాట కచేరీలు పాట కచేరీలు ఉంటే, పేదల పెళ్ళీలల్లో ఉండే మనస్తత్వాలు కనపడతాయి. వివాహం జరిగాక ఉండే

అప్పగింతల ఆచారాల్ని గ్రామంలోని దొరలు లేదా షావుకార్ల వద్దకు వెళ్ళి ఆశీర్వాదాలు తీసుకోవడం లాంటివి ఈ నవలలో కనబడుతాయి.

వర్షాకాలంలో కుమ్మరి వృత్తుల పని సజావుగా సాగదు. ఒకరోజు షావుకారు తమ్ముడి కూతురు లత వచ్చి సైన్స్ ఎగ్జిబిషన్‌లో మోడల్స్ తయారు చేయడానికి మట్టి కావాలని అడుగుతుంది. మట్టి ఒక్క కుమ్మరి వారికే అవసరమనుకునే గోవిందు బడిపిల్లలకు కూడా అవసరముంటుందనే విషయాన్ని గ్రహిస్తాడు.

బాలయ్యకు సారా ఎవ్వరూ పోయకపోవడంతో ఇంటికి వచ్చిన సందర్భంలో గోవిందు, ఎంకమ్మ వర్షం కారణంగా చలికి ఏమి పని చేయకుండా కూర్చుంటారు. దాంతో తన కోపాన్ని భార్యపై చూపించబోతాడు. కొడుకు నాయనా అమ్మను ఒదులు అనడంతో అవమానంగా భావించి బయటికి వెళ్తాడు. బాలయ్య లాంటివారు ఎందుకు తాగుతారో అర్థంకాదు. ఇలాంటివారి వల్ల ఆమె కుటుంబం కష్టాల్లో చిక్కుకుంటుంది. గోవిందు అయ్యంగారు హోటల్లో టీ తాగి వస్తుండగా లత పిలుస్తుంది. అక్కడ దేవకీ టీచర్‌ని చూసి ఆకర్షితుడవుతాడు. పిల్లలు చేసిన గుండే, ఊపిరితిత్తులలాంటి మోడల్స్ చూసి ఆశ్చర్యపోతాడు గోవిందు.

శ్రావణ మాసం రావడంతో ఎంకమ్మ కోమటి రంగయ్య దగ్గర అరువుకు నూనె, పిండి తెచ్చి ఫలహారాలు చేసుకొని కోడల్ని తీసుకొస్తుంది. కాని ముత్యం వచ్చాక పనిలో సహకరించదు. పైగా ఖర్చులు పెరుగుతాయి. కింది వర్గాలలో పప్పులు, ఇతర వస్తువులను ఒకరికొకరు ఇచ్చి పుచ్చుకుంటారు. ఎంకమ్మ రాములుని పప్పు బదులు అడుగుతుంది. రాములు లేదని చెప్తుంది. కానీ తర్వాత రాములు కొడుకు ద్వారా పప్పు ఉన్న విషయం తెలుసుకున్న ఎంకమ్మ పంచాయితికి దిగడం, రాములు తన కూతురి కడియాలు, కమ్మలు నీ కోడల్కి పెడితే పెండ్లి జరిగిందని అనడం, దాంతో వాటిని తిరిగి ఇవ్వడం ఇలాంటి సంఘటనలు జరిగే చిన్న చిన్న గొడవలు ఈ నవలలో కనిపిస్తాయి.

దేవకిని చూసి ఆకర్షితుడైన అమెని చూడాలని, ఆమెతో ఇంటికి వెళ్తుంటాడు. ఆమె సాధారణంగా మాట్లాడే మాటలు, చేసే పనులు తనకోసమేనని భావిస్తుంటాడు గోవిందు. బతుకమ్మ పాటల్లోని శివపార్వతుల వలే ఆ దేవకిని ఊహించుకుంటాడు. మీనయ్య ప్యాంట్, షర్ట్ వేసుకొని వెళ్ళిన సందర్భంలో అక్కడివారితో దెబ్బలు తినడం లాంటి సంఘటనలు జరుగుతాయి.

ముత్యం ప్రతిసారి తల్లిగారి ఇంటికి పారిపోవడం, ఎంకమ్మ వెళ్ళి తీసుకురావడంతో విసిగిపోతారు. ఇంతలో ప్రభుత్వం భూమి ఇవ్వడం, ముత్యంతో విడాకులు జరగడం బాలయ్యలో సంతోషాన్ని నింపుతాయి. భూమికొరకు ఇరవై రూపాయలు దేవకి సహాయం చేసినపుడు తననే ప్రేమిస్తుందని నమ్మకం పెంచుకుంటాడు. ఇలా ఒకరోజు దేవకి ఇంట్లో ఒక వ్యక్తిని చూశాక, సాయంత్రం అతని గురించి అడుగగా తననే పెళ్ళి చేసుకునేదని చెప్తుంది. అప్పుడు నిస్పృహకు గురైన గోవిందును చూసిన దేవకి, తను నీలాంటి వారి కుటుంబాలలో కలవలేనని, సినిమాలు అనేవి నీలాంటివారు చూడాలని తీస్తారు. కాని అవి వాస్తవాలు కావని చెబుతుంది.

ప్రభుత్వం ఇచ్చిన భూమిని తాకట్టు పెట్టి గోవిందుకు చుక్కతో వివాహం చేస్తారు. చుక్క ఆ గ్రామ సర్పంచ్ ఇంట్లో పని చేసేది. సర్పంచ్ కొడుకుతో అనుబంధం పెరిగి గర్భవతి అవుతుంది. ఆ విషయం తెలిసిన తర్వాత ఎంకమ్మ, బాలయ్య పిల్ల పనిమంతురాలు అని ఓర్చుకుంటారు. ఎంకమ్మ కోడలికి కొంత దూరంగానే ఉంటుంది. దావూద్ చుక్కను వేదిస్తుంటాడు. భర్త గోవిందు అమాయకత్వాన్ని చూసిన చుక్క భర్తతోనే సఖ్యంగా జీవించాలని నిర్ణయించుకుంటుంది.

"లోకం అమాయకులు కాదన్న సంగతి తెలిస్తే చుక్క నిశ్చింతగా ఉండగలిగేది కాదేమో." (పుట: 88).

చుక్క రావడంతో బాలయ్య ఇంట్లో మార్పు కనబడుతుంది. షావుకారి, దావూద్ దొంగలెక్కలు చెల్లకుండా అవుతాయి. చుక్కకు కొడుకు పుట్టడంతో గోవిందు ఆనందంలో ఉంటాడు. మరుసటిరోజు వాయిదా ఉందని దావూద్ ఇంటికి వస్తాడు. బాలయ్యతో దావూద్ నీ కొడుకు పెండ్లి జరిగి ఎనిమిది నెలలే అయింది. అప్పుడే మనవుడు పుట్టాడా అని అంటాడు. బాలయ్య సమాధానంగా మా యింట్లో ఏడో నెలలోనే పుడతారు అనగా దావూద్ గట్టిగా నవ్వుతాడు. గోవింద్ ఇంట్లో నుండి రావడం చూసి కొడుకు దావత్ ఇవ్వమంటాడు దావూద్. తన దగ్గర డబ్బులు లేవని చెప్పడంతో, తానే యిస్తానని చెప్పి బలవంతంగా గోవింద్‌ని తీసుకెల్లి కల్లు, సారా తాగించి "ఏడవ నెలలో పుడితే తల్లి బతకదని, నీ పెళ్ళాం మంచి హుషారుదని విషపు మాటలు నేర్పుతాడు దావూద్.

ఇంటికి వచ్చిన గోవింద్ చుక్కను కొట్టి అసలు విషయం తెలుసుకొని, ఇంటినుండి వెళ్ళగొడుతాడు. జరిగిన విషయాన్ని తల్లికి చెప్పగా "తను ఏ కొడుకు భవిష్యత్తు ఆశించి దావానలం

మింగిందో, ఆ కొడుకు మళ్ళీ వంటరిగాడు అయ్యాడు. ఆ విషయం ఆమెను తొలిచివేయసాగింది." (పుట: 93).

తల్లి కొడుకు జీవితం పట్ల ఉండే ప్రేమానురాగాలు ఇక్కడ స్పష్టంగా కనపడతాయి. గోవిందు ఎంత చెప్పినా వినడు. దాంతో ముత్యంకు కడియాలు, కమ్మలు ఐనా పెట్టి తీసుకొద్దాం అనుకుంటుంది. కాని అది చేజారిపోతుంది.

ఎంకమ్మ బావిదగ్గర కాలు జారిపడి ఆరునెలల తర్వాత మరణిస్తుంది. చివరి దశలో కోడలు కోడలు అని కలవరిస్తుంది.

కులపెద్దమనిషి చొరవతో గోవిందుతో మాట్లాడి చుక్కను రప్పిస్తారు. చుక్క వస్తూనే అత్తమీద పడి ఏడుస్తుంది. భర్త కాళ్ళను పట్టుకొని దుఃఖిస్తుంది. ఐదవరోజు అయిపోతుంది. కాలం గడిచిన గోవిందు మౌనంగా ఉండటాన్ని చూసిన చుక్క గోవిందును ప్రాదేయపడగా పిల్లవాన్ని పంపియ్యమంటాడు. దాంతో చుక్క తల్లికి పిల్లవాన్ని ఇచ్చివచ్చి సంసారం సాగిస్తుంది.

షావుకారి కొడుకు కుమార్ అప్పుల వాళ్ళను పిలిచి ఒక సంవత్సరం వాయిదాలో అప్పులు తీర్చుమని చెప్తాడు. కుమార్‌కు వడ్డీ వ్యాపారం నచ్చదు. ఏదైనా పరిశ్రమ పెట్టాలనుకుంటున్నానని చెప్తాడు. అక్కడినుండి వస్తున్న గోవింద్‌ను దావూద్ ఆపి విషయం అడుగగా "సంవత్సరంలో ఎలాగైనా తీరుస్తా" అంటాడు గోవింద్. వెంటనే దావూద్ "బంగారు గుడ్లు పెట్టే బాతు ఇంట్లున్నది. దానికి జెప్పు సర్పంచి కొడుకు దగ్గర తెస్తది అన్నాడు వంకరగా నవ్వుతూ. గోవిందుకు కోపం వచ్చింది. దిగమింగాడు. నేను పంపుతనా? నువ్వు పంపకపోయినా అది తెస్తది. నసీబ్ అంటే నీదేరా. పోరన్ని విడిచిపెట్టి వచ్చింది నీకోసం."(పుట:98). ఈ విధంగా లేని ఆలోచనలు గోవిందులో నింపుతాడు దావూద్. ఇంటికి వెళ్ళి చుక్కను కొడతాడు. గోవిందులో మార్పు రాదు. అప్పులో పెరిగి, చివరికి యిల్లు తాకట్టు పెడతామన్నా ఎవరూ రారు. చుక్క పనిచేస్తూ తిండి వరకు సంపాదిస్తుంది. కంపమోపులు, ఇంట్లోని యిత్తడి చెంబులు, సత్తు గిన్నెలు కూడా అమ్మి తాగే స్థితికి వస్తాడు గోవిందు.

బాలయ్య ఆకలి చూడలేని చుక్క ఇరుగుపొరుగు వారి దగ్గరికి వెళ్ళి అడిగినా ఫలితం లేకపోవడంతో వచ్చి ఇంట్లో కూర్చుంటుంది. ఇంతలో దావూద్ పరిస్థితిని చూసి ఐదు రూపాయలు ఇస్తాడు. కానీ బియ్యం తెచ్చి వండే శక్తి కూడా ఉండదు చుక్కకి. ఇంతలో చుక్కపై చేయి

పడుతుంది. దావూద్ అన్నం, మాంసం కూర తెచ్చి ఇస్తాడు. అది తను తిని, బాలయ్యకు పెడుతుంది చుక్క. దాంతో దావూద్ మీదున్న కోపం పోతుంది.

సాయంకాలం కిలో బియ్యంతో వచ్చిన గోవిందు మాంసం కూరతో తిన్న విషయం తండ్రి ద్వారా తెలిసి చుక్కను కొడుతాడు. చుక్కను దావఖానలో చేర్చుతారు. ఆ దెబ్బలను చూసి రాములు బాధపడుతుంది. అక్కడికి వచ్చిన దావూద్ పాలగ్లాసు అందిస్తాడు.

అప్పుల కింద భూమి, అన్నం, నీళ్ళులేక తండ్రిని కోల్పోతాడు గోవిందు. దెబ్బలు తినలేక చుక్క వెళ్ళిపోతుంది. గోవిందు ఒంటరివాడవుతాడు. గోవిందును చూసిన మీనయ్య అప్పులమీద కాకుండా పని చేసుకొని జీవించాలని చెప్తాడు. దావూద్ పట్నంలో కోళ్ళఫారం, డైరీ ఫారం పెట్టాడు. అక్కడ పనిచేసుకుంటూ బ్రతుకుదువని గోవిందును పట్నం తీసుకెళ్తాడు. మీనయ్య గోవిందుని దావూద్ ఇంటిదగ్గర వదిలి వెళ్తాడు. దావూద్ ఇంట్లోకి ప్రవేశించిన గోవిందుకు ఖరీదైన చీరతో, నూతన అలంకారాలతో వెలిగిపోతున్న చుక్క కనబడుతుంది. పక్కనే దావూద్ ఉంటాడు. వారు మాట్లాడే మాటలు విని నిలబడలేక వస్తూ కింద పడిపోతాడు. తన మనసులో భార్యపట్ల విషం నింపిన దావూద్ నిజ స్వరూపం అర్థం అవుతుంది గోవిందుకి. దాంతో నవల ముగుస్తుంది.

ఈ నవలలో ప్లాస్టిక్, స్టీలు పాత్రల రాకతో కుమ్మరి వృత్తి మాయమయ్యే స్థితికి చేరుకుంటుంది. భారతదేశంలో 1990వ సంవత్సరంలో నూతన పారిశ్రామిక విధానాలను అమలులోకి తెస్తే, అంతకు ముందే 1974లోనే ఈ నవలలో ప్రపంచీకరణ ప్రభావాన్ని, దానివలన గ్రామీణ జీవనం ధ్వంసం అయిన తీరును దృశ్యమానం చేశారు రచయిత్రి. అంతేగాక, స్త్రీ పురుషులు కలిసి పనిచేసే సంస్కృతి ఇందులో కనబడుతుంది.

### 2.7. మోహిని(1994)

ననుమాసస్వామి 'మోహిని' నవలను 1994లో రచించాడు. ఈ నవల గౌడ వృత్తి జీవితాన్ని ఆవిష్కరించింది. ఇది ఎనిమిది భాగాలు కలిగి ధారాళమైన శైలితో ఆద్యంతం చదివే గుణం కలిగివుంది.

ఈ నవల ప్రారంభంలో మోదుంపురం గ్రామాన్ని వర్ణిస్తూ "తెలతెలవారుతోంది అరుణోదయ కిరణాల తెలుగులో చిన్న ద్వీపంలా ఊరు మెరిసిపోతోంది. ఎత్తయిన ప్రదేశం చుట్టూ గుబురుగా ఉన్న చెట్ల మధ్యలోంచి వరసగా తీర్చిదిద్దిన గృహాలు కనిపిస్తున్నాయి. ఊరు చుట్టూ పొలాలు... పల్లె రైతులంతా పొలం పనుల్లోకి మెల్లగా జారుకుంటున్నారు. మేతకోసం బయలుదేరిన బర్రె గొడ్లు ఊరు బయట చెల్లాచెదురవుతాయి. పాలవాళ్ళు, కూరగాయల వాళ్లు, నెత్తిన బుట్టలు ఎత్తుకొని రోడ్డు వెంట పరిగెడుతున్నారు, కోతులెగపాకుతున్నట్లు గీతకార్మికులు చకచకా తాటి చెట్లు ఎక్కుతున్నారు" తో ప్రారంభమవుతుంది.

మోదుపురం గ్రామం ఎత్తయిన ప్రదేశంలో ఉంటుంది దానివలన నీటి సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతుంటారు. ఆ ఊరికి తూర్పువైపున లోతట్టులో ఉన్న బావియే వారికి దిక్కు. ఆ జిల్లాకు కలెక్టరుగా వచ్చిన చైతన్య ఆ గ్రామం నుండి వెళ్తున్న సందర్భంలో ప్రజలు నీటి బిందెలతో రావడం చూసి కారు ఆపి వారి సమస్యను తెలుసుకుంటాడు. అక్కడే మోహినిని చూసి ప్రేమిస్తాడు. కాటమయ్యను గుర్తించడం జరుగుతుంది. నీటి సమస్యను పరిష్కరించి నీళ్ళ ట్యాంక్ ను మోహిని చేత ప్రారంభించమని కాటమయ్య తనకు చిన్నతనంలో గోరుముద్దలు తినిపించాడని తెలుపుతూ ఎమ్మార్వో ద్వారా సందేశాన్ని పంపుతాడు కలెక్టర్ చైతన్య.

చైతన్యతో అక్క అనసూయ మోహిని వాళ్ల గురించి చెబుతూ తండ్రి రామనాథం ఉద్యోగరీత్య మోదుపురం గ్రామానికి వెళ్ళామని అక్కడే కాటమయ్య ఇంట్లో ఉన్న విషయాన్ని ప్రస్తావిస్తూ తండ్రి రామనాథం కాటమయ్య నాటకాలువేసేవారు అని చెప్తూ తనకు వరూధిని పాత్రలో నటించటానికి దొరికిన అవకాశం మరియు ఆ నాటకంకు బహుమతి రావడం గూర్చి తెలుపుతుంది.

మోహిని డిగ్రీ పూర్తిచేసి, 'గీతపరిశ్రమ' పత్రికా సంపాదకురాలిగా పనిచేస్తుంది. సామాజిక చైతన్యం కలిగిన వ్యక్తి. గీత వృత్తి పట్ల నిబద్ధతను కలిగి ఉంటుంది. మోహిని తండ్రి కాటమయ్య డిగ్రీ వరకు చదివి గీతవృత్తి ద్వారా జీవనం సాగిస్తుంటాడు. మోహిని తనతో ట్యాంక్ ప్రారంభింప చేసిన కలెక్టర్ గురించి కొంత అనుమానం వ్యక్తం చేస్తుంది. మోసం చేసే ఉద్దేశంతో ఇలా చేశాడా? అని కొందరు దళితులు స్వజాతి వారిని కూడా మోసం చేసిన సందర్భాలు కూడా ఉన్నాయని, ఆదర్శమైన పురుషులు మాత్రమే దళితులను ఉద్ధరిస్తారని అనుకుంటుంది. ఈ కలెక్టర్ ఎలాంటివాడో తేల్చుకోలేక పోతుంది.

సుభాష్‌ది మోదుపురం గ్రామమే కానీ హైదరాబాదులో నిజాం కాలేజీలో, డిగ్రీ పూర్తిచేసి సివిల్స్ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాడు. గ్రామానికి వచ్చినప్పుడు మోహిని ఇంటికి వెళ్తాడు. అక్కడ కాటమయ్య, మోహిని, సుభాష్ ల (చర్చలలో) మాట్లాడుకునే సందర్భంలో కల్లుగీత, పారిశ్రామిక సంఘం, రిజర్వేషన్లు విషయ ప్రస్తావన వస్తుంది. కొత్తగా నాన్ క్రిమిలేయర్ ను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, అది పాయిజన్ లేయర్‌గా మారి ఎస్సీ, ఎస్.టి, బిసి ప్రయోజనాలు కాలరాస్తుందంటాడు కాటమయ్య.

సుభాష్ మద్యపాన నిషేధం వల్ల గౌడ జాతికి ఏమైనా ముప్పు కలుగుతుందా? అన్న ప్రశ్నకు సమాధానంగా రెండు సంవత్సరాల క్రింద దూబగుంట లో ప్రారంభమైన మద్యపాన నిషేధ ఉద్యమం వల్ల ప్రభుత్వం నిషేధ ప్రకటన చేసింది. కానీ ధనికులు తాగే మద్యాన్ని నిషేదించ కుండా ప్రభుత్వం పక్షపాత ధోరణిని అవలంబిస్తోంది. దానితో పేదలు తాటివనాలలోకి వచ్చారంటాడు. ప్రభుత్వం చీప్ లిక్కర్ ని ప్రవేశపెట్టే ఆలోచనలో ఉందని హైదరాబాద్ ధూల్పేటలో సారా విక్రయాలు ఎక్కువయ్యాయని ప్రభుత్వం నిషేధ ప్రకటన చేస్తే ప్రభుత్వానికి ఆదాయం తగ్గి, ప్రైవేటు వ్యక్తులకు ఆదాయం సమకూరుతుందంటాడు. “మద్యపానం అనేది సజీవనదిలా మనదేశంలో పారుతూనే ఉంటుందని” కాటమయ్య అంటాడు.

ఈనాడు ఉదయం పేపర్లో రాష్ట్ర మంత్రివర్గం ‘సంపూర్ణ మద్యపాన నిసేధం’ గురించి రేపు చర్చిస్తారని వార్త రాగానే గౌడ నాయకులు చలో హైదరాబాద్ కి పిలుపునిస్తారు. దాంతో రాష్ట్రం నలుమూలలనుండి గౌడ కుటుంబాలన్ని నిజాం కాలేజీ మైదానానికి చేరుకుంటాయి. సభలో ప్రధాన వక్తలుగా గౌతు లచ్చన్న, ధర్మభిక్షం, మాచర్ల జగన్నాథం, బలాగౌడ్, మోహినిలు మాట్లాడుతూ గీత వృత్తిని కాపాడుకోవాలని మద్యపాన నిషేదం నుండి కల్లును మినహాయించాలంటారు. మోహిని తిరుగు ప్రయాణంలో నర్సంపేటకు చేరుకోగానే అక్కడ బస్టాండ్లో గీత కార్మికులు ఎదురై తమ పరిస్థితి ఎలా ఉంటుందని అడగగా దానికి సమాధానంగా మోహిని భవిష్యత్తు సందిగ్ధంలో పడిందని మంత్రివర్గం మద్యపాన నిషేధంపై నిర్వహించిన సమావేశం ఇంకా ఏ నిర్ణయం ప్రకటించలేదు. దానికి కారణం గౌడ సభ కారణం కావచ్చు. ఉద్యమస్ఫూర్తి మేరకే కావచ్చు. కల్లును నిషేధిస్తే ప్రభుత్వం కూలబడుతుందని చెప్తుంది.

మోహిని ఇంటికి చేరుకుంటుంది కాని ఆమె ఆలోచనలన్ని రాష్ట్ర కార్య వర్గ సభ్యులు తీసుకొన్న నిర్ణయాల చుట్టూ తిరుగుతుంటాయి. ఈ సందర్భంలో తల్లి సుందరమ్మకు మోహిని సురాభాండం రక్షించేందుకు పుట్టిన దేవతలా కనిపిస్తుంది. ఇంతలో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు నోటిఫికేషన్ వస్తుంది. ఎన్నికల ఫలితంగా ప్రభుత్వం సంపూర్ణ మద్యపాన నిషేధం గురించి ప్రకటన రాలేదని గీత కార్మికులు ఊపిరి పీల్చుకుంటారు.

గీత కార్మికులు తమ సమస్యను రాజకీయంగానే పరిష్కరించుకోవాలనే నిర్ణయానికి వస్తారు. దీంతో గౌడ నాయకులు హైదరాబాదులోని హోస్టల్లో సమావేశం ఏర్పాటు చేస్తారు. గౌతు లచ్చన్న చర్చను ప్రారంభిస్తూ ప్రస్తుత ఎన్నికల్లో మనమేవైఖరి అవలంభించాలని ప్రధాన సమస్యగా చెప్తాడు. దాంతో అందరూ మోహిని సమాధానం కోసం ఎదురుచూస్తుంటారు.

మోహిని మాట్లాడుతూ "కురువృద్ధుల్ లాంటి కుల పెద్దమనుషులు, ఈ సమావేశంలో ఉన్నారు. ఇది సాహసమే అయిన చెప్పక తప్పదు. గీత కార్మిక బంధువులారా మనముందరేమో గౌడకుల భవిష్యత్తు, రానున్నవేమో అసెంబ్లీ ఎన్నికలు మనం తీసుకొనే నిర్ణయం మీదనే ఒక కోటి గీత కార్మికుల భవిష్యత్తు ఆధారపడి ఉంది... (పుట: 45) అని తప్పుడు విధానం అనుసరిస్తే జాతి చరిత్రలో మచ్చగా మిగిలిపోతుందని, ప్రజలు కొత్త పార్టీలను ఆదరిస్తారని అంటూ దక్షిణాఫ్రికాలాగా దక్షిణభారతం రగిలిపోతేనే రాజకీయ ప్రయోజనం దక్కుతుందని అంటుంది. అప్పుడే మన జాతి ప్రయోజనాలు కాపాడుకోవచ్చు. రాష్ట్రంలో సిద్ధాంతాలు ఉన్నవి, లేని పార్టీలు ఉన్నాయి. కానీ ఇప్పుడు కొత్తగా అందరికీ ఆమోదయోగ్యమైన పార్టీ వస్తుందని అది యూపీలో బలంగా ఉందని చెప్తూ అందులో గీతకార్మికుల ప్రయోజనాలు కాపాడుకుందాం అని చెప్తుంది. దీంతో నాయకుల్లో కొంత చర్చ మొదలవుతుంది. గౌతు లచ్చన్న, మోహిని నిర్ణయాన్ని స్వాగతంగా మిగతావాళ్ళుతాము కొనసాగుతున్న పార్టీలోనే ఉంటామంటారు. లచ్చన్న, మిగతా నాయకులతో చర్చించి మోహిని నర్సంపేట అసెంబ్లీ అభ్యర్థిగా నిర్ణయిస్తారు.

చైతన్య పుట్టినరోజు ఆహ్వానం మేరకు మోహిని తండ్రి కాటమయ్యతో కలిసి వెళ్తుంది. అక్కడ చైతన్య అక్క అనసూయ, తల్లి జగదాంబ పలకరింపులు వారి ఆత్మీయత కనబడుతుంది.

మోహిని ఎన్నికల ప్రచారంలో అందరిని కలుపుకొని ప్రచారం చేస్తుంది. ఆ సందర్భంలో ప్రత్యర్థులు మోహినిపై దాడి చేస్తారు. హాస్పిటల్లో చేరుతుంది. స్వల్ప గాయాలు తాకుతాయి.

మోహిని మీద జరిగిన దాడితోని నియోజకవర్గం ప్రజలలో సానుభూతి, నమ్మకం కలిగి మోహిని ఎన్నికల్లో గెలుస్తుంది.

రాష్ట్ర ఎన్నికలలో ఏ పార్టీకి సరైన మెజార్టీ రాకపోవడంతో వామపక్ష పార్టీ, అంబేద్కరిజంపార్టీ కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేస్తారు. ముఖ్యమంత్రిగా గౌతు లచ్చన్నను, మోహినికి సంక్షేమ, సాంస్కృతిక శాఖామంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తుంది. మోహిని తన ఛాంబర్లో ఏ ఒక్క ఫైలు కూడా పెండింగ్ లో ఉండకూడదని పి.ఏల కు చెప్తుంది.

రాజాగౌడ్ మోహినికి సన్మానం చేస్తామని అనగానే సన్మానాల పేరిట డబ్బు వృధా చేయవద్దని చెప్పి ప్రతినెల నర్సంపేట నియోజకవర్గానికి వస్తానని చెప్తుంది.

మద్యనిషేధ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తూ మద్య నిషేధ ఐక్యవేదిక నిర్ణయం తీసుకోవడం ప్రభుత్వం చర్చలకు పిలుస్తోంది. ఈ చర్చల్లో మంత్రి మోహిని కీలకపాత్ర పోషిస్తుంది. ఐక్యవేదిక ప్రజాప్రతినిధులు రాజ్యసిన్హ, రాజ్యలక్ష్మి, సుబ్బమ్మ అధ్యక్షులుగా గోపాలకృష్ణయ్య ప్రశ్నల వర్షానికి ముఖ్యమంత్రి, ఎక్సైజ్ మంత్రి తడబడటంతో మోహిని మాట్లాడుతూ కొంత సమయం అవసరమని కల్లును ఎక్సైజ్ శాఖ నుంచి మినహాయించి మిగతావాటిని మినహాయిస్తామని అంటుంది. ఐక్యవేదిక సభ్యులు కల్లు కూడా నిషేదించాలి అనటంతో మోహిని "గీత పరిశ్రమ అనేది స్వయం ఉపాధికి సంబంధించింది. కోటిమంది గీత కార్మికులకు ఈ ప్రభుత్వం ప్రత్యామ్నాయమైన ఉపాధిని కల్పించలేదు. గీత పరిశ్రమను మూయిస్తే దాని మీద ఆధారపడ్డ కోటిమంది గీత కార్మికులు ఆకలికి గురై చస్తా ." (పుట: 176) అని చెప్పి ఒక కన్ను కోసం మరో కన్నును పొడుచుకోవద్దని చెప్పడంతో అందరూ ఒప్పుకుంటారు. కల్లు ఎక్సైజ్ శాఖ నుండి మినహాయించి సంపూర్ణ మద్యపానం నిషేధం అమలుపరచాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంటుంది. మోహిని సమర్థవంతమైన నాయకురాలిగా పేరు పొందుతుంది.

బంధువులు సుభాష్, మోహినితో పెళ్లి గురించి ప్రస్తావన తెచ్చిన సందర్భంలో కాటమయ్య సుందరమ్మలు మోహిని చైతన్యలు ఇద్దరు ఇష్టపడుతున్నారు. ఆ విషయం మోహిని ప్రకటిస్తే బాగుంటుందని అంటాడు కాటమయ్య. దాంతో మోహిని చైతన్యతో వివాహానికి ఒప్పుకుంటుంది. చైతన్యతో అభిప్రాయాలు చెప్పే సందర్భంలో తమ కుటుంబం వామపక్ష భావాలు కలిగివుందని, కార్యాలు, కర్మకాండల పట్ల ఆసక్తి తక్కువని చెప్పి సౌఖ్యంగా బతకాలనే కాకా సదాశయంతో

బ్రతకాలన్నదే నా ధ్యేయం అని చెప్తుంది. అందం చూసి అందాల వెనక సౌఖ్యం చూసో పెళ్లి చేసుకోవద్దని చెప్తుంది. నువ్వు సాధారణ స్త్రీవి కాదు నీజాతిని, నన్ను ఉద్ధరించడానికి పుట్టావని అంటాడు చైతన్య. వివాహం కూడా స్టేజి వివాహం అని కేవలం దండలు మాత్రమే మార్చుకోవాలని, చైతన్య అంగీకారంతో పెద్దలు పెళ్లి చేస్తారు. మోహిని ఆదర్శంగా తీసుకొని దళిత జాతి అంతా ఆమె ముందు నిలబడి ఆదర్శ వివాహం చేసుకుంటామని ప్రతిజ్ఞ చేయడంతో మోహిని పదవులను మించిన ఆనందాన్ని పొందుతుంది.

### ౨.౮. సంకెళ్లు తెగాయి(౧౯౯౪)

ముదిగంటి సుజాతారెడ్డి రచించిన 'సంకెళ్లు తెగాయి' నవల ఒక మారుమూల పల్లెలో (క్షురక) మంగలి జీవితాన్ని ఆవిష్కరించిన నవల. ఇది 15 భాగాలు కలిగి ధారాళమైన శైలితో ఏకబిగిన చదివించే గుణం కలిగివుంది. "ఈరయ్య మంగలి పెట్టే చంకన పెట్టుకొని దొర రాజేశ్వరరావు గడివైపు నడిచాడు" అని ప్రారంభ వాక్యంతోనే కులవృత్తిపై గురిపెట్టడం కనిపిస్తుంది.

ఈ పల్లెలో 'ఈరిగా అని పిలవబడే ఈరయ్యది కులవృత్తియే జీవనాధారంగా నడుస్తున్న కుటుంబం. భార్య రంగి, ముగ్గురు కూతుళ్ళు పూలమ్మ చంద్రమ్మ, పద్మమ్మ ఒకే ఒక్క కొడుకు నారాయణ. అతని ఆస్తి 4 ఎకరాల మడి చెలక, మంగలి పెట్టి ఆ గ్రామానికి మోతుబరి రాజేశ్వరరావు భూస్వామి. బడుగువర్గాలను అణచి వుండే స్వభావం కలవాడు. కూతురు సుశీల, అల్లుడు డాక్టర్ అమెరికాలో స్థిరపడతారు. కొడుకు రాజేశ్వరరావు.

సుశీల భర్తతో పసిబిడ్డతో పుట్టింటికి రావడంతో కథ ప్రారంభం. పుట్టువెంట్రుకలు తీసే సంప్రదాయ కార్యక్రమం ఒక భూస్వామి ఇంట్లో ఎంత ఆర్భాటంగా జరుగుతుందో ఇక్కడ చిత్రించబడింది. రోజులు తరబడి ఆ పల్లెకు చెందిన మంగలి, చాకలి, వంటి కులాల చాకిరీ కనిపిస్తుంది. భార్యకు జ్వరం, నీళ్లు లేక ఎండిన పొలంలో ఆగిపోయిన పని ఒత్తిళ్ల మధ్య రాజేశ్వరరావు ఇంటిలో వెంట్రుకలు తీయడానికి వస్తాడు. వీరయ్య "ఏందిరా! ఈరిగా నీకోసం ఎప్పటినుంచి చూస్తున్నాం. చిన్న దొర తయారయి ఎంతసేపయే! మునుపటి కాలం కాదురా! నీకు మస్తీలు ఎక్కువైనయి. మునుపటి భయాలు లేవు. ఇప్పుడెందుకు మాట వింటరు" (పుట: 6) ఇది

రాజేశ్వరరావు దొర గద్దింపు వేడుక అనంతరం అక్కడికి వచ్చిన పెద్దలు, బంధువులు భోజనం చేసి వెళ్ళిపోతారు. డప్పులు వాయించిన వాళ్లకు, చాకలి, మంగలి పనివాళ్ళకు అందరికీ కలిపి సాయంత్రానికి పెరట్లో మిగిలిపోయిన అన్నం, కూరలు పెడతారు. "మాంసం బొక్కయినా మన దాకా రాలేదే" అని ఆశ్చర్యపోయాడు మేకలను కోసి కోసి అలసిపోయిన చాకలి అంజయ్య" (పుట:12) అనే ఆవాక్యం ఆ మొత్తం సంఘటనను మనముందుంచుతుంది. వీరయ్య కొడుకు నారాయణ మంచిగా చదువుకునేవాడు.

పల్లెల్లో బలహీనవర్గాల అణచి వేత పట్ల కలత చెందుతాడు. తన గ్రామంలో తండ్రి పడుతున్న యాతన, బానిసల్లా రాజేశ్వరరావు ఇంట్లో శ్రామిక కులాలు చేస్తున్న ఊడిగానికి బాధపడతాడు. తను చదువుతున్న కళాశాలలోనే రాజేశ్వరరావు కొడుకు రామేశ్వరరావు చదువుతాడు. కానీ నారాయణ అంటే రామేశ్వరరావుకు చిన్న చూపు తన బానిస కొడుకు తనతో సమానంగా చదువుకోవడం ద్వేషానికి కారణం అవుతుంది.

కళాశాలలో వేదప్రకాష్ చరిత్ర అధ్యాపకుడు. నారాయణ విద్యార్థి. నారాయణ ఏకాగ్రత పట్ల, కష్టించి అధ్యయనం చేయడం పట్ల, సహనం పట్ల ముగ్ధుడు అవుతాడు. డిగ్రీ చివరి సంవత్సరం చరిత్ర పరీక్షలో నారాయణకి అందరికంటే ఎక్కువ మార్కులు వస్తాయి. ఉక్రోషం పెంచుకున్న రామేశ్వరరావు, వేదప్రకాష్‌ల పై నిందమోపుతాడు. నారాయణతో ఇంట్లో పనులు చేయించుకొని ఎక్కువ మార్కులు వేసినట్లు ప్రచారం చేస్తాడు. వేదప్రకాష్‌పై దౌర్జన్యం చేయడానికి ప్రయత్నిస్తాడు. కానీ వేదప్రకాష్ ప్రేమతో రామేశ్వరరావుని దగ్గరగా తీసుకొని ప్రేరణ కలిగిస్తూ మాట్లాడుతాడు. అనల డిగ్రీ రెండో సంవత్సరం విద్యార్థిని. ఒకరోజు అనల నారాయణతో వెళ్లి వాళ్ల ఊరు చూడడానికి తల్లిదండ్రులను ఒప్పిస్తుంది. రామారావు దంపతులు నారాయణతో వారు ఊరు వెళ్ళి చూసి రాత్రికి ఇంటికి చేరుకునే ఒప్పందంతో పంపిస్తారు. నారాయణ తన ఇంటికి అనలను తీసుకెళ్తాడు. పల్లెలో ఉన్న అనేకమైన కులాల వృత్తుల వారి జీవన విధానాన్ని ఆర్థిక, రాజకీయ, సామాజిక, సంస్కృతాది కోణాల్లో అధ్యయనం చేస్తుంది. నారాయణ చెల్లెలు పూలమ్మ, చంద్రమ్మలు అనలను వదిలి ఉండలేనంతగా కలిసిపోతారు. అనలకు తెలియని విషయాలు పల్లెల్లో తెలుసుకుంటుంది. వరి మొక్కలకు బియ్యం కాస్తాయనుకుంటుంది. కానీ ధాన్యాన్ని దంచితే బియ్యం వస్తాయని తెలుసుకుని ఆశ్చర్యపోతుంది. వేరుశనగ కాయలు మొక్కలకు కాస్తాయో, భూమిలో

ఉంటాయో ఇప్పుడు తెలుసుకుంటుంది. పల్లెల్లో వివిధ వృత్తుల వారి జీవితాల్ని అధ్యయనం చేస్తున్నప్పుడు దోపిడి వ్యవస్థలో భూస్వాములు ఎలా పేద ప్రజల్ని దోచుకుంటున్నారో తెలుసుకుంటుంది. ఆ పల్లెలో పది సాలెకుటుంబాలున్నాయి. వాళ్ళు పొద్దస్తమానం కుటుంబం అంతా కలిసి పనిచేస్తారు. చీరలు నేస్తారు కానీ వేల రూపాయలు విలువచేసే చీరల్ని చాలా తక్కువ ధరకు రాజ్యలక్ష్మమ్మకు అమ్ముతారు. ఆమె ఆ చీరలు పట్టణంలో వేలల్లో అమ్మి సొమ్ము చేసుకుంటుంది. నాకు చీర నేయడమే తెలుసు కానీ దాన్ని బజార్లో ఎంతకమ్ముకోవాలో, ఎట్లా అమ్మాలో, ఎవరికి అమ్ముకోవాలో నాకు తెల్వదమ్మా! నేను నేసిన చీరలు అందరూ కట్టుకొనేయి కావు. అంటే అందరు గన్ని పైసలు పెట్టి కొనలేరు. అందుకే దొరసాని చీరలు తీసుకపోయి. పట్నంలో తమ దోస్తులకు అమ్ముతది. ఆమె దయవల్ల అంతమాత్రం అమ్మకం జరుగుతున్నది. అని రెండు చేతులెత్తి దానయ్య గాలిలో ఆ దొర్సానిను ఉద్దేశించి నమస్కరించాడు." (పుట:113) అనే మాటలు దొరసాని వల్ల అమాయకులైన బడుగువర్గాలు ఎలా మోసపోతున్నది కనబడుతుంది. దళారీ వ్యవస్థతో శ్రమజీవుల జీవితాలు ఎలా దోపిడీకి గురవుతున్నది వివరంగా చెప్పి నేత కార్మికులు సహకార సంఘంగా ఏర్పడాలని చైతన్యపరుస్తుంది.

కుమ్మరి కుటుంబాలవైపు వెళ్లి అక్కడ కుండలు తయారుచేసే విధానానికి చకితురాలవుతుంది. కుండలకు గిరాకి లేకపోవడం ప్లాస్టిక్ (స్టెయిన్ లెస్) స్టీలు వస్తువుల వాడకం పెరగడం, కుమ్మరుల జీవితాలు దయనీయంగా మారటం, వృత్తి పనివాళ్లు వేరే పనులు చేయడానికి చైతన్యం లోపించడం పట్ల బాధపడుతుంది. "ఇదే మా బతుకుదెర్వ మరీ! ఏరే పని రాదు మాకు తల్లీ! ఏదోగట్ల దొరికిన పైసలతోనే గడుపుకుంటున్నం గందుకే ఇప్పటి పోరలెవ్వరూ గీపని నేర్చుకుంటలేరు. ఎవసాయం కూలిపని చేసుకుంటున్నారు. వరి కోతలు, చెరువు కొట్టే కాలంలో నాగార్జున సాగరం అని బెజవాడ అని దూరదేశాలకు పోతుంండ్రు. కుండలు ఎవరికి కావాలమ్మ గిప్పుడు! నేనేదో ముసలోన్ని గీపని ఒదులుకోక చేస్తున్న" (పుట: 108) అని తన వృత్తిలోని కష్టనష్టాలను ఏకరువు పెట్టాడు మల్లయ్య. కమ్మరం, వడ్రంగం, కంసాలి పనులు చేయడంలో వృత్తి పనితనాన్ని కళాత్మకతను అందులో ఇమిడివున్న విజ్ఞానాన్ని పరిశీలిస్తుంది, బంగారం పనులు చేసే వృత్తి పరికరాలను ఆసక్తిగా గమనిస్తుంది. వ్యవసాయానికి ఆధారమైన వడ్రంగి పనితనాన్ని గమనిస్తుంది. బండి చక్రాలు, నాగలి వంటి సాధనాలు చరిత్రలో ఎలాంటి మలుపులు తీసుకున్నది. నాగరికత వృద్ధిలో వాటి స్థానాన్ని

మననం చేసుకుంటుంది. కమ్మరి కొలిమిలో ఇనుము సైతం ఎలా వంపులు తిరుగుతుందో కొడవలి, పార వంటి వస్తువులు తయారీ వెనుక ఎంత శ్రమ దాగి ఉందో విశ్లేషించుకుంటంది. చివరగా రాజేశ్వరరావు గడి చేరుకుంటుంది. ప్రజల్ని కొల్లగొట్టి తన ఆధిక్యతను ప్రదర్శించిన ఇంటి వైభవాన్ని తన అహంకారాన్ని గమనిస్తుంది. నారాయణ, ఈరయ్య వంటి చిన్న కులాల వాళ్లు ఎలా అణచి వేయబడింది గ్రహిస్తుంది. రాజ్యలక్ష్మమ్మ కట్టుకున్న చీర వెనుక ఎంత దోపిడీ దాగివుందో విశ్లేషించుకుంటుంది.

నారాయణ సివిల్స్ రాయడానికి ప్రయత్నిస్తాడు. అతనికి స్ఫూర్తిని ఇవ్వటానికి అనల కూడా కోచింగ్ తీసుకుంటుంది. నారాయణ బావ రాజయ్య పోలీసుల ఎదురుకాల్పుల్లో మరణిస్తాడు. పూలమ్మ పుట్టింటికి చేరుకుంటుంది. పోలీసులు విచారణ పేరుతో కుటుంబాన్ని వేధిస్తారు. ఈ సంఘటనకు నారాయణ కదిలిపోతాడు. మొత్తం శక్తిని వినియోగించి పరీక్ష రాస్తాడు. రాతపరీక్షలో ఉత్తీర్ణుడు అవుతాడు.

సంకెళ్లు తెగాయి నవల పేరుకు తగినట్లుగా ఉంది. తరతరాలుగా సంకెళ్ళుగా ఉన్న కులాన్ని, కులాంతరాల్ని తెంచి వేయాలనే సంకేతం. కుల భావన పట్టణాల్లోకంటే పల్లెల్లో ఎక్కువగా ఉన్నట్లు చిత్రించింది నవల. ఈ నవల వివిధ కులవృత్తుల ఆవిష్కరణ, దోపిడీతనం, చైతన్య రహితమైన భావజాలం, వారి ఎదుగుదలను ఎలా నిరోధిస్తుందో వ్యక్తీకరించింది. ఇది క్షురక వృత్తిపై వచ్చిన తొలి నవల అవుతుంది.

**౨.౯. కక్క(౨000)**

కక్క నవల రచయిత వేముల ఎల్లయ్య దళిత (మాదిగ) జీవితాన్ని వస్తువుగా తీసుకొని నవల రాయడం జరిగింది. ఈ నవలలో ప్రధానపాత్ర 'కక్క' దీనిలో వాస్తవికత ఎక్కువగా కనిపిస్తుంది.

'కక్క' నానమ్మ పిడుగుపాటు వల్ల కలిగే నష్టాన్ని, జాగ్రత్తలను ఆమె మనుమడైన 'కక్క'కు చెప్తుంది. కక్క నాన్న చనిపోయిన విషయాన్ని గుర్తుచేస్తూ, అతను పోయిన తర్వాత తాను కలెమ్మ (కక్కతల్లి)ని కక్కను పోషించిన విధానంలో చెప్తూ ఉంటుంది. ఇలా నవల ప్రారంభమవుతుంది.

గ్రామ ఆసాములైనా పటేళ్ళ దగ్గర కక్క జీతగాడిగా ఉంటాడు. పశువులను కాపలాకాసే అతని సహచరులు 'పస్లపండగ' చేసుకుంటారు. కక్క కూడా పండగలో భాగంగా ఉంటాడు. ఆ పశువుల కాపరులు చేసుకునే పండగ, పిల్లలు సరదాగా ఆడే పెళ్లి ఆట విధానాన్ని ఈ సన్నివేశంలో వర్ణించాడు.

కక్క నానమ్మ చనిపోతే ఖననం చేయడానికి, ఖర్చులకు పైసలు లేకపోవడంతో కులం వాళ్ళు (మాదిగ) తలా కొంత చందాలు వేసి దినాలు చేయడం, కలెమ్మ, కక్క పెదనాన్నకు గొడవ జరగడం వంటివి మరో సన్నివేశంలో చెప్పడం జరుగుతుంది.

భూస్వామి దగ్గర జీతం చేయాలంటే ఎన్ని బాధలు అనుభవించాలో కక్క పాత్ర ద్వారా మనకు అర్థమవుతుంది. భూస్వామి భార్య కక్కపై భౌతిక దాడి చేయడం, పటేలు కక్కను చాలా రకాలుగా హింసిస్తూ ఉంటాడు. ఆ దాడి నుండి కక్కని కాపాడే ప్రయత్నం చేస్తుంటాడు. తోటి జీతగాడైన బర్రోల్ల మల్లయ్య. మల్లయ్య, కలెమ్మ ఇంటికి అప్పుడప్పుడూ వస్తూ, వెళుతూ ఉంటాడు. మల్లయ్య ఇంటికి రావడాన్ని తప్పుగా అర్థం చేసుకున్న సమాజం వారికి అక్రమ సంబంధాన్ని అంటగడతారు. భర్తలేని స్త్రీని సమాజం చూసే విధానం ఈ సన్నివేశం ద్వారా మనకు అర్థమవుతుంది.

కలెమ్మ, ఎల్లయ్యల మధ్య సంబంధాన్ని కుట్రతో కలెమ్మ బావ ఆగమయ్య అక్రమసంబంధం అంటగట్టి కచ్చేరు కీడ్చి స్త్రీ అనే గౌరవం లేకుండా పెద్దమనుషుల ద్వారా కొట్టించి దారుణంగా హింసించడం జరుగుతుంది.

కలెమ్మను కులం నుంచి వెలివేసిన తప్పు చేయనప్పుడు నాకు భయం లేదని ధైర్యంతో జీవనం సాగిస్తుంది. అలాంటి సమయంలో కక్క ధాన్యాలను బీటుకు చేరవేసినప్పుడు కుమ్మరి మంగయ్య పరిచమయమౌతాడు. అతడు ఇచ్చిన సలహాతో కక్క తల్లికి పెళ్లి చేస్తాడు. "కొడ్కుగా బుట్టి తల్లి పెళ్లి చేసిన ఘనుడమ్మా గీ బాడ్కావ్" అని ఊరిజనం ఆశ్చర్యపోతారు.

కక్క యువకుడు అవుతున్న కొద్దీ పటేలు ప్రేమగా చూడటం మొదలుపెడతాడు. ఏపనికైనా వెనకకు తగ్గని దిట్ట కక్క కాబట్టి ఎక్కడ పని మానివేస్తాడో అనే భయంతో లేని ప్రేమను చూపిస్తుంటాడు.

గ్రామంలో మాద్గిర్కం (పెద్ద మేదరితనం = దళితులు గ్రామానికి చేసే సేవ) పకీరయ్య చేస్తాడు. కక్కకు పకీరయ్య పరిచయమవుతాడు. కక్కకు మాద్గిర్కం చేయాలని ఆశ కలుగుతుంది. అప్పుడు

పకీరయ్య తాతను మాద్గిర్కంలో ఉండే కష్టనష్టాలను, ఆనందాన్ని చేయాల్సిన పనులను చెప్పమని అడుగుతాడు. తాత డప్పు కొట్టడం, గొడ్లను కోయడం, వాటి చర్మం తీసి చదును చేయడం, చర్మంతో తయారయ్యే సామాగ్రిని తయారుచేసే విధానాన్ని కక్కకు నేర్పిస్తాడు. మాదిగల ప్రత్యేక వృత్తి అయిన పెద్ద మేదరితనం గూర్చి నా పనులను గూర్చిన పనులను గురించి ఫకీరు తాత కక్కకు వివరించిన సన్నివేశాన్ని కింద చూడవచ్చు.

"సెప్తా ఇనా కక్క! ఆసాములు ఇండ్లల్ల పెండదొక్కి పిడ్కెలు జెయ్యాలే! పొయ్యిలకు కట్టెలు తేవాలే! ఎంతమందుంటే అందర్కి సెప్పులు గుట్టియ్యాలె! పాత కొత్త సెప్పులకు గల్పి పదేను మాన్కలు (30 సేర్లు) ఇగ ఇను కక్కా! ముత్తాం ఎన్మిది కుండలు గింత సేవ జేస్తే వొచ్చేదిగాల్ల సేనేరబోతే నేల కుండ నిండ కంకులు నింపిత్తరు! ఎన్కముందు వొడి మాదిగొని వొంచె నింపుకో వచ్చు! నాగలిత్తనాన్కి రెండు పూటలు బోతే తవ్వేడు గింజలు కల్లం అల్కుపూతకు కల్లుమడ్లు ఇత్తులు ఊక ఎత్తుకోవాలె! సెల్కల కల్లమైనా వొరికల్లమైనా వొచ్చేదంతే! పదుం (పది కుండలు), పందుం ( ఇరవై కుండలు), పుట్టెడు ( నలబై కుండలు) ఇగొ దాన్నెం లెక్కస్తే గిట్లుంటది. ఆ సామ్కియే పంటైనా పండితే మనమే కల్లమడ్లు పెద్ద మేతరి సాట కల్లంల దిప్పేశిన దిష్టికట్ట మనకొచ్చేది! ఇంటివా కక్కా! మంచిగిను జవాన్ల సేవ అవరకాలు సిన్నకారు సన్నకారు అంజుమాన్ భూమిశిస్తు పన్లు గివ్వన్నింటినిగొసం ఊరంతా డప్పు సాటింపు జెయ్యాలే! మాదిగాయి నెంబడి జతకూతకు మాలాయిన గూడుంటడు. ఆయినే మనం డప్పు గొట్టాలే! గా దర్వోలె ఎలకూత వొంత బాడాలె మాలాయన! మాలోల్లకి మా బాదలుంటయ్ బిడ్డా! బేగరి పని ( సుంకరి) బొందలు తొవ్వుతారు పీన్గును బొందబెట్టినంక తలగొర్గి తిప్పుతున్న కుండకు సుట్టుకో పొక్క గొడ్తడు! కుండెత్తేసినంక గండ్లేసిన సిల్లరపైసలేగాయనకు వొచ్చేది! మర్సిపోయ్న పీన్గును పాడగట్టేది గూడ ఆయనే! కాష్టమైనా బొందైనా, ఫలానోల్లదని బొందల కాష్టాల గడ్డ సిర్నామంతా బేగారాన్కి ఎర్క! నక్కలు, కుక్కలు బొందల పీన్గల్ని పీక్కుదినకుంట జూస్కొనేది బేగరాయనే కాష్టాన్కి నిప్పంటించ్చి కాలి బుగ్గై తలపండు సిట్న జిత్కెసప్పుడు ఇనబడేదాక ఎంత సీకటైన అక్కడ్నె వుండాలె! బొక్కల్గొడ కాలిమసయ్యేదాక కాపుగాయాలె! చెర్వుల మీద నేరటికాడి పని ఊర్లె మస్కూరి పని మాలోడు జెయ్యాలే! ఇంటివార కక్క ఎట్టి గొట్టాలంటె గింత లంబుడ్కం వుంటుంది" వివరంగా చెపాడు పకీరుతాత (పుట: 34, 35).

పకీరు తాత మనవరాలు రజస్వల అవుతుంది. ఆ సందర్భాన చేయాల్సిన కార్యాలు, ఆచారాలు మరో సంఘటన ద్వారా మనకు కనిపిస్తాయి.

తాత మనవరాలు (లస్మి) తన కొడుకు కులస్త్రీతో అక్రమసంబంధం పెట్టుకోవడం వల్లనే పుడుతుంది. పుట్టిన తర్వాత ఆమెను పకీరు తాత వద్ద వదిలేసి ఇద్దరు ఎటో వెళ్ళిపోతారు.

లస్మి కక్కను ఇష్టపడుతుంది. కక్కకు తన ఇంట్లోని ఎండు మాంసం ముక్కలను తీసుకువెళ్లడం కలుసుకోవడం పలుమార్లు చూసినప్పుడు ఫకీర్ తాత ఇద్దరికీ పెళ్లి చేయాలని నిశ్చయించుకుంటాడు. ఆ పెళ్ళికి కావలసిన పనులన్నీ మొదలుపెట్టి అందులో భాగంగా చేసే పండుగ కోసం పుట్టమన్ను తేవాలి. దానికోసం పటేళ్ళ భూమిలోకి మాదిగ కులస్థులు వెళ్ళినప్పుడు పటేళ్ళు వారిని కొడతారు. అంతటితో ఊరుకోకుండా శూద్రులను వారిపైకి ఉసిగొల్పుతారు. ఆ గొడవలో మాదిగల రక్తాలు చిందుతాయి. అగ్రవర్ణాల వాళ్లు దళితులను కాస్త సంతోషంగా పండగ కూడా చేసుకోనియకుండా అస్పృశ్యత పేరుతో దాడులు చేయడాన్ని ఈ సంఘటన ద్వారా తెలుసుకోవచ్చు.

కక్క, లస్మీల పెళ్లి గందరగోళంగా జరుగుతుంది. ఈ పెళ్లి గొడవకు సంబంధించి రచ్చబండ దగ్గర పంచాయతీ పెడతారు. పెద్దమనుషులు సరైన తీర్పు ఇస్తారనే నమ్మకం లేక మాదిగ యువకులు పెద్దమనుషుల (పటేళ్ళ) పైకి విరుచుకుపడుతారు. మాదిగ యువకులపై కేసు నమోదవుతుంది. పోలీసులు పెద్దమనుషులు కలిసి మళ్ళీ పంచాయితీ పెడతారు. దళితులను పోలీసులు దారుణంగా హింసిస్తారు. బలవంతంగా దళితులదే తప్పు అని ఒప్పిస్తారు. దళిత స్త్రీలు దీనికంతటికి కారణం. నీ మనుమరాలి నీ పెళ్లి కారణం అని ఫకీరు తాతను తిడుతారు. అతను మనస్థాపంతో ఉరివేసుకుని చనిపోతాడు.

చనిపోయిన పకీరయ్య గ్రామ సర్పంచి. అతడు చనిపోయేంతవరకు కూడా గ్రామస్తులకు, పకీరయ్యకు మాత్రం చనిపోయేముందు తెలుస్తుంది. పటేళ్ళు దళితులకు వచ్చిన సర్పంచ్ పదవిని దళితులెవ్వరికి తెలియనివ్వకుండా నిరక్షరాస్యుడైన పకీరయ్యతో సంతకం చేయించి సర్పంచిగా రహస్యంగా అంగీకరించి బహిరంగంగా పటేళ్ళే గ్రామాన్ని ఏలుతారు. అగ్రవర్ణాలవారు దళితులను, శూద్రులను ఐక్యంగా ఉండనీయరు. వీరు ఐక్యం అయితే తమకు ముప్పు వస్తుందని నిరంతరం

గొడవలు సృష్టిస్తూనే ఉంటారు. అగ్రవర్ణాల మోసపూరిత ఆధిపత్య భావజాలం దళితులపై నిత్యం ప్రభావం చూపుతూనే ఉంటుందని రచయిత ఈ సన్నివేశం ద్వారా తెలియజేశాడు.

తరం మారుతున్నది మారుతున్న కొద్దీ అగ్రవర్ణాల కుటుంబాలు చదువులు చదివి పట్టణాలలో ఉద్యోగాలు పొంది అక్కడే ఉండటానికి అలవాటుపడుతున్నారు. అందుకోసం గ్రామంలో ఉన్న భూములు ఆంధ్ర ప్రాంతం నుంచి వలస వచ్చిన వారికి (కమ్మ కులస్థులకు) అమ్ముతారు. అప్పటినుంచి దళితుల కష్టాల్లో రూపంలో మాత్రమే మార్పు వస్తుంది. కమ్మకులస్తులు కూలీ కింద డబ్బు మాత్రమే ఇస్తారు. భూస్వాములు మాత్రం కూలి రూపంలో ధాన్యం ఇచ్చేవారు. కూలీలు కమ్మోళ్ల కంటే భూస్వాములే నయం అనుకుంటారు.

దళితుల కళారూపాలైన భాగోతం, సుట్టు కాముడు (స్త్రీలు వలయాకారంలో తిరగటం) రాత్రివేళల్లో అలసట తీర్చుకోవడానికి ఆడుతారు. కక్క, అతని సహచరులు మైసాసురవధ అనే 'బాగోతం' నేర్చుకుంటారు. అందులో కక్క మైసాసుర పాత్ర ధరిస్తాడు. బాగోతం నేర్చుకున్న తర్వాత ప్రదర్శన కొరకు రంగస్థలం అలంకరించి సిద్ధం చేస్తారు. ప్రారంభమయ్యే సమయానికి ప్రధానపాత్ర పాత్రధారుడైన కక్కను దొంగలు ఎత్తుకుపోయి పిక్కలు కోస్తారు. ఆ పని చేసింది అగ్రవర్ణాల వారు. దొంగలను తొందరగా పట్టుకోవాలని పక్క ఊరి చదువుకున్న మాదిగ పిల్లవాడు కేసు పెడతాడు.

కక్క బాగోతానికి సంబంధించిన కేసు విచారణ కోసం గ్రామానికి వస్తారు. అదేసమయంలో దళితులు తమ ఇళ్ళ స్థలాల కోసం పటేళ్ళతో గొడవపడతారు. ఈసుమియా అనే ముస్లిం పెద్దమనిషి భూమి పటేళ్ళ చేతిలో ఉండేది. అది కమ్మకులస్థులు కొన్నారు. ఆభూమిలో మేము గుడిసెలు వేసుకుంటామని న్యాయంగా అడుగుతారు. వచ్చిన అధికారులు దళితులకు పట్టాలు ఇస్తామని హామి ఇస్తారు. ఇది సహించని పటేళ్ళు అధికార్లను అడ్డుకుంటారు.

భూమి పుట్టుపూర్వోత్తరాలు పటేళ్ళు చెప్పటం మొదలు పెడతారు. పాపిరెడ్డి పటేలు మా తండ్రి తరం వారు తెలంగాణ సాయుధపోరాటంలో లీడర్లుగా ఉండి నైజాం రజాకార్లతో పోరాడి భూమి సంపాదించారు. మా తండ్రి పోరాడకపోతే ఈ భూములు ఉండేవా అని అంటాడు. ఈ భూమినంతా మా వాళ్ళు కాపాడారు. కనుక భూమంతా మా చేతిలో ఉంది. దళితులైన మీకు లేదు అని అంటారు. అప్పుడు అక్క లేచి నైజాం రజాకర్లప్పుడు వాళ్ల నాన్న ఒక్కడే కమ్యూనిస్టు కాలేదు. మా దళితులు

లేకుండా  లీడరు ఎలా అయ్యాడు. పోలీసులు మీ లీడరు ఎక్కడ అని ముళ్ళపై పడేసి బూటుకాళ్ళతో తొక్కితే రక్తం చిందించింది మా దళితులదే. ప్రత్యక్షంగా పోరాడింది మా వాళ్ళు. పటేళ్ళు దొంగచాటున ఉండి లీడర్లయ్యారు. ఎంత పోరాటం చేసినా మాకు కనీసం బొందపెట్టడానికి పదడ్గుల భూమిరాలేదు. వీరికి ఇన్ని భూములు ఎలా వచ్చాయి. పటేళ్ళంతా నైజాంకు లొంగిపోయి భూములు సంపాదించారు సారు' అని చెప్తాడు. అటువంటి భూమిని కమ్మకులస్థులకు అమ్మి మాకు కనీసం ఉండటానికి కూడా లేకుండా చేశారు. కనుక మాకు భూమి ఇప్పించండి సారు అని కక్క అంటాడు. అధికార్లు ఇస్తామని హామీలు ఇవ్వగా అధికార్లపై దాడికి దిగుతారు పటేళ్ళు. చివరకు అధికార్లు మీరు ఈ కేసును కోర్టులో తేల్చుకోవాల్సి ఉంటుందని చెప్పిరక్తపు శరీరాలతో వెనుదిరుగుతారు. భూమి దళితులకు దక్కకుండా మోసం చేసి అధికారం చెలాయించి భూమిపై అగ్రవర్ణాల వాళ్ళు ఎలా ఆక్రమించారో ఆ సన్నివేశాల ద్వారా మనకు రచయిత తెలియజేశాడు.

వేముల ఎల్లయ్య మాదిగ (దళిత) కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి కాబట్టి వారి వృత్తి (మాద్గిర్కం) నేపథ్యాన్ని, వారి జీవన విధానంను చక్కగా వర్ణించాడు.

### 2.10. బతుకుతాడు(2004)

గౌడ వృత్తి జీవితాన్ని చిత్రించిన నవల 'బతుకుతాడు' రచయిత నేరెళ్ల శ్రీనివాస్ గౌడ్. రచయిత స్వయంగా గీత కార్మికుడు. రచయిత కుటుంబ కథయే ఈ నవల నేపథ్యం. ఈ నవల 15 భాగాలుగా ఉంది. ఈ నవలలోని కథ ప్రధానంగా మూడు కుటుంబాల మధ్య నడుస్తుంది. ఈ మూడు కుటుంబాలు కూడా కులవృత్తిని నమ్ముకున్నవే. కుటుంబం పెద్ద ధర్మయ్య గౌడ్. ధర్మయ్య గౌడ్, లింగమ్మల సంతానం భూమయ్య గౌడ్, నారాయణ గౌడ్, లక్ష్మణ్ గౌడ్ కూతుర్లు. సత్తవ్వ, ఎల్లవ్వ, నర్సవ్వ.

> "నా నేనేమి సేతూ ... నేనెట్ల బతుకుడు
>
> ..............................................
>
> పొద్దాడు ఎల్లింది

పొట్ట నింపుద్దకుంటి,

మూడొద్దులే పారింది,

మురిపించి పోయిందే...” అని పాటపాడుతూ

నారాయణ గౌడ్ తాటి చెట్టుమీద గోల చేస్తున్నాడు. అనే పాటతో నవల ప్రారంభమవుతుంది. వీరిది తెలంగాణలోని జగిత్యాల దగ్గర హన్మాజీపేట గ్రామం.

ధర్మయ్య గౌడ్ పెద్దకొడుకు భూమయ్య గౌడ్. ఊర్లో ఉండి తాటి చెట్లు ఎక్కుతున్న తన తండ్రి, తండ్రిలాంటి నారాయణ గౌడ్ ఎంత బ్రతిమిలాడినా వదిలిపెట్టడు. ఈ విషయం తెలిసిన నారాయణ గౌడ్ తల్లిదండ్రులు లింగమ్మ, ధర్మయ్య గౌడ్, భార్య లక్ష్మి వచ్చి ప్రాధేయపడతారు అయినా వదలడు. లక్ష్మి ఊర్లోని బగ్గరి రాజన్న, గడిగొప్పుల రాయమల్లును తీసుకొచ్చి వారితో చెప్పించిన వినడు లక్ష్మణరావు పటేలు. చివరకు తమ్ముడు లక్ష్మణ్ గౌడ్ వచ్చి కట్లు విప్పబోటుంటే లక్ష్మణ గౌడ్ని బజార్లోకి నెట్టుతాడు లక్ష్మణరావు పటేల్. ఈ సందర్భంలో కులస్థుల నిరంకుశ ధోరణిని మన కళ్ళ ముందుంచాడు రచయిత.

నారాయణ గౌడ్ భార్య లక్ష్మి, నారాయణ గౌడ్కి నలుగురు పిల్లలు. శ్రీనివాస్ గౌడ్ గంగవ్వ తిరుపతి, మంగవ్వ. నారాయణ గౌడ్ ఆర్థికంగా వెనుకబడి ఉంటాడు. ఎంత కష్టపడినా వృత్తిలో ఎదుగుదల లేక కుటుంబమును పోషించడమే కష్టమవుతుంది. తన భార్యకు జ్వరం వచ్చినా సరైన వైద్యం చేయించలేని స్థితిలో ఉంటాడు. గీత కార్మికుల శ్రేయస్సును కాంక్షించే విధంగా గౌడ సంఘం చేసే పోరాటాలు, మండల కేంద్రమైన జగిత్యాలలోని గౌడ సంఘం దగ్గర మామూలు(పన్ను) కట్టడం ఆ పన్ను ప్రతి సంవత్సరం పెంచడంతోపాటు పడే ఇబ్బందులు పడుతుంటారు. తాళ్ళను పంచుకునే విధానంతో పాటు తాటి, ఈత చెట్లలోని రకాలు, తాటి చెట్లకు చెల్లించే పన్ను గురించి ఇందులో చిత్రించబడ్డాయి.

లక్ష్మణ్ గౌడ్ బొంబాయిలో ఆర్థికంగా నష్టపోయి అనారోగ్యంతో మరణిస్తాడు. లక్ష్మణ్ గౌడ్ మరణంను జీర్ణించుకోలేని తల్లి లింగమ్మ కొన్ని రోజులకు బావిలోపడి చనిపోతుంది. తర్వాత ధర్మయ్య గౌడ్ మరణిస్తాడు.

లక్ష్మణ్ గౌడ్ సంతానం శ్రీనివాస్ గౌడ్ రాధ. రాధను చెల్లె ఎల్లవ కొడుకుకు ఇచ్చి వివాహం చేస్తాడు. కట్నం దగ్గర కొంత మనస్పర్థలు వస్తాయి. చివరికి లక్ష్మణ్ గౌడ్ డబ్బులు ఇచ్చిన రాధను

సరిగా చూసుకోదు అత్త. చివరకి రాధకు విడాకులు ఇచ్చింది. రాధకు మళ్ళీ పెళ్లి చేయడం కష్టమైనప్పటి కొండగట్టు దగ్గర హిమ్మత్ రావు పేటకు చెందిన రాజయ్యతో పెండ్లి చేశారు.

ఇదే సమయంలో "రాష్ట్రంలో మల్లా సుబ్బమ్మ మద్యపాన నిషేధ ఉద్యమం లేవదీసింది. రాష్ట్రంలో సారానిషేధ ఉద్యమం తీవ్రస్థాయిలో ఉన్న సందర్భంలో నారాయణమూర్తి 'దండోరా' పేరుతో ఒక సినిమా తీశాడు. ఈ సినిమా ప్రజల జీవితంపై విశేషమైన ప్రభావాన్ని చూపింది..... అక్టోబర్ ఒకటి నుండి సారా నిషేధిస్తున్నట్లు ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి అధికారికంగా ప్రకటించాడు."(పుట: 92) సారానిషేధంలో గీత కార్మికుల కళ్ళలో ఆనందాన్ని నింపి వారి కల్లు అందరూ తాగడంతో గిరాకి పెరిగి వారి ఆదాయాన్ని పెంపొందించింది. ఇదే అదునుగా కల్లుకు పన్ను పెంచుతారు జగిత్యాల సొసైటీవారు.

జగిత్యాల విధానాలతో తాము వేరుగా మాములు చేయించడానికి జితేందర్ రావు కలిసి కమిషనర్‌కు అప్పీలు చేయడంతో కళ్ళు దుకాణం సాంక్షన్ అవుతుంది. దీనికోసం నారాయణ గౌడ్ తన ఆస్తినంతా అమ్ముతాడు. అతనికి ముందు ఇస్తాన్న డబ్బులు తోటి వృత్తిదారులు ఇవ్వకపోవడం లాంటి విషయాలతో పాటుగా అబ్కారి అధికారుల లంచగొండితనం మొదలగు విషయాలు మన ముందుంచాడు. చివరికి లక్ష్మణ్ గౌడ్ కొడుకు చిన్న శ్రీనివాస్ గౌడ్ కూడా తాళ్లు గీయడం నేర్చుకొని గీత వృత్తిదారుడిగా మారుతాడు.

చివరికి నారాయణ గౌడ్ ఉన్న ఆవులు అమ్మి సొసైటీకి పెట్టడంతో బతకడం కష్టమవుతుంది. "ఈ సందర్భంలో ఈ కుల వృత్తులన్నీ కూడు పెట్టని కులవృత్తులే" అనే ముగింపు పలుకులతో ముగుస్తుంది. ఈ నవలలో మూడు తరాల జీవితాలను చిత్రించాడు రచయిత.

### ౨.11. గువ్వల చెన్నా(౨౦౦౫)

గువ్వల చెన్నా నవలా రచయిత కాలువ మల్లయ్య. పద్మశాలీల జీవితాన్ని చిత్రించిన నవల ఇది. కరీంనగర జిల్లాలోని ఒక మారుమూల పల్లెలో చేనేత పని చేస్తున్న చిప్ప మల్లయ్య, లింగమ్మ దంపతులకు ముగ్గురు కొడుకులు. రాజమల్లు, వీరయ్య, శంకరయ్య.

"లింగమ్మ వాకిట్లో కూర్చొని రాట్నం వడుకుతోంది. ఆమె చుట్టూ కండెల మండెలున్నాయి. ఆ వాకిలినానుకొని వున్న పెంకిటిల్లు శిథిలావస్థలో ఉంది. ఆ ఇంట్లో మగ్గం గుంటుంది. మగ్గానికి అయిపోవడానికి సిద్ధంగా చీరుంది. మగ్గం గుంటలో కూర్చొని మగ్గం నేస్తున్నాడు వీరయ్య." అనే వాక్యంతో కథ ప్రారంభమౌవుతుంది. చిప్పమల్లయ్య ముగ్గురు కొడుకులను చదివించే స్తోమత లేకపోవడంతో చిన్నవాడైన శంకరయ్యను మాత్రం లింగమ్మ బలవంతం చేయడంతో చదివిస్తాడు. మిగిలిన ఇద్దరు కొడుకులు తండ్రితోపాటు చేనేత వృత్తిని చేస్తూ ఉంటారు. ఈ విధంగా ఇంట్లోవారంతా కలిసి పని చేసినా పూట గడవని పరిస్థితి మల్లయ్య కుటుంబానిది. కనీసం స్నానం చేయడానికి సబ్బు కూడా కొనలేని పరిస్థితి. కులవృత్తిలో తండ్రికి సహాయంగానే ఉంటూ చదువుకుంటాడు శంకరయ్య. కులవృత్తినే నమ్ముకొని నిజాయితీగా బతుకుతున్న తండ్రి ఆర్థికంగా నిలదొక్కుకోకపోవడం వాళ్ళను కలచివేస్తుంది. ఒక పట్టుచీర కట్టుకోవాలనే కోరిక కూడా తీర్చుకోలేని తల్లి లింగమ్మ పరిస్థితిని అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తారు.

చిప్పమల్లయ్య ధోతీ, చీర, పంచె ఏది నేసినా ఒక జానెడు ఎక్కువగానే పెడతాడు. ఆ ఊరి దొర రాజారావు ఇంటికి ధోతులు ఇవ్వడానికి వెళతాడు. అక్కడ దొర ధోతిని కొలవమనగా నాలుగు గజాల కంటే జానెడు ఎక్కువగానే ఉందని చెప్తాడు చిప్పమల్లయ్య. "మా చెప్పినవ్ తియ్ సాలయినె ఎక్కువ పెడుతడట. దసురున్నప్పుడు నీ దగ్గర్నే ధోతి తీసుకున్నానా? చింగులు మంచిగ ముదుసుటానికి గూడ సాలలేదు పొడుగు. గుంజి గోచి పెట్టడానికే కష్టమైంది. మల్ల గట్లనే గోచిలిరుకుటమాయెటట్టు జేయకు. అట్ల జేత్తే కట్టుకున్నంక నీది నీకు పారేత్త. గందుకేనేమో సాలె సంకటం గోచిలిరుకుటం అన్నరు. హహహహ అని నవ్వాడు రాజారావు. దొరతోపాటు అక్కడున్నవాళ్ళంతా గొల్లుగొల్లున నవ్వారు" (పుట: 28).

ఈ విధంగా దొరలు అవమానించడం చిప్పమల్లయతోపాటుగా కొడుకులు రాజమల్లును, శంకరయ్యలను బాధపెడుతుంది. దొరలు చెప్పిన విధంగా బట్టలు నేసినా వాళ్ళు అడిగిన ధరకే ఇవ్వాల్సి వస్తుంది. ఇలాంటి సంఘటనలు చూసిన శంకరయ్య బాగా చదువుకొని ఉన్నతస్థాయికి ఎదిగి ఇలాంటి వారికి సరైన సమాధానం చెప్పాలని అనుకుంటాడు.

కులాలు అంతరించే క్రమంలో కులాలపై ఆధారపడిన ఉపకులాల మనుగడ ప్రశ్నార్థకమైపోతుంది. చిప్పమల్లయ్య తరానికి చెందినవారు ఆదరించగా, తరువాత తరాల ఆదరణ తగ్గడంతో సాధనాసూరుల విద్యలు కనుమరుగైపోయాయి.

కుటుంబ పరిస్థితులను గమనిస్తున్న రాజమల్లు భీవండికి వెళ్తానంటాడు. దూర ప్రాంతాలకు వెళ్ళడం ఇష్టంలేని తల్లిదండ్రులు ఎంత చెప్పినా వినడు. భార్య లచ్చమ్మ గర్భిణి. చివరకు రాజమల్లు భీవండి వెళ్తాడు. ఆరు నెలల తర్వాత అక్కడ జరిగిన మతకలహాలలో చనిపోతాడు. భార్య లచ్చమ్మ, కొడుకు శ్రీరాంతో కలిసి అత్తవారింటి దగ్గరే ఉంటుంది. కొడుకు మరణాన్ని తట్టుకోలేని చిప్పమల్లయ్య, లింగమ్మలు చాలా కాలానికి కోలుకుంటారు. మనవడు శ్రీరాంలోనే కొడుకును చూసుకుంటారు.

వీరయ్య ఆదిలాబాద్‌వైపు వెళ్ళి సంపాదించుకుంటాడు. కాలక్రమంలో వీరయ్య పెద్దకొడుకు రాజేశం సంపాదించాలనే ఆశతో దుబాయ్ వెళ్తాడు. కరీంనగర్ ప్రాంతం నుండి ఎక్కువమంది దుబాయ్ జీవనోపాధికి వెళ్తారు. తిరిగి వచ్చి సొంతంగా ఇల్లు కట్టుకుంటాడు. రెండోవాడు లక్ష్మీరాజం సరిగా చదువుకోకపోవడంతో తండ్రి చేసే వృత్తిని చేస్తుంటాడు. వృత్తిలో ఎదుగుదల ఉండదు. సిరిసిల్లాలో చాలాకాలం క్రిందనే సాంచాలు రావడం జరిగింది. వాటితో లాభాలు పొందుతున్న విషయాలు తెలుసుకున్న లక్ష్మీరాజం తను కూడా ఆ మరమగ్గాలని కొంటాడు. దాంతో అప్పు అవుతుంది. అందులో ఉన్న పోటీని అప్పుల బాధను తట్టుకోలేక లక్ష్మీరాజం ఆత్మహత్య చేసుకుంటాడు. "ఏం జేత్తడు మరి? తిండికే లాకపోతే ఏంజెయ్యమంటవు? మరమగ్గాలని కొనంగానే ఏమచ్చె. అన్ని ధరలు పెరిగె. గవర్నమెంటిచ్చేటివి ఇవ్వకపాయె. నేసిన బట్టను కొనెటోడు లేకపాయె. ఓ దిక్కేమో అప్పులాయె. మల్ల అప్పులు పుట్టే వసతి లేకపాయె. ఉరిడిసి నేబోదునా ఉరిపెట్టుకొని సత్తునా అన్నట్టాయె బతుకులు." (పుట:102)

ఇలాంటి పరిస్థితుల్లో లక్ష్మీరాజం ఆత్మహత్య చేసుకుంటాడు. గుంట మగ్గాల ద్వారా నేసిన బట్టకు ప్రజాదరణ తగ్గడం, మిషన్లు (సాంచాల) ద్వారా జరిగే ఉత్పత్తిలో పోటీ ఉండటంతో కొనుగోలు జరగక అప్పులు ఎక్కువై చేనేత కార్మికుల హత్యలతో సిరిశాలగా ఉన్న సిరిసిల్ల కాస్త ఉరిశాలగా మారిందని రచయిత వాస్తవికతను దృశ్యమానం చేసాడు.

శంకరయ్య చదువుకొని ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా స్థిరపడతాడు. శంకరయ్య సమాజంలో జరిగే మార్పుల్ని నిశితంగా పరిశీలిస్తూ, సమాజ తత్వాన్ని మారుతున్న కాలాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తుంటాడు. శంకరయ్యకు ఇద్దరు కొడుకులు రమేశ్, సురేశ్. కొడుకులను బాగా చదివిస్తాడు. రమేశ్ కంప్యూటర్ ఇంజనీర్. మల్లీశ్వరి అనే తోటి ఉద్యోగిని ప్రేమిస్తాడు. ఆమె ఉన్నత కులానికి చెందింది. మల్లీశ్వరిని వివాహం చేసుకొని ఎక్కువ సంపాదన కోసం అమెరికా వెళ్ళాలనుకుంటాడు. కులాంతర ప్రేమ వివాహ ప్రతిపాదనని నిశితంగా పరిశీలిస్తాడు శంకరయ్య. సమాజంలో ఉన్నత హోదా సాధించిన బడుగు వర్గాల యువకుల్ని ఉన్నత వర్గాలకు చెందిన యువతులు ప్రేమించడం జరుగుతుంది. కాగా వారు ప్రేమించేది యువకుని హోదానే కానీ, అతని వెనక ఉన్న తరతరాల నేపథ్యాన్ని కాదని ఫలితంగా తమ మూలాల్ని మరచి, తల్లిదండ్రులకు కూడా దూరమైపోతారేమోననే కోణంలో పరిశీలన చేస్తాడు శంకరయ్య. కాని మల్లీశ్వరి ప్రేమించేది శంకరయ్య వర్గపు చైతన్యాన్ని అని తెలుసుకొని ఆదర్శ వివాహం చేస్తాడు. అనగా సంప్రదాయంగా కాకుండా మీటింగులో ప్రతిజ్ఞ చేయడం (స్టేజ్ మ్యారేజ్).

శంకరయ్య పాత్ర ద్వారా ప్రవేశపెట్టిన అంశాలపై చర్చ మన అవగాహనను మరింత పెంచుతుంది. పట్టుచీర కట్టుకోవాలనే కోరిక తీరకుండానే తల్లి మరణించిన సందర్భంలో తన మొత్తం జీవితాన్ని సమీక్షించుకుంటాడు. తన తండ్రి చిప్పమల్లయ్య వృత్తిని దైవంగా భావిస్తాడు. తన మగ్గంమీద ధోతులు, చీరెలు, పంచెలు, రవిక బట్టలు, తువ్వాలల వంటివి ఎంతో నాణ్యంగా బట్ట నేసినప్పటి మరమగ్గాల (సాంచెలు) తాకిడికి చేనేత కార్మికుల జీవనం కుంటుపడుతుంది. అగ్గిపెట్టెలో పెట్టగలిగే చీరలు నేసిన గొప్పతనం పద్మశాలీలకుంది. నేడు ఆ పద్మశాలీలు బతుకుదెరువుకోసం రకరకాల మార్గాలు వెతుక్కుంటున్నారు. ఆడవాళ్ళు బీడీలు చేస్తూ, తోడ్పడుతున్నారు. కొంతమంది చదువుకున్నవారు ఉద్యోగం చేస్తూ, చదువు మధ్యలో ఆపేసినవారు ఆర్.ఎం.పి, పి.ఎం.పి వైద్యులుగా స్థిరపడుతున్నారు. సహకార సంఘాలు, ఆప్కోవంటి వాటిలో కొందరే బాగుపడ్డారు.

శంకరయ్యకు కొడుకులిద్దరు విదేశాలకు వెళ్ళే అవకాశం వచ్చినప్పుడు తనకు కొంత ఇష్టంలేకున్నా సమాజానికి అనుకూలంగా మారిన తండ్రిలా ప్రవర్తిస్తాడు. ప్రపంచీకరణ

దుష్పరిణామాలకు దారి తీస్తుందని భావిస్తూనే తాను మారక తప్పని పరిస్థితి వచ్చినందుకు బాధపడతాడు.

ఈ విధంగా ప్రపంచీకరణ ప్రభావంతో ప్రత్యామ్నాయ బీడీ పరిశ్రమలు, చేనేతల ఆత్మహత్యలు మొదలగు విషయాలతోపాటు వృత్తి చైతన్యాన్ని ఆవిష్కరించిన నవల ఇది.

## 2.12. కల్లు మండవ

కె. వెంకటేశ్వర్లు (కెవిఎల్) గారు 'కల్లు మండవ' నవలలో గౌడ వృత్తి జీవితాలను వారి సమస్యలను పరిష్కారానికై పోరాటం చేసిన విధానాన్ని చిత్రించారు. ఈ నవలలో మొత్తం 21 భాగాలుగా ఉంది. ఇందులో కథ సూర్యా ట ప్రాంతంలో ప్రారంభమవుతుంది.

"నీ కాల్మొక్తా దొరా... నీ బాంచెన్ మీ చెప్పు కింద దుమ్ములాగా బతికెటోల్లం ముంతడు కళ్ళతోటి రోజులెల్ల దీసేటోల్లం. మా అమ్మతోడు దొర! మళ్ళీ గిట్ల జరగకుంటా నడుచుకుంటా" అంటూ కన్నీళ్లు కార్చుకుంటూ తలమీద చుట్టుకునే ముతక రుమాలు గుడ్డను చేతిలో నలుపుకుంటూ దొరవారి గడి దగ్గర గౌండ్ల వీరన్న వంగి వంగి దండాలు పెడుతున్నాడు" అన్న ప్రారంభ వాక్యంతో నవల ప్రారంభమవుతుంది.

ఈ నవల తొలిభాగంలో స్వాతంత్ర్యానికి పూర్వం గౌడ కులస్తుల సామాజిక స్థితిని తెలియజేస్తుంది. తెలంగాణలో దొరల వ్యవస్థ పాతుకొని ఉన్నకాలం. దొర ఉంపుడు గత్తె 'కాసుల దొరసాని' ఇంటికి బంధువులు వస్తారు. బంధువులకు కల్లు పంపమని పటేలు ద్వారా కబురు పంపుతాడు దొర. ఆ కబురు వీరన్నకు చేరదు. వీరన్న జ్వరంతో బాధపడుతున్న తన బిడ్డకు వైద్యం చేసిన డాక్టర్ కు కల్లు పోస్తాడు. కాసుల దొరసాని ఇంటికి కల్లు పంపలేదని తెలిసిన దొర కోపంతో వీరన్నను పిలిచి 20 కొరడా దెబ్బలు, వంద రూపాయలు జరిమానా విధిస్తాడు. దెబ్బలకు స్పృహ తప్పిపోతాడు వీరన్న. ఈ విషయం తెలిసిన వీరన్న భార్య లింగమ్మ ఇంట్లోని బర్రెని అమ్ముతుంది. డబ్బులు సరిపోకపోవడంతో ఊరి ఆసామి దగ్గర అప్పు తెచ్చి జరిమానా కట్టి భర్తను ఇంటికి తీసుకొస్తుంది. ఒక్క వీరన్న మాత్రమే కాదు అన్ని వృత్తుల వారి పరిస్థితి కూడా ఇలానే ఉంది. ఊరి ప్రజలంతా వచ్చి జాలిపడతారు. అక్కడ మంచంలో ఉన్న వీరన్న తండ్రి అనుభవంతో ఆవేదనగా మాట్లాడుతాడు. తాతల కాలం నుండి నేటి వరకు దొరలకు ఊడిగం చేసినా, బానిసలుగా ఇంకా బతకాల్సిందేనా! దొరలు మన పేదోళ్ళ కష్టాన్ని, వంటల్ని దోచుకోవడం మొదలు దొరల ఇండ్లల్లో జరిగే వివాహాలలో పాటించి తాటికమ్మలు తెచ్చి పందిరి వేసిన గౌండ్లు, వడ్లవాళ్లు, బట్టలు నేసి తెచ్చిన శాలోల్లు, రెండు వారాలు గడీలోవుండి కట్టెలు కొట్టిన మాదిగ మట్టయ్య, అతని బంధువులు ఇంకా మంగలి, చాకలి వంటి అన్ని వృత్తుల వాళ్ళ శ్రమను గుర్తుచేసుకుంటాడు. తరతరాలుగా పేద వర్గాల కష్టాల్ని దోచుకొని

ద్వేషాన్ని ప్రదర్శిస్తున్న దొరను ఎదురించాలనీ, తమ వృత్తులను కాపాడుకొని సంపదపై హక్కులు సాధించే వరకు పోరాడాలనీ చైతన్యవంతంగా మాట్లాడుతూనే మరణిస్తాడు.

ఈ సందర్భంలోనే ధర్మభిక్షం ప్రవేశిస్తాడు. ధర్మభిక్షం ఇందులో ప్రధాన పాత్ర. ధర్మభిక్షం అసలు పేరు ధర్మన్న. ధర్మభిక్షం తమ ప్రాంతంలో జరుగుతున్న దోపిడి, దౌర్జన్యాలను ఎదురించాలనే సంకల్పంతో ఉంటాడు. ధర్మన్న చదువుకునేటప్పుడు బడిపిల్లలకు ఆ బడి ప్రధానోపాధ్యాయుడు ఏదో అన్యాయం చేసిండని తెలిసి దానికి వ్యతిరేకంగా పెద్ద పోరాటం చేస్తాడు. బడిపిల్లలతో ఊరేగింపు నిర్వహిస్తాడు. పోలీసులు లాఠీచార్జి చేసిన పట్టు వదలడు. అధికారులు వచ్చి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చే వరకు పోరాటం కొనసాగిస్తాడు. ఇలాంటి నిబద్ధత కలిగిన వ్యక్తిగా ధర్మభిక్షం మనకు కనబడతాడు. అజ్ఞానం, నిరక్షరాస్యత వల్ల అణచివేతకు గురవుతున్న తమ వర్గాల్ని చైతన్యపరచాలనే ప్రగతిశీల భావాలతో ధర్మభిక్షం గీత కార్మికులను ఏకం చేయడానికి ఇల్లు వదిలి బయలుదేరుతాడు.

"ఈ దొరలు, జమిందారులు గౌండ్లోల్లను, చాకలొల్లను, కమ్మరోల్లను, మంగలోల్లను కంసాలోల్లను ఒక్కరేంది ఎవరినైనా మనిషిలాగా బతకనిస్తున్నారా? వాళ్ళ వృత్తులను వాళ్ళు చేసుకునే అవకాశాలు కల్పిస్తున్నారా? వాళ్ళా కష్టాన్ని ఈ దొరలు దోచుకోవటం లేదా? అంతెందుకు మూడు గీతల తాళ్ళెక్కి తెచ్చిన కల్లును అమ్మగా వచ్చిన డబ్బుతో రకరకాల పేరుతో వీళ్లు దోసుకుంటుండ్రు కదమ్మా?" (పుట: 13) అని తను ఈ నిర్ణయానికి వచ్చానని చెప్పి ఒప్పిస్తాడు.

దొరలకు అనుచరులుగా ఉండే కొందరు పెద్ద ముస్తాదర్లు జిల్లాస్థాయిలో వేలంపాడి ఈ వృత్తిని వారి చేతుల్లో పెట్టుకుంటారు. వాళ్లు ఎంత కిస్తు కట్టమంటే అంత ప్రతి గీత కార్మికుడు కట్టాల్సిందే. లేకపోతే ఆస్తులను జప్తు చేస్తారు. ఈ పరిస్థితులను ఎదుర్కోవడానికి కార్మికులను చైతన్యపరిచే క్రమంలో వీరయ్య అనే గీత కార్మికుడితో "పెద్దయ్యా! ఇంతకాలం దొరలు, పెద్ద ముస్తాదర్లు మిమ్ములను బానిసలుగా తయారు చేసుకున్నారు. మీ కష్టాన్ని దోచుకుంటున్నారు. వాళ్ళ కనుసైగలల్లో నడిచేటట్లు ఆజ్ఞలు జారీ చేస్తున్నారు. ఇది ఒక బతుకేనా పెద్దయ్యా! నీ లాంటి వయస్సు ఊడిగినోళ్ళంతా ఇంతకాలం పడ్డ కష్టాన్ని గుర్తుతెచ్చుకొని ఈ ముస్తాదర్లకు ఎదురు తిరగండి" (పుట: 16) అని కార్మికులలో స్ఫూర్తిని కలిగిస్తాడు.

వీరయ్య ఇంట్లో గీత కార్మికుల సమావేశం అయ్యేలా చేసి, గ్రామస్థాయి వేలం పాటలను సాధించాలని ,అప్పుడే ముస్తాదర్ల దోపిడి పోతుందని వారిలో చైతన్యాన్ని నింపుతాడు. కాటమయ్య పండగ సమయంలో గౌడవృత్తిదారులలోని అన్యోన్యతను చూసి ధర్మభిక్షం దేవుడి మీద భారం వేయకుండా మన ప్రయత్నం చేయాలి అని ప్రబోధిస్తాడు. దాంతో అక్కడి కార్మికులకు ఐక్యంగా తమ సమస్యలపై పోరాటం చేస్తామంటారు. ఈ పరిణామం ధర్మభిక్షంకు ఎంతో సంతోషానిస్తుంది. గీత కార్మికులు సంఘటితమైన విషయం తెలిసిన ముస్తాదర్లు కల్లు కుండలు, కల్లు మండువలు పగలగొట్టి భయభ్రాంతులకు గురిచేయాలని ప్రయత్నిస్తారు. కానీ గీత కార్మికులలో ఐక్యత మరింత పెరిగి గిట్టుబాటుకే పొందుబాటు కావాలని గ్రామ వేలం పాటలు కావాలనే నినాదాలతో ధర్మబిక్షం నాయకత్వంలో వేలాదిగా కదిలి ధర్నాలు, పికెటింగ్ ల రూపంలో తిరుగుబాటు చేయడంతో జిల్లాస్థాయి వేలం పాట రద్దయి గ్రామస్థాయి వేలం పాటలు రావడంతో గీత కార్మికులలో ఆత్మస్థైర్యం పెరుగుతుంది.

సూర్యాపేటలో జరిగే గౌడ మహాసభలో సమస్యల పరిష్కారానికి మార్గం చూపుతానని మంత్రులను ఆహ్వానిస్తారు. సభ గురించి వివిధ గ్రామాలలో ప్రచార యాత్ర నిర్వహిస్తారు. ప్రచారంలో భాగంగా ఎడ్లబండి మధ్యలో తాటిచెట్టును నిలబెట్టి, గీత కార్మికుడు నడుముకు ముస్తాదు కట్టుకొని ఎక్కుతున్న భంగిమలో నిలబడి ఉంటాడు. కరపత్రాలు పంచుతారు. ఈ విధంగా ఆకర్షణీయంగా ప్రచారం చేస్తారు. ఈ సందర్భంలో వెంకటయ్యతో రంగనాయకులు "మీరంతా కష్టపడి గీత కార్మికుల రాతలు మారాలని చూస్తున్నారు. కాని వీళ్లు ఒక్కసారి చెప్పగానే ఐక్యంగా కలిసిరారు. అదే దొరబాబు పిలుస్తుండంటే భయంతో చేతులు కట్టుకొని ఘడియ ఆలస్యం కాకుండా పోయి వస్తారు. అందుకే దోపిడోళ్ళ ఆటలు సాగుతున్నాయని రంగనాయకులు అన్నాడు" (పుట:131) అక్కడే ఉన్న బాలయ్య మన తాతముత్తాతలు అలానే బ్రతికారు మనం కూడా అలానే ఉండాలి. ఎదురుతిరిగితే బతకలేమని అంటాడు. వెంటనే వెంకటయ్య అక్కడ ఉన్న బావి నీరు గతంలో కేవలం దొరలు మాత్రమే తాగేవారు. మన తాతలు చేసిన పోరాటం ద్వారా నేడు ఈ బావి నీళ్లు మనం స్వేచ్ఛగా తాగుతున్నాం. మన తాతలు త్యాగాలు, పోరాటాలు చేస్తే ఫలితం అనుభవిస్తున్నాం. మనం పోరాటం చేస్తే మనతోపాటు ముందు తరాలు బాగుపడతారనేది ఆశ, నమ్మకం అని బాలయ్య ధోరణిని మార్చుకొమ్మని చెప్తాడు. దాంతో బాలయ్య ఆలోచనలో పడుతాడు.

వెంకటయ్యతో పాటు కొందరు నాయకులు సభకు వస్తున్న గీత కార్మికులకు స్వాగతం పలుకుతారు. బేతవోలు గ్రామంలో రాత్రి కావడంతో అక్కడే వృద్ధ గీతకార్మికుని ఇంట్లో ఉంటారు. వెంకటయ్యతో వృద్ధుడు ప్రాణం పోయే వరకు ఇదే వృత్తి చేసుకుంటూ బతకాల్సిన పరిస్థితి. వృద్ధ కార్మికులకు ఈ ప్రభుత్వాలు సహాయం చేయడం లేదని వాపోతాడు. తనవంతుగా గౌడ సంఘానికి తను దాచుకున్న డబ్బులు అందిస్తాడు. ఇక్కడ ఆ వృద్ధుని ఔదార్యం మెచ్చుకోవచ్చు.

ఈ నవలలో చిన్నకథ అంతర్భాగంగా నడుస్తుంది. గౌడ కుల వృత్తిలో స్త్రీ పాత్ర ప్రాధాన్యం కలిగి ఉంటుంది. శ్రామిక ఉత్పాదనలో స్త్రీ  ఉండడం ప్రత్యేకం. రామయ్య అనే గీత కార్మికుడు తాటి చెట్టు పైనుండి పడి మరణిస్తాడు. రామయ్య తండ్రి కూడా చెట్టు పైనుండి పడి మరణిస్తాడు. రామయ్య భార్య సీతమ్మ, పెద్ద కూతురు వికలాంగురాలు, చిన్నకూతురు స్వరాజ్యం. రామయ్య చనిపోవడంతో సీతమ్మ పిచ్చిదానిలా  ఏదుస్తుంది.

“నీ అడుగులో అడుగేస్తూ నీతోపాటు వనానికి వచ్చేదాన్ని, నీవు తాళ్ళెక్కి గీసి పెట్టిన కల్లు నెత్తిన ఎత్తుకొని ఇంటికి తెచ్చి అమ్మేదాన్ని, రోజు నీవు కోడికూత కంటే ముందు లేచి గజ్జల ముస్తాదు కట్టి, మోకు భుజాన పెట్టుకొని కావలి కుండలతో వనానికి నడిసొచ్చేవాడివి” (పుట: 40). స్త్రీ పురుషులు సమానంగా కష్టించడం గౌడ కులవృత్తిలో కనబడుతుంది.  శ్రమ సౌందర్యంతోపాటు అన్యోన్య దాంపత్యం కలిగి ఉంటారు.

రామయ్య మరణంతో సీతమ్మ దిక్కులేనిదిగా అవుతుంది. భర్తను కోల్పోయి బాధలో ఉన్న సీతమ్మకు ఎర్రన ధర్మభిక్షం చేస్తున్న పోరాటాన్ని ఆమెతో చెప్పి ధైర్యం నింపుతాడు. సాయన్న కల్లు గీసి పోయడంలో కల్లు అమ్ముకొని జీవితాన్ని సాగిస్తుంది. భర్తలేని స్త్రీలు ఎదుర్కొనే కష్టాలు చాలా ఉంటాయి. సీతమ్మ కూడా అనేకమైన వేధింపులను ఎదురుకొంటుంది. సీతమ్మ గౌడ సభలకు హాజరు కావడం, అక్కడ తనలాంటి వారిని చూసి, వారు చేస్తున్న పోరాటాలు చూసి, ధైర్యం తెచ్చుకుంటుంది. సీతమ్మ సరాజ్యంను ఎర్రయ్య కొడుకుతో వివాహం జరిపిస్తుంది. కాని దురదృష్టం పెళ్లైన 10 సంవత్సరాలకు అతడు మరణిస్తాడు.

సూర్యపేట మహాసభకు హాజరైన మంత్రులు మధ్య దళారీలు లేకుండా చేస్తామని, కార్మికులకు గీత కార్మికులకు ప్రమాదం జరిగిన, మరణించిన నష్టపరిహారం ఇస్తామంటారు.

ప్రభుత్వాలు బడ్జెట్‌లో ఎక్స్‌గ్రేషియాకు నిధులు కేటాయించినా అవి బాధితులకు అందకుండా ఉంటాయి. అందుకు ప్రధాన కారణం ఆబ్కారి అధికారుల లంచగొండితనం, అలసత్వం. ఎక్స్‌గ్రేషి కేసులన్ని పెండింగ్‌లో ఉండటంతో ధర్మభిక్షం కార్యాచరణ రూపొందించి కలెక్టర్ ఆఫీసుల ముందు రాస్తారోకోలు నిర్వహించి విజయం సాధిస్తాడు.

విశాఖపట్నంలో జరిగిన సభకు ముఖ్య అతిథిగా హాజరవుతాడు ధర్మభిక్షం. ఆ సభలో ధర్మభిక్షం గౌడ వృత్తి గురించి, సమగ్ర చట్టం గురించి, ఆబ్కారి చట్టాల గురించి వివరిస్తాడు. మన పోరాటంతోనే సమాజంలో గుర్తింపు లభించిందని, కాంట్రాక్టు విధానం పోయి సహకార సంఘాలు వచ్చాయని చెప్తాడు. ఆ రోజు రాత్రి వీరభద్రరావు ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుంటాడు. వీరభద్రరావు మనవడు కిరణ్‌తో తాటి ఉత్పత్తులు, తాటి ఆవశ్యకతను మరియు ఆర్థిక, ఉపాధి పరమైన విషయాలను వివరిస్తాడు.

ఆంధ్ర ప్రాంతంలో తుఫాన్ వలన కలిగే నష్టాలు ప్రత్యక్షంగా గౌడ వృత్తి వారికి శిస్తు మాఫీ చేయడం, పరికరాల కొనుగోలుకు ప్రభుత్వాలు చేయూతనివ్వాలని ధర్నాలు చేసి విజయం సాధిస్తారు.

బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్ 'తాటిచెట్టు సాహిత్యం – వనవృత్తి సంరక్షణ ప్రాధాన్యం' అనే అంశంపై సాహితీ పెద్దలు చర్చిస్తారు. లిపికి ఆధారం తాటాకు అని, తాటిచెట్టు ప్రాధాన్యం గురించిన విషయాలు చర్చిస్తారు.

రంగారెడ్డి, నల్గొండ, కరీంనగర్ మొదలగు జిల్లాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు తాటి వనాలను కూల్చడంతో ధర్మభిక్షం నాయకత్వంలో ఉద్యమ బాట పడతారు. వృత్తిని రక్షించాలి, వనాన్ని జయించాలి, అడవిని జయించాలి, గ్రామాన్ని జయించాలి, కష్టజీవులంతా కలిసి రాజ్యాన్ని జయించాలి. ఇదే నా ఆశయం, నేనందించే ఆయుధం, పోరాటమే భవితవ్యమని ధర్మభిక్షం అనడంతో ఈ నవల ముగుస్తుంది.

ఈవిధంగా కుల, వర్ణ నిర్వచనాలతో పాటు తెలంగాణ వృత్తి నవలల ఇతివృత్తాన్ని స్థూలంగా పరిచయం చేస్తూ విశ్లేషించడం జరిగింది.

# అధ్యాయం - 3

# తెలంగాణ వృత్తి నవలలు — పాత్ర చిత్రణ

## 3.1. పాత్రలు — పాత్రల రకాలు — పాత్ర చిత్రణ

తెలుగు సాహిత్యాన్ని రెండు విధాలుగా వర్గీకరించవచ్చు. మొదటిది ప్రాచీన సాహిత్యం. ఇందులో పాత్రలుగా దేవతలు, రాజులు, బ్రాహ్మణులు, మంత్రులు మొదలగు పాత్రలు కనిపిస్తాయి. పంచతంత్రం వంటి కావ్యాల్లో జంతువులు, పక్షులు, పాత్రలుగా వున్నాయి. రెండవది అయిన ఆధునిక తెలుగు సాహిత్యంలో జమిందారులు, రైతులు, జాతీయ నాయకులు, గొప్ప వ్యక్తులు పాత్రలుగా ఉండేవి. క్రమంగా సామాన్య ప్రజలే పాత్రలుగా రూపొందించబడుతున్నారు.

ఆధునిక సాహిత్యంలో నవల అనేది విస్తృత పరిధిని కలిగివుంది. ఈ నవల ప్రధానాంగాలు కథ, కథా వస్తువు, నేపథ్యం, పాత్రలు. వీటిలో 'పాత్రలు' అనేది ముఖ్యమైన అంగంగా చెప్తారు. కథ లేనివి, కథావస్తువు లేని నవలలు ఉండొచ్చుగాని, పాత్రలు లేకుండా నవల రాయటం సాధ్యం కాదు.

"కథ కల్పనయందే ఆయా పాత్రలు రూపరేఖలు తీర్చిదిద్ది మన మనో నేత్రములకు సాక్షాత్కరించేటట్లు చేయగల నేర్పు ప్రతిభా నవలా రచయితకు ఉండాలి. అప్పుడే పాత్రలు సజీవ సంపన్నంగా ఉండును. నాటకంలోని పాత్రల వలె నవలల్లోని పాత్రలు గూడా సజీవ సంపన్నంగా మన ముందు ప్రత్యక్షమయినపుడే మనకు అవి ఆనందమును చేకూర్చగలవు" (వెంకటేశ్వర్లు, పుల్లాభొట్ల. 1974: పుట: 22).

"కథావస్తువును భరించేవారు, కథను నడిపించేవారు పాత్రలు" (వెంకటసుబ్బయ్య, వల్లంపాటి: పుట: 27)

"కొన్ని నవలల్లో ఒకటి కంటే ఎక్కువ జీవితాల చిత్రణ ఉంటుంది. ఈ జీవితాల ప్రతినిధులైన పాత్రలు పరస్పరం ఆధారపడి ఉంటాయి. అప్పుడు ప్రధాన పాత్రలు రెండు కంటె ఎక్కువగానే ఉంటాయి." (మృణాళిని. 1988: 52, 53).

"నవలకు ప్రాణ భూతమైనవి పాత్రలు. పాత్రలు లేని నవలలు ఉండవు. నవల అనే సాహితీ ప్రక్రియ పాత్రల కోసమే ఉద్భవించింది అని వర్జీనియావూల్ఫ్ మాటలు ఈ విషయాన్ని బలపరుస్తున్నాయని మృణాళినిగారు పేర్కొన్నారు." (మృణాళిని : పుట: 50).

నవలకు ఇతివృత్తం అస్థిపంజరమైతే పాత్రలు జీవం వంటివి కాబట్టి పాఠకుడిలో సానుభూతిని కల్గించి, రసానందానికి ప్రధానంగా పాత్రలే దోహదపడుతాయి. నవలల్లో రచయితల భావ ప్రకటనకు ప్రధాన ఆకరం పాత్రలే. నవలాకారుడు ప్రతి పాత్రను ప్రయోజనకరంగా మలుస్తాడు.

పాత్ర చిత్రణ నవలకు జీవం. నవలలోని కథకు మానవ జీవితం ఆధారమైనట్లే పాత్ర చిత్రణకు వ్యక్తులే ఆధారం. కథా గమనానికి, వ్యక్తీకరణకు పాత్రలే సాధకాలు. నవలలోని పాత్రలను బట్టి కథ ఉంటుంది. ఆయా పాత్రల గుణాల ఆధారంగానే సన్నివేశకల్పనలు కూడా ఉంటాయి. నవలకు ఒక రూపాన్ని సార్థకతను ఇచ్చేవి పాత్రలే. నవలలో ఇతివృత్తానికి, సన్నివేశ చిత్రీకరణకూ, పాత్ర చిత్రణకూ సమ ప్రాధాన్యం ఉంటుంది.

వ్యక్తులు లేకుండా జీవితం లేదు, సమాజం లేదు. సమాజాన్ని, సమాజంలోని వ్యక్తుల జీవితాలను చిత్రించేది నవల. కాబట్టి నవలలోని కథకు పాత్రలు ప్రధాన ఆధారం. నవల సమాజాన్ని మాత్రమే చిత్రించేది కాదు. వ్యక్తిని, వ్యక్తి సమస్యలను కూడా నవల చిత్రిస్తుంది. వ్యక్తికి, సమాజానికి మధ్యగల సంబంధాలను నవల వివేచిస్తుంది. సమాజాన్ని చిత్రించే నవలలో వ్యక్తులు పాత్రలుగా చిత్రించబడుతారు.

నవల ప్రధానంగా సమకాలిక యధార్థ జీవితాన్ని చిత్రించేది కాబట్టి పాత్రలు సజీవంగా యధార్థంగా కనిపించాలి. సామాన్యంగా రచయిత నిత్యజీవితంలో తాను చూసిన వ్యక్తులను నవలలో పాత్రలుగా చిత్రిస్తాడు. అప్పుడు నవలలోని ఇతివృత్తం ఆ పాత్రల చర్యలే కాని వేరే కాదు. అంటే రచయిత యధార్థ వ్యక్తులను వాళ్ళ చర్యలను సంఘటనలను నవలలేతివృత్తంగా

మలచవచ్చు. నవలలోని ఇతివృత్తంలో వాస్తవికతను తేవాలంటే సజీవ పాత్రచిత్రణ చాలా అవసరం.

నిత్యజీవితంలో ఒక వ్యక్తిని కొద్దికొద్దిగా అర్థం చేసుకుంటాం. కాలం గడిచిన కొద్దీ అభివృద్ధి చెందిన సంబంధం వల్ల మరికొంత అవగాహన కలుగుతుంది. అలాగే నవలలోని పాత్రను గూర్చి మొదట్లో కొద్దిగా తెలిసినా, కాలక్రమంలో పాఠకుడి అవగాహన పెరుగుతుంది. అంటే పాత్ర క్రమంగా ప్రాణం పోసుకుంటుందన్నమాట. ఈ ప్రాణం పోసుకోవడం వెనుక ఉండేది రచయిత శక్తి. అదే పాత్రపోషణాశక్తి జీవితంలోని వ్యక్తిలాగానే నవలలో కూడా పాత్ర పరిణామం చెందుతుంది.

'జీవితమంటే సుఖదుంఖాలు ఒక మనిషి జీవితంలో అవి ఎలా సంప్రాప్తిస్తున్నవి? ఆయా సందర్భాలలో ఆ మనిషి ఎలా ప్రవర్తిస్తున్నాడు? ఈ విషయాల్నిబట్టి మనిషిలో వ్యక్తి వైశిష్ట్యం గోచరమౌతుంది. జీవితాన్ని కథగా మలిచే ప్రక్రియయైన నవలలో నిరూపింపబడే వ్యక్తి వైశిష్ట్యాన్నే పాత్ర చిత్రణం అంటారు.' అని ఆర్. ఎస్ సుదర్శనం అభిప్రాయం (సమాజం – సాహిత్యము. 1972: 104).

నవలల్లో పాత్రచిత్రణని విశ్లేషించడానికి కొన్ని అంశాలను చర్చించాలి. అవి

i. నవలల్లో పాత్రలు ఎన్ని రకాలుగా ఉంటాయి?
ii. పాత్రల స్వరూప స్వభావాలు ఏమిటి?
iii. పాత్రల పోషణలో ఉన్న వివిధ పద్ధతులు ఏమిటి?
iv. పాత్రల వలన పాఠకులకు కలిగే ప్రయోజనం ఏమిటి? అని ప్రశ్నిస్తే పాత్రల చిత్రణకు, నవలాశిల్పానికి ఉన్న సంబంధం బయల్పడుతుంది.

నవలల్లో పాత్రలు అన్ని చూడడానికి ఒకటిగా అనిపించినా వ్యక్తులలో ఉండే వైవిధ్యంలో వలె అట్లే పాత్రలలో కూడా అనేక రకాలు ఉన్నాయి. ఇవి అన్ని వారివారి స్వభావాలనుబట్టి సాహిత్యకారులు, పరిశోధకులు ఆయారకాలుగా విభజించారు.

➢ డా. సి. మృణాళినిగారు 'సాంఘిక నవల – కథనశిల్పం' (పుట:113) అనే గ్రంథంలో పాత్రల స్వభావాలను అనుసరించి సూక్ష్మంగా పరిశీలించి పాత్రల్లో విభేదాలు 12 రకాలు ఉన్నాయని పేర్కొన్నారు. అవి

i. పరిణామశీలక పాత్రలు.

ii. పరిణామరహిత పాత్రలు.

iii. సమకాలీన సమాజానికి ప్రతినిధులు.

iv. రచయిత ఆదర్శానికి ప్రతినిధులు.

v. స్వతంత్ర ప్రతిపత్తి కల పాత్రలు.

vi. సామాజిక వైయక్తిక జీవితాల సంఘర్షణకు ప్రతినిధులు.

vii. మనోవైజ్ఞానిక శాస్త్రంతో అన్వయంపొందే పాత్రలు.

viii. సిగ్మండ్‌ఫ్రాయిడ్ సిద్ధాంతాలైన ఇడ్, ఈగో, సూపర్‌ఈగో, ఈడిపస్‌కాంప్లెక్స్ భాగాల ఆధిపత్యానికి నిదర్శనంగా నిలిచేపాత్రలు.

ix. అడ్లర్ సిద్ధాంతాలు ఆత్మన్యూనత, ఆత్మాధిక్యత భావాలకు బానిసలుగా తీర్చిదిద్దిన పాత్రలు.

x. యంగ్ సిద్ధాంతభాగమైన బాహ్య, అంతర్‌వర్తనుల, భావాలకు అన్వయించే పాత్రలు.

xi. యూంగ్ పేర్కొన్న మూలరూప ప్రతీకలు, సాంస్కృతిక ప్రతీకలకు నిదర్శనంగా వుండే పాత్రలు.

xii. అపసామాన్య ప్రవృత్తులకు అన్వయించే పాత్రలు.

స్వీయసౌందర్యాతిశయం, అధికలైంగికేచ్ఛ, నాడీరుగ్మత, ఉన్మాదం, అకారణభీతి, నియంత్రీభావన మొదలైనవి అపసామాన్యప్రవృత్తులు.

➢ విశ్వనాథ నవలాశిల్పం అనే గ్రంథంలో డా. ఎమ్. ప్రసన్నాంజనేయులు విశ్వనాథ సత్యనారాయణగారు రాసిన నవలల్లోని పాత్రలు 14 రకాల భేదాలున్నాయని తెలిపారు.

i. చారిత్రక పాత్రలు (Historical Characters)

ii. అభౌమిక పాత్రలు ( Super – Natural Characters)

iii. సంప్రదాయ పాత్రలు ( Traditional Characters)

iv. వాస్తవికపు పాత్రలు ( Realistic Characters)

v. కల్పితపాత్రలు ( Romantic Characters)

vi. సంక్లిష్ట పాత్రలు ( Flat Characters)

vii. సరళ పాత్రలు

viii. వర్గసంబంధ పాత్రలు

ix. వ్యక్తి సంబంధ పాత్రలు

x. నిదాన పాత్రలు (Symbolic Characters)

xi. పరివర్తన పాత్రలు (Dynamic Characters)

xii. అపరివర్తన పాత్రలు (Static Characters)

xiii. ధనాత్మక పాత్రలు (Positive Characters)

xiv. వ్యతిరేక పాత్రలు / ఋణాత్మక పాత్రలు ( Negative Characters)

➢ ఆచార్య జి. యోహాన్‌బాబుగారు రాసిన 'బలివాడ కాంతారావు నవలలు పరిశీలన' అనే గ్రంథంలో బలివాడ కాంతారావుగారు రాసిన మొత్తం నవలల్లో ఉన్నటువంటి పాత్రలను 10 రకాలుగా వర్గీకరించారు. అవి.

i. ఆదర్శోన్ముఖ పాత్రలు

ii. ఉదాత్త పాత్రలు

iii. సంప్రదాయోన్ముఖాలు – సంప్రదాయవిరుద్ధాలు

iv. సందేశాత్మక పాత్రలు

v. గాంధీ ప్రభావాత్మకాలు

vi. కళలకు అంకితమయిన పాత్రలు

vii. తీవ్రవాద భావాలుగల పాత్రలు

viii. ప్రతినాయక రాజకీయ పాత్రలు

ix. అప్రధాన పాత్రలు

x. మనోవిశ్లేషణాత్మక సిద్ధాంతగత పాత్రలు" (యోహన్ బాబు, జి. 2001: 178)

పైన పేర్కొన్న విధంగా పరిశోధకులు, విమర్శకులు, సాహిత్యకారులు, పాశ్చాత్యులు చెప్పిన పాత్రల వర్గీకరణే కాకుండా స్త్రీ పాత్రలు, పురుష పాత్రలు అనే రెండు రకాలుగా కూడా చెప్పే వర్గీకరణ కూడా వుంది. ఇవేగాక ఆయా పాత్రల ప్రాముఖ్యాన్ని బట్టి ప్రధాన పాత్రలని, అప్రధాన పాత్రలని చెప్పబడే మరో రెండు రకాల విభజన కూడా ఉంది. ఇవే గాకుండా ప్రధాన స్త్రీ పాత్రలు, అప్రధాన స్త్రీ పాత్రలు, ప్రధాన పురుష పాత్రలు, అప్రధాన పురుష పాత్రలుగా కూడా వర్గీకరించటం జరుగుతుంది.

ఈ విధంగా పాత్రలలో ఉండే వైవిధ్యం, విభజన ఎంతో విస్తృతమైనది. అందుకే రచయిత యొక్క జీవితానుభవాన్నిబట్టి, చిత్రించిన విధానాన్నిబట్టి, నవల చిత్రణనుబట్టి పాత్రలను విభజించటం జరుగుతుంది.

➢ పాత్రల స్వరూప స్వభావాలు ఏమిటి? అనే అంశం ప్రధానంగా రచయిత ప్రతిభపై ఆధారపడి ఉంటుంది.

ఏ రచయిత ఎప్పటికీ కొత్త పాత్రలను సృష్టిస్తూ ఉండలేడు. కానీ అతను ముఖ్యంగా చేయవలసిన పని పాత్రల ద్వారా పాఠకుడి హృదయంపై తన సామర్థ్యం కొలదీ ఒక గాఢమైన ముద్రవేయడం అంటారు. పాఠకుల హృదయాలపై గాఢముద్ర వేయడంలోనే పాత్ర చిత్రణ అనే సమస్య ఇమిడి ఉంటుంది. వస్తువును ఎన్నుకుని తగిన ఇతివృత్తాన్ని అంటే కార్యాకారణ సంఘటిత కథాక్రమాన్ని నిర్ణయించుకున్న తర్వాత రచయిత పాత్రల సంఖ్యను, వాటి తరతమ ప్రాధాన్యాన్ని నిర్ణయించుకుంటాడు. ఆ తర్వాత తన కథా ప్రణాళిక, రచనా సిద్ధాంతాల ఆధారంగా పాత్ర చిత్రణకు పూనుకుంటాడు. కాని ఈ పాత్రలెప్పుడూ తన ఆధీనంలో ఉండవని, వాటిని సృష్టించడం వరకే తన బాధ్యత అనీ, ఆ పాత్రలే తమ నడవడికని తీర్చిదిద్దుకుంటాయి. అసంకల్పితంగా ఆయా పాత్రల ప్రవర్తన, స్వభావం కథాక్రమాన్ని బట్టి మారడం అసంభవం

కాకపోయినా సాధారణంగా పాత్ర చిత్రణ పూర్తిగా రచయిత ఆధీనంలోనే ఉంటుంది. ఈ అసంకల్పిత పరిణామాలు కూడా రచయిత సుప్తచేతనలోని భావాల ఫలితాలే.

➢ పాత్రచిత్రణలో ఉన్న వివిధ పద్ధతులు ఏమిటి? అని ఆలోచిస్తే పరిశోధకులు, విమర్శకులు చెప్పిన విధానాలు చూద్దాం.

❖ బొడ్డుపాటి వేంకటకుటుంబారావు గారు "ఆంధ్రనవలా పరిణామము" అనే గ్రంథంలో (1971: 115) పాత్ర పోషణము ప్రధానంగా ద్వివిధమైనది. 1. విమర్శనాత్మకం 2. అభినయాత్మకము.

మొదటిది విమర్శనాత్మకము. దీనిలో రచయిత పాత్రల యందే ప్రవేశించి భావములను, స్వభావములను, రాగద్వేషములను వెల్లడించి దానిని వ్యాఖ్యానించి కారణమును తెల్పి పిమ్మట తన విమర్శనము అభిప్రాయం గూడా వెల్లడించును.

రెండోది అభినయాత్మకము. దీనిలో రచయిత పాత్రకు దూరముగా నుండి వాని వాని సంభాషణా వ్యాపారము వలననే ఆయా పాత్రల గుణశీలములను స్ఫుటితము చేయును. ఇది యుత్తమకోటి శిల్పజ్ఞత.

❖ డా. ఎమ్. ప్రసన్నాంజనేయులుగారు విశ్వనాథ నవలాశిల్పము అనే గ్రంథంలో పాత్రపోషణలో

మూడు ప్రధాన పద్ధతులు కలవు. అవి వర్ణనాత్మకము, విశ్లేషాత్మకము, సంభాషణాత్మకము.

మొదటిది వర్ణనాత్మక పద్ధతి యందు రచయిత ఒక పాత్రలో సర్వవిషయాలను తానై స్వయంగా చెప్పును.

రెండవ విశ్లేషణాత్మక పద్ధతియందు ఒక పాత్రల మానసిక ప్రవర్తనాదులను మనస్తత్త్వ శాస్త్రానుసారముగా విశ్లేషించి చెప్పును.

మూడవ సంభాషణాత్మక పద్ధతియందు పాత్రల పరస్పర సంభాషణ మూలమున పాత్రచిత్రణ మొనర్చును.

ఈ మూడు పద్ధతులు శ్రేష్ఠమైనవేగాని సంభాషణాత్మక పద్ధతి సర్వశ్రేష్ఠమైనది. మహారచయితలు అందరు వరప్రసాదంగా ఈ పద్ధతినే అనుసరించి పాత్రచిత్రణ చేయుట

గమనార్హం. స్వగతము అందును ఇతర పాత్రలతో సంభాషించుట యందును, ఇతర పాత్రలు ఒక పాత్రను గూర్చి చర్చించు సందర్భములందును పాత్ర వ్యక్తిత్వము మనకు అవగతమౌతుంది. ఈ మూడు చోటులందు కవి జాగరూకుడై పాత్రలను తీర్చిదిద్దును.

❖ ఆచార్య ముదిగంటి సుజాతారెడ్డి గారు రాసిన తెలుగు నవలానుశీలనం అనే గ్రంథంలో నవలల్లో వున్నటువంటి వివిధ రకాల పాత్ర చిత్రణ గురించి W.H. హడ్సన్ అనే పాశ్చాత్యుడు చెప్పిన Descriptive Method, Indirect (or) Dramatic Method అనే రెండు రకాల పద్ధతులను గురించి తెలియజేసారు.

పాత్రచిత్రణలో మొదటిదాన్ని ప్రత్యక్ష లేక వర్ణనాత్మక పద్ధతి అని రెండోదాన్ని పరోక్ష లేక నాటకీయపద్ధతి అని అనవచ్చును.

ప్రత్యక్ష పద్ధతిలో రచయిత స్వయంగా పాత్రల మనోభావాలను, గుణస్వభావాలను, వేషభాషాదులను ప్రత్యక్షరూపంగా పనిగట్టుకొని వర్ణించి చెప్పడం. ఒక్కొక్కసారి పాత్రల గుణగణాలను వ్యాఖ్యానిస్తూ చెప్పడం కూడా ఉంటుంది. ప్రారంభదశలో వచ్చిన నవలల్లో పాత్రల గుణశీలాదులను వాచ్యంగా చెప్పడమే జరిగేది.

పరోక్షపద్ధతిలో పాత్ర చిత్రణ నాటకశిల్పాన్ని పాటించడంతో జరుగుతుంది. నవలలోని రచయితలు నాటక శిల్పంతో కూడిన పరోక్షపద్ధతిని అవలంబించి పాత్ర చిత్రణ చేస్తారు. ఈ పద్ధతిలో పాత్రగుణ స్వభావాదులకు సంబంధించిన చాలా చిషయాలు రచయిత వాచ్యంగా చెప్పకపోవడం చేత పాఠకుల ఊహకు, వ్యాఖ్యానానికి వదిలివేయవలసి వుంటుంది.

నవలలోని పాత్రచిత్రణలో వ్యక్తిత్వచిత్రణ, బౌద్ధిక చిత్రణ, చారిత్రక చిత్రణలను రచయిత చేయవలసి వుంటుంది.

వ్యక్తిత్వచిత్రణ అంటే పాత్రల స్వరూప వేషభాషాదుల వర్ణన, దీనివల్ల పాఠకులకు ప్రతిపాత్ర ఒక్కొక్క రూపంతో పరిచయమౌతుంది.

బౌద్ధిక చిత్రణలో పాత్రల గుణగణాల వర్ణన వుంటుంది. ఈ వర్ణనలు ప్రారంభ దశలోని నవలాకారులు వాచ్యంగా పక్షపాతవైఖరితో అఖ్యానాభిప్రాయాలతో వర్ణించి చెప్పగా తర్వాత నవలాకారులు తటస్థవైఖరిని ప్రత్యక్ష పద్ధతిని అవలంబించి చెప్తారు.

చారిత్రిక చిత్రణ వర్ణనలో పాత్రల భావాలు, ఆలోచనలు, మనస్తత్వ చిత్రణలు ఉంటాయి. ఈ చారిత్రక వర్ణనకు ప్రారంభదశలోని నవలాకారులు ఎక్కువ ప్రాధాన్యతనివ్వలేదనే చెప్పాలి.

వల్లంపాటి వేంకటసుబ్బయ్య రాసిన నవలా శిల్పం గ్రంథంలో పాత్రపోషణలో రెండు ప్రధాన ధోరణులున్నాయన్నారు. అందులో మొదటిది రచయిత పాత్రల ప్రవర్తనను వర్ణిస్తూ, ప్రవర్తనను గురించి వ్యాఖ్యానం కూడా చేస్తూపోవటం. రెండోది పాత్రల ప్రవర్తనను మాత్రమే పాఠకుడి ముందుంచి అతడే ఆ పాత్రను గురించి ఒక అభిప్రాయాన్ని ఏర్పరచుకునే స్వాతంత్ర్యాన్నివ్వటం.

కొంతమంది రచయితలు పాత్రలు ఆకారవికారాలనూ, చేష్టలనూ, కళ్ళకుకట్టేలా వర్ణిస్తారు. మరికొందరు పాత్రను వర్ణించకుండా పాఠకుడి మనసులో పాత్రకు సంబంధించిన రూపకల్పన చేస్తారు.

ఇతివృత్తమందలి పాత్రలలో రచయిత తాను సృష్టించబోయే పాత్రలకు ఆకృతిని, నిర్మాణాన్ని ఇచ్చే విధానాన్ని పాత్ర అంటారు. దీన్నే పాత్రసృష్టి, పాత్రపోషణ అంటారు. రచయిత భావాలను, రచనాశిల్పాన్ని తెలుసుకోవడానికి రచయిత చిత్రించిన పాత్రలను పరిశీలించవలసి ఉంది. రచనలో కథాగమనమందలి వివిధ సన్నివేశములలో ఆయా పాత్రల మనఃప్రవృత్తులలోగలుగు క్రమోన్మీలమును పూర్వాపర సందర్భముగా ప్రవచించి నిరూపించుట పాత్రపోషణ అని పేర్కొన్నారు.

పాత్రచిత్రణకు కావలసిన విషయ సేకరణకు రెండు మార్గాలున్నాయి. అందులో మొదటిది బాహ్యప్రపంచ పరిశీలనము. రెండవది ఒక వ్యక్తిని భిన్న మార్గములలో పరిశీలించుట.

రచయిత తన వ్యక్తులను రెండు మార్గముల మూలమున చిత్రించవచ్చును. అందు మొదటిది ప్రత్యక్షపద్ధతి. ఈ పద్ధతి యందు రచయిత పాఠకునకు తన పాత్రలను గూర్చి దాని లక్షణములను గూర్చి స్వయంగా చెప్పును. రెండవది కార్యవిధానము. కార్యమనగా పాత్రల మాటల మూలమునకు ప్రవర్తనమూలమునకు తెలియవచ్చు అంశము లేక విషయం.

డా. మృణాళినిగారు 'సాంఘిక నవల – కథాకథనశిల్పం' అనే గ్రంథంలో పాత్ర చిత్రణలో నవలారచయిత నాలుగు పద్ధతులను అవలంబిస్తున్నారని తెల్పారు. అవి 1. వర్ణనాత్మక పద్ధతి 2. నాటకీయ పద్ధతి 3. క్రమవికాస పద్ధతి 4. చారిత్రక పద్ధతి.

వర్ణనాత్మక పద్ధతిలో రచయిత పాత్ర స్వభావంలోని వివిధాంశాలను తన మాటల్లో, వ్యాఖ్యానాలలో పేర్కొంటాడు. పాత్ర బాహ్యరూపం నుండి పాత్ర ప్రతిస్పందనల వరకు అన్నింటినీ వర్ణిస్తాడు. రచయిత మొదటగా పాత్రల గతచరిత్రను బహిర్గతపరచటం, వాటిరూపం ఎలాంటిది అని వర్ణించడం, వారు ఎటువంటి వ్యక్తులు అని చిత్రీకరించడం అనే మూడింటిని తన మాటల్లో తన ఆధీనంలో పాత్రలు చరించే విధంగా చిత్రీకరిస్తాడు.

నాటకీయ పద్ధతిలో రచయిత పాఠకులకు ఆయా పాత్రలను ప్రవేశపెడుతున్నప్పుడు పరిచయం చేసి, వాటిని వ్యాఖ్యానించటం చేయడు. ఒక్కొక్కసారి పాత్రల ప్రవేశం కూడా సన్నివేశాలు, సంభాషణలద్వారా నాటకీయంగానే జరుగుతుంది. పాత్రల మనస్తత్వాన్ని, స్థితిగతులను, పరస్పర సంబంధాలను, నమ్మకాలను, అనుభూతులను, మానసిక పరిణామాన్ని పూర్తిగా వాటి సంభాషణలు ఆలోచనలు, చర్యలద్వారా రచయిత సూచిస్తాడు. పాత్ర మానసిక జీవితాన్ని, చేష్టలను కళ్ళకుకట్టినట్లు చిత్రించి పాఠకుడి ముందు తెరిచినప్పుడు ఈ పద్ధతికి సమగ్రరూపం వస్తుంది.

క్రమవికాస పద్ధతిలో పాత్ర స్వీయ వ్యక్తిత్వ వికాసం ఆధారంగా ఇతివృత్తం నిర్వహింపబడుతుంది. పాత్ర ప్రధానమైన నవలల్లో ఈ పద్ధతిని రచయితలు అవలంబిస్తారు.

చారిత్రక పద్ధతిలో ఇతివృత్తం అభివృద్ధి చెందుతున్న నిర్ణీత సమయంలో దానికి లోబడి పాత్ర వ్యక్తిత్వవికాసం చిత్రింపబడుతుంది. కథాప్రధానమైన నవలల్లో ఈ పద్ధతిని రచయితలు నిర్వహిస్తారు.

పాత్రచిత్రణ పద్ధతులు అన్నిరకాలుగా వున్నప్పటికీ విమర్శనాత్మకము, సంభాషణాత్మకము, ప్రత్యక్షపద్ధతీ, పరోక్షపద్ధతీ, నాటకీయపద్ధతి, వర్ణనాత్మకపద్ధతి, క్రమవికాసపద్ధతి, చారిత్రక పద్ధతులు ఉన్నప్పటికి రచయిత అనుభవాన్నిబట్టి, స్వీకరించిన ఇతివృత్తాన్నిబట్టి పాత్రల ఎంపిక చేసుకుని వాటిని చిత్రీకరిస్తాడు.

పాత్రల ఎంపికలో, వాటి చిత్రణలో రచయిత వాస్తవికతను ఎంత చిత్రిస్తున్నాడో గమనించాలి. సాధారణంగా రచయిత నిత్యజీవితంలో ఎదురుపడిన వ్యక్తుల, స్వభావంలోని వైశిష్ట్యాల ఆధారంగా, కథావస్తువును అనుకూలమైన పాత్ర సృష్టికి పూనుకుంటాడు. తను సృష్టించిన పాత్రలు నిద్రావస్థలో, జాగృతిదశలో రచయిత కూడా ఉండాలి. ఆ పాత్రలను గాఢానుభూతితో భావిస్తూ, అసహ్యించుకోవచ్చు, ప్రేమించవచ్చు. అంటే రచయిత కొంత ఆత్మాశ్రయత్వంతోను, అనుభూతితోను తన పాత్రలను తిలకించాలని సూచిస్తున్నాయి.

నవలారచనలో పాత్రచిత్రణకు అగ్రస్థానం లభించడానికి ప్రధాన హేతువు నవలాగతమైన ఇతర అంశాలనన్నింటికీ పరిపూర్ణరూపం పాత్రల సహకారంతో సంభవించడమే దృక్కోణ నిర్వహణకు, సన్నివేశ కల్పనకు ఆధారభూతాలు పాత్రలే. శైలికూడా పాత్రోచితమై వాటి స్వభావాలను అనుసరించి ఉంటుంది. రచయిత సిద్ధాంత ప్రతిపాదనకు, సందేశవ్యాప్తికి అతనిచారిత్రక చిత్రణ ఆధీనంలోవున్న సమగ్రమైన సాధనం పాత్ర. అందువల్లనే పాత్రచిత్రణలో రచయిత అధిక శ్రద్ధ వహిస్తాడు.

పాత్రల వలన పాఠకులకు కలిగే ప్రయోజనం ఏమిటి? అన్నప్పుడు పాఠకుల వ్యక్తిత్వానికి పాత్రలు మార్గనిర్దేశాన్ని ఇస్తాయి.

పాత్రలు మంచివై వుండాలి. జీవితానికి దగ్గరగా ఉండాలి. సహజంగా ఉండాలి. ఏకరూపత అనే గుణాన్ని కలిగి ఉండాలి. అంటే ఒక వ్యక్తి చపలుడైనా, ఆ చపలత్వం స్థిరంగా ఉండడమే ఏకరూపత. ఆ గుణం పాత్రల్లో ఉండాలి అంటాడు అరిస్టాటిల్ (సాంఘికనవల – కథాకథన శిల్పం, పుట: 53).

ఏ సాహితీ ప్రక్రియయైన సమాజాన్ని ప్రభావితం చేసే శక్తి కలిగి వుంటుంది. ఆ కథకు ప్రాణాధారమైన పాత్రలలోని మంచిని సామాజికులు గ్రహించడానికి అవకాశం వుంటుంది. ప్రతి వ్యక్తిలోను కొంత మంచి, కొంత చెడు ఉండటం సహజం. సమాజాన్ని ప్రభావితం చేయగలిగేవి పాత్రలే, పాఠకులు మంచిచెడు మధ్య విభేదాన్ని చెడుని అధిగమించి, మంచిని అలవరచుకోవలసిన అవసరాన్ని సూచించాలంటే అవి మంచి చెడుల సమ్మేళనాలై ఉండాలి. ఒక పాత్రలోని చెడు అతనిని అధోలోకానికి నెట్టివేస్తూ ఉండగా అతనిలోని మంచి మేల్కొని ఆ

చెడుని ఓడించి వ్యక్తిని సక్రమమార్గగామిగా చేయడం అంటే అంతిమ విజయం మంచికి లభించే విధంగా చిత్రించడం సమాజ శ్రేయస్సునుకోరే రచయిత చేసేపని. ఈ మంచి చెడుల సమ్మేళనమే పాత్రలను సజీవంగా లోపింపజేసేగుణం. అందుకే కట్టమంచి రామలింగారెడ్డి "ప్రాణము అనుగుణము లేని పాత్రములు రిత్తములు. పాత్రల చరిత్రములు శుద్ధముగ మంచిగానో, శుద్ధముగ చెడ్డవిగానో యుండునట్లు దీర్చుట శిల్పదోషములలో నొకొటి" (కవిత్వత్త్వవిచారము. పుట: 37) అని భావించారు.

సాధారణంగా నవలలో నాయకుడిలో మంచి అధికంగానూ, ప్రతినాయకుడిలో చెడు అధికంగా కనిపిస్తుంది. మంచిచెడుల సంఘర్షణ జీవిత వాస్తవాలలో ఒకటి కనుక ఒక్కొక్క భావానికి కేంద్రంగా ఒక్కొక్క పాత్రను ఎన్నుకుని వాటి మధ్య అలజడి రచయిత సృష్టిస్తాడు. కథావస్తువును బట్టి పాత్రలు స్వాభావికంగాగాని, కల్పన అధికమైనచోట ఆదర్శప్రాయంగాలేక అతినీచ స్వభావులుగా ఉండవచ్చు.

సాధారణంగా నిత్యజీవితంలో, సమకాలీన సమాజంలో తటస్థపడే వ్యక్తుల వంటివారే పాత్రలుగా రూపొందించినప్పుడు ఆ పాత్రల ద్వారా రచయిత అందించవలసిన సందేశం పాఠకుడికి సత్వరంగా స్పష్టంగా అందగలదు.

తెలుగు కావ్యాలలో మహాకవులు తీర్చిదిద్దిన పాత్రలు అన్నీ సజీవమూర్తులు.

నన్నయ – శర్మిష్ట, దేవయాని, కచుడు, యయాతి.

తిక్కన – ద్రౌపది,  అభిమన్యుడు, కృష్ణుడు, ఉత్తరకుమారుడు, కర్ణుడు, అర్జునుడు, దుర్యోధన, దుశ్శాసనులు, వికర్ణుడు, స్వల్ప ప్రాముఖ్యం పాత్రలు అయిననూ ఆ చిత్రణ యందుగల శ్రద్ధ యెంతయో బృహత్తరమైనది.

ఎర్రన – శ్రీకృష్ణుడు, కుంతి, వామదేవభరద్వాజుడు, హిరణ్యకశిపుడు.

శ్రీనాథుడు – గుణనిధి.

అల్లసానిపెద్దన – ప్రవరుడు, వరూధిని.

నందితిమ్మన – సత్యభామ, రుక్మిణి.

చేమకూరవేంకటకవి – సుభద్ర.

మొదలైన పాత్రలు చెరగని ముద్రవేస్తాయి.

ఆవిధంగానే తెలుగు నవలాకారులు చిత్రించిన పాత్రలు నిత్యరమణీయములు. నిత్యచైతన్యమూర్తులు. సంఘ సంస్కరణాభి నిర్దేశక పథమూర్తులు. అందులో ప్రధానంగా కందుకూరి వీరేశలింగం పంతులు రాజశేఖర చరిత్ర – రాజశేఖరుడు, మాణిక్యాంబ, రుక్మిణి, సీత. ఉన్నవలక్ష్మీనారాయణ మాలపల్లి – రామదాసు, సంగదాసు, వెంకటదాసు, రంగడు, జ్యోతి. విశ్వనాథ సత్యనారాయణ వేయిపడగలు – ధర్మారావు, అరుంధతి, గిరిక, పసరిక, గణాచారి. అడవిబాపిరాజు - నారాయణరావు, హిమబిందు, గన్నారెడ్డి, కోనంగి, చిలకమర్తి లక్ష్మినరసింహం – గణపతి, రామచంద్రుడు. చలం – దైవమిచ్చినభార్య – పద్మావతి, రాధాకృష్ణ; మైదానం – రాజేశ్వరి; ఇంకా అమీనా, అరుణ. మొక్కపాటి నరసింహారావు – పార్వతీశం. గోపీచంద్ అసమర్థునిజీవయాత్ర – సీతారామారావు, రామయ్యతాత. బుచ్చిబాబు చివరకుమిగిలేది - దయానిధి, కోమలి, అమృతం, సుశీల, ఇందిర. జి.వి. కృష్ణారావు – పుల్లయ్య, శేఖరం. వట్టికోట ఆళ్వారుస్వామి – గంగు. నోరి నరసింహశాస్త్రి – మల్లారెడ్డి, రుద్రమదేవి, నారాయణభట్టు. రావిశాస్త్రి అల్పజీవి – సుబ్బయ్య, వెంకట్రావుగవరయ్య, సావిత్రి. కొడవటిగంటి కుటుంబారావు చదువు – సీతమ్మ, సుందరం, జానకి, శేషగిరి, వేముల ఎల్లయ్య – కక్క మొదలైన పాత్రలు తెలుగువారికి కంటి ముందు కనిపిస్తాయి.

పాత్రచిత్రణకు ఉన్న ప్రాముఖ్యాన్ని కందుకూరి వీరేశలింగం నుండి నేటి నవలాకారుల వరకు అందరూ గుర్తించారనే చెప్పవచ్చు. ఒక పాత్ర బాగుందనిగానీ, బాగోలేదనిగానీ, పాఠకులు భావించాల్సిన ఆధారం రచయిత పాత్రను చిత్రించే దృక్పథం ఎటువంటిదైనా పాత్రను నడిపించేది రచయితలే. రచయిత చిత్రించిన పాత్రల చిత్రణలోనే పాత్ర స్వభావం, ప్రయోజనం, వైశిష్ట్యం, వైవిధ్యం ఇమిడి ఉంటాయి.

నవలలో పాత్రల సంఖ్య పరిమితంగా ఉండాలి అనే నిబంధన లేదు. కథానిర్వహణకు అవసరమైన సంఖ్యలో పాత్రలను రచయిత ఎన్నుకుంటాడు. అది ఒకటి కావచ్చు లేదా ఇరవై కావచ్చు. కానీ ప్రతి పాత్ర ఒక నిర్దిష్టమైన ప్రయోజనాన్ని కల్గివుండాలి. పాత్రల కోసం పాత్రలను కాక, కథ కోసం పాత్రలను సృష్టించడం వలన రచయిత ప్రతి పాత్రకూ న్యాయం చేకూర్చ

గలుగుతాడు. కథా ప్రాధాన్యతను అనుసరించి ప్రధాన పాత్రలు తక్కువగా సహాయక పాత్రలు ఎక్కువగా ఉండవచ్చు లేదా ప్రధాన పాత్రలు ఎక్కువగా, అనుషంగిక పాత్రలు తక్కువగా ఉండవచ్చు.

సాధారణంగా రచయితలు పాత్రల పేర్లు, హావభావాలు, ఆకార విశేషాలు, అలవాట్లు, వస్త్రధారణ, స్వభావంలోని ప్రత్యక్షతా మొదలైన అంశాలను సంభాషణల ద్వారా గాని, వర్ణనల ద్వారాగాని స్పష్టం చేస్తుంటారు. పాత్రల మధ్య తేడాను అర్థం చేసుకోవడానికి ఈ పాత్ర చిత్రణ తోడ్పడుతుంది. పాత్ర చిన్నదై దానిని మనస్సుకు హత్తుకునేలా చేయడంతో రచయిత సామర్థ్యం వెల్లడవుతుంది.

తెలంగాణ నవలల్లో అందున వృత్తి నేపథ్యంగా వచ్చిన నవలల రచయితలు పాత్రల చిత్రణలో సమాజంలోని వివిధ రకాల మనస్తత్వంగల వ్యక్తుల మనోభావాలను నిక్షిప్తం చేశారు. పాత్రల సంభాషణలు, వ్యక్తపరిచే భావాలు, ఆయా పాత్రల స్వభావానికి అనుగుణంగా ఉండి వాస్తవికతను ప్రతిబింబించేలా ఉన్నాయి.

## 3.2. తెలంగాణ వృత్తి నవలలు - పాత్రల పేర్లు — వర్గీకరణ

తెలంగాణ నవలల్లోని పాత్రలు ఎక్కువగా వృత్తిదారులకు సంబంధించినవి. ఎక్కువ పాత్రలు ఉదాత్తంగాను, ఆదర్శవంతంగా ఉంటాయి. ఈ నవలల్లో ఉన్న మొత్తం పాత్రలు ఎనభై. ఆ పాత్రల గుణగణాల్ని, వ్యక్తిత్వాల్ని పరిశీలించి ఎనిమిది రకాలుగా వర్గీకరించాను.

### 3.2.1. ప్రధాన పాత్రలు

#### 3.2.1.1. రాజాగౌడ్ (పెరటిచెట్టు)

రాజాగౌడ్ గౌడవృత్తికి చెందిన వ్యక్తి. మామూలాలు చేస్తూ జీవనం సాగిస్తాడు. రాజాగౌడ్ తండ్రి కూడా మామూలాలు చేసేవాడు. అతడు మరణించడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడతాడు. ఏమిపని చేయకపోవడం, భార్యను వేధించడంతో మామ కులంలో పంచాయితి పెట్టి

భార్యను తీసుకెళ్తాడు. దాంతో రాజాగౌడ్ తన భార్య తనకు కావాలని దొరకు లంచం ఇచ్చి గ్రామ పంచాయితి ద్వారా తిరిగి తన భార్యను ఇంటికి వచ్చేలా చేస్తాడు.

గ్రామంలో తన తండ్రితోపాటు మామూలాలు చేసిన శివలింగం దగ్గరికి వెళ్ళి తనకు తాళ్ళు కావాలని ఆర్జిస్తాడు. కాని అతను ఇవ్వడు. రాజాగౌడ్‌కి రంగారావు ద్వారా మెహిత్మం అనే అబ్కారి అధికారి పరిచయం అవుతాడు. మెహిత్మం కొత్తగా అబ్కారి ఉద్యోగంలో చేరుతాడు. కారు కొనాలని ఉంటుంది. దానికి మార్గం చూపిస్తాడు రాజాగౌడ్. దాంతో శివలింగం భయపడి రాజీకివచ్చి ఒక ఊరు మామూలు దానికి అవసరమైన డబ్బులు వడ్డీలేకుంట ఇవ్వడంతో రాజాగౌడ్ తిరిగి వృద్ధిలోకి రావడం జరుగుతుంది. దానితో చుట్టు ప్రక్కల ఉన్న గ్రామాలను తన ఆధీనంలో ఉండేలా చేసుకుంటాడు. ముస్తాజర్ కావాలనే ఆశతో రాజాగౌడ్ నాగపూర్, చాంద్ ప్రాంతాలకు వెళ్ళి అక్కడ ధనం, పేరు రెండు సంపాదిస్తాడు. అక్కడ ఇల్లు కొంటాడు. తన కుటుంబాన్ని నాగపూర్‌కి తీసుకురావాలి అనుకుంటాడు. కాని తన భార్య వేషధారణ చూసి ఎవరైనా చూస్తే ఏమనుకుంటారో అని ఆమెను వదిలి కొడుకును మాత్రమే తీసుకెళ్తాడు. ధనంవల్ల అతనిలో వచ్చిన మార్పును ఈ సందర్భంగా గమనించవచ్చు. గతంలో దొరకు లంచం ఇచ్చి భార్యను తిరిగి తెచ్చుకున్నవాడు నేడు కాదనుకోవడం ఇందుకు ఉదాహరణ. తన హోదాకు తగ్గట్టు ఉండాలని ఒక అమ్మాయిని పెళ్ళి చేసుకుంటాడు. ఆమెకు ఇష్టం ఉండదు. ఆమె ఎవరితోనో డబ్బులు, నగలు తీసుకొని లేచిపోతుంది. దానితో రాజాగౌడ్ దివాలా తీస్తాడు. అక్కడ ఇక్కడ తిరిగి చివరికి తన ఊరికి చేరుకుంటాడు. తల్లీ, భార్య, కొడుకు దగ్గరికి తీయడంతో కుటుంబం ఒక్కటవుతుంది. రాజాగౌడ్ ప్రతి విషయంలో డబ్బుకు ప్రాధాన్యం ఇవ్వడం కనబడుతుంది. డబ్బుకన్న ఆత్మీయత, ప్రేమ అనేవి ఉండాలని చివరికి అతని పాత్ర ద్వారా అర్థమవుతుంది.

### 3.2.1.2. దుర్గాప్రసాద్ (సంఘము)

ఇందులో ప్రధాన పాత్ర దుర్గాప్రసాదు. తల్లి బుచ్చమ్మ. తండ్రి చిన్నతనంలో మరణిస్తాడు. ప్రసాదుకు ఒక చెల్లె ఉంటుంది. పేరు శ్యామల. ప్రసాదు చిన్నతనంలో గ్రామం దగ్గర జరిగే

రామస్వామి జాతరకు తల్లి వద్దన్నా వినకుండా వెళ్తాడు. అక్కడే చీకటి పడటంతో తప్పిపోగా, ఒక ధనికుడు చేరదీసి, పాఠశాలకు పంపిస్తాడు. అక్కడ జోగేంద్రతో స్నేహం కుదురుతుంది. ఆ తరువాత జోగేంద్ర తండ్రి వచ్చి ధనికుడితో మాట్లాడి తీసుకెళ్లి జోగేంద్రతో సమానంగా పెంచి చదివిస్తాడు. ఆ విధంగా చదువును పూర్తి చేసుకున్న ప్రసాద్ లాయర్ అవుతాడు. ప్రసాద్ తన తల్లి చెల్లి కొరకు వెతకినా వారి ఆచూకి దొరకదు.

ప్రసాదు ఒకసారి జోగేంద్ర ఆసుపత్రికి వెళ్ళగా అక్కడ తన రూపురేఖలతో ఒక అమ్మాయి ఉందని చెప్తాడు జోగేంద్ర. ఆమె దగ్గరికి వెళ్ళి వివరాలు అడుగగా ఆమె తన చెల్లి శ్యామల అని తెలుస్తుంది. అంతేగాక తల్లి మరణించిందని తెలియడంతో ఎంతో బాధపడ్తాడు. కుటుంబ సభ్యుల మధ్య ఉండే ప్రేమానురాగాలు ఈ పాత్ర ద్వారా తెలుపుతాడు రచయిత.

దుర్గాప్రసాదు పద్మశాలీల జీవన విధానాన్ని గమనిస్తూ, డిపోదార్లు, మధ్యవర్తుల ద్వారా ఏవిధంగా మోసపోతున్నారో తెలిసి బాధపడ్తాడు. పద్మశాలీలను ఈ దోపిడి నుండి రక్షించాలని ప్రయత్నిస్తాడు ప్రసాదు. అందుకోసం సహకార సంఘాలను ఏర్పాటు చేసి నేరుగా నూలును వృత్తిదారునికి ఎలాంటి లోపాయకారం లేకుండా అందేలా చేస్తాడు. అంతేగాకుండా పద్మశాలీలలో విద్యాభివృద్ధికై, అందు స్త్రీ విద్యకై పాటుపడుతాడు. సంఘం ద్వారా సమావేశాలు ఏర్పాటు చేసి గ్రామాలలోని పద్మశాలీలలో చైతన్యం తేవడానికి ప్రయత్నం చేస్తాడు. బుక్కరావుపేటలో తన ఇంటి స్థలంతోపాటు పక్కన ఉన్న స్థలం కొని పద్మశాలీ భవనం కట్టిస్తాడు. గ్రామీణ విద్యార్థులకు హైదరాబాదులో 'పద్మశాలి భవనం'లో వసతి ఏర్పాటు చేసి ఉన్నత చదువులు చదివేలా ప్రోత్సాహం కలిగిస్తాడు. ఇలా అనేక కార్యక్రమాల ద్వారా పద్మశాలీల అభ్యున్నతి కాంక్షించే పాత్రగా రచయిత తీర్చిదిద్దాడు.

### 3.2.1.3. గోవింద్ (సుషుప్తి)

గోవిందు బాలయ్య, ఎంకమ్మల ఏకైక పుత్రుడు. గోవిందు బడికి వెళ్ళినా సరిగా చదవడు. ప్రభుత్వంవారు ఇచ్చే స్కాలర్‌షిప్ తండ్రి తాగుడుకోసమే వాడుకునేవాడు. గోవిందు తండ్రితోపాటుగా కుమ్మరి పని చేస్తుంటాడు. గోవిందుపై సినిమా ప్రభావం ఉండి తోటమాలిగా

పనిచేస్తూ, యజమాని కూతురిని పెళ్ళి చేసుకోవాలని అనుకుంటాడు. తోటమాలి పని ప్రయత్నాలు చేసి చివరకు తోటమాలి అవసరం ఎవరికి లేదని గ్రహిస్తాడు.

గోవిందుకు మేనమామ కూతురు ముత్యంతో వివాహం జరుగుతుంది. ఆ సమయంలో తన ఊహలలోని సినిమా హీరోయిన్‌కు, ముత్యంకుగల వ్యత్యాసం చూసి బాధపడతాడు. ముత్యం పదే పదే తల్లిగారింటికి పారిపోతూ ఉండటంతో ముత్యంతో తెగతెంపులు అవుతుంది.

షావుకారి తమ్ముడి కూతురు లత సైన్స్‌ఫేర్ మోడల్స్ కొరకు మట్టికోసం గోవిందు దగ్గరికి వెళ్తుంది. మట్టి కేవలం కుమ్మరి వారికే కాకుండా మిగతావాటికి కూడా ఉపయోగపడుతుందనే విషయం గోవిందు తెలుసుకుంటాడు. లత వాళ్ల టీచర్ దేవకిని చూసి ముగ్ధుడైపోతాడు. దేవకి ఇంట్లో పిల్లలు తయారు చేసిన కప్ప, మెదడు, పక్షిలాంటి ఆకారాలను చూసి ఆశ్చర్యానికి గురౌతాడు. దేవకిని 'దేవత' అని పిలుస్తూ ఆమెతో ఏదోవిధంగా మాట్లాడే ప్రయత్నాలు చేస్తుంటాడు. ఆమె టీ ఇచ్చినా, ఏదైనా మాట్లాడినా తనను ప్రేమిస్తుందనే భావనతో ఆమెను ఆరాధిస్తుంటాడు.

ఒకసారి గోవిందు మీనయ్య అంగీ, లాగు వేసుకొని దేవకికి చూపిద్దామని వెళ్తాడు. దేవకి ఇంటికి తాళం వేసి ఉంటుంది. రాత్రి సమయం కావడంతో చుట్టుపక్కల వాళ్ళు దొంగ అనుకొని కొడతారు. ఆ సందర్భంలో తాను మొదటిసారి అంగీ, లాగు వేసుకోవడంతో సిగ్గుపడటం, అనుకోని పరిణామానికి అతడు కంగుతింటాడు. ఇంతలో మీనయ్య వచ్చి ఆదుకుంటాడు. దేవకి తను చేసుకోబోయే భర్త గురించి, జీవితంలో ప్రణాళికల ప్రాధాన్యత గురించి చెప్పినపుడు గోవిందు బాధపడతాడు. తనకు ఎలాంటి ప్రణాళిక లేకుండా పెళ్ళి జరిగిందనే విషయాన్ని గ్రహిస్తాడు. తనలాంటివారికి దేవకిలాంటి వారిని ఇష్టపడటం కూడా పొరపాటనే విషయాన్ని తెలుసుకుంటాడు. సినిమాల గురించి ప్రస్తావించి దేవకిని అడిగినపుడు సినిమాలు, జీవితం ఒకటి కాదని ఆమె వివరిస్తుంది. దాంతో అక్కడినుండి వెళ్తాడు గోవిందు.

గోవిందుకు చుక్కతో రెండోపెళ్ళి జరుగుతుంది. చుక్క రావడంతో ఇల్లు అభివృద్ధిలోకి వస్తుంది. దావూద్ చుక్కతో అసహ్యంగా మాట్లాడటం తెలిసిన గోవిందు ఆ విషయాన్ని దావూద్ భార్యతో చెప్పి దావూద్‌ను తిట్టిస్తాడు. గోవిందు, చుక్కలకు కొడుకు పుట్టడంతో ఆనందంలో

ఉంటాడు గోవిందు. ఇంతలో వాయిదా డబ్బుల కొరకు వచ్చిన దావూద్ గోవింద్‌ను దావత్ అడుగుతాడు. గోవిందు ఇవ్వలేను అనడంతో దావూదే గోవిందును తీసుకెళ్ళి నిషా వచ్చే సారా తాగిస్తాడు. దావూద్ గోవింద్‌తో నీకు పెళ్ళై ఎన్ని నెలలు అని అడగగా ఎనిమిది నెలలు అని చెప్పడంతో ఎనిమిది నెలలకు పిల్లల్ని కంటె తల్లి బతకదనే విషయాన్ని విషంలా గోవిందు మెదడులోకి ఎక్కిస్తాడు దావూద్. ఇంటికి వచ్చిన గోవింద్ భార్యను కొట్టి అసలు విషయం చెప్పమనగా చుక్క చెప్తుంది. దాంతో చుక్కను ఇంట్లోంచి వెళ్ళగొడతాడు గోవిందు.

గోవిందు తాగుడుకు బానిసగా మారుతాడు. తల్లి చనిపోతుంది. బాగయ్య గోవిందుకు చెప్పి చుక్కను తీసుకొస్తాడు. కాని పిల్లవాణ్ణి చూస్తే గోవిందుకు విపరీతమైన కోపం వస్తుంది. దాంతో పిల్లవాణ్ణి దూరంగా ఉంచమనడంతో చుక్క తల్లికి అప్పగిస్తుంది. తాగుడుకు బానిసైన గోవిందు చుక్క తెచ్చే కంపమోపులతోపాటు ఇంట్లోని సామాను కూడా అమ్ముకుంటూ తాగుతాడు. ఇంట్లో తిండిలేక నీరసించి పోతున్న సమయంలో దావూద్ ఇచ్చిన అన్నం, డబ్బులు తీసుకున్న భార్యను చితకబాదడంతో దవాఖానలో పడుతుంది. అక్కడినుండి చుక్క ఎటుపోయిందో తెలియదు. ఇంతలో గోవిందు తండ్రి చనిపోవడంతో ఏకాకిగా మారి క్షీణించిపోతాడు.

మీనయ్య గోవిందును పట్నంలో దావూద్ దగ్గర పనిలో పెడతానని తీసుకెళ్ళి అక్కడ దావూద్ ఇంటిదగ్గర వదలడంతో గోవిందు ఇంట్లోకి వెళ్ళి అక్కడ తన భార్య చుక్కను చూసి నిశ్చేష్టుడవుతాడు. తనలో తన భార్యపట్ల విషాన్ని నింపిన దావూద్ చూసి అతను మాట్లాడిన మాటలతో ఖంగు తింటాడు గోవిందు.

గోవిందు చదువుపట్ల అనాసక్తి కలిగినవాడు, లోకజ్ఞానం తెలియని వాడుగా, తండ్రితోపాటు వృత్తినే చేసుకుంటూ బతికేవాడుగా, సినిమాలే నిజ జీవితాలని భ్రమలో బతికేవాడిగా, అమ్మాయిలు చనువుగా మాట్లాడితే అదే ప్రేమగా భావించేవాడుగా, సిగ్గుపడే వ్యక్తిగా, ఆలోచన లేకుండా ఇతరులు చెప్పిన దాన్ని నమ్మేవాడిగా, వారి చేతిలో మోసగింపబడే వ్యక్తి పాత్రే గోవిందు.

#### 3.2.1.4. చిప్పమల్లయ్య (గువ్వల చెన్నా)

మల్లయ్య చేనేత కార్మికుడు. తరతరాలుగా వస్తున్న మగ్గాలతో జీవనం సాగిస్తాడు. ఇతనికి భార్య లింగమ్మ, కొడుకులు రాజలింగం, వీరయ్య, శంకరయ్య. శంకరయ్యను చదివించి ప్రభుత్వ ఉద్యోగిగా చేస్తాడు. మల్లయ్యది భార్యకు పట్టుచీర కూడా కోనియ్యలేని స్థితి. రాజారావు దొరకు ధోతులు నేసి, తీసుకెళ్ళినపుడు అతనితోపాటుగా అక్కడున్నవారు కులంపేరుతో, ఇంటి పేరుతో చేసే హేళనలు, అవమానాలు అనుభవిస్తాడు. పెద్దకొడుకు రాజలింగం భీవండికి వెళ్ళి బతుకుతానంటే అంతదూరం వద్దని అంటాడు. భీవండికి వెళ్ళిన రాజలింగం మత అల్లర్లలో చనిపోయినపుడు బాధతో కుంగిపోతాడు.

వృత్తిపట్ల నిబద్ధత, ప్రేమ కల్గిన వ్యక్తిగా మల్లయ్య కనబడుతాడు. వినాయక చవితికి వృత్తి పనిముట్లను కడిగి పూజలు చేస్తాడు. కొడుకులు పెద్దవారై, మనవండ్లు వచ్చిన తను చేసే పనిని వదలడు మల్లయ్య. వీరయ్య కొడుకు దుబాయ్ వెళ్తానన్నపుడు రాజలింగం గుర్తుకువచ్చి కన్నతల్లిని, ఉన్న ఊరును వదిలిపోవద్దని సలహా ఇస్తాడు. వృత్తి పనులలో ఆధునిక యంత్రాలు వచ్చాయని, వాటి ద్వారా బతుకుదామని లక్ష్మీరాజం అన్నపుడు అందులో ఉన్న ఖర్చులు అధికమని, కష్టాలు కూడా ఉంటాయని కూడా చెప్తాడు. రైతు వ్యవసాయం మానేస్తే ఎంత ఇబ్బందో నేతవారు కూడా అదే విధంగా ఉండాలని వృత్తిపట్ల గౌరవాన్ని ప్రకటిస్తాడు.

రాజలింగం కొడుకు శ్రీరాంకు వేములవారి అమ్మాయిని యిస్తానని వచ్చినపుడు మల్లయ్య సంతోషానికి హద్దే ఉండదు. దానికి కారణం మల్లయ్యది పేద కుటుంబం. వేములవారిది నిజాం కాలంలో వతన్‌ల పని చేయడమేకాక, ధనిక కుటుంబం. చిప్పమల్లయ్య నాలుగు తరాలు చూస్తాడు. దొరలతరం, ఫ్యూడల్ దొరల ఆధిపత్యాన్ని అనుభవించాడు. నైజాం పాలన మరియు స్వాతంత్ర్యం వచ్చాక చిల్లర దేవుళ్ళ పాలనను చూసాడు. అంతేగాక వలసలను, పారిశ్రామికీకరణ ద్వారా వృత్తులు పతనం కావడాన్ని చూసాడు.

మల్లయ్య నేతవృత్తిపట్ల నిబద్ధత, గౌరవం కలిగిన వ్యక్తి. తన పరిస్థితినిబట్టి ఒకరిని చదివించగలిగాడు. కన్నతల్లిని, ఉన్న ఊరును విడదీయరాదని నమ్మే వ్యక్తి. నేత పనిలో అధిక లాభాలు చూడకుండా అది ఒక ధర్మంగా చేయాలనే పాత్ర మల్లయ్యది.

### 3.2.1.5. నారాయణ (సంకెళ్ళు తెగాయి)

నారాయణ విద్యార్థి. తల్లిదండ్రులు వీరయ్య, రంగమ్మ. ముగ్గురు చెల్లెళ్ళు. నారాయణకు చదువంటే ఆసక్తి ఉంటుంది. నారాయణకు ఎక్కువగా స్నేహితులు ఉండరు. నారాయణ చదివే కాలేజిలో ఊరి దొర కొడుకు రామేశ్వరరావు కూడా చదువుకుంటాడు. కాని అతను ఇతనిపట్ల అసహ్యభావం ప్రకటిస్తూ ఉంటాడు. దానితో నారాయణ వారికి దూరంగా ఉంటూ తనపని తాను చేసుకొనేవాడు. ఇలా దొరల చిన్నచూపు చిన్నప్పటి నుండి భరిస్తాడు. రామేశ్వరరావు వాళ్ళ స్నేహితులు ఆటలు ఆడుకునే అవకాశం ఇవ్వరు. ఆట వస్తువులను పట్టుకొని ఆనందించేవాడు నారాయణ. కలలో వాటి  ఆడుకుంటున్నట్లు కలవరించేవాడు. ఇలా పేదరికంలో ఉన్న పిల్లల పరిస్థితిని ఈ పాత్రద్వారా రచయిత్రి స్పష్టం చేసింది.

నారాయణ చదువుకునే కాలేజి హిస్టరీ లెక్చరర్ వేదప్రకాశ్ అంటే అభిమానం. వేదప్రకాశ్ బోధన నారాయణను ఆకర్షించింది. అంతేగాక హిస్టరికి సంబంధించిన అనేక విషయాలు చెప్పడంతోపాటు అనేక పుస్తకాలు వారి దగ్గర వుండేవి. అవి చదువుకోవడానికి నారాయణకి ఇచ్చేవాడు. వేదప్రకాశ్ భార్య సుమిత్ర కూడా నారాయణను పుత్రవాత్సల్యంతో ఆదరించేది. నారాయణ తనకు వచ్చిన అనుమానాలను వేదప్రకాశ్‌తో చర్చించి నివృత్తి చేసుకునేవాడు. ఆ చర్చల్లో కులం గురించి వేదప్రకాశ్ పడుతున్న బాధలు వుండేవి. ఈ చర్చల్లో సమాజంలో కొంతమంది ఉన్నతమైనవారు మరికొందరు అనిమ్నమైన వాళ్ళని మరికొందరు అంటరాని వాళ్ళుగానే భేదాలున్నాయి. ఆ భేదాలు ఇప్పటికి ఉన్నాయి. ఈ వ్యవస్థలో మార్పు ఎప్పుడు వస్తుందని ఆశించే వ్యక్తి నారాయణ. నారాయణ వ్యక్తిగతంగా ఎన్నో బాధలు అనుభవించాడు. నారాయణ ఊరి దొర కూతురు సుశీలమ్మ అమెరికాలో వుండి వచ్చినామె నారాయణను చూసి నారిగా! మంగలిషాపు పెట్టుకో అని అనడం. ఈ విధంగా విజ్ఞానం పెరిగి విదేశాలకు వెళ్ళిన వారు కూడా ఇలా ఏ కులంలో పుట్టినారు కులవృత్తియే చెయ్యాలన్న ఆలోచనలో ఉండడం వారి సంకుచిత స్వభావాన్ని తెలుపుతుంది.

నారాయణ, వేదప్రకాశ్, సుమిత్రలతో ఒకరోజు సత్యానందతీర్థుల ఆశ్రమానికి వెళతాడు. అక్కడి ఉపన్యాసాలు వింటుండేవాడు. విగ్రహారాధన లేకపోవడం, యజ్ఞయాగాదులు చేయడం మాత్రమే ఉంటుంది. పురోహిత్యంలాంటి వాటిని నిషేధించడం ఇవన్ని చూసి ఎన్నో విషయాలు నేర్చుకుని ఆర్థం పర్థంలేని ఉత్సవాలతో మనుషులను మోసం చేయవద్దని గ్రహిస్తాడు.

నారాయణ డిగ్రి ఫైనల్ ఉన్నప్పుడు స్టూడెంట్ ఎలక్షన్ విద్యార్థి నాయకుడిగా తోటి స్నేహితుల ప్రోద్బలంతో పోటీ చేస్తాడు. కాని రామేశ్వరరావు డబ్బు బలంతో గెలుస్తాడు. ఇక్కడ ధనవంతుడే గెలుస్తున్నాడు. పేదవానికి మంచితనానికి గుర్తింపులేదని తెలుస్తుంది. ఎలక్షన్ల సమయంలో అనల నారాయణకు సపోర్టుగా ఉంటుంది.

కులాల సంకెళ్ళు తెగాలని ఎవరు ప్రయత్నం చేయటం లేదని, అవి రోజురోజుకు ఎక్కువవుతున్నాయని నారాయణ ఆవేదన చెందుతాడు. వేదప్రకాశ్ ప్రాచీనకాలం నుండి మతాచార్యులు ఎంతోమంది నిరసించారు. మహావీరుడు, బసవేశ్వరుడు, ఆధునికకాలంలో రామమోహనరాయ్ లాంటివారు కాని బసవేశ్వరుని వంటి వాళ్ళు శివుని భక్తి ఒకటి మనుషుల్లో భేదాలు లేవన్నాడు. ఇతన్ని అనుసరించిన వారు తిరిగి ఒక కులంగా ఏర్పడ్డారని ఈ కులం విచ్ఛిన్నం కావాలంటే పారిశ్రామికీకరణ, సాంకేతికతయే ప్రధానం అని అంటాడు. ....

అనల నారాయణ ఊరికి వచ్చినప్పుడు దొర రాజేశ్వరరావు ఇంటికి వెళ్తారు. అనల కుర్చిలో కూర్చుంటుంది. రాజేశ్వరరావు, ఆయన భార్య మాటల్లోని వ్యత్యాసాలను విని బయటకు వచ్చాక నారాయణతో నువ్వుకూడా కుర్చిలో కూర్చోలేవా? అని అడుగుతుంది. దానికి నారాయణ తరతరాలనుండి వస్తున్న సంప్రదాయం నేను పోయి కుర్చిలో కూర్చున్నంత మాత్రాన సమాజంలో అతనితోపాటు సమానమైన హోదారాదు. ఒకవేళ కూర్చున్న అవమానిస్తారని చెప్తాడు. ఈ సంఘటన ద్వారా సమాజంలోని మనుషుల మధ్య వ్యత్యాసాలు ఏ విధంగా ఉన్నాయో తెలుస్తుంది.

నారాయణ డిగ్రి పూర్తి చేసుకొని ఎం.ఎ హిస్టరిలో యూనివర్సిటిలో సీటు వస్తుంది. మంచి విద్యార్థిగా ఇక్కడ అందరి అధ్యాపకుల మన్ననలు పొందుతాడు. అనల తండ్రి IAS కి ప్రిపేర్ కమ్మని సలహ ఇవ్వడం జరుగుతుంది. అనల నారాయణకి ఏ విధంగానైన సహాయం

చేయాలనే ఉద్దేశంతో కోచింగ్ సెంటర్‌లో ఇద్దరికి తనే ఫీజుకట్టడం జరుగుతుంది. నారాయణ ప్రిలిమ్స్ సెలెక్ట్ అయ్యి  Main Exams రాసి ఫలితాల కోసం ఎదురు చూసే సందర్భంలో చెల్లెలి భర్త రాజయ్య పోలీసుల ఎన్‌కౌంటర్‌లో చనిపోవడం. ఉద్యోగంకోసం తిరిగినవాడు ఎప్పుడు దళంలో చేరాడో తెలియదు. ఈ సంఘటనతో కుటుంబంలో కొంత అల్లకల్లోలం జరుగుతుంది. పోలీసులు నారాయణతోపాటు ఇంటి దగ్గర వాళ్ళను బాగా వేధించడం జరుగుతుంది. నారాయణ IAS Main Exams కూడా పాసై ఇంటర్యూకు సెలెక్ట్ అవుతాడు. అనల తండ్రి ఆనందరావు ఫ్రెండ్ అనంతశర్మ ఢిల్లీలో ఉంటారు. అనంతశర్మ సహకారంతో ఇంటర్వ్యూ పూర్తి చేసి వస్తాడు. నారాయణ IAS కి సెలెక్ట్ కావడం జరుగుతుంది. నారాయణ తల్లిదండ్రులు అనుకోకుండా హైదరాబాద్‌కి వస్తారు వారిని వేదప్రకాశ్ దగ్గర ఉంచడం. అనల, నారాయణలు ప్రేమతో ఒక్కటవుతారు.

**3.2.1.6. నారాయణగౌడ్ (బతుకుతాడు)**

నారాయణగౌడ్ ధర్మయ్యగౌడ్ రెండవ కొడుకు. నారాయణగౌడ్ భార్య లక్ష్మి. కొడుకులు శ్రీనివాస్‌గౌడ్, తిరుపతి, కూతుర్లు గంగవ్వ, మంగవ్వ. నారాయణగౌడ్ గౌడకులవృత్తియైన కల్లు అమ్మి జీవనం గడుపుతాడు. ఆర్థికంగా వెనకబడిన వ్యక్తి. గౌడ సంఘం ఉద్యమాలపట్ల అవగాహన కల్గినవాడు. లక్ష్మణరావు పటేల్‌కు కల్లు పోయలేదని తనను వాళ్ళ పందిరి గుంజకు కట్టేసి కొట్టిన, అతని దౌర్జన్యాన్ని ఎదురించలేని వ్యక్తి.

నారాయణగౌడ్ రామక్కపల్లెలో కల్లు మాములు పడుతాడు. అక్కడ జనాభా తక్కువ, ధర్మపురికి వెళ్ళి అమ్మిన అతనికి ఆదాయం మిగలక నష్టపోతాడు. భార్య లక్ష్మి మెడలోని బంగారం అమ్మి పన్ను కడతాడు. ఈ పరిణామంతో తను వేరే ఊరికిగాని, తన అన్న భూమయ్యగౌడ్ బొంబాయిలో కల్లు దుకాణం పెట్టిస్తా రమ్మని అడిగినా అతడు వెళ్ళడానికి ఇష్టపడడు. స్వగ్రామంలోనే కులవృత్తి చేసుకుంటూ బ్రతుకుతాడు.

నారాయణగౌడ్ ఇంట్లో ఒక్కొక్కసారి తినడానికి తిండి కూడా ఉండని పరిస్థితి. వాడుక దారుడు గంగన్న బియ్యం ఇవ్వగా వాటితో ఇల్లు గడపడం లాంటి సంఘటనలు ఈ పాత్రలో

కనబడుతాయి. భార్యకు తీవ్రమైన జ్వరం వచ్చిన ఆమెకు బాగుచేయించలేని స్థితి. లక్ష్మీ అమ్మనాన్నలు వచ్చి ఆమెను తీసుకెళ్ళి ఆరోగ్యం బాగయ్యాక పంపుతారు. ఇలాంటి స్థితిలో అప్పులు చేయాల్సిన పరిస్థితి నారాయణది. అందులో వూరెళ్ళ లింగక్క ఒకరు.

నారాయణగౌడ్ వూరెల్ల లింగక్క అప్పు తీర్చలేకపోవడంతో ఇంటికి తాళం వేస్తుంది. చివరికి దున్నపోతులు అమ్మి అప్పు తీరుస్తాడు నారాయణగౌడ్. బాలారాజు అనేవ్యక్తి నారాయణగౌడ్ దగ్గర వాడికదారుడు. వర్షం కారణంగా కల్లు లేదని చెప్పినా వినకుండా, తాడిచెట్టుపై ఉన్న నారాయణగౌడ్‌ని రాళ్ళతో కొడుతూ, తిడుతుంటాడు. అతనికి ఓపికతో సమాధానం చెప్తూ, తాటిచెట్టు దిగనియ్యమని ప్రాదేయపడతాడు.

గౌడ జెట్టీలు గౌడవృత్తిదారులను ఆశ్రయించుకొని జీవించే వృత్తి కళాకారులు. వీరు వచ్చినపుడు రెండు గ్రామాల గౌడ కులస్తులు కలిసి ఒకేచోట ఆటలు ఆడించాలనుకుంటారు. నారాయణగౌడ్ తన వూర్లో ఆడియ్యాలన్నపుడు ఒక్కరి కోసం మీ వూరికి ఎలా వస్తారని అనడంతో, నారాయణగౌడ్ ఆవేశంతో తన వూర్లో ఒక ఆట ఆడిస్తాడు. దానికొరకు తన ఆవును అమ్ముకుంటాడు. ఆర్థికంగా వెనకబడివున్నా, తమ పురాణాల పట్ల అభిమానం ఉన్న వ్యక్తి నారాయణగౌడ్.

నారాయణగౌడ్ కొడుకు శ్రీనివాస్‌గౌడ్ తాళ్ళు ఎక్కడంతో కొంత ఆర్థికంగా ఎదుగుతారు. శ్రీనివాస్‌గౌడ్ పెళ్ళి సందర్భంలో కట్నం దగ్గర తండ్రి మాటను కాదనటంతో, నారాయణగౌడ్ బాధపడటం జరుగుతుంది. కొడుకు పెండ్లయ్యాక అతనిని వేరే కాపురం ఉంచుతాడు.

జగిత్యాల గౌడ సంఘంవారు పెట్టే ఇబ్బందుల నుండి, తమ మాముల వేరు చేసుకోవాలని ప్రయత్నాలు చేస్తుంటారు. నారాయణగౌడ్ ప్రభుత్వ కార్యాలయాలు తిరిగి తిరిగి, చివరకు zptc జితేందర్ సహాయంతో సొసైటీ సాధిస్తాడు. ముందు అనుకున్న ప్రకారం నారాయణగౌడ్ పెట్టిన ఖర్చులు చెల్లించమంటాడు. ఎవరూ చెల్లించరు. తరువాత నారాయణగౌడ్ ఆవులను మేపుకుంటూ జీవనం సాగిస్తుంటాడు.

గౌడ వృత్తిదారుడిగా, ఊరుని వదిలి వెళ్ళలేని వ్యక్తిగా, వృత్తి పనిలో ఉండే ఇబ్బందులను ఎదుర్కొన్నవాడిగా, సంఘం ఏర్పాటులో తన డబ్బు పెట్టినపుడు తోటి వృత్తిదారుల చేత మోసగించబడిన వాడిగా నారాయణగౌడ్ పాత్ర చిత్రించబడింది.

### 3.2.1.7. మోహిని (మోహిని)

మోహిని తల్లిదండ్రులు సుందరమ్మ, కాటమయ్య. డిగ్రీ వరకు చదువుకుంటుంది. సామాజిక చైతన్యం కల్గిన స్త్రీ. 'గీతపరిశ్రమ' పత్రిక సంపాదకురాలు. మోహిని గుణవంతురాలేగాక, అందమైనది కూడా. తండ్రి ద్వారా మంచి వ్యక్తిత్వం గల స్త్రీగా తీర్చిదిద్దబడుతుంది. మధ్యపాన నిషేధ ప్రకటన సమయంలో గీతవృత్తిదారుల మహాసభలో ప్రధాన వక్తగా మట్లాడటం, గీతవృత్తి నాయకుల చర్చలలో భాగస్వామ్యం కల్పించడంతోపాటు, ఆమె నిర్ణయాన్ని అందరూ ఆమోదించడం జరుగుతుంది. ఇక్కడ మోహిని సమర్థత, విషయంపట్ల అవగాహన కల్గిన వ్యక్తిగా కనబడుతుంది.

గౌడ నాయకులు ఎన్నికల సందర్భంలో తమ సమస్యల పరిష్కారం రాజకీయంగానే అవుతుందని, భావించినప్పుడు చర్చ ఏర్పాటు చేస్తారు. ఆ సందర్భంలో మోహిని మనం తీసుకునే నిర్ణయాలు మన జాతికి మేలు చేసేలా వుండాలని అంటూ కొత్త పార్టీలను ప్రజలు ఆదరిస్తారని ఇప్పుడు మంచి ఆశయాలతో కొత్తపార్టీ ఒకటి వచ్చింది. అందులో చేరి మన జాతికి మేలు జరిగేలా చేద్దామంటుంది. ఇక్కడ మోహినికి రాజకీయ దృక్పథం, ప్రజలకు సేవ చేసే పార్టీని ప్రస్తావించడం ఆమెలోని అవగాహనను తెలుపుతుంది. మోహిని ఎంఎల్ఏగా గెలిచి మంత్రి కావడం, తదుపరి మద్యపాన నిషేధ చర్చలో ప్రధాన పాత్ర పోషించి కల్లుని మినహాయించడంలో, ఆమె సమర్ధతను గుర్తించవచ్చు.

పెళ్ళి విషయంలో చైతన్యతో తన అభిప్రాయాలు చెప్పి అందంకోసం, సుఖాలకోసం కాకుండా ఆదర్శం కోసమే తను పెళ్ళి చేసుకుంటానని చెప్పుతుంది. సంప్రదాయ వివాహాలకు స్వస్తి చెప్పి, స్టేజి పెళ్ళిలకు పునాది వేస్తుంది. ఈమెను ఆదర్శంగా తీసుకొని దళితులు వివాహాలు చేసుకోవడంతో సంతోషిస్తుంది. నేటి సమాజానికి ఒక ఆదర్శ మహిళగా మనకు ఈ పాత్ర

కనబడుతుంది. మోహిని గీత పరిశ్రమ సంపాదకురాలిగా, గీతకార్మికుల సమస్యలపై పోరాడిన స్త్రీగా, ఆదర్శ వివాహం చేసుకుని వాటిని ప్రోత్సహించే మహిళగా కనబడుతుంది.

### 3.2.1.8. కక్క (కక్క)

ఈ కక్క నవలలో ప్రధాన పాత్ర కక్క. ఈ నవలలో కక్క పాత్ర ఆది నుండి అంతం వరకు కొనసాగుతుంది. కక్క మాదిగ కులానికి చెందినవాడు. ఇందులో కక్క పాత్ర నిరక్షరాస్యునిగా చిత్రించబడింది. కక్కడు బాల్యం నుండే భూస్వాముల దగ్గర జీతం ఉంటాడు. బాల్యం నుండే ఇతనికి ఆధిపత్య కులాలపై తిరగబడే స్వభావం కనబడుతుంది.

కక్క అమ్మ కలెమ్మ. కలెమ్మకు ఊరివారందరూ అక్రమ సంబంధం అంటగట్టి నిందవేసి, వెలి వేస్తారు. అప్పుడు తల్లి మోసిన నిందలు, తాను పడిన బాధలను దిగమింగుకొని ఎంతో ధైర్యంతో తల్లి పెళ్ళి చేస్తాడు. "కొడుకు పుట్టి తల్లి పెళ్ళి చేసినాడు" అని కక్కనిమీద ఊరి వారందరూ ఆడిపోసుకుంటారు.

కక్క సాధారణ పటేలు దగ్గర జీతం చేసేవాడు. అతను పెద్దపెద్ద భూస్వాముల వద్ద జీతం చేయాలని అనుకునేవాడు. మాద్గిర్కం చేయాలని ఫకీరు తాతను కలిసి మాద్గిర్కంలో ఉన్న కష్టసుఖాలను గూర్చి తెలియజేయమంటాడు. ఫకీరు తాత దానికి సంబంధించి డప్పు కొట్టడం, చెప్పులు కుట్టడం వంటి పనులు నేర్పుతాడు. దళితులు కుల వృత్తులు చేయడానికి పడిన ఆరాటాన్ని కక్క పాత్ర ద్వారా రచయిత చిత్రించాడు.

ఫకీరు తాత కక్కకు మాద్గిర్కం పనులు నేర్పించే సమయంలో తన మనుమరాలు లస్మి కక్కను ఇష్టపడుతుంది. ఇదంతా గమనించిన ఫకీరుతాత కక్కకు లస్మికి పెళ్ళి చెస్తాడు. వీరి పెళ్ళిలో జరిగిన గొడవలో అగ్రవర్ణాలు దళితులపై దాడి చేస్తారు. దళితులపై దాడి, కక్క బాధపడే సందర్భాన్ని రచయిత చక్కగా వివరిస్తాడు.

కక్క పెళ్ళిలో జరిగిన గొడవల కారణంగా ఫకీరయ్య చనిపోతాడు. ఆ ఊరి కుల జనాభా ప్రాతిపాదికన సర్పంచ్ పదివి దళితులకు వస్తుంది. ఆ విషయం తెలుసుకున్న అగ్రకులస్తులు ఫకీరయ్యను సర్పంచిని చేస్తారు. కానీ ఆ విషయం ఫకీరయ్యకే తెలియకుండా అగ్రకులస్థులు

రాజ్యమేలుతారు. ఇదంత ఫకీరయ్య చనిపోయిన తర్వాత తెలుస్తుంది. ఇదంతా కక్కడు తెలుసుకుంటాడు. కొంతమంది కులస్థులతో పటేలు దగ్గరకి వెళ్ళి అధికారం మాది అని తిరగబడే విధానాన్ని రచయిత చక్కగా తెలియజేశాడు.

దళితుల సంస్కృతిలో భాగంగా భాగోతాన్ని కూర్చుకుంటారు. ఆ భాగోతం పేరు మైసాసుర వధ. కక్క పాత్ర మైసాసురుడు ఈ కక్క పాత్ర ద్వారా రచయిత దళితుల్లో కళలను బయటకు తీశాడు.

మైసాసుర పాత్రను కక్క ద్వారా ఈ విధంగా చిత్రించబడింది.

> "బూతాలంబన మహాక్యాతికెక్కిన సూర
> క్యాతినీ మంటలు బంతులు దిర్గంగా
> మంటల్ల బుట్టిన మహారాజుడిరా
> ఆహా ఆహా వీరాది వీరుడిరా
> అసుర జాతి నేను
> జన్మనెత్తినాడు రచ్చసి ముద్దు బిడ్డ నేను ఆహా ఆహా
> మందిబల్గం మెచ్చ మైసాసురడిరా"

ఈ భాగోతాన్ని కక్క అతని సహచరులు నేర్చుకుంటారు. కానీ అగ్రకులస్థులు ఆడనివ్వలేదు. ఆట ప్రారంభమయ్యే సమయానికి కక్కను దొంగలు ఎత్తుకుపోయి కాళ్ళ పిక్కలు కోస్తారు. దళితులు పటేళ్ళపై కేసు పెడతారు. విచారణ నిమిత్తం R.D.O మరికొంతమంది అధికారులు గ్రామానికి వస్తారు. దళితులు తమకు కనీసం నివాసయోగ్యమైన భూమి కూడా లేదు అని అధికార్లతో తమ బాధను వెల్లబుచ్చుకుంటారు. అధికారులు భూమి పట్టాలిస్తామని ప్రకటన చేస్తారు. పటేళ్ళు లేచి తమ తండ్రులు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో లీడర్లుగా వుండి ఈ భూమి సంపాదించారు. కనుక ఈ భూమిపై దళితులకు హక్కు లేదని అంటారు. అప్పుడు కక్కడు లేచి దళితులు లేకుండా మీ తండ్రులు ఎలా పోరాటం చేశారు? లీడర్లు ఎలా అయ్యారు? అని అడుగుతాడు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో దళితుల పాత్రను కక్క పాత్ర ద్వారా రచయిత తెలియజేశాడు.

### 3.2.1.9. ధర్మభిక్షం (కల్లుముండువ)

ధర్మభిక్షం గౌడ వృత్తి కుటుంబానికి చెందినవాడు, అన్యాయాన్ని ఎదురించే స్వభావం కల్గిన వ్యక్తి. చిన్నతనంలోనే బడిలో ప్రధానోపాధ్యాయుడు తప్పు చేస్తే అతన్ని శిక్షించాలని ధర్నా చేస్తాడు. అధికారులు హామీ ఇవ్వడంతో ధర్న విరమిస్తాడు. నిరక్షరాస్యత, అజ్ఞానం వల్ల ప్రజలలో చైతన్యం లేదని గ్రహిస్తాడు. వృత్తిదారులందరిని ఏకం చేసి సంఘాన్ని ఏర్పాటు చేసి, సమస్యలను పరిష్కరించాలని అనుకుంటాడు. అందుకోసం మారయ్య ఇంట్లో సమావేశం ఏర్పాటు చేసి  గౌడ వృత్తిదారులలో చైతన్యాన్ని పెంపొందిస్తాడు. వేరే గ్రామంలో కాటమయ్య పండుగ చేసుకుంటున్న సమయంలో వారిలో ఆచార వ్యవహారాల పేరుతో చైతన్యం తీసుకరావచ్చని అనుకుంటాడు. అందరిని ఒకచోటికి పిలిచి వెంకయ్య తాత ఒక్కడే అందరికి వినబడేలా అందరూ బాగుండాలని కోరుకుంటాడు. అందరూ మనసులో కోరుకుంటారు. కేవలం దేవుడిమీద నమ్మకమే కాదు మనవంతు ప్రయత్నం చేసినప్పుడే అవి పరిష్కారమవుతాయి. అందరూ కలిసికట్టుగ ఉండి సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసి వాటిని పరిష్కరించుకుందామని అందరిని ఐక్యం చేస్తాడు.

ఈ విధంగా గీతకార్మికులలో ఐక్యత తెచ్చి జిల్లాస్థాయి వేలం పాటలు లేకుండా చేసి, గ్రామస్థాయి వేలం పాటలను సాధిస్తారు. ఇవేగాక గీతకార్మికుడు చెట్టుపై నుండి పడినప్పుడు మరణించిన లేదా వికలాంగులైనా ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించేలా సూర్యాపేట సభ ద్వారా సాధిస్తారు. ఎక్స్‌గ్రేషియా కేసులు పెండింగ్‌లో ఉండటంతో వివిధ జిల్లా నాయకులతో సమావేశమై అన్ని జిల్లాల కలెక్టర్ ఆఫీసుల ముందు ధర్నాలు నిర్వహించి వాటిని పరిష్కరిస్తాడు. ప్రభుత్వం మద్యపానం నిషేధించినప్పుడు కల్లును మినహాయించేలా చేసుకుంటారు.

విశాఖపట్నం మహాసభలో ధర్మభిక్షం ప్రధాన వక్తగా గీత వృత్తి గురించి అబ్కారి చట్టాల గురించి ప్రసంగిస్తాడు. వీరభద్రరావు మనవడు కిరణ్‌కు తాటి ఉత్పత్తుల ఉపయోగం మరియు ఉపాధి, ఆర్థిక సంబంధమైన విషయాలు వివరంగా చెపుతాడు ధర్మభిక్షం. రియల్ ఎస్టేట్ వారి నుండి తాటి వనాన్ని రక్షించడానికి ఐక్య కార్యచరణ ప్రకటిస్తాడు. వృత్తిని రక్షించి, వనాన్ని రక్షించాలని కోరుకుంటాడు ధర్మభిక్షం.

అన్యాయాన్ని ఎదురించే వ్యక్తిగా, దొరలు, భూస్వాములు, పెద్ద ముస్తాజుదార్ల చేతుల్లో అణచి వేయబడుతున్న గీతకార్మికులను ఐక్యం చేసిన విజయం సాధించిన వ్యక్తిగా, తాటి ఉత్పత్తులపై సరైన అవగాహన కల్గిన వ్యక్తి  ధర్మభిక్షం కనబడుతాడు.

### 3.2.2. ఆదర్శ పాత్రలు

#### 3.2.2.1. బాలాగౌడ్ (పెరటిచెట్టు)

బాలాగౌడ్ తల్లిదండ్రులు గంగమ్మ, రాజాగౌడ్. తండ్రి నాగపూర్‌లో స్థిరపడడంతో ఇతన్ని అక్కడికి తీసుకెళ్ళి చదివిస్తాడు. చిన్నమ్మ ప్రవర్తన నచ్చని బాలాగౌడ్ ఒక సందర్భంలో ఇంట్లోకి వచ్చిన వ్యక్తితో మా నాన్నలేని సమయంలో రావద్దని అంటాడు. దాంతో చిన్నమ్మ చెప్పిన మాటలు నమ్మి తండ్రి తిట్టడంతో అమ్మ దగ్గరికి చేరుకుంటాడు బాలాగౌడ్. విద్యపట్ల ఆసక్తి, సామాజిక సమస్యలపట్ల అవగాహన కల్గిన వ్యక్తిగా మనకు కనిపిస్తాడు బాలాగౌడ్.

గ్రామంలోని గౌడ కులస్తుల పరిచయంతో వారి పరిస్థితులను అర్థం చేసుకుంటాడు. నాగపూర్‌లో ఉన్న గౌడ సంఘాల కృషి గురించి తెలిపి, వాటి వలన కలిగే ప్రయోజనాలు వివరిస్తాడు. గీతవృత్తిదారులలో చైతన్యం తీసుకొస్తాడు. కొత్తూరులో గౌడసంఘం శాఖను ఏర్పాటు చేస్తాడు.

బాలాగౌడ్ గీతవృత్తిదారుల సమస్యలపై ఒక కరపత్రం విడుదల చేస్తాడు. అందులో మాములాలుపట్టి చేసేవారి మోసాలను, అబ్కారి అధికారుల లంచాలు, ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతున్న విధానాన్ని వివరిస్తాడు. ఈ సంవత్సరం గీతవృత్తివారు మాములా పట్టవద్దని 'గీచేవారిదే చెట్టు' కావాలంటాడు. ఈ విషయం తెలిసి పోలీసులు బాలాగౌడ్‌ని అరెస్టు చేస్తారు. అప్పుడు బాలాగౌడ్ నానమ్మతో "గాంధీ, నెహ్రూలు స్వాతంత్ర్యం కోసం జైలుకు వెళ్ళారు. అదే విధంగా తను కూడా మంచిపనికోసమే జైలుకు వెళ్తున్నానని" చెప్తాడు. కేంద్ర సంఘం ఒత్తిడితో విడుదలై ఊరేగింపుగా రావడం, తండ్రి రాజాగౌడ్ కనిపించడంతో అతన్ని హత్తుకొని ఇంటికి తీసుకెళ్ళడం జరుగుతుంది.

బాలాగౌడ్ విద్యావంతుడిగా, గౌడవృత్తిదారుల సమస్యల పరిష్కారానికై పోరాడిన వ్యక్తిగా, గౌడ సంఘాల ఆవశ్యకతను తెలిపే పాత్రగా కనబడతాడు.

### 3.౽.౽.౽. జోగేంద్ర (సంఘము)

ప్రసాదును ఆదరించిన మిత్రుడు. ధనవంతుల కుటుంబమైన తోటివారిపట్ల ప్రేమానురాగాలు గల వ్యక్తిగా మనకు కనబడుతాడు. జోగేంద్ర డాక్టర్. నల్గొండలో ఆసుపత్రి నెలకొల్పి తన సేవలను అందిస్తుంటాడు. పేదలకు ఉచితంగా వైద్యం చేస్తాడు. సున్నితమైన మనస్తత్వం, తోటివారి బాధను చూసి చలించే వ్యక్తిగా మనకు కనబడుతాడు. తోటి మిత్రుల్ని ఆదరించడమేకాదు తనతోపాటు చదివించి ఉన్నతున్ని చేస్తాడు. ప్రసాదు చెల్లెని వివాహమాడుతానని, పేద స్త్రీని పెళ్ళి చేసుకొని వారికి చేయూత నివ్వాలనే దృఢ సంకల్పం కల్గిన వ్యక్తి. ఆ విధంగా ప్రసాదు చెల్లె శ్యామలను పెళ్ళి చేసుకొంటాడు.

పేదవారిని ఆదరించే వ్యక్తిగా, ఉచిత వైద్యాన్ని అందించే వైద్యుడిగా, పేద అమ్మాయిని పెళ్ళాడిన ఆదర్శవంతుడిగా, మంచి మిత్రుడిగా జోగేంద్ర పాత్ర చిత్రించబడింది.

### 3.౽.౽.3. నర్సయ్య (సంఘము)

నర్సయ్యది చేనేతవృత్తి. సున్నిత మనస్తత్వం కల్గిన వ్యక్తి. తోటి వారికి ఏదైనా ఆపద వస్తే ఆదుకునే వ్యక్తిత్వం కల్గిన వ్యక్తి. కుల పెద్దమనుషులు అనుసరించే విధానాలను వ్యతిరేకించేవాడు. బుచ్చమ్మ విషయంలో భర్త లేని స్త్రీకి జరిమాన విధించడం దారుణమని అంటాడు. కుల పంచాయితీల ద్వారా వచ్చే ఆదాయాన్ని పేదలకు, బుచ్చమ్మలాంటి వారికి తోడ్పాటు ఇవ్వడానికి, ఏదైన సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించాలంటాడు.

వెంకయ్య అనే పద్మశాలిని  ఆదుకోవడంలాంటి సంఘటనలతోపాటు, దొరలకు కోళ్ళను, గుడ్లను ఇచ్చే వెట్టి పద్ధతిని వ్యతిరేకించే వ్యక్తిగా కనిపిస్తాడు. పద్మశాలీలకు ఒక్కపూట తినడమే

కష్టంగా మారిందని అలాంటి సమయంలో దొరలకు కోళ్ళను, గుడ్లను ఇవ్వలేని స్థితిని చూసి బాధపడ్తాడు.

నర్సయ్య మీద ఎవరో దొరతో చెడుగా చెప్పినప్పుడు దొర పిలిపించి అడుగగా పద్మశాలీల పరిస్థితి దయనీయంగా ఉందని, బుచ్చమ్మలాంటి వారి పరిస్థితులను వివరించి దయచూపాలని దొరను వేడుకుంటాడు. సమస్యలను అర్థం చేసుకోవాలని చెప్పే పాత్రగా ఈ సందర్భంలో కనబడుతుంది.

దొర నర్సయ్యను కర్రతో కొట్టినప్పుడు అవమానంగా అనిపించి ఊరి నుండి వెళ్ళి పోదామనే నిర్ణయానికి వస్తాడు. ఇంతలో దొర చేతిలో, ఇల్లు, కొట్టంతోపాటు తన తొమ్మిది నెలల కొడుకును, దూడను పోగొట్టుకుంటాడు. దాంతో బొంబాయి వెళ్ళి అక్కడ ఉంటాడు. సహకార సంఘాల ఏర్పాటుతో నర్సయ్య తిరిగి వస్తాడు. ఈ పాత్ర ద్వారా రచయిత సంఘ సంస్కర్తలాంటి పాత్రను ప్రవేశపెట్టాడు. ఇతరుల కష్టాన్ని చూసి చలించడమే కాదు వారికి సహాయం చేయడం, ఉపాధి మార్గాన్ని చూపించే పాత్రగా నర్సయ్య మనకు కనబడుతాడు.

### 3.2.2.4. దేవకి (సుషుప్తి)

దేవకి ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. పిల్లలను ప్రోత్సహించే టీచర్‌గా కనబడుతుంది. వృత్తిదారుల నైపుణ్యాన్ని మెచ్చుకుంటూ, వారి గొప్పతనం తెలిసిన వ్యక్తి. సాధారణంగా ఒక టీచర్‌కు ఉండే లక్షణాలుంటాయి. దేవకి జీవితంలో ప్రణాళికాబద్ధంగా ఉంటూ, ఇబ్బందులు ఎదుర్కొనే ఆలోచన కల్గి ఉంటుంది. ఇరవై రూపాయలకు అప్పు కాగితం రాయమని గోవిందు వచ్చినపుడు, అతనికి తనే డబ్బులు ఇచ్చి పంపిస్తుంది. ఇలాంటివారి అమాయకత్వాన్ని చూసి బాధపడుతుంది. చదువుకోవటానికి అవకాశాలు ఉన్నప్పటికి వినియోగించుకోలేని వారిస్థితిని చూసి ఆలోచనలో పడుతుంది.

గోవిందుకు తనపట్ల ఇష్టం ఉన్నదని తెలిసి అతని సందేహాలను నివృత్తి చేస్తుంది. సినిమాలకు, నిజ జీవితాలకు వ్యత్యాసం ఉందని, ఇప్పుడు అందరూ తమకు సమాన హోదా కలిగిన వారినే పెళ్ళి చేసుకుంటారని చెప్తుంది. దేవకి టీచర్‌గా పిల్లలను ప్రోత్సహించడమేగాక,

సమాజంలో చదువుకోలేకపోతున్న వారిని చూసి బాధపడే వ్యక్తిగా, జీవితంపట్ల స్పష్టమైన అవగాహన కలిగిన స్త్రీగా, గోవిందులాంటి స్థితిని అర్థం చేసుకునే ఆధునిక స్త్రీగా దేవకి పాత్ర కనిపిస్తుంది.

### 3.2.2.5. శంకరయ్య (గువ్వల చెన్నా)

చిప్పమల్లయ్య, లింగమ్మల చిన్నకొడుకు శంకరయ్య. శంకరయ్య భార్య శారద. కొడుకులు రమేశ్, సురేశ్‌లు. శంకరయ్య రచయిత. సాహిత్యాన్ని, సామాజిక తాత్త్విక పుస్తకాలను చదివి ఒక దృక్పథాన్ని ఏర్పరుచుకుంటాడు. శంకరయ్యకు చిన్నతనంనుండి చదువంటే ఆసక్తి, చదువుకుంటూనే తండ్రికి వృత్తిపనిలో సాయంకాలం సహాయపడేవాడు. తండ్రి అనుభవిస్తున్న పేదరికం, అవమానాలను చూసిన శంకరయ్య ఉద్యోగం చేయాలని నిర్ణయించుకుంటాడు. తనకు ఉద్యోగం వస్తే తల్లికి పట్టుచీర కొంటానని చెప్పేవాడు. ఉద్యోగం వచ్చాక భార్యకు మాత్రమే పట్టుచీర కొంటాడు. దానికి కారణం ఆర్థిక పరిస్థితులు. రెండు పట్టుచీరలు కొనేస్థితిలో లేకపోవడం. చివరకు తల్లికి పట్టుచీర తెస్తాడు కానీ, అది ఆమె శవం మీద కప్పడానికే ఉపయోగపడుతుంది.

ఈ సంఘటనతో తన గురించి, తనవాళ్ళ వెనకబాటుతనం గురించి ఆలోచిస్తాడు. ఇకపై తండ్రినైనా మంచిగా చూసుకోవాలనుకుంటాడు. తండ్రి మరణించినపుడు శంకరయ్య సాంప్రదాయంగా కాకుండా ఒక మీటింగు ఏర్పాటుచేసి తిండిలేని పేదలను పిలిచి భోజనాలు ఏర్పాటు చేస్తాడు. వారితోపాటు బంధుమిత్రులను, కొందరు రచయితలు, మేధావులను పిలుస్తాడు. ఆ మీటింగ్‌లో తన నాన్న జీవితంలో అనుభవించిన కష్టాలను చెప్పి, నేటి సమాజంలో ఇలాంటి పరిస్థితులను గురించి చర్చిస్తారు.

శంకరయ్య కొడుకు రమేశ్ కంప్యూటర్ ఇంజనీర్. రమేశ్‌ను ఉన్నత కుటుంబానికి చెందిన మల్లీశ్వరి అనే అమ్మాయి ప్రేమిస్తుంది. పై వర్గాలవారు కింది వర్గాల నుండి ఎదిగిన వాళ్ళను తమ సొంతం చేసుకుంటారనే ఆలోచనలో ఉంటాడు శంకరయ్య. దాంతో ఆమెను కొడుకు ద్వారా పరీక్షిస్తా . అందులో ఆమె గెలవడంతో వారికి ఆదర్శ వివాహం చేస్తాడు.

శంకరయ్య కొడుకులు అమెరికా వెళ్తుంటారు. వారు తిరిగి వస్తారు లేదా అక్కడే ఉంటారా అనే ఆలోచనల్లో ఉంటాడు.

శంకరయ్య ఒక రచయితగా, తాత్త్వికవేత్తగా, కుటుంబ సభ్యులు గౌరవించేవాడిగా, తండ్రి నుండి కొడుకుల వరకు మారుతున్న కాలాన్ని చూసిన వాడిగా, ఆదర్శమైన వ్యక్తిగా శంకరయ్య పాత్ర కనబడుతుంది.

**3.2.2.6. శ్రీరాం (గువ్వలచెన్నా)**

శ్రీరాం రాజలింగం కొడుకు. బాగా చదువుకొని ఇంజనీరు ఉద్యోగం చేస్తాడు. వేములవారి ఇంటి అమ్మాయితో వివాహం జరుగుతుంది. ఎన్ని అవకాశాలు వచ్చినా విదేశాలకు వెళ్ళకుండా స్వంత దేశంలో ఉంటూ తల్లిని చూసుకోవాలనుకుంటాడు. ఆర్థికంగా ఎదగాలంటే తన భార్యతో ఉద్యోగం చేపిస్తే చాలనుకుంటాడు శ్రీరాం. శ్రీరాం తల్లిని, స్వంత దేశాన్ని ప్రేమించే వ్యక్తి పాత్రగా చిత్రించబడినాడు.

**3.2.2.7. వేదప్రకాశ్ (సంకెళ్ళు తెగాయి)**

వేదప్రకాశ్ తాత ఉత్తర భారతీయుడు. నిజాం ప్రభువుల కింద ఉద్యోగంలో చేరాడు. తండ్రి నరేశ్‌జీ లాయర్. నిజాంకు వ్యతిరేకంగా పోరాడి జైలుకి వెళ్ళి వచ్చాక ఆశ్రమం నెలకొల్పి స్వచ్ఛంద మానవసేవలో ఉంటాడు. ఇలా ఇంట్లోనే క్రమశిక్షణతో పెరుగుతాడు వేదప్రకాశ్. దీనికితోడు స్వామి సత్యానంద తీర్థ బోధనలతో తన వ్యక్తిత్వాన్ని పెంపొందించుకుంటాడు. అధ్యాపకవృత్తి అతనికిష్టం. చరిత్ర అధ్యాపకుడిగా ఉంటాడు. విద్యార్థులకు ఆసక్తికరంగా పాఠాలు చెప్పడంతో విద్యార్థులకు అతడంటే ఇష్టం. నారాయణ వేదప్రకాశ్‌లానే భావాలను అర్థం చేసుకొని తనకు కావాల్సిన సమాచారాన్ని, పుస్తకాలను, సందేహాలను నివృత్తి చేసుకునేవాడు. భార్య సుమిత్ర కూడా వచ్చిన విద్యార్థులను ప్రేమతో పలకరించేది. ఇలా విద్యార్థుల్లో నారాయణతో సన్నిహిత్యం ఏర్పడుతుంది.

వేదప్రకాశ్ చరిత్ర అధ్యాపకుడిగా, విద్యార్థులను ప్రోత్సహించే వాడిగా కనబడతాడు.

### 3.2.2.8. ఈరయ్య (సంకెళ్ళు తెగాయి)

ఈరయ్యది పెద్దపెల్లి గ్రామం. కుల వృత్తైన మంగలి పని చేస్తూ జీవించేవాడు. భార్య రంగమ్మ. ఒక్క కొడుకు నారాయణ. ముగ్గురు ఆడపిల్లలు. ఈరయ్య తాతల కాలం నుండి దొరకు సేవ చేసేవారు. దొరమనవడి పుట్టెంట్రుకలు తీసే రోజు వానజల్లు పడుతుంది. చెల్కలో శెనగసేను పీకాల్సింది. కాని దొరపై ఉన్న భయంతో దొర ఇంటికి వెళ్తాడు. ఈరయ్య తనలాగె తనకొడుకు నారాయణ దొరల దగ్గర అణిగిమనిగి ఉంటే, వారే ఏదోఒక పని చూపిస్తారనే భావంతో ఉంటాడు. కాని కొడుకు వినకపోయేసరికి బాధపడ్తాడు. అయిన కొడుకును చదివిస్తాడు. పెద్దబిడ్డ పెండ్లికి సంబంధించి కొడుకుతో చర్చించి పెళ్ళి చేయడంతో కుటుంబ సభ్యుల మధ్య అవగాహన, బాధ్యత కనబడుతుంది. బిడ్డ రాజవ్వ భర్త ఎన్‌కౌంటర్‌లో చనిపోతే పోలిసుల వేధింపులు తట్టుకోలేక చివరకు పట్నం చేరుకుంటాడు.

ఈరయ్య మంగలి వృత్తిదారుడు. దొరలకు వెట్టి చేసేవాడిగా, కొడుకుని చదివించిన వాడిగా కనబడతాడు.

### 3.2.2.9. బాలయ్య

బాలయ్య కుమ్మరి వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. బాలయ్య భార్య ఎంకమ్మ, కొడుకు గోవిందు. బాలయ్య ఆరంభంలో వృత్తిద్వారా జీవితంలో ఎదుగుతాడు. ఇతడు చేసే కూజాలు, గురుగులు మొదలగు వాటిని అందరూ కొనేవారు. ప్రపంచీకరణ ప్రభావంతో ఫ్రిజ్, స్టీల్, ప్లాస్టిక్ వస్తువులు రావడంతో ఇతని వృత్తి దెబ్బతిని ఇల్లు గడవటమే కష్టంగా మారుతుంది. బాలయ్య కల్లు, సారాకు బానిసగా మారుతాడు. ప్రతిరోజూ తాగాల్సిందే. షావుకారు రామస్వామి దగ్గర అప్పుచేసి తను వాము విప్పగానే వారికి వస్తువులను ఇవ్వాల్సిన పరిస్థితి ఉంటుంది. బాలయ్య చేసిన కష్టం అప్పుల కిందనే జమ అవుతుంది.

బాలయ్య కొడుకు గోవిందును చదివించే అవకాశాలు ఉన్నప్పటికీ చదివించడు. బడిపంతులుతో చదివి ఉద్యోగాలు చేయాలా? మా పని చేసుకొని బతుకుతామని అనేవాడు. ఆ ఊర్లో బాలయ్య లాంటివారు చాలామంది కులవృత్తి ఉందంటూ అవకాశాలు ఉన్నా వినియోగించుకోలేదు.

బాలయ్య గోవిందు పెళ్ళి చేయడానికి డబ్బులు లేకపోవడంతో దావూద్‌కు కల్లు తాగించి, అతని ద్వారా షావుకారి దగ్గర అప్పు తీసుకుంటాడు. తెచ్చిన అప్పు పెళ్ళికి సరిపోదు. దాంతో ఇంటిపక్కనున్న రాములమ్మను ఆమె కూతురి చెవి కమ్మలు, కడాలు ఇవ్వమని బ్రతిమిలాడుతాడు. ఆమె ఇవ్వడంతో వాటిని పెళ్ళి కూతురికి పెట్టి తన మర్యాదను నిలుపుకుంటాడు. గోవిందు, ముత్యంల విడాకుల తర్వాత చుక్కతో వివాహం జరిపిస్తాడు. చుక్క పెళ్ళికి ముందే ఆ గ్రామ సర్పంచ్ కొడుకు ద్వారా గర్భవతి అయిన విషయం భార్య ద్వారా తెలిసినపుడు ఒక్క ఆ విషయంలో తప్ప ఆ అమ్మాయి గుణవంతురాలు, పనిమంతురాలు అని భార్యకు నచ్చజెప్పుతాడు. చుక్క తనకు త్రాగడానికి డబ్బులు ఇచ్చిన విషయాన్ని మనసులో తలచుకొని సానుకూలంగా మాట్లాడుతాడు.

బాలయ్య కుమ్మరి వృత్తిదారుడిగా మొదట్లో ఒక వెలుగు వెలిగి అందరి ఆదరాభిమానాలు పొందిన వ్యక్తిగా, ప్రపంచీకరణ ప్రభావంతో ఉపాధిని కోల్పోయిన వ్యక్తిగా, త్రాగడానికి బానిసైన వ్యక్తిగా, త్రాగడానికి అప్పులు చేసే వ్యక్తిగా, అరువుగా ఎవరైనా కల్లు, సారా పోయనప్పుడు ఆ కోపాన్ని పెళ్ళంమీద చూపే వ్యక్తిగా, కోడలు చుక్క విషయం సానుకూల దృక్పథం కల్గిన వ్యక్తిగా బాలయ్య పాత్ర ఉంది.

**3.2.2.9. శ్రీనివాస్ గౌడ్ (బతుకుతాడు)**

నారాయణగౌడ్ పెద్దకొడుకు శ్రీనివాస్‌గౌడ్. ఇంటి పరిస్థితిని అర్థం చేసుకొని ఆవులను మందలతో తోలడం, కల్లు ఇచ్చి రావడం లాంటి పనులు చేసేవాడు. ఏడవ తరగతి పూర్తయ్యాక కులవృత్తైన తాళ్ళు ఎక్కడం నేర్చుకుంటాడు. జగిత్యాల సంఘం వారు తాళ్ళ పన్ను పెంచినపుడు, కులవృత్తిద్వారా వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో బొంబాయిలోని పెదనాన్న దగ్గరికి వెళ్తాడు

శ్రీనివాస్‌గౌడ్. అక్కడి కల్లు దుకాణం, వారు చేసే పనులను చూసిన శ్రీనివాస్‌గౌడ్ తన నాన్నకి, పెద్దనాన్నకి గల తేడాను గమనిస్తాడు. తన నాన్న కష్టాన్ని నమ్ముకున్నవాడు కాబట్టి ఇలా ఉన్నాడని అర్థమవుతుంది. తిరిగి సొంత గ్రామానికి వచ్చి గీత వృత్తి చేసుకుంటూ ఉంటాడు శ్రీనివాస్‌గౌడ్.

శ్రీనివాస్‌గౌడ్‌కి గోపాలపురం గ్రామానికి చెందిన సత్యవతితో వివాహం కుదురుతుంది. కట్నకానుకల దగ్గర తండ్రి ఇరవై ఐదువేలు అడగగా శ్రీనివాస్‌గౌడ్ ఇరవైవేలు చాలనడంతో తండ్రి బాధపడ్డాడు. తాము చెల్లెకు పద్దెనిమిది వేలు ఇచ్చాము, వీరు ఇరవైవేలు ఇస్తామంటున్నారు అని, ఇక్కడ శ్రీనివాస్‌గౌడ్ తన, పర భేదం లేకుండా ఆర్థికస్థితుల గురించి ఆలోచించే వ్యక్తిగా కనబడతాడు. జగిత్యాలవారు మళ్ళీ పన్ను పెంచడంతో వీరు సొంత సంఘం కొరకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటారు. కులవృత్తిని వదిలి సెంట్రింగ్ పనికి వెళ్తాడు. తండ్రి గౌడ సంఘం ఏర్పాటుకోసం ఖర్చుపెట్టిన డబ్బులు కల్లెపల్లివారు ఇవ్వరు. సంఘం ఏర్పాటు కావటంతో తిరిగి కులవృత్తి చేసుకోవడం జరుగుతుంది.

శ్రీనివాస్‌గౌడ్ కుటుంబ పరిస్థితిని అర్థం చేసుకున్న వ్యక్తిగా, కులవృత్తి దారుడిగా, బొంబాయిలోని కల్లు దుకాణాలకు, ఇక్కడి వృత్తిదారుల కష్టానికి మధ్యగల తేడాని గమనించినవాడుగా, తన పెళ్ళి సందర్భంలో పిల్లవారి ఆర్థిక స్థితిని అర్థం చేసుకున్న పాత్రగా శ్రీనివాస్‌గౌడ్ కనబడతాడు.

### 3.2.2.10. కాటమయ్య (మోహిని)

మోహిని తండ్రి కాటమయ్య. డిగ్రీ వరకు చదువుకొని మోదుపురంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ, గీతవృత్తి ద్వారా జీవనం సాగిస్తాడు. తన కూతురిని మంచి మార్గంలో పెంచి, ఆమె ఉన్నతికి, ఆదర్శాలకు మార్గం వేసే ప్రయత్నం చేసి, సఫలీకృతం అవుతాడు. ఆదర్శమైన తండ్రిగా కనబడుతాడు.

సామాజిక సేవకుడిగా, విద్యావంతుడిగా, గీతవృత్తిదారుడిగా, కూతురుని ప్రోత్సహించే తండ్రిగా కాటమయ్య పాత్ర చిత్రించబడింది.

### 3.2.2.11. చైతన్య (మోహిని)

చైతన్య వరంగల్ జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తుంటాడు. తండ్రి రామనాథం, తల్లి జగదాంబ, అక్క అనసూయ. వీరి కుటుంబం గతంలో కొన్ని రోజులు కాటమయ్య ఇంట్లో ఉంటారు. చైతన్య కలెక్టర్ అయినప్పటికి సాదాసీదాగానే వుండే వ్యక్తిత్వం. ఎలాంటి ఆర్భాటాలు ఉండవు. మోహినిని చూసి ఇష్టపడతాడు. కాటమయ్య కూతురు అని తెలిసి రెండు కుటుంబల మధ్య అనుబంధాన్ని పెంచటానికి ప్రయత్నిస్తాడు. మోహినికి ఎన్నికల ప్రచారం సందర్భంలో ఆమెపట్ల శ్రద్ధ తీసుకోవడం తరువాత ప్రస్తుత రాజకీయాలపట్ల అవగాహనను కల్గిస్తాడు. ఈ విధంగా అతడు మోహినికి తోడ్పాటు అందిస్తాడు. పెళ్ళి విషయంలో మోహిని అభిప్రాయాల్ని గౌరవిస్తాడు. స్టేజి వివాహం చేసుకుంటాడు.

చైతన్య కలెక్టర్‌గా, మోహినిని ప్రేమించేవాడిగా, నిరాడంబరుడుగా, ఆదర్శాన్ని అంగీకరించి మోహినిని పెళ్ళిచేసుకునేవాడిగా కనబడతాడు.

### 3.2.2.12. వెంకటయ్య (కల్లుమండువ)

వెంకటయ్య గీతవృత్తిదారుడు, పెద్దగౌడ్. గీత వృత్తిదార్ల ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్ళడానికి కృషి చేసిన వ్యక్తి. సూర్యపేటలో జరిగే గౌడ మహసభ ప్రచారాన్ని వెంకటయ్య చూసుకుంటాడు. ప్రచారంలో భాగంగా కరపత్రాలతోపాటు ఎడ్లబండ్లకు రంగులు వేసి తిప్పుతారు. అందులో ఒక ఎడ్లబండిలో తాటిచెట్టును ఉంచి గీత కార్మికుడు ఎక్కుతున్న భంగిమలో ఉంటాడు. ఈ విధంగా ప్రజల్ని ఆకర్షిస్తూ, తాము సమస్యలపై పోరాడుతున్న విషయం అర్థమయ్యేలా ప్రచారం చేస్తారు.

వెంకటయ్యను చూసిన రంగనాయకులు నమస్కరించి దొరలకు భయపడి ఎవరు ముందుకురారు. అందుకే దొరల దౌర్జన్యం నడుస్తుందని అంటాడు. ఇన్ని రోజులు దొరల క్రిందనే మన తాత, ముత్తాతలు బ్రతికారు. ఇప్పుడు మనం అలాగే బ్రతుకుదాం అంటాడు

బాలయ్య. వెంటనే వెంకటయ్య ఏదైనా ఒకేసారి రాదు పట్టుదలతో సాధించాలనుకున్నప్పుడే అది సాధ్యమవుతుంది.

వెంకటయ్య అక్కడ ఉన్న బావి గురించి చెప్తూ ఈ బావినీళ్ళు దొరలు తప్ప ఊరి వాళ్ళు తాగొద్దని శాసించారు. కాని మన తాతలు ప్రాణాలు లెక్క చేయకుండా దొరలతో పోరాడి బావినీళ్ళను సాధించారు. అందుకు అందరూ ఒక్కటయ్యారు. మనం కూడా వృత్తి బాగు కొరకు పోరాడుదాం అనడంతో బాలయ్య ఆలోచనలో పడుతాడు.

వెంకటయ్య పెద్దగౌడ్, గీత వృత్తిదారుల సమస్యలపై ధర్మభిక్షంతోపాటు పోరాడిన వ్యక్తి, గీత కార్మికులలో చైతన్యం తీసుకరావడానికి కృషి చేసిన పాత్ర వెంకటయ్య.

### 3.2.2.13. ఫకీరయ్య (కక్క)

ఈ నవలలో కక్క తర్వాత ప్రధానమైన పాత్ర ఫకీరయ్య. ఫకీరయ్య మాదిగ కులానికి పెద్ద మేతరి. ఫకీరయ్య చెప్పులు కుట్టడం, చర్మ పరికరాలు అందిస్తూ వుండేవాడు. పటేళ్ళకి, దొరలకి, జీతగాండ్లకు చెప్పులు కుట్టడం, వ్యవసాయానికి సంబంధించిన చర్మంతో చేసే వస్తువులను అందిస్తుంటాడు. అందరితో కలిసి ఉంటాడు. ఎవరన్న మాట అంటే తట్టుకోలేడు. ఫకీరయ్య పరువుకు ప్రాణం ఇచ్చే మనిషి. అందరితో కలివిడిగా వుండేవాడు. కక్కను చేరదీసి అతను కోరిన జీతం ఇచ్చి  మేతరితనానికి కావల్సిన పనులన్నింటిని నేర్పిస్తాడు. తన మనుమరాలు లస్మి కక్కను ఇష్టపడటం చూసి ఇద్దరికి వివాహం జరిపిస్తాడు. ఫకీరయ్య నిరక్షరాస్యుడు. కాబట్టి పటేళ్ళు పన్నిన కుట్రలో చిక్కుకొని మోసపోయి సర్పంచి పదవిని కోల్పోతా . కక్క, లస్మిల పెళ్ళిలో దళితులకు, అగ్రవర్ణాలకు మధ్య గొడవల కారణంగా ఫకీరయ్య ఉరి వేసుకొని చనిపోతాడు.

మాదిగలలో మేతరితనం చేసేవారు ఎంత కష్టపడాల్సి వుంటుందో, దళితుల్లో అక్షరాస్యత లేనందున ఎదురయ్యే పరిణామాలను రచయిత ఈ పాత్ర ద్వారా వివరించారు.

### 3.2.3. ప్రతినాయక పాత్రలు

#### 3.2.3.1. రామారావు(పెరటిచెట్టు)

రామారావు దొర మరియు సర్పంచ్. ప్రజల్ని ఏ విధంగానైనా దోచుకోవాలనే స్వభావం కల్గిన వ్యక్తి. అన్యాయానిదే మెజారిటి అని ఖచ్చితంగా చెప్పి, అన్యాయంగా డబ్బులు తీసుకోవడం, పంచాయితీలో తీర్పులు ఇస్తుంటాడు. దొరగా, సర్పంచ్‌గా మరియు లంచం తీసుకొని పంచాయితీలలో తీర్మానాలు ఇచ్చే వాడిగా రామారావు పాత్ర ఉంది.

#### 3.2.3.2. భుజంగరావు (సంఘము)

భుజంగారావు దొర వెలమ కులస్తుడు. ఇతని తండ్రి కొండల్‌రావు. కొండల్‌రావు ఉండగానే ఏయే కులాలవారు ఏయే సేవలు చేసేది నిర్ణయిస్తాడు. తండ్రి చనిపోయాక కూడా వాటిని భుజంగరావు అమలుపరుస్తాడు. కొండల్‌రావు పేరు వింటే గర్భిణిస్త్రీలు ప్రసవించేవారు. అంటే వారి దౌర్జన్యాలు ఏ విధంగా ఉంటాయో అర్థం చేసుకోవచ్చు.

దొరకు శుక్రవారం కోడిని, ప్రతి రోజూ నాలుగు గుడ్లు ఇవ్వడం పద్మశాలీల పని. వారు ఇచ్చిన గుడ్లను పొదుపు చెయ్యాలి. ప్రభుత్వ అధికారులు వచ్చినప్పుడు కోళ్ళను ఇవ్వడం, పడుకోవడానికి కావాల్సిన చెద్దర్లు ఇవ్వడం. పండుగలు, పెళ్ళిలలో దీపాలు మోయడం వీరిపని. రామలింగాన్ని పిలిచి భుజంగరావు సంఘాలు పెడుతున్నారని, కోళ్ళను ఇవ్వడంలేదని బెదిరిస్తాడు. నేడు సాలోల్లు పద్మశాలీలని పేరు పెట్టుకుంటున్నారని గట్టిగా అడగడంతో, తనకు ఏమి తెలియదని నర్సయ్య పేరు ప్రస్తావిస్తాడు. భుజంగారావు తన అహంకారంతో నర్సయ్యను పిలిచి కర్రతో కొట్టడం అతని దురహంకారానికి నిదర్శనంగా చెప్పవచ్చు. అంతేగాక గ్రామంలో ఎవరైనా మంచిగా ఉన్నారంటే ఓర్వలేనిగుణం కలదు. నర్సయ్య ఇల్లు తగలబెట్టిస్తాడు. నాగనాథం ఇంట్లో దొంగలుపడి బంగారం దోచుకోవడం కూడా ఇతని పనేగా తెలుస్తుంది.

దొరగా, దౌర్జన్యాన్ని ప్రదర్శించే వ్యక్తిగా, ఎదుటి వ్యక్తి ఆర్థికంగా ఎదిగితే అతన్ని దోచుకునే వాడిగా భుజంగరావు పాత్ర చిత్రించబడింది.

### 3.2.3.3. రామలింగం (సంఘము)

బుక్కరావుపేట పద్మశాలి కులసంఘం పెద్దమనిషి. కులవృత్తిని దైవంగా భావిస్తాడు. ఎన్ని కష్టాలు వచ్చినా కులవృత్తి తప్ప వేరేపని చేయవద్దని అలా చేసిన వారినుండి జరిమానాలు వసూలు చేసి త్రాగడం చేస్తుంటాడు. బుచ్చయ్య విషయంలో కూడా అలానే ప్రవర్తిస్తాడు. నర్సయ్య కుల పంచాయితి డబ్బులను పేదవారి కోసం వినియోగించమని సలహా ఇచ్చిన అది పట్టించుకోడు.

పద్మశాలీల కులపెద్దమనిషి, కులపిచ్చి ఉన్నవాడు, కుల పంచాయితీల ద్వారా వచ్చే ధనాన్ని తాగడానికే ఉపయోగించే పాత్ర రామలింగంది.

### 3.2.3.4. రాజేశ్వరరావు (సంకెళ్ళు తెగాయి)

ఈయన దొర. ఊర్లో గ్రామంలోని వారందరిచేత పని చేయించుకుంటాడు. అందరూ తనకింద అణిగిమణిగి ఉండాలనే వ్యక్తిత్వంగలవాడు. ఈ ఊరికి తరతరాల నుంచి అధికారి మీరు, దొరలు పంచాయితి ప్రెసిడెంటు కూడా మీరే ఊరి అభివృద్ధి గురించి పట్టించుకోరా? అని అడిగినప్పుడు నాచేతిలో ఏమీలేదని ప్రజలలో చైతన్యం రావాలి. వాళ్ళు సోమరిపోతులు, పని దొంగలు అని అంటాడు. ఈ పాత్రద్వారా గ్రామ ప్రజలను ప్రభుత్వ పథకాలను దోచుకునే పాత్రగా మనకు కనబడతాడు.

### 3.2.3.5. రామేశ్వరరావు (సంకెళ్ళు తెగాయి)

రాజేశ్వరరావు కొడుకు రామేశ్వరరావు. రామేశ్వరరావు, నారాయణతోటి విద్యార్థి. నారాయణను చిన్నచూపు చూస్తాడు. దొరలనే భావన ఇతనిలో ఉంటుంది. రైలు వెళ్ళేటప్పుడు నారాయణ ఐస్క్రీమ్ తెచ్చి ఇచ్చే సందర్భంలో కాలిమీద పడితే నారాయణను కొట్టుతాడు. కళాశాల ఎలక్షన్లో డబ్బులు పెట్టి గెలవడం, చివరకు పరీక్షల్లో ఫేయిల్ కావడంతో రాజకీయాల్లోకి రావాలని చూస్తాడు. ఈపాత్ర ద్వారా ధనవంతుల అరాచకత్వం,

చదువులేకపోయిన ధనంతో అధికారంలోకి రావాలన్న ఉద్దేశం కలిగిన వ్యక్తిగా రామేశ్వరరావు మనకు కనిపిస్తాడు.

### 3.2.3.6. లక్ష్మణరావు పటేలు (బతుకుతాడు)

లక్ష్మణరావు గ్రామ పట్వారి. గ్రామంలో అతనికి ఎదురుగా ఎవరూ మాట్లాడరు. ఆయన పంచాంగం కూడా చూస్తాడు. లక్ష్మణరావు ఇంటికి బంధువులు వస్తే కల్లు తీసుకురమ్మని నారాయణగౌడ్ దగ్గరికి సాకలి భూమయ్యను పంపుతాడు లక్ష్మణరావు. నారాయణగౌడ్ గతంలో కల్లుపోసి, పైసలు అడిగితే బెదిరిస్తాడు లక్ష్మణరావు పటేలు. ఆ విషయం గుర్తుండి కల్లులేదని చెప్పుతాడు. ఆరోజు సాయంత్రం లక్ష్మణరావు పటేలు తన ఇంటిముందు నుండి వెళ్తున్న నారాయణగౌడ్‌ని చూసి ఉద్రిక్తుడై తిడుతూ, కల్లు ఎందుకు పొయ్యలేదని, అతన్ని లాక్కొని వచ్చి తన ఇంటి ముందున్న పందిరి గుంజకు కట్టేసి కొడుతాడు. ఈ విషయం తెలిసిన నారాయణ తల్లిదండ్రులు, భార్య వచ్చి లక్ష్మణరావు పటేల్‌ను బ్రతిమిలాడినా విడిచిపెట్టడు. ఈ సందర్భం ద్వారా ఆనాడు పటేల్ల దౌర్జన్యం ఎలా సాగిందో అర్థమవుతుంది. భార్య లక్ష్మీ వెళ్ళి గ్రామంలోని మరో ఇద్దరిని తీసుకవచ్చి అడిగించినా వదలడు. తరువాత లక్ష్మణ్ గౌడ్ వచ్చి మా అన్నని ఎందుకు కట్టేశావు అని అడుగుతూనే కట్లు విప్పే ప్రయత్నం చేస్తుండగా అతన్ని కూడా లక్ష్మణరావు పటేలు తరుముతాడు. ఇంతలో చీకటి పడుతుంది. నారాయణగౌడ్ నీరసించిపోయి తనకు చావు దగ్గర పడిందని భయపడుతుంటాడు. రాత్రి గడిచేకొద్దీ లక్ష్మణరావు పటేలు మనసులో అల్లకల్లోలంగా మారుతుంది. తను బాగా ఆలోచించి నారాయణను ఎందుకు కట్టేసినట్లు, కల్లు ఉంటే పోస్తాడు లేకపోతే లేదు. అది అతని ఇష్టమని నారాయణగౌడ్ దగ్గరికి వచ్చి కట్లు విప్పి వెళ్ళమని సైగ చేస్తాడు. ఈ పాత్రద్వారా నాటి పట్వారీల దౌర్జన్యం కనబడుతుంది. లక్ష్మణరావు పటేలుకు ఉండే అహంకారంతోపాటుగా, ఇతరులను అన్యాయంగా శిక్షించేవాడిగా, లక్ష్మణరావు పటేలు లాంటి వ్యక్తి తరువాత తాను చేసిన పనిని విశ్లేషించుకొని అది తప్పుగా భావించి నారాయణగౌడ్‌ని వదలడంతో అతని మానసిక ఆలోచన విధానంలో మార్పు వచ్చిన పాత్రగా కనబడతాడు.

### 3.2.3.7. పెద్ద పటేలు (కక్క)

కక్క పెళ్ళి కోసం పుట్టమన్ను తేవడానికి ఈసుమియా భూమిలోకి మాదిగ కులంవాళ్ళు వెళ్ళినప్పుడు శూద్రులను మాదిగవారిపై ఉసిగొల్పి కొట్టిస్తాడు. వాళ్ళ మీద కేసు పెడతాడు. ఆ కేసు పరిష్కారంకోసం రచ్చబండ దగ్గరికి పటేళ్ళు, మాదిగవారు వస్తారు. పెద్ద పటేలు అనవసరంగా పెట్టిన కేసుకు కోపోద్రిక్తులైన మాదిగవాళ్ళు పటేళ్ళపై విరుచుకబడి గాయపరుస్తారు. దానికి ఆగ్రహించిన పెద్ద పటేలు సర్పంచిచేత కేసు పెట్టిస్తాడు. ఆ సర్పంచి ఫకీరయ్య. కాని అతనికి తెలియదు తానే సర్పంచినని. కేసు నమోదు పత్రంపై అప్పు పత్రమని అబద్దం చెప్పి పెద్ద పటేలు ఫకీరయ్య చేత వేలిముద్ర వేయిస్తాడు. కేసు పరిష్కారం కోసం ఆమీను వస్తే అతనికి లంచం ఇచ్చి కేసును తనకు అనుకూలంగా మార్చమని మాదిగవారిదే తప్పని నిర్దారించి వారిచే పటేళ్ళను ఎప్పుడూ కొట్టకుండా ఒప్పందపత్రం రాయిస్తారు. ఈ గొడవల్లో ఫకీరయ్య చనిపోతాడు. ఆ తర్వాత ఫకీరయ్య సర్పంచని తెలిసి మా పదవి మాకివ్వండని పటేళ్ళను నిలదీస్తారు. దళితులందరం ఏకమై ఒప్పందం కుదుర్చుకుంటారు. సర్పంచి పదవి మాదే అని. కక్క భాగోతం ఆడకుండా అతని పిక్కలు కోయించిన దుర్మార్గపు మనిషి పెద్ద పటేలు. ఈ పాత్ర ద్వారా రచయిత అగ్రవర్ణాల ఆధిపత్య భావజాలాన్ని తెలిపే ప్రయత్నం చేశాడు.

### 3.2.4. స్త్రీ పాత్రలు

### 3.2.4.1. గంగమ్మ (పెరటిచెట్టు)

గంగమ్మ రాజాగౌడ్ భార్య. భర్త వేధింపులు తట్టుకోలేక తల్లిగారింటికి వెళ్ళాలని అనుకుంటుంది. దొర తీర్పుతో భర్తతో కాపురం చేయడానికి వస్తుంది. తను కష్టంచేసి పేడితే తినేవాడు, తనను కావాలని మరీ తెచ్చుకున్న భర్త ధనవంతుడయ్యాక తనను అసహ్యించుకోవడం, వేరొక స్త్రీని పెళ్ళి చేసుకోవడంతో బాధపడుతుందేగాని ఎదురించదు. ఎప్పటికైన మంచిరోజులు వస్తాయని ఎదురుచూస్తూ కొడుకు కోసం బతుకుతుంది. కొడుకు

తిరిగి రావడంతో అతన్ని చూస్తూ తన బాధను మర్చిపోతుంది. చివరికి భర్త మొత్తం పోగొట్టుకొని వస్తే ప్రేమగా దగ్గరికి తీసుకుంటుంది.

భర్త వదిలెళ్ళినా, వేరొక అమ్మాయిని పెళ్ళిచేసుకున్నా, అని కోల్పోయి భర్త తిరిగి ఇంటికి వస్తే అతన్ని ఆదరించే భార్య పాత్ర గంగమ్మది.

**3.2.4.2. ఎల్లమ్మ (పెరటిచెట్టు)**

రాజాగౌడ్ తల్లి. మొదట్లో కోడల్ని వేధించినా తరువాత ఆమెతో కలిసివుంటుంది. కొడుకు ధనవంతుడయ్యాక తమను దూరం చేసినా కొడుకు అభివృద్ధిని ఆకాంక్షించే స్వభావం కలది. మనవడే తమ ఇంటి గౌరవాన్ని నిలబెడతాడని ఆకాంక్షిస్తుంది. రాజాగౌడ్ తల్లిగా, కొడుకు వదిలి దూరం వెళ్ళిన అతన్ని బాగోగులు తెలుసుకునేదిగా, మనవడే తన ఇంటి పేరు నిలుపుతాడని నమ్మిన వ్యక్తిగా ఎల్లమ్మ పాత్ర ఉంది.

**3.2.4.3. బుచ్చమ్మ (సంఘము)**

బుచ్చమ్మది బుక్కరావుపేట గ్రామం. పద్మశాలీ కుటుంబం. ప్రసాదు, శ్యామల వీరి సంతానం. భర్త మరణించడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయి. అంతేగాక కొడుకు చిన్నతనంలో రామస్వామి జాతరకు వెళ్ళి తప్పిపోవడంతో ఆమె ఆరోగ్యం ఇంకా క్షీణిస్తుంది. కంటిచూపు సరిగా కనబడదు. బ్రతుకుదెరువుకై గ్రామంలోని కోమటి, బ్రాహ్మణుల ఇండ్లలో పని చేస్తుంది. దాన్ని కులస్తులు తప్పుగా భావించి, పంచాయితి పెడతారు. కులానికి అగౌరవం తెచ్చిందని ఇరవై రూపాయలు జరిమానా విధిస్తారు. దానితో బుచ్చమ్మ తన బిడ్డ మెడలోని కడెం అమ్ముతుంది. దానికి పదిరూపాయలు వస్తాయి. గ్రామంలో వారిని అడిగి మిగతా పదిరూపాయలు మొత్తం ఇరవై రూపాయలు జరిమాన కడుతుంది. తను కులపని ద్వారా బతకడం కష్టం. ఇండ్లల్ల పని చేస్తే కొంత ఆదాయం లభిస్తుంది. తాను ఇదే గ్రామంలో ఉంటే

కులస్తులు తనను హింసిస్తారని, వేరే గ్రామానికి వెళ్తుంది. అక్కడ ఇంటిపని చేస్తూ బిడ్డను చదివిస్తుంది. చివరికి కలరా వ్యాధిసోకి మరణిస్తుంది.

భర్త లేకున్నా పిల్లలను పెంచిన తల్లిగా, కొడుకు తప్పిపోతే బాధలో కంటిచూపును పోగొట్టుకున్నదిగా, కులం వేసే జరిమానాలు కట్టలేక వేరే గ్రామానికి వేళ్ళిన పాత్రలో బుచ్చమ్మ కనబడుతుంది.

**3.2.4.4. శ్యామల (సంఘము)**

ప్రసాదు చెల్లె శ్యామల. తల్లి పెంపకంలో పెరుగుతుంది. ఇంద్రసాగరంలో దేశ్‌పాండ్య బిడ్డతో స్నేహం కుదురుతుంది. ఇద్దరు కవల పిల్లల వలే స్నేహంగా ఉండేవారు. దేశపాండ్య తన కూతురు సరళతోపాటు శ్యామలను కూడా చదివిస్తాడు. మెట్రిక్యులేషన్ వరకు పాసవుతుంది. సరళ ఫెయిల్ కావడంతో ఈ సంఘటన ఆమె జీవితాన్ని మార్చుతుంది. దేశపాండ్య శ్యామలను మెచ్చుకోవడంతో సరళ తల్లి వీళ్ళను దూరం చేయడం. ఇంతలో కలరా వ్యాధితో తల్లి మరణించడం జరుగుతుంది. ఆ వ్యాధి తనకు సోకడం. జోగేంద్ర డాక్టర్ రక్షించడంతోపాటు, అక్కడే తన అన్న ప్రసాదును కలుస్తుంది. శ్యామల జోగేంద్రను పెళ్ళి చేసుకుంటుంది. ఈ విధంగా తల్లి సంరక్షణలో ఉండి, ఒకరి ఇండ్లల్లో పనిచేసే వారి పరిస్థితి ఎల్లప్పుడు ఒకే విధంగా ఉండదని ఈ పాత్ర ద్వారా తెలుస్తుంది.

తండ్రి లేని బిడ్డగా, యజమాని ఆదరణను పొందినదానిగా, చివరకు తప్పిపోయిన అన్న కలవడమే కాదు అన్న స్నేహితుణ్ణి పెళ్ళి చేసుకునే పాత్ర శ్యామలది.

**3.2.4.5. ఎంకమ్మ (సుషుప్తి)**

ఎంకమ్మ భర్త బాలయ్య. ఎంకమ్మ భర్త చేసే కుమ్మరి వృత్తికి అవసరమైన మట్టి, కంప మోపులు తెచ్చి సహాయపడుతుంది. తమ వృత్తి ద్వారా ఇల్లు గడవడం కష్టంగా ఉన్నప్పటికి వయసుకి వచ్చిన కొడుక్కి పెళ్ళి చేయాలని భర్తతో అంటుంది.

సంతలో గురుగులు అమ్మడానికి వెళ్ళినపుడు అక్కడ వెలిసిన స్టీలు దుకాణం, లేడీస్ కార్నర్, మిఠాయి దుకాణాలు వృత్తిదారుల జీవనోపాధిని కోల్పోతున్న విధానాన్ని చూసి బాధపడుతుంది.

ఎంకమ్మ గాడిదమీద గోనెసంచులలో మట్టి తెస్తుంది. ఒకసారి మట్టికి వెళ్ళే సందర్భంలో ఇద్దరు యువతులు కలుస్తారు. అందులో కోనమ్మ అనే ఆవిడ ఎంకమ్మతో కొడుకు పెండ్లి చేస్తే కోడలు వచ్చి అత్తను సుఖపెడుతుందిగా అనగా, ఎంకమ్మ నువ్వు వచ్చి మీ అత్తను సుఖపెట్టినవా అని అడుగుతుంది. ఐనప్పటికి ఆ యువతులు మట్టిని సంచులలో నింపడంలో ఎంకమ్మకు సహకరిస్తారు. దాంతో ఎంకమ్మకు బాధకల్గి తను అన్న మాటలకు బాధపడకని అంటుంది. ఇక్కడ వీరిమధ్య స్వార్థం లేదనే విషయాన్ని గమనించవచ్చు.

కొడుక్కు అన్నకూతురు ముత్యంతో పెళ్ళి జరుగుతున్న సందర్భంలో అమ్మగారి ఇంటిపై ఉండే అధికారాన్ని ప్రదర్శిస్తుంది ఎంకమ్మ. ఎంకమ్మ ఇంటిపక్కన రాములు ఉంటుంది. సాధారణంగా పక్క ఇంటివారినుండి బదులు తెచ్చుకోవడం, ఇవ్వడం జరుగుతుంది. అంతేగాక కష్టసుఖాలను కూడా పంచుకుంటారు. ఒకసారి రాములు పప్పు పెట్టకపోతే ఎంకమ్మ రాములుతో పంచాయితి చేస్తుంది. వారిమీద అధికారాన్ని కూడా ప్రదర్శిస్తుంది. దాంతో రాములు తన ఆభరణాలు ఇవ్వమని అడుగుతుంది. దాంతో ఎంకమ్మ కోడలు మీదున్న నగలు తీసి ఇచ్చి గట్టిగా తాను మాటమీద నిలబడే వ్యక్తిగా మాట్లాడుతుంది.

ముత్యం ప్రతిసారి పారిపోవడంతో తెగతెంపులు చేసుకొని చుక్కతో పెళ్ళి చేస్తారు. చుక్క విషయం తెలిసిన ఎంకమ్మ దూరంగా ఉంటుంది. కొడుకు జీవితం బాగుపడాలని ఏ విషయం దాస్తుందో, ఆ విషయం కొడుక్కి తెలిసి కోడల్ని వెళ్ళగొట్టినపుడు తన కొడుకు ఏకాకి అయ్యాడని బాధపడుతుంది. అంతేగాక కొడుకు తాగుడుకు బానిసకావడం చూసి భరించలేకపోతుంది. బావిదగ్గర కాలుజారి మంచంలో పడుతుంది ఎంకమ్మ. చివరిదశలో చుక్క వస్తే తన కొడుక్కి తోడుగా ఉంటుందని అంటూనే శ్వాస విడుస్తుంది.

ఎంకమ్మ భర్తకు పనిలో సహకరించే భార్యగా, వృత్తిదారులమీద ఆధునిక వస్తువులు చేస్తున్న దాడిని గుర్తించిన వ్యక్తిగా, కొడుకును ప్రేమించే తల్లిగా, తోటివారితో కలిసిపోయే

మనస్తత్వంతోపాటు వారిపై అధికారాన్ని చూపించేదిగా, మరియు కొడుకు ఒంటరి కాకూడదనే ఆలోచన, బాధకల్గిన ఒక అమ్మగా ఎంకమ్మ పాత్ర ఉంది.

### 3.2.4.6. చుక్క (సుషుప్తి)

చుక్క గోవిందు భార్య. చుక్క పెళ్ళికి ముందు గ్రామ సర్పంచ్ ఇంట్లో పనిచేసేది. సర్పంచ్ కొడుకు చేతిలో మోసపోయి గర్భవతి అవుతుంది. చుక్క గోవిందును పెళ్ళిచేసుకొని ఇంటికి వచ్చాక ఒక పుస్తకంలో పద్దులు రాయడంతో దావూద్ రాసే దొంగలెక్కలు బయటపడటంతోపాటుగా, ఇల్లు కొంత ఆర్థికంగా నిలదొక్కుకుంటుంది. పెళ్ళికి ముందు చేసిన తప్పుకు అత్త ఎంకమ్మ కొట్టినా భరిస్తుంది. దావూద్ పెట్టే వేధింపులు భరించలేక భర్తతో చెప్పి అతని అమాయకత్వాన్ని చూసి భర్తతోనే జీవితం అని భావిస్తుంది.

చుక్కకు కొడుకు పుట్టిన తర్వాత గోవిందులో విద్వేషాన్ని నింపుతాడు దావూద్. దాంతో చుక్కను కొట్టగా అసలు విషయం చెబుతుంది. అంతేగాక ఈ కష్టం ఎక్కడ చేసుకున్నా తనూ, తన కొడుకు బతకగలమని విశ్వాసాన్ని ప్రకటించడమేగాక, నీలాంటి మగవాడు చేసిన మోసంవల్ల తన పరిస్థితి ఇలా అయ్యిందని బాధపడుతుంది. అత్త ఎంకమ్మ చనిపోయాక తిరిగి వస్తుంది చుక్క. గోవిందు పిల్లవాణ్ణి దూరంగా ఉంచమని చెప్పినప్పుడు తల్లి బాధను మింగి, తన తల్లి పిల్లవాణ్ణి ఇచ్చి వస్తుంది. గోవిందు తాగుడుకు బానిస కావడంతో ఇంట్లో సామాన్లతోపాటు, కంపమోపులు కూడా అమ్ముకుంటాడు. ఆకలితో అలమటిస్తున్న బాలయ్యమామకు ఆకలి తీర్చడానికి అన్ని విధాల ప్రయత్నాలు చేస్తుంది. చివరకు దావూద్ తెచ్చిన అన్నంతో తనుతిని మామకు పెడుతుంది. ఆ విషయం తెలిసిన గోవిందు చితకబాదడంతో దవాఖానలో చేరుతుంది. తర్వాత దావూద్‌తో పట్నంలో జీవితాన్ని గడుపుతుంది.

చుక్కపై కులస్తుడి చేతిలో మోసపోయిన స్త్రీగా, భర్తను ప్రేమించే భార్యగా, ఇంటిని చక్కదిద్దే ఇల్లాలుగా, జీవితంలో జరిగిన తప్పును ఆసరాగా చేసుకొని భర్త కొట్టినా, తిట్టినా భరించేదానిగా, దావూద్ పెట్టే వేధింపులు భరిస్తూ చివరకు దావూద్‌తో జీవితాన్ని పంచుకునే స్త్రీగా చుక్క పాత్ర కనిపిస్తుంది.

### 3.2.4.7. లింగమ్మ (గువ్వల చెన్నా)

లింగమ్మ చిప్పమల్లయ్య భార్య. కండెలు చుట్టుతూ భర్తకు వృత్తిపనిలో సహకరిస్తుంది. ఆర్థిక పరిస్థితులవల్ల శంకరయ్యని చదివించాలని పట్టుబడుతుంది. స్నానం చేయడానికి సబ్బును కూడా కొనలేని స్థితి వీరిది. లింగమ్మ చిరకాల కోరిక పట్టుచీర కట్టుకోవడం. ఈ కోరిక చిన్నతనంలో కల్గుతుంది. తన కోరికను తండ్రి, భర్త తీర్చలేకపోతారు. చిన్నతనంలో తల్లికి పట్టుచీర కొంటానని చెప్పిన శంకరయ్య పెళ్ళానికి కొంటాడేగాని, తల్లికి కొనడు. చివరకు మంచంలో పడి చనిపోయాక తెచ్చి కప్పుతాడు.

లింగమ్మ భర్తకు సహకరించేదిగా, పిల్లల్ని ప్రేమించే తల్లిగా, ఇంట్లో ఒక్కరన్న చదవాలనే దృడసంకల్పం కల్గి శంకరయ్యను చదివించిన తల్లిగా, సగటు స్త్రీ చిన్న కోరికైన పట్టుచీర కట్టుకునే అదృష్టం లేకుండానే మరణించిన పాత్రగా లింగమ్మ కనిపిస్తుంది.

### 3.2.4.8. మల్లీశ్వరి (గువ్వల చెన్నా)

మల్లీశ్వరి కంప్యూటర్ ఇంజనీరు మరియు ఉన్నత కుటుంబానికి చెందిన అమ్మాయి. రమేశ్‌ను ప్రేమిస్తుంది. రమేశ్ తనను పరీక్షిస్తున్నప్పటికీ, రమేశ్‌కు వారి సంస్కృతి పట్ల, కుటుంబాల పట్ల గౌరవం ఉందో? లేదో? తెలుసుకోవడానికి అతడు అడిగిన దానికి వ్యతిరేకంగా సమాధానం చెప్తుంది. అంతేగాక అతనికి తెలియకుండా అతని ఇంటికి వెళ్ళి రమేశ్ తండ్రితో చెప్పే మాటలు విని రమేశ్‌కుగల మంచి అభిప్రాయాలు వింటుంది. దాంతో మల్లీశ్వరి వాళ్ళ మధ్యకు వచ్చి అసలు విషయం చెబుతుంది. శంకరయ్య మామ ప్రకారం ఆదర్శ వివాహం చేసుకుంటుంది. మల్లీశ్వరి ఉన్నత కుటుంబానికి చెందినదిగా, కంప్యూటర్ ఇంజనీరుగా, కింది వర్గాల సంస్కృతిని గౌరవించేదిగా, ఆదర్శ వివాహం చేసుకునేదిగా మల్లీశ్వరి పాత్ర కనిపిస్తుంది.

### 3.2.4.9. రంగమ్మ (సంకెళ్ళు తెగాయి)

నారాయణ తల్లి. కొడుకు చదువుతుంటే సంబరపడిపోతుంది. అదే సందర్భంలో బాలయ్యల తన కొడుకు కూడా మంగలి షాపు పెట్టుకుంటే బాగుండు అనే ఆలోచనలో

పడిపోతుంది. ఇంటిని శుభ్రంగా ఉంచుకుంటుంది. కష్టపడి జీవించడం మాత్రమే తెలిసిన వాళ్ళు.

తల్లిగా, వృత్తిదారుల కుటుంబంలో కష్టాల్ని చూసిన స్త్రీ పాత్రగా రంగమ్మ కనబడుతుంది.

**3.2.4.10. అనల (సంకెళ్ళు తెగాయి)**

అనల తల్లిదండ్రులు భారతి, ఆనందరావు. వీరిది కులాంతర వివాహం. ఆనందరావు లాయర్, భారతి సమాజ సేవకురాలు. తండ్రి అభ్యుదయ భావాలు, తల్లి గాంధీతత్వం అనలపై ప్రభావం చూపాయి. అనల నారాయణ చదివే కాలేజిలో చదువుకుంటుంది. నారాయణ కన్న ఒక క్లాసు తక్కువ. ఒక డిబేట్‌లో నారాయణ ఫస్ట్ వస్తే, అనల సెకండ్ వస్తుంది. అప్పటి నుండి నారాయణపై అభిమానం. దాంతోపాటుగా అతని వ్యక్తిత్వం తెలుసుకుంటుంది. కాలేజి ఎలక్షన్లలో నారాయణను నిలబడమని, రామేశ్వరరావులాంటి రౌడి రాకూడదని చెప్పడం జరుగుతుంది. కాని చివరకు నారాయణ ఓడిపోతాడు. నారాయణ వాళ్ళ ఊరికి అనల వెళ్తుంది. వాళ్ళ కుటుంబ సభ్యులకు బట్టలు తీసుకవచ్చిందని చెప్పడంలో వాళ్ళు ఆశ్చర్యపోతారు. అందరితో కలగలసి మాట్లాడటంతో అందరికి నచ్చుతుంది. ఊర్లోని కుమ్మరి, పద్మశాలి మొదలగు వృత్తుల నైపుణ్యాన్ని పరిశీలించి, వారికి సలహాలు ఇస్తుంది. అనల కేవలం గ్రామాన్ని చూడటంకోసం కాదు గ్రామ పరిస్థితులను అర్థం చేసుకొని వారిని ఆదుకునే మార్గాలు కూడా చెప్పడంతో ఆమెపై ఇంకా గౌరవం పెరుగుతుంది నారాయణకి. గ్రామదొర రాజేశ్వరరావుని గ్రామాభివృద్ధిని గురించి అడగడం ఇలా అన్ని విషయాలలో సరైన అవగాహన, అభ్యుదయ భావాలుగల యువతిగా మనకు అనల కనిపిస్తుంది. నారాయణకు కోచింగ్ సెంటర్‌లో ఫీజు కట్టడం నుండి అతనికి అవసరాలు తెలుసుకొని తీర్చేదిగా అతన్ని ప్రమించే వ్యక్తిగా అనల మనకు కనబడుతుంది.

**3.2.4.11. లింగమ్మ (బతుకుతాడు)**

ధర్మయ్య గౌడ్ భార్య లింగమ్మ. లింగమ్మకు కండ్లు మసకగా కనిపిస్తాయి. గ్రామంలోకి వచ్చిన నకిలి వైద్యునితో బాగు అవుతాయనుకుంటుంది కాని ఉన్న కండ్లు పోతాయి. నకిలి వైద్యునికోసం చుట్టు ప్రక్కల గ్రామాలలో వెతుకుతారు కొడుకులు. కాని అతని ఆచూకి దొరకదు. పెద్ద కొడుకు భూమయ్యగౌడ్ బొంబాయిలో కల్లు దుకాణం ద్వారా బతుకుతానని భార్య పిల్లలను తీసుకెళ్తాననే సందర్భంలో, కోడలే కొడుక్కి నేర్పిందని గట్టిగా అంటుంది. ఆ మాటలలో కొడుకి మీద ప్రేమ కనబడుతుంది తప్ప వేరే ఉద్దేశ్యం ఉండదు. తాము వృద్ధాప్యంలోకి వచ్చినామని, పెద్దవాడు వెళ్ళితే మిగిలిన ఇద్దరూ కొడుకులు మమ్మల్ని పట్టించుకోరనే అభిప్రాయాన్ని వెలిబుచ్చుతుంది లింగమ్మ.

రెండో కొడుకు నారాయణను లక్ష్మణరావు పటేలు కట్టేసినప్పుడు "పటేల తన కొడుకు తెలినోడుగాన పిసోడు" (పుట: 9) అని అంటుంది. తన కొడుక్కి ఏమి తెలియదని చెప్పి, పటేల్ని బ్రతిమిలాడుతుంది. చిన్న కొడుకు లక్ష్మణ్‌గౌడ్ అంటే ఎక్కువ ఇష్టం లింగమ్మకి. లక్ష్మణ్ గౌడ్ గ్రామ పంచాయితి ఎన్నికల్లో వార్డ్ మెంబర్‌గా గెలిచి ఉప సర్పంచి పదవిని చేబడుతాడు. కొన్ని రోజులకు లక్ష్మణ్ గౌడ్‌పై అపవాదు పడడంతో ఇక్కడ ఉంటే కొడుకుకు ఆపద కల్గుతుందని గ్రహించి పెద్దకొడుకు భూమయ్యతో బొంబాయికి పంపుతుంది. బొంబాయిలో లక్ష్మణ్ గౌడ్ నడిపే కల్లు దుకాణం సరిగ్గా నడవక నష్టపోతాడు. దానితో లక్ష్మణ్ గౌడ్ చనిపోతాడు. కొడుకు తట్టుకోలేక తల్లి లింగమ్మ కొన్ని రోజుల తర్వాత బావిలోపడి చనిపోతుంది. ఈ పాత్ర ద్వారా రచయిత తల్లి ప్రేమను తెలియజేశాడు. అంతేగాక తన పిల్లలకు ఏమన్న అయితే తల్లి భరించలేదని ఆ విషయాన్ని లక్ష్మణ్ గౌడ్ మరణంతో తట్టుకోలేని లింగమ్మ ఆత్మహత్య చేసుకోవడంలాంటి సన్నివేశాలు మన కళ్ళముందుంచుతాయి.

**3.2.4.12. లక్ష్మి (బతుకుతాడు)**

నారాయణగౌడ్ భార్య లక్ష్మి. భర్తకు వృత్తిపనులలో సహాయపడుతుంది.. కల్లు అమ్మడం, తాటి చెట్లకు నీళ్ళు పోయడం లాంటి పనులతోపాటూ కూలి పనికి వెళుతుంది. లక్ష్మి తమ

కుటుంబ పరిస్థితిని చూసి ఒక్కోసారి చనిపోవాలని భావిస్తుంది. ఇంటిలోని వారికి సరైన ఆహారంగాని, బట్టలుగాని ఉండవు. ఆర్థికంగా వెనుకబడి ఆకలి బాధలు అనుభవిస్తారు. వీరి పరిస్థితిని చూసి చాకలి గంగమ్మ తను తెచ్చుకొనే దానిలో కొంత అన్నం పెడుతుంది. అది పిల్లలు తింటారు. లక్ష్మీ ఆరోగ్యం క్షీణిస్తే తల్లిదండ్రులు తీసుకెళ్ళి దవాఖానాలో చూపిస్తారు.

లక్ష్మి తన భర్తపై కోపాన్ని వెలిబుచ్చుతుంది. దానికిగల కారణం నారాయణగౌడ్ అన్న, తమ్ముడు ఇద్దరు బొంబాయిలో కల్లు దుకాణం పెట్టుకొని వారు స్థిరపడటం. తన భర్త అక్కడికి వెళ్ళకుండా ఇక్కడే ఉండి ఇబ్బందులు పడడం చూసి వర్షాలు వచ్చి భర్త తాళ్ళు ఎక్కలేని పరిస్థితి. తాళ్ళు ఎక్కకుంటే అవి ఎండిపోతాయి. అప్పుడు తమ పరిస్థితి ఎలా? అని వర్షాల వల్ల పంటపొలాలు నష్టమైతే ప్రభుత్వాలు రైతులను ఆదుకునే విధంగా, తమ చెట్లు ఎండిపోతే మమ్మల్ని ఆదుకుంటే బాగుండు అని తన సందేహాన్ని ప్రకటిస్తుంది లక్ష్మి.

లక్ష్మి భర్తకు సహకరించే భార్యగా, కుటుంబ పరిస్థితులను అర్థంచేసుకునే ఇల్లాలుగా, తోటివారి వలె మనం బాగుపడాలనే ఆశ కల్గిన వ్యక్తిగా, గీతకార్మికులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలనే ఆలోచన కల్గిన పాత్రగా లక్ష్మి చిత్రించబడింది.

### 3.2.4.13. సుందరమ్మ (మోహిని)

మోహిని తల్లి. కూతురిని గౌడ జాతిని ఉద్దరించే దేవతగా భావిస్తుంది. కూతురుపై ఎలాంటి ఆంక్షలు పెట్టకుండా అభ్యున్నతికై తోడ్పడే గుణంగల పాత్ర. భర్తకు వృత్తిలో సహకరిస్తూ, గృహిణిగా, కుటుంబం మొత్తం గీతవృత్తిదారుల శేయస్సుకు తోడ్పడే పాత్ర.

### 3.2.4.14. అనసూయ (మోహిని)

చైతన్య అక్క అందరిని కలుపుకపోయే వ్యక్తిత్వం గలది. చిన్నతనంలో వరూధిని పాత్రకు నటించి తన అభిరుచిని తెలుపుతుంది. చైతన్య మోహినిలను కలపాలనే ఆశ, ప్రేమగల పాత్రగా

మనకు కన్పిస్తుంది. అందరిని ప్రేమతో కలుపుకుపోయే మనసత్త్వంగల పాత్రగా అనసూయ కనబడుతుంది.

### 3.2.4.15. కలెమ్మ (కక్క)

కక్క తల్లి కలెమ్మ. కక్క తండ్రి చనిపోయిన తర్వాత కక్కని పెంచి పోషించి, జీతానికి భూస్వాముల దగ్గరికి పంపిస్తుంది. పటేళ్ళు పెడుతున్న హింసను చూడలేక తన కొడుకుని జీతం మాన్పించాలనుకుంటుంది. కానీ వాళ్ళ దగ్గర తెచ్చిన అప్పు తీరక భూమిని అమ్మడానికి సిద్ధపడి తన బావగారైన ఆగమయ్యను కలుస్తుంది. ఆగమయ్య కలెమ్మతో అసభ్యకరంగా ప్రవర్తించి తన కోరిక తీర్చమని బలాత్కరిస్తాడు. ఆమె నిరాకరిస్తుంది. కలెమ్మకు, ఆ ఊరిలో వుండే బర్రోల్ల ఎల్లయ్యకు అక్రమ సంబంధం అంటగట్టి ఆ ఊరి నుండి ఆగమయ్య వెలి వేస్తాడు. సమాజంలో స్త్రీని చూస్తున్న విధానం ఆమె మోపే నిందలు, ఆమెను హింసిస్తున్న తీరును రచయిత ఈ పాత్ర ద్వారా తెలియజేశాడు.

### 3.2.4.16. లస్మి (కక్క)

ఫకీరయ్య మనుమరాలు లస్మి. లస్మి చిన్నప్పటి నుండి మేకలను మేపడం, ఇంటి పని చేయడంతోపాటు తాత చేసే పనులు చెప్పులు కుట్టడం, దప్పు కొట్టడం మొదలైన పనులన్నీ నేర్చుకుంటుంది. బాల్యంలో పశువులు మేపుతూ ఉండేది. లస్మి, కక్కల పెళ్ళి అనంతరం అందరూ కలిసి అడవిలో భోజనాలు చేసి, పాటలు పాడుకుంటూ వుంటారు. లస్మి పాట పాడుతుంది.

> "సీలచ్చి నీ మహిమలే భూలచ్చి
> సూడ సిత్రమాయెనే మాలాచ్చి
> తవ్వతో తవ్వేడూ గవ్వలెండాబోసి
> మెల్క జల్లెన సౌటపొలం ఎదిగొచ్చిపండే"

దళిత స్త్రీలు సైతం పురుషులతో సమానమైన పనులు చేస్తారని, స్త్రీలలోని జానపద కళారూపాల్ని ఈ పాత్ర ద్వారా చిత్రించారు.

### 3.2.4.17. సీతమ్మ (కల్లుమండువ)

సీతమ్మ రామయ్య భార్య. వీరిది గౌడవృత్తి కుటుంబం. వీరికి ముగ్గురు సంతానం. రామయ్య తండ్రి బోడయ్య తాటి చెట్టుపై నుండి పడి మరణిస్తాడు. తరువాతి కాలంలో రామయ్య కూడా తాటి చెట్టుపై నుండి పడి మరణిస్తాడు. దాంతో సీతమ్మ దిక్కులేనిదవుతుంది. కుటుంబ పోషణ భారం మీద పడుతుంది. భర్త చనిపోవడంతో బాధలో ఉన్న సీతమ్మను దగ్గరి బంధువైన ఎర్రయ్య వచ్చి ధర్మభిక్షం పోరాటం గురించి చెప్పి ఆమెలో ధైర్యాన్ని నింపుతాడు.

సీతమ్మకు అదే గ్రామానికి చెందిన సాయన్న తాల్లు ఎక్కి కల్లు పోయడంతో, కల్లు అమ్ముకొని జీవనం సాగిస్తుంది. భర్తలేని ఆడదంటే అందరికి చిన్న చూపే. కొందరు కల్లు కావాలని వచ్చి ద్వందర్థాల మాటలు మట్లాడుతారు. అలాంటి వారిని ఎదురిస్తే కల్లు అమ్ముకోవడం కష్టమని, అన్నా అని ఇంట్లోకి పిలిచి కల్లు పోస్తుంది. ఈ విధంగా స్త్రీలు వేధింపులు ఎదుర్కోవాల్సి వస్తుంది. బిడ్డ స్వరాజ్యం పెండ్లి చేస్తుంది. పెండ్లైన పది సంవత్సరాలకు స్వరాజ్యం భర్త చెట్టు మీద నుండి పడి మరణిస్తాడు.

సీతమ్మ చిన్నతనంలో భర్తను కోల్పోయిన స్త్రీగా, గౌడ సంఘం, ఎర్రన్న, సాయన్న లాంటి ప్రోత్సాహం కల్గిన స్త్రీగా, వేధింపులను ఎదుర్కోని జీవితంలో ముందడుగా వేసిన స్త్రీగా మగవారితోపాటు పనిచేసే స్త్రీ పాత్రగా సీతమ్మ కనిపిస్తుంది.

### 3.2.4.18. స్వరాజ్యం (కల్లుమండువ)

స్వరాజ్యం సీతమ్మ కూతురు. తల్లికి కల్లు అమ్మడంలో సహకారాన్ని అందిస్తుంది. ఎర్రయ్య కొడుకుతో పెండ్లి జరుగుతుంది. పెండ్లైన పది సంవత్సరాలకు భర్త తాటి చెట్టు మీది నుండి పడి చనిపోవడంతో కష్టాలు మొదలవుతాయి.

స్వరాజ్యం భర్త చనిపోయినందుకు వచ్చే ఎక్స్‌గ్రేషియా డబ్బుల కోసం నల్గొండలోని అబ్కారి ఆఫీసుకు వెళ్తుంది. అక్కడ గుమాస్తా సుగుణమూర్తి సహకారాన్ని అందిస్తాడు. కాని హెడ్ క్లర్క్ యొక్క అవినీతిని చూసిన స్వరాజ్యం బాధపడుతుంది. కేవలం ఫైలు చూడడానికే వందరూపాయలు తీసుకుంటారు. మొత్తం ఎక్స్‌గ్రేషియా డబ్బులు చేతికి రావాలంటే ఎంత ఇవ్వాలో అనుకుంటుంది. ధర్మభిక్షం నేతృత్వంలో గీతకార్మికుల పోరాటం ద్వారా పెండింగ్ కేసులు పరిష్కారమై అందరికి ఎక్స్‌గ్రేషియా డబ్బులు అందుతాయి.

స్వరాజ్యం చిన్నతనంలో తండ్రి కోల్పోయిన బిడ్డగా, పెళ్ళయ్యాక భర్తను కోల్పోయిన భార్యగా, ఎక్స్‌గ్రేషియా కొరకు అనేక ఇబ్బందులు పడ్డ పాత్రగా స్వరాజ్యం కనిపిస్తుంది.

### 3.2.5. అప్రధాన పాత్రలు

#### 3.2.5.1. ముత్యం (సుషుప్తి)

ముత్యం గోవిందు మొదటి భార్య. ముత్యంకు చిన్నతనంలో పెండ్లి చేస్తారు. ముత్యం స్తబ్దంగా ఉండడమేగాక, ఇంటిలో పనులు కూడా చేయదు. అత్త తన కాళ్ళకడియాలు, చెవికమ్మలు తీపిస్తుంటే ఎదురు అడగక, ఆమె చెప్పే మాటలను నమ్మి తన అమ్మ గురించి చెప్తుంది. అత్తగారింటి దగ్గర ఉండలేకపోతుంది. దాంతో అమ్మగారింటికి పారిపోవడంతో తరువాత గోవిందుతో విడాకులవుతాయి. తర్వాత వేరే వారితో పెళ్ళి నిశ్చయమవుతుంది.

ముత్యం గోవిందు భార్యగా, చిన్నతనంలో పెళ్ళైన అమ్మాయిగా, అమాయకురాలిగా, పెండ్లి, జీవితంపట్ల అవగాహన లేని అమ్మాయిగా కనబడుతుంది.

#### 3.2.5.2. ఎల్లమ్మ (సుషుప్తి)

ఎల్లమ్మ ముత్యం తల్లి. భర్తను అదుపులో ఉంచుకుంటుంది. ముత్యం పెండ్లిలో పెట్టాల్సిన ఆభరణాలు పెట్టకపోవడంతో కోపగిస్తుంది. ఆభరణాలు బాలయ్య తేవడంతో సంతోషపడుతుది. కూతురికి అత్తగారింటి దగ్గర సరైన ఆహారంలేక చిక్కిపోవడం చూసి తల్లిగా బాధపడుతుంది.

ముత్యంకు పెళ్ళిలో పెట్టిన ఆభరణాలు లేకపోవడంతో కూతుర్ని ఇంటికి తీసుకొచ్చుకుంటుంది. ఆభరణాలు పెడితేనే పంపిస్తానని చెబుతుంది. పెద్దమనుషులు సర్దిచెప్పడంతో కూతుర్ని తిరిగి అత్తగారింటికి పంపుతుంది. తరువాత ముత్యం ఇంటికి పారిపోయి రావడంతో గోవిందుతో విడాకులవుతుంది. ముత్యంకు వేరే వారితో పెళ్ళి కుదుర్చుతుంది.

ఎల్లమ్మ తన ఇంటిలో అజమాయిషి చేసే స్త్రీగా, బిడ్డ పెండ్లిలో పెట్టాల్సిన ఆభరణాల గురించి నిలదీసే పాత్రగా ఎల్లమ్మ కనబడుతుంది.

### 3.2.5.3. వీరయ్య (గువ్వల చెన్నా)

చిప్పమల్లయ్య రెండో కొడుకు. వీరయ్య భార్య లక్ష్మి. కొడుకులు రాజేశం, లక్ష్మిరాజం. మొదట ఆదిలాబాద్‌వైపు వెళ్ళి బట్టలు అమ్మేవాడు. తర్వాత తండ్రి వారసత్వాన్ని తీసుకొని నేతబట్టలు, ధోతులు, నవారా నేస్తూ జీవనం సాగిస్తుంటాడు. రాజేశం దుబాయికి వెళ్ళినపుడు, లక్ష్మీరాజం ఆధునిక సాంచన్లు పెట్టుకుంటానని చెప్పినపుడు కొంత వ్యతిరేకించిన తమ్ముడు శంకరయ్య మాటను గౌరవించేవాడిగా కనబడుతాడు. వీరయ్య తండ్రి వారసత్వమైన నేతపనిని వారసత్వంగా తీసుకున్న పాత్రగా కనబడుతుంది.

### 3.2.5.4. రాజేశం (గువ్వల చెన్నా)

రాజేశం వీరయ్య పెద్దకొడుకు. చదువుపై ఆసక్తి లేకపోవడంతో దుబాయ్‌కి వెళ్ళి అక్కడ పనిచేసి సంపాదించాలనే ఆలోచన కల్గి ఉంటాడు. దానికి కుటుంబంలోని అందరిని ఒప్పించి వెళ్ళి డబ్బులు సంపాదించుకొని వస్తాడు. రాజేశం దూరదేశమైన వెళ్ళి డబ్బు సంపాదించాలనే వ్యక్తి. ఆర్థికంగా ఎదిగినపుడు మాత్రమే తోటివారు విలువ ఇస్తారనే ఆలోచన కలిగిన పాత్ర రాజేశం.

### 3.2.5.5. రాజలింగం (గువ్వల చెన్నా)

రాజలింగం చిప్పమల్లయ్య, లింగమ్మల పెద్దకొడుకు. రాజలింగం భార్య లచ్చవ్వ. కొడుకు శ్రీరాం. తండ్రి చేసే చేనేత పని చేస్తూనే, ఆదిలాబాద్ వైపు వెళ్ళి బట్టల వ్యాపారం చేస్తుంటాడు. తన తండ్రి పరిస్థితిని చూసి, తన పరిస్థితిని అంచనా వేసుకొని భీవండికి వెళ్ళి అక్కడ కొంత డబ్బు సంపాదించి ఎదుగుదామనుకుంటాడు. తల్లిదండ్రులు వద్దన్నా వినకుండా భార్య గర్భిణిగా ఉన్నా వెళ్తాడు. భీవండిలో జరిగిన మత ఘర్షణలల్లో కత్తులతో పొడవబడి చనిపోతాడు.

తండ్రి చేసే పనిని చేసే వ్యక్తిగా, ఆర్థికంగా కొంత ఎదగాలనే ఆలోచనతో ఉన్న వ్యక్తిగా, దూరప్రాంతాలు వెళ్ళి ప్రాణాలు కోల్పోయిన వ్యక్తిగా రాజలింగం పాత్ర కనిపిస్తుంది.

### 3.2.5.6. భారతి (సంకెళ్ళు తెగాయి)

భారతి సంఘ సేవకురాలు. భారతి తండ్రి హరిజనుడు. హరిజనులకు వైద్యసేవలు అందిస్తూ తల్లి లేకపోవడంతో భారతికి తానే తల్లి తండ్రిగా పెంచారు. అభ్యుదయ భావాలుగల ఆనందరావుని ఇష్టపడి వివాహం చేసుకుంటుంది భారతి. సంఘ సేవకురాలిగా భారతి కూతురు అనలను కూడా మంచి మార్గంలో పెంచుతుంది.

### 3.2.5.7. సుశీల (సంకెళ్ళు తెగాయి)

సుశీల రాజేశ్వరరావు కూతురు. భర్తతో అమెరికా పోయివచ్చిన ఇంకా సామాజిక అవగాహన లేని వ్యక్తి. నారాయణను చదువు ఎందుకు మంగలి పని చేసుకో అనడంతో ఆమె స్వభావం తెలుస్తుంది. విదేశాలకు వెళ్ళి అక్కడ ఉన్నప్పటికి ఇంకా మార్పు చెందని వ్యక్తిగా మనకు కనబడుతుంది.

**3.2.5.8. అనంత శర్మ (సంకెళ్ళు తెగాయి)**

అనంతశర్మ పాత్రికేయుడు. ఢిల్లీలో వుంటాడు. ఆనందరావుకి మిత్రుడు. బ్రహ్మచారి. తనపనులు తానే చేసుకునేవాడు. అనంతశర్మ నాస్తికుడు. పాత్రికేయుడిగా, తన పనులు తానే చేసుకునే వాడీగా అనంతశర్మ పాత్ర చిత్రించబడింది.

**3.2.5.9. ఆనందరావు (సంకెళ్ళు తెగాయి)**

ఆనందరావు బ్రాహ్మణుడు. అభ్యుదయ భావాలు కలవాడు. భారతి సంఘసేవకు నచ్చి వివాహం చేసుకుంటాడు. కూతురు అనలను కూడా అభ్యుదయ భావాలతో పంచుతాడు. ఆనందరావు మంచి లాయర్. రాష్ట్రంలో నక్సలైట్ ఉద్యమకాలంలో వాళ్ళకు ఫీజు తీసుకోకుండానే వాదించేవాడు. నిరాడంబరుడిగా ఆనందరావు పాత్ర మనకు కనబడుతుంది.

**3.2.5.10. లింగప్ప, సోమయ్య (సంఘము)**

వీరు పద్మశాలీ . వీరి సంభాషణ ద్వారా గ్రామంలోని సమస్యలను, జరిగే సంఘటనలను వివరిస్తాడు రచయిత. గ్రామం నుండి బొంబాయి వెళ్ళిన వారు జీవించే విధానం గ్రామానికి వచ్చి తిరిగివెళ్ళేటప్పుడు ధనం లేకుండా ఖర్చు చేయడం. నర్సయ్యలాంటి మంచి వ్యక్తులకు సమాజంలో బతకడం కష్టమని, దొరలాంటి దుర్మార్గులను చూసి ఆ దేవుడు కూడా భయపడుతాడని అంటారు. నాగనాథం ఇంట్లో దొంగలుపడి బంగారం దోచుకోవడం కూడా దొర పనేనని, పోలీసులు కూడా ఇలాంటి వారికి సహకరిస్తారు. పోలీసులు అందరూ ఒకేలా ఉండరని అంటారు. లింగప్ప, సోమయ్యల ద్వారా గ్రామ పరిస్థితులు, బొంబాయికి వెళ్ళి బతికే వారి పోకడలను, దొరల దౌర్జన్యాలను మనముందుంచారు.

**3.2.5.11. ఎల్లాగౌడ్ (పెరటి చెట్టు)**

గంగమ్మ తండ్రి ఎల్లాగౌడ్. కూతురి బాధలు చూడలేక అవసరమైతే వేరేవ్యక్తికి ఇచ్చిపెళ్ళి చేయాలనుకుంటుంటాడు. రాజాగౌడ్ సంపాదించకున్న తన బిడ్డతో అన్యోన్యంగా ఉండాలని కోరుకునే పాత్ర. కూతురి శ్రేయస్సు కోరే తండ్రిగా, కూతురి మాటపై ఆమెను అత్తగారింటికి పంపిన తండ్రిగా ఎల్లాగౌడ్ కనబడతాడు.

**3.2.5.12. మోహిత్కం (పెరటిచెట్టు)**

అబ్కారి అధికారి. కొత్తగా ఉద్యోగంలో చేరుతాడు. అధిక సంపాదనకు ఆశపడే వ్యక్తిగా మనకు కనిపిస్తాడు. కారుకొనాలనే కోరికను రాజాగౌడ్ సలహాతో తీర్చుకుంటాడు. లంచం తీసుకునే అధికారిగా కనబడుతాడు. అబ్కారి అధికారిగా, లంచం ద్వారా వచ్చిన ధనంతో కారు కొనాలనే కోరిక కలిగిన వాడిగా కనబడతాడు.

**3.2.5.13. రాంభట్ల కృష్ణమూర్తి (కల్లుమండువ)**

రాంభట్ల కృష్ణమూర్తి జర్నలిస్ట్. ఈనాడు జర్నలిజం స్కూలు నిర్వాహకులు. గీత కార్మికుల సమస్యలపై స్పందిచే గుణం కల్గినవాడు. తాటి చెట్టు గురించి సాహిత్య సభలో మాట్లాడుతూ తాటాకు రాయడానికి ప్రధాన వనరు అని, తాటాకు సాహిత్యాన్ని భద్రపరిచిందని చెప్తారు. తాటాకుతో గొడుగులు, తాటాకు పందిర్లు వేయడానికి ఉపయోగిస్తారు. తాటికమ్మల స్థానంలో నేడు బంగారు, వెండి కమ్మలు వచ్చాయని చెప్తారు. కొన్ని ప్రాంతాలకు తాటి పేరు మీదుగా తాళ్ళసింగారం, తాడ్‌బన్, ఈదులూర్ లాంటి పేర్లు వచ్చాయని వివరిస్తాడు. ధర్మభిక్షం పోరాటంతో గీతకార్మికుల జీవితాలలో ఆనందం వచ్చిందని పేర్కొంటాడు.

జర్నలిస్టుగా, గీతకార్మికుల సమస్యలపట్ల, తాటి వస్తువుల ఉపయోగంపట్ల అవగాహన కల్గిన వ్యక్తిగా రాంభట్ల కృష్ణమూర్తి కనబడుతుంది.

**3.2.5.14. కిరణ్ (కల్లుమండువ)**

కిరణ్ వీరభద్రరావు మనవడు. ధర్మభిక్షం ద్వారా తాటివృక్షం ఉపయోగాలను తెలుసుకుంటాడు. తాటితో బెల్లం, చెక్కర పదార్థాల తయారీ, వీధులను శుభ్రపరిచే చీపుర్లు (బ్రూమ్స్), సంచులు ఇలా అనేక విషయాలు తెలుసుకుంటాడు. కిరణ్ చిన్నవాడైనప్పటికి కొత్త విషయాన్ని తెలుసుకోవడంలో ఉత్సుకతను ప్రదర్శిస్తాడు. కిరణ్ చిన్నపిల్లవాడు, ధర్మభిక్షం ద్వారా తాటి ఉత్పత్తులు, వాటి ఉపయోగాలు తెలుసుకునేవాడిగా కిరణ్ పాత్ర కనబడుతుంది.

**3.2.6. సేవక పాత్రలు**

**3.2.6.1. నాజరు (కక్క)**

పెద్ద పటేలు దగ్గర గ్రామంలో పనిచేసే మస్కూరి (బంట్రోతు) లాంటివాడు నాజరు (ముస్లిం). గ్రామంలో పంచాయితీలు జరిగినప్పుడు ఎవరినైనా పిలవాల్సి వస్తే నాజరే వెళ్ళి పిలవాలి. పటేలు ఇంటి పనులన్ని తానే చూడాలి. పటేళ్ళకు, మాదిగవారికి గొడవ జరుగుతున్నప్పుడు ఇతడు మాదిగవారివైపు నిలబడి రహస్య సలహాలు ఇస్తూ ఉంటాడు. వారి బలాన్ని, ఐకమత్యాన్ని గుర్తుచేసి మాదిగ వారిని పటేళ్ళపై తిరుగుబాటు చేయమంటాడు. తను పటేలు చేతిలో దోపిడికి గురైన వాడినేనని చెప్తాడు.

నాజరు బంట్రోతుగా, దోపిడికి గురైన వాడిగా, దళితులలో చైతన్యం కల్గించిన పాత్రగా కనబడతాడు.

**3.2.6.2. గఫ్రూసాబ్ (సంఘము)**

నాగనాథంసేటు దగ్గర జవానుగా ఉంటాడు. అప్పులు వసూలు చేయడం ఇతనిపని. ఏలాంటి మొండిబకాయిలను సైతం వసూలు చేస్తాడు. అప్పుల వాళ్ళ ఇంటిచుట్టూ తిరిగినందుకు రోజు ఒకరూపాయి బత్తెంగా అతనికి వచ్చేస్తుంది.

గఫ్రూసాబ్ జవానుగా పని చేయడంలో నిరంకుశంగా ఉండే వ్యక్తిగా, అప్పులవారెవరైనా సేటుకు లేదని చెప్పే సందర్భంలో వారిచ్చే డబ్బులకు ఆశపడిన వ్యక్తిగా కనబడతాడు.

**3.2.6.3. దావూద్ (సుషుప్తి)**

దావూద్ షావుకారి దగ్గర పనిచేస్తుంటాడు. ఇతనికి ఇద్దరు భార్యలు. షావుకారి దగ్గర అప్పులు తీసుకున్న వారి దగ్గరినుండి వాయిదాల ప్రకారం డబ్బులు వసూలు చేయడం ఇతనిపని. తప్పుడు లెక్కలు రాస్తూ, వాయిద సమయానికి డబ్బులు కట్టలేనివారు కొంత డబ్బు ఇవ్వడంతోపాటు కల్లు, సారా తాగిస్తారు. అంతేగాక దావూద్ తన దగ్గర ఉన్న కొంతడబ్బును అప్పులు ఇచ్చి వసూలు చేసుకుంటాడు. దావూద్‌కి ప్రభుత్వ ఉద్యోగం వచ్చినప్పటికీ వెళ్ళడు. దానికిగల కారణం ఇక్కడ ఆదాయం ఎక్కువగా రావడమే.

గోవిందు భార్య చుక్కమీద దావూద్‌కి కోరిక కలిగి ఆమెను లోబరుచుకోవాలని చూస్తాడు. కాని చుక్క లొంగకపోవడంతో గోవిందుకు చుక్కపట్ల అనుమానాన్ని కలిగించి ద్వేషించేలా చేస్తాడు. గోవిందు కుటుంబానికి తిండి లేనప్పుడు దావూద్ సహాయం చేసి చుక్కను తనవైపు మలుపుకుంటాడు. గోవిందు చుక్కను కొట్టడంతో దవాఖానలో చేరుతుంది. పట్నంలో దావూద్ చుక్కతో కలిసి ఉంటూ వ్యాపారాలు చేసుకుంటూ ఉంటాడు. గోవిందు దావూద్ ఇంటికివచ్చి చుక్కను చూసి అడగగా నువ్వు వద్దనుకున్నావు, నేను కావాలనుకున్నానని గోవిందుకు సమాధానం చెప్తాడు దావూద్.

దావూద్ ఇతరులను మోసగించేవాడిగా, షావుకారి అప్పులు వసూలు చేసేవాడిగా, తను కావాలనుకున్న దానికోసం ఎలాంటి పని చేయడానికి వెనకాడని వ్యక్తిగా, తప్పుడు లెక్కలు రాసి పేదలను దోచుకునేవాడిగా దావూద్ పాత్ర చిత్రణ జరిగింది.

### 3.2.7. వ్యాపారవర్గ పాత్రలు

#### 3.2.7.1. శివలింగం సేటు (పెరటి చెట్టు)

కల్లు మాములాల (కాంట్రాక్టు) ద్వారా జీవనం సాగిస్తాడు. వ్యాపార దృక్పథం కల్గిన వ్యక్తి. కొన్ని చెట్లకు పన్ను చెల్లించి, మిగతా చెట్లకు పన్ను చెల్లింకుండా ఆదాయాన్ని సమకూర్చుకుంటాడు. రాజాగౌడ్‌కు విలువ ఇవ్వడు. తరువాత మెహత్మిం తనిఖీలో తను పన్ను చెల్లించకుండ గీపించే చెట్ల గురించి తెలుస్తుందని భయపడి రాజాగౌడ్‌తో స్నేహం కుదుర్చుకుంటాడు.

వ్యాపార దృక్పథం కల్గిన వాడుగా, ప్రభుత్వ ఆదాయానికి గండికట్టి, తన ఆదాయాన్ని పెంచుకునే పాత్రగా శివలింగం సేటు కనబడతాడు.

#### 3.2.7.2. నాగనాథం (సంఘము)

నాగనాథం కొమటి కులస్తుడు. బుక్కరావుపేటకు వలసగా వెళ్తాడు. అతడు అక్కడికి వచ్చినప్పుడు ఏమిలేనివాడు. తరువాత ఆగ్రామంలో సరుకులు అమ్మడం, అధిక వడ్డీలకు అప్పులు ఇవ్వడం ద్వారా లక్షాధికారిగా మారుతాడు. వడ్డీ ఎక్కువగావున్న అందరికీ ఆపద సమయంలో డబ్బు ఇచ్చి ఆదుకునేవాడు. నాగనాథం భార్య కూడా ఇతని ప్రవర్తనకు తగిన విధంగా ఉంటుంది. నాగనాథం తనిచ్చే అప్పులు వసూలు చేయడానికి గఫ్రూ సాబ్‌ను జవానుగా నియమించుకుంటాడు.

నాగనాథం ప్రజలను దోచుకునే వాడీగా, ఖాళీ చేతులతో వచ్చి ధనవంతుడిగా మారిన వ్యక్తిగా కనబడతాడు.

#### 3.2.7.3. రంగమ్మ (సుషుప్తి)

కోమటి రంగమ్మ దుకాణం నడుపుతూ జీవితం కొనసాగిస్తుంది. తన దగ్గరికి వచ్చినవారికి అరువుకింద సామాను ఇచ్చి తరువాత వసూలు చేసుకుంటుంది. ఎంకమ్మ కూడా

నూనె, బెల్లం, పప్పు కోసం వస్తుంది. తన దగ్గర డబ్బులు లేవని అరువు అడుగుతుంది రంగమ్మను. ఎంకమ్మకి సామాను ఇస్తుంది రంగమ్మ. నూనె ధర ఎనిమిది రూపాయలు కిలో ఉంటే పదకొండు రూపాయలకు అమ్ముతుంది. ఇతరుల అవసరాలను ఆసరాగా చేసుకొని ఎక్కువ ధరలకు సామాన్లు అమ్మి, వారిని దోచుకుంటుంది రంగమ్మ.

రంగమ్మ కోమటి కులానికి చెందిన ఆవిడ. ఇతరుల అవసరాలను గుర్తించి వారిని ఆర్థికంగా దోపిడి చేసే గుణంగల పాత్ర రంగమ్మగా చిత్రించబడింది.

### 3.2.8. సహాయక పాత్రలు

#### 3.2.8.1. సుభాష్ (మోహిని)

సుభాష్‌ది మోదుపుర గ్రామం. హైదరాబాదులో నిజాం కాలేజీలో డిగ్రీ పూర్తి చేసి సివిల్స్‌కి ప్రిపేర్ అవుతుంటాడు. సమాజంలో ఉన్న సమస్యలపట్ల అవగాహన కలిగిన వ్యక్తిగా, అతడు కాటమయ్య, మోహినితో మాట్లాడే సందర్భంలో మనకు తెలుస్తుంది. తెలియని విషయాలను తెలుసుకోవాలనే తృష్ణకలవాడు. కాటమయ్యతో మద్యపాన నిషేదం గురించి, బి.సి. క్రిమిలేయర్‌తో నష్టపోతున్న విషయాలను, గౌడ వృత్తిదారుల సాధక బాధలను చర్చిస్తాడు. సుభాష్‌కి మోహినిపై ప్రేమ వుంటుంది. మోహిని మంత్రి అయ్యాక ఆమెను పెండ్లి చేసుకుందామనే ఆలోచనతో వెళ్తాడు. కాని కాటమయ్య మాకు అలాంటి ఉద్దేశ్యం లేదని చెప్పడంతో తన మేనమామ కూతురిని చేసుకుంటానని చెప్తాడు.

#### 3.2.8.2. రాముల (సుషుప్తి)

రాముల ఎంకమ్మ పక్కింటామె. ఎంకమ్మ కుటుంబానికి మిత్రురాలిగా, ఆపదలో సహకరించే వ్యక్తిగా కనబడుతుంది. గోవిందు పెండ్లిలో పెళ్ళి కూతురుకు పెట్టాల్సిన చెవికమ్మలు, కడియాలు కావాలని బాలయ్య బతిమిలాడినపుడు తన కూతురివి ఇచ్చి వారి విలువను కాపాడుతుంది.

ప్రతిసారి బదులు ఇవ్వలేక ఎంకమ్మతో ఒకసారి పప్పులేదని చెబుతుంది. రాముల ఇంట్లో పప్పు ఉన్న విషయం తెలిసి ఎంకమ్మ గొడవ చేసినపుడు ఇష్టం ఉంటే పెడతారు లేకపోతే లేదని ఖచ్చితంగా చెప్పడమే కాదు తను ఇచ్చిన నగలు నగలివ్వమని గట్టిగా అడుగుతుంది.

ఎంకమ్మ చనిపోయినపుడు ఇంట్లో ఆడదిక్కు ఉండాలని బాగయ్యతో చెప్పి గోవిందును అడిగిస్తుంది. చుక్కను గోవిందు కొట్టినపుడు దవాఖానలో చేర్పించగానే చుక్క తల్లికి సమాచారం పంపుతుంది.

రాముల అవసరాలకు సహాయపడే వ్యక్తిగా, ప్రతిసారి బదులు అడగడమే కాకుండా హక్కుగా ఎదుటివ్యక్తి భావించినపుడు ఇవ్వనని చెప్తుంది. తోటిస్త్రీని ఆదుకునే దానిగా రాముల పాత్ర ఉంది.

### 3.2.8.3. మీనయ్య (సుషుప్తి)

మీనయ్య రాముల కొడుకు. గ్రామం నుండి పట్నంకు పనికోసం వెళ్తాడు. గోవిందు తోటమాలి. సినిమా చూసి తనూ తోటమాలి కావాలని చెప్పినప్పుడు మీనయ్య సినిమాలో జరిగిన విధంగా నిజజీవితంలో జరగదని చెప్తాడు. పట్నంలో ఉండడంతో అంగి, లాగు వేసుకుంటాడు. అది చూసి మీనయ్య తన దుస్తువులను అడగడంతో ఇస్తాడు. వాటిని గోవిందు వేసుకొని దేవకికి చూపించాలని వెళ్ళినప్పుడు అక్కడ గోవిందును దొంగగా భావించి కొట్టి పోలీసులకు అప్పగించాలని చూసే సందర్భంలో అటువైపు వెళ్ళిన మీనయ్య అసలు విషయం తెలిసి సమయస్ఫూర్తితో వ్యవహరించి గోవిందును కాపాడతాడు.

గోవిందు తల్లిదండ్రులను కోల్పోయి, భార్యను వెళ్ళగొట్టి తాగుడుకు బానిసగా మారిన అతన్ని చూసి పని చేసుకొని బతకమని చెప్పి పట్నంకు తీసుకెళ్తాడు. మీనయ్య కార్మికుడిగా గోవిందుకు స్నేహితుడిగా, జీవితం పట్ల అవగాహన కల్గిన వాడిగా మీనయ్య పాత్ర కనిపిస్తుంది.

### 3.2.8.4. లక్ష్మీరాజం (గువ్వల చెన్నా)

లక్ష్మీరాజం వీరయ్య చిన్నకొడుకు. సాంప్రదాయంగా వస్తున్న మగ్గాల కన్న అధునాతన మరమగ్గాల ద్వారా ఆదాయం లభించి జీవితంలో ఎదగాలనుకుంటాడు. సహకార సంఘాలు, ప్రభుత్వాలు సహాయాన్ని అందిస్తున్నాయని తెలిసి కుటుంబాన్ని ఒప్పించి అందులో అడుగు పెడతాడు. ప్రభుత్వ సబ్సిడీలు, సహకార సంఘాల పనితీరు సరిగ్గా లేకపోవడంతో తాను తయారు చేసిన బట్ట అమ్మకం జరగక కుప్పలుగా పేరుకుపోతుంది. దాంతో అప్పులు పెరిగి చివరకు ఆత్మహత్య చేసుకుంటాడు.

లక్ష్మీరాజం కాలానుగుణంగా ఆధునికతను ఆదరించే వ్యక్తి. సహకార సంఘాల, ప్రభుత్వ వైఫల్యంతో ఆత్మహత్యకు గురైన పాత్రగా లక్ష్మీరాజం చిత్రించబడ్డాడు.

### 3.2.8.5. రమేశ్ (గువ్వల చెన్నా)

రమేశ్ శంకరయ్య కొడుకు. కంప్యూటర్ ఇంజనీరు. బెంగళూరులో పని చేస్తుంటాడు. అక్కడే ఉన్నత కుటుంబానికి చెందిన మల్లీశ్వరిని ప్రేమిస్తాడు. ఆమె కూడా కంప్యూటర్ ఇంజనీరే. రమేశ్ తండ్రి సలహా మేరకు మల్లీశ్వరి తనను చూసి లేదా తన సంస్కృతిని చూసి ప్రేమించేది తెలుసుకోవాలనుకుంటాడు. రమేశ్ మల్లీశ్వరితో అమెరికా వెళ్ళడం ఇష్టం లేదని చెప్తాడు. దానికి ఆమె వ్యతిరేకిస్తుంది. దాంతో రమేశ్ బాధపడతాడు. ఇంటికి తిరిగి వచ్చిన రమేశ్ తండ్రితో జరిగిన విషయం చెప్పి మీరు చూసిన అమ్మాయిని పెళ్ళి చేసుకుంటానంటాడు. ఎన్ని కండీషన్లు పెట్టినా మల్లీశ్వరితో పెళ్ళి వద్దంటాడు. ఇంతలో మల్లీశ్వరి వచ్చి అసలు విషయం చెప్పడంతో అందరూ ఆశ్చర్యానికి గురవుతారు. రమేశ్ మంచి ఉద్యోగం ఉన్న వ్యక్తిగా, కులాంతర వివాహాన్ని ఇష్టపడేవాడిగా, తమ సంస్కృతిని తాము గౌరవించేవారే కావాలి కాని ఆస్తులు వద్దనేపాత్ర రమేశ్.

రమేశ్ కంప్యూటర్ ఇంజనీరుగా, తండ్రి ఆలోచనల్ని, ఆశయాల్ని, తమ సంస్కృతులను గౌరవించడమే కాకుండా కులాంతర వివాహం చేసుకున్న ఆదర్శ పాత్రగా కనబడతాడు.

### 3.2.8.6. అయ్యమ్మ (కక్క)

కక్క నాయినమ్మ అయ్యమ్మ. కక్క తల్లి కలెమ్మ గర్భవతిగా ఉన్నప్పుడు ఎంతో జాగ్రత్తగా చూసుకుంటుంది. కక్క నాన్న చనిపోయిన తర్వాత కలెమ్మని, కక్కని కష్టపడి పోషిస్తుంది. ఈ పాత్ర ద్వారా అత్తాకోడళ్ళ మధ్య సంబంధాలు చెప్పబడ్డాయి.

### 3.2.8.7. వెంకయ్య (సంఘము)

వెంకయ్యది పద్మశాలి కుటుంబం. తను నేసిన వస్త్రాలు అమ్ముడు పోకపోవడంతో ఇబ్బంది పడుతుంటాడు. నాగనాథం సేటు దగ్గర ఇరవై రూపాయలు అప్పుతెచ్చుకొని తీర్చలేని పరిస్థితి ఏర్పడుతుంది. అతని జవాను గఫ్రూ వచ్చి ఇంటిముందు కూర్చోని అవమానంగా మాట్లాడుతాడు. దాంతో ఏదైనా వస్తువు అమ్మి అప్పు తీర్చాలనుకుంటాడు. ఇంతలో నర్సయ్య రావడం, అతడి సహాయంతో అప్పు తీర్చడం జరుగుతుంది. గ్రామంలో చేనేత వస్త్రాలకు గిరాకి లేకపోవడంతో ఇద్దరు కొడుకుల్ని బొంబాయి పంపిస్తాడు. వారు మొదటి రెండు సంవత్సరాలు బాగానే సంపాదిస్తారు. కాని తరువాత అక్కడి వాతావరణానికి అలవాటుపడి వచ్చిన ఆదాయాన్ని విలాసాలకు ఖర్చు చేయడం ప్రారంభిస్తారు. ఇదే విషయం గురించి మాట్లాడుకుంటున్న లింగప్ప, సోమయ్యలతో చెప్పి బాధపడ్తాడు. లాయరు ప్రసాదు ప్రోత్సలంతో సహకార సంఘాలు రావడంతో అతనికి సంతోషం కలుగుతుంది.

నేత వృత్తి ఆదరణలేని కారణంగా జీవనం కష్టమైనదిగా, కొడుకులను బొంబాయి పంపిస్తే వారు విలాసాలకు అలవాటుపడటంతో కుటుంబం ఆర్థికంగా ఎదగలేని స్థితిని చూసి బాధ పడే వ్యక్తి పాత్రగా వెంకయ్యని చిత్రించారు.

### 3.2.8.8. ధర్మయ్యగౌడ్ (బతుకుతాడు)

ధర్మయ్యగౌడ్‌ది జగిత్యాల దగ్గర హన్మాజిపేట. ధర్మయ్యగౌడ్ భార్య లింగమ్మ. వీరు గౌడ కులస్థులు. వీరి  ముగ్గురు కొడుకులు, ముగ్గురు బిడ్డలు. కొడుకులు భూమయ్య, నారాయణ,

లక్ష్మణ్. బిడ్డలు – సత్తవ్వ, ఎల్లవ్వ, నర్సవ్వ. వీరి కుటుంబం కులవృత్తిమీద ఆధారపడి నడుస్తుంది. కొడుకులకు, బిడ్డలకు పెళ్ళిళ్ళు చేశాడు. ఎంత కష్టమొచ్చిన ఉన్న ఊర్లోనే ఉండి జీవించాలనేది ధర్మయ్యగౌడ్ మనస్తత్వం. పెద్ద కొడుకు భూమయ్య గౌడ్ బొంబాయి పోయివచ్చి పెళ్ళాం పిల్లలతో బొంబాయిలో కల్లు దుకాణం నడుపుతానంటాడు దానికి ధర్మయ్యగౌడ్ మన ఊరు, మన భాష కాదని, అక్కడ బ్రతకడం కష్టమని కొడుకును బొంబాయికి పంపించలేని పరిస్థితిలో ఉంటాడు. కొడుక్కి ఎన్ని విధాల చెప్పిన వినకపోవడంతో సరే అంటాడు. భార్య లింగమ్మకు కండ్లు సరిగ్గా కనబడవు. నకిలి వైద్యునివల్ల అసలు కండ్లు కనబడకుండ పోతాయి. దానితో తానే భార్యకు కావాలసిన అన్నం వండటం మొదలు అన్ని అవసరాలు చూసుకుంటాడు.

తాను తాటి చెట్లు ఎక్కే పరిస్థితిలో లేనని, తనను మీరే చూసుకుంటారనుకుంటే నిన్ను చూసి మీ తమ్ములిద్దరు వెళ్ళిపోతే పరిస్థితి ఎలా అని ధర్మయ్యగౌడ్ అడుగుతాడు. రెండోకొడుకు నారాయణ గౌడ్ ఊరి దొర లక్ష్మణరావు పటేలుకు ఒకసారి కల్లు పోయకుంటే నారాయణను దొర ఇంట్లో కట్టేసి కొట్టినా, నా కొడుకు ఏమి అన్యాయం చేశాడు అని ధైర్యంగా అడగలేని స్థితి ధర్మయ్యగౌడ్‌ది. ఆనాడు దొరలకు భయపడే తత్వం, వారు పెట్టే బాధలను భరించే గుణం ప్రజలలో ఉందని అర్థమవుతుంది.

చిన్నకొడుకు లక్ష్మణ్ గౌడ్ గ్రామ పంచాయితి ఎన్నికల్లో వార్డ్ మెంబర్‌గా పోటీ చేస్తాడు. ఆ సందర్భంలో "అవుర లచ్చువన్న యెనుకటి నుంచి వాల్లె దొరలు రంగయ్య పటేలు ఊల్లెనించి పోతుంటే అందరు ఇంట్లకుపోయి తలుపేసుకునేటోల్లు... లేకుంటే వాల్లు ఎవలను బతకనిచ్చింద్రు. వాల్లకు ఎదురు తిరగవద్దు" (పుట: 34) అంటాడు. కాలం మారిన దొరల పెత్తనం మారలేదని, వారికి ఎదురుగా నిలబడితే తరువాత ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ధర్మయ్యగౌడ్ తన అనుభవంతో కొడుక్కి చెప్పిన మాటలు. ధర్మయ్యగౌడ్ పాత్ర ద్వారా కొడుకులు దూర ప్రాంతాలకు వెళ్ళి అక్కడ బ్రతుకుతాము అంటే అక్కడ వారికి ఎదురయ్యే ఇబ్బందులను ముందుగానే ఊహించి వారిని సముదాయించే గుణం కలిగిన వ్యక్తిగా, అంతేగాక తాను చూసిన సంఘటనల ఆధారంగా దొరల పెత్తనపు విధానాన్ని, దౌర్జన్యాన్ని ఈ పాత్ర ద్వారా అర్థం చేసుకోవచ్చు. ఒక తండ్రి తన కొడులు తనను విడిచి దూర

ప్రాంతాలకు వెళ్ళినప్పుడు పడే బాధ ధర్మయ్యగౌడ్ పాత్ర ద్వారా రచయిత మనముందు ఉంచారు.

### 3.2.8.9. భూమయ్యగౌడ్ (బతుకుతాడు)

భూమయ్యగౌడ్ ధర్మయ్య పెద్దకొడుకు. భూమయ్య గౌడ్ భార్య లక్ష్మి నర్సమ్మ. భూమయ్యగౌడ్ గ్రామంలోనే ఉండి తాటిచెట్లు ఎక్కుతున్న తనతండ్రి, తండ్రిలాంటి వాళ్ళందరు పడుతున్న కష్టాలను గమనిస్తాడు. తన తండ్రి పూర్వీకుల నుంచి తనకులం వాళ్ళంతా తరతరాలుగా తాటిచెట్లకే అంకితమై బ్రతకడం. కులవృత్తిపై ఉన్న ప్రేమతో తన వాళ్ళు, తన పూర్వీకులు ఆర్థికంగా అభివృద్ధి చెందకపోవడాన్ని భూమయ్యగౌడ్‌ను ఆలోచింపజేస్తుంది. తాను కూడా ఇక్కడే ఉంటే తన పరిస్థితి కూడా అలాగే మారుతుందని భావిస్తాడు. దాంతో ఇంట్లో ఎవ్వరికి చెప్పకుండా బొంబాయికి వెళ్ళి అక్కడ కారంపొడి అమ్ముకుంటూ, ఇంటికి కొంత డబ్బు పంపేవాడు. బొంబాయిలోని అబ్కారి చట్టాలు, వాటి విధానాలు తెలుసుకొని భూమయ్యగౌడ్ ఒక కల్లు దుకాణం పెడుతాడు. కల్లు గీయడానికి ఒక జీతగాన్ని కూడా పెట్టుకుంటాడు. అతనికి జీతంతోపాటు భోజనం కూడా తనే పెట్టాలి. వండిపెట్టడానికి భార్యను, పిల్లలను తీసుకొని రావాలనుకుంటాడు. గతంలో తాను చెప్పకుండా వస్తేనే అందరూ నిందించారు. అందుకే ఈసారి తల్లిదండ్రులను ఒప్పించి భార్య పిల్లలను తీసుకపోవాలనుకుంటాడు. తల్లిదండ్రులు భూమయ్యగౌడ్‌ని కుటుంబంతో బొంబాయికి వెళ్ళడాన్ని ఒప్పుకోరు. పెద్దవాడివి నువ్వు వెళ్తే మా పరిస్థితి ఎలా అని ప్రశ్ని . దానితో తలా మూడు నెలలు పోషిస్తామని భూమయ్యగౌడ్ అంటాడు. దానికి లింగమ్మ ఒప్పుకోదు. తనకు చేతనైనంత వరకు తానే చేసుకుంటాను అంటుంది. చివరకు తల్లిదండ్రులతో తనకు బొంబాయి అంతా తెలుసు అని, అబ్కారి శాఖలో మిత్రులు ఉన్నారని, వాళ్ళు ఆపదలో ఆదుకుంటారని చెప్పి అక్కడ అర్థికంగా ఎదగడానికి అవకాశం ఉందని వారిని ఒప్పిస్తాడు.

భూమయ్యగౌడ్ బొంబాయిలో కల్లు దుకాణం ద్వారా ఆర్థికంగా ఎదుగుతాడు. భార్య లక్ష్మినర్సమ్మ. భూమయ్య గౌడ్ జగిత్యాల, కండ్లపల్లిలో ఇండ్ల స్థలాలు కొని ఇల్లు కట్టుకుంటాడు.

చిన్న తమ్ముడు లక్ష్మణ్ గౌడ్ గ్రామపంచాయితిలో వార్డ్ మెంబర్‌గా గెలిచి, ఉపసర్పంచ్‌గా ఉన్న తర్వాత అతనిపై అపవాదులు రావడంతో తల్లి లింగమ్మ మాట ప్రకారం బొంబాయికి తీసుకెళ్ళి అక్కడ కల్లు దుకాణం పెట్టిస్తాడు. పెద్దతమ్ముడు నారాయణ గౌడ్‌కు దుకాణం పెట్టిస్తానంటాడు భూమయ్యగౌడ్. కాని అతడు రాడు. నారాయణ గౌడ్ కొడుకు శ్రీనివాస్ గౌడ్ బొంబాయికి వచ్చి కొన్ని రోజులు కల్లు దుకాణంలో పనిచేసి తిరిగి ఇంటికి వెళ్ళిపోతాడు. తమ గ్రామంలోని తాటివనంలో ఉన్న ఎల్లమ్మ దేవతకు గుడి కట్టిస్తాడు భూమయ్యగౌడ్. ఇంతలో పెద్ద కోడలు గ్యాస్ పోసుకొని నిప్పంటించుకొని చనిపోతుంది. దాంతో గుడి ప్రారంభోత్సవం ఆగిపోతుంది. ఆమె చనిపోవడానికి గల కారణాలు మాత్రం తెలియదు. ఈ సంఘటనతో ధనవంతుల ఇండ్లల్లో జరిగే సంఘటనలు బయటపడవు అన్న విషయం తెలుస్తుంది.

భూమయ్యగౌడ్ పెద్ద కొడుకుగా, బొంబాయికి వలసపోయి ఆర్థికంగా ఎదిగిన వ్యక్తిగా, తమ్ముడు లక్షణ్‌గౌడ్‌ని ఆదరించిన అన్నగా, గౌడవృత్తిదారుల దైవమైన ఎల్లమ్మకు గుడి కట్టించిన భక్తుడిగా భూమయ్యగౌడ్ పాత్ర చిత్రించబడింది.

### 3.2.8.10. లక్ష్మణ్ గౌడ్ (బతుకుతాడు)

ధర్మయ్యగౌడ్ చిన్నకొడుకు. లక్ష్మణ్ గౌడ్ భార్య రాజేశ్వరి కూతురు రాధ, కొడుకు చిన్న శ్రీనివాస్‌గౌడ్. లక్ష్మణ్ గౌడ్ కూడా కులవృత్తియైన తాటిచెట్లు ఎక్కుతూ, వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తాడు. లక్ష్మణ్ గౌడ్‌పై జగిత్యాల జైత్రయాత్రతోపాటు, గ్రామానికి వచ్చిన నక్సలైట్ల మాటల ప్రభావం ఉంటుంది. దానితో గ్రామపంచాయితి ఎన్నికల్లో వార్డ్ మెంబర్‌గా పోటీ చేస్తాడు. వ్యవసాయదారుడైన ధర్మయ్య సర్పంచిగా నామినేషన్ వేస్తాడు. లక్ష్మణ్ గౌడ్ వార్డ్ మెంబర్‌గా నిలబడటం కుటుంబ సభ్యులకు ఎవరికీ ఇష్టం ఉండదు. దొరల మీద పోటీ చేయడం ద్వారా ఇబ్బందులు కల్గుతాయని ఆందోళన చెందుతారు. లక్ష్మణ్ గౌడ్ తండ్రి ధర్మయ్యగౌడ్ పూర్వం నుండి వాళ్ళకు ఎదురు తిరిగితే ఎవరిని బతకనివ్వలేదు. వాళ్ళకు ఎదురు తిరుగొద్దని చెప్పుతాడు. నక్సలైట్ల సమావేశం గ్రామంలో జరుగుతుంది. అక్కడికి లక్ష్మణ్ గౌడ్‌తోపాటు ప్రజలందరు వస్తారు. కులమతాలులేవు, అంతటా రెండే వర్గాలు ఉన్నాయి. ఒకటి

దోచుకునే వర్గం, రెండోది దోచబడే వర్గం. దోచబడేవారు మేల్కొనాలి, తిరగబడాలని ఇంకా అనేకమైన ఉపన్యాసాలు ఇస్తారు. ఆ ఉపన్యాసాలు లక్ష్మణ్ గౌడ్‌ని ప్రభావితం చేస్తాయి. ప్రజలు దొరలకు వ్యతిరేకంగా మారుతారు. లక్ష్మణ్ గౌడ్ వాళ్ళ నాన్నతో మనది ప్రజాస్వామ్య దేశం. ఈ దేశంలో ఎవరైనా పోటీ చేయవచ్చు. తను వేసిన నామినేషన్‌ను ఉపసంహరించుకోనని చెప్తాడు. తండ్రి ఇక నీ ఇష్టం అని చెప్పడంతో ఎన్నికల ప్రచారంలో పాల్గొని గెలుస్తాడు. వార్డ్ మెంబర్‌గా గెలిచిన తరువాత లక్ష్మణ్ గౌడ్‌కి ఉప సర్పంచ్ పదవి లభిస్తుంది. కొంత కాలానికి లక్ష్మణ్ గౌడ్ మీద అవినీతి ఆరోపణలు వస్తాయి. దాంతోపాటు అతనిపై హత్య ప్రయత్నం జరిగే సూచనలు కనబడతాయి. వీటికిగల కారణం ఆసరావు పటేలు తమ్ముడు కాంతారావుకి గ్రామ కోశాధికారిగా ఉద్యోగం వస్తుంది. కాంతారావు సర్పంచ్, ధర్మయ్య, ఉప సర్పంచ్ లక్ష్మణ్ గౌడ్‌తోపాటుగా మరికొంత మందికి దావతు ఇస్తాడు. దానికి వెయ్యి రూపాయలు ఖర్చు అవుతుంది. కాంతారావు తన అన్న ఆసరావుతో తన దగ్గర సర్పంచ్, ఉప సర్పంచ్ లంచం తీసుకున్నారని చెప్పడంతో వీరిపై అవినీతి ఆరోపణలు వస్యాయి.

ఈ సమయంలోనే భూమయ్యగౌడ్ బొంబాయి నుండి ఊరికి వస్తాడు. అప్పుడు అన్నతో తనుకూడా బొంబాయి వస్తానని అంటాడు లక్ష్మణ్ గౌడ్. భూమయ్యగౌడ్ ఇక్కడే ఊర్లో ఉండు, ఇప్పుడు నీవు రాజకీయంలో ఉన్నావు. ఏ పంచాయితీలైన నువ్వు ఉండి పరిష్కరించాలిగదా, అక్కడికి ఎందుకు రావడం అని అడుగగా దానికి తల్లి లింగమ్మ ఊర్లో పరిస్థితులు సరిగాలేవని, కండ్లపెల్లి వాళ్ళు మంచివాళ్ళు కాదు, కాంతారావు విషయం గురించి చెప్పగానే తీసుకపోతానని అంటాడు భూమయ్యగౌడ్. లక్ష్మణ్ గౌడ్ బొంబాయికి వెళ్ళగానే సర్పంచ్ ధర్మయ్య అవినీతి ఆరోపణలను మొత్తం లక్ష్మణ్ గౌడ్‌పైకి నెట్టుతాడు. ఇక్కడ రాజకీయాలలో విలువలు, న్యాయం ఉండదని, అవసరమైతే ఎలాంటి వారినైన అది ముంచుతుందని అర్థమవుతుంది.

లక్ష్మణ్ గౌడ్ బొంబాయిలో అన్న సహాయంతో ఒక కల్లు దుకాణం పెట్టుకొని జీవిస్తాడు. ఇంతలో అన్నతో విభేదాలు రావడం, అక్కడి పరిస్థితులు సరిగ్గా తెలియక అప్పులపాలవుతాడు. లక్ష్మణ్ గౌడ్ ఆర్థికంగా నష్టపోవడంతో కల్లు దుకాణం నడపలేని పరిస్తితి వస్తుంది. దాంతో తిరిగి

స్వంత ఊరైన హన్మాజిపేటకు రాలేక తన అత్తగారి ఊరైన అనంతారం వెళ్తాడు. అక్కడే లక్ష్మణ్ గౌడ్ అనారోగ్యంతో చనిపోగా హన్మాజిపేటకు తీసుకవచ్చి దహన సంస్కారాలు చేస్తారు.

లక్ష్మణ్ గౌడ్‌పై జగిత్యాల జైత్రయాత్ర, నక్సలైట్ల ప్రభావం పడిన వ్యక్తిగా దొరలకు వ్యతిరేకంగా గ్రామపంచాయితి ఎన్నికల్లో పోటి చేసిన అభ్యర్థిగా, రాజకీయాల్లో మోసపోయినవాడిగా, బొంబాయిలో నిలదొక్కుకోలేక అప్పులపాలైన వ్యక్తిగా లక్ష్మణ్‌గౌడ్ పాత్ర కనబడుతుంది.

**3.2.8.11. మారయ్య - కల్లుమండువ**

మారయ్య గౌడ్ కుల పెద్దమనిషి. వృద్ధుడు. సూర్యపేట వీరిది. అందరికి మంచి జరగాలనే మనస్తత్వం కల్గిన వ్యక్తి. ముస్తాజుదార్లు మారయ్య ఇంటి మీదికి గుండాలను పంపి సామాన్లు బయటపడేసి బూతులు తిడుతారు. దాంతో బాధలో ఉండి అన్నం తినడు మారయ్య. తాళ్ళకు వెళ్తున్నప్పుడు దారిలో కట్టమైసమ్మకు మొక్కి, కావడి భుజాన వేసుకొని నడుస్తున్నప్పుడు కండ్లు తిరిగి కట్టకు ఎడమవైపు పడుతాడు. అక్కడే ఉన్న ధర్మభిక్షం చేయి అందించి లేపుతాడు. అతనితో మాట్లాడుతూ కల్లుమండువ దగ్గరికి వస్తాడు. ధర్మభిక్షం జిల్లా వేలం పాటలుపోయి గ్రామీణ వేలం పాటలు రావాలని చెప్పడంతో సంతోషిస్తాడు మారయ్య. అందుకు ప్రారంభ సమావేశం మారయ్య ఇల్లే వేదికగా మారుతుంది.

మారయ్య ఇతరులకు సహాయం చేసేవ్యక్తిగా, గీత కార్మికుల సమస్యలను పరిష్కారాలకు తన ఇల్లే వేదికను చేసిన పాత్రగా మారయ్య కనబడుతాడు.

**3.2.8.12. వీరన్న (కల్లుమండువ)**

వీరన్న గీతకార్మికుడు. గ్రామ దొర ఉంపుడుగత్తె కాసుల దొరసాని ఇంటికి కల్లుపంపమని పటేలు ద్వారా కబురు పంపుతాడు. ఆ విషయం వీరన్నకు తెలియదు. వీరన్న బిడ్డకు జ్వరం ఎక్కువ కావడంతో కల్లు మండువకు ఎత్తుకొని వస్తుంది వీరన్న భార్య. ఆచారి డాక్టర్‌ని పిలిచి

వైద్యం చేయిస్తాడు. బిడ్డ కోలుకోవడంతో డాక్టర్‌కు కృతజ్ఞతగా కల్లు పోస్తాడు వీరన్న. ఈ విషయం తెలిసిన దొర వీరన్నను పిలిపిస్తాడు. వీరన్న భయంతో 'నీకాల్మొక్త దొర! ఇంకోసారి ఇలా జరగకుండా చూసుకుంటానని ప్రాధేయపడ్తాడు. కాని దొర కనికరించడు. వీరన్నకు ఇరవై కొరడా దెబ్బలు, వందరూపాలు జరిమానా విధిస్తాడు. కొరడా దెబ్బలకు స్పృహ కోల్పోయి క్రింద పడుతాడు వీరన్న. అక్కడే ఉన్న తోటివారు ఇది అన్యాయం అని అడగలేని పరిస్థితి ఉంటుంది. వీరన్న భార్య బర్రెను అమ్మి, అప్పుజేసి జరిమానా కట్టి వీరన్నను తీసుకెళ్తుంది.

వీరన్న గీతవృత్తిదారుడు, తనకు సహాయం చేసిన వారిపట్ల కృతజ్ఞత భావం కల్గినవ్యక్తి, అన్యాయంగా తనను దొర కొట్టిన భరించేవాడి పాత్రగా వీరన్న కనబడుతాడు.

ఈవిధంగా పాత్రలు పరిచయం చేస్తూ తెలంగాణ వృత్తి నవలల్లోని పాత్రలను ఎనిమిది రకాలుగా వర్గీకరించడం జరిగింది. ఇలా పాత్రలను వర్గీకరించుకొని ఆయా పాత్రల గుణ, రూప, స్వభావాలను, వ్యక్తిత్వాలను విశ్లేషించాను.

# అధ్యాయం - 4

## తెలంగాణ నవలలు – వృత్తి జీవన చిత్రణ

నేడు తెలుగు నవల ఎందరో రచయితల కృషివలన విస్తృతి చెందింది. తెలుగులో నవలా ప్రారంభకాలంలో సాంఘిక సంస్కరణలు, అంటరానితనం, స్వాతంత్ర్య ఆంకాంక్షలను ఇతివృత్తాలను కలిగి ముందుకుసాగింది. నాటి నుండి నేటి వరకు నవల మధ్యతరగతికి, పీడిత, అణగారిన వర్గాలకు అండగా ఉంటూ వారికి మంచి నేస్తంగా మారింది.

సాహిత్యంలో నవల అనేది ఒక ప్రక్రియ. ఇది వాస్తవికతతో కూడిన రచన. ఇందులో కొంత కల్పనా శక్తికి స్థానం ఉంటుంది. ఇక్కడ వాస్తవికత అంటే పూర్తిగా అవభావాన్ని ఉన్నది ఉన్నట్టుగా చిత్రించడం కాదు. సమాజంలోగానీ, జీవితంలోగానీ సమస్యలు ఎలా వస్తాయి? వాటికి గల కారణాలను మరియు పరిష్కార మార్గాలను సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక కోణంలో విడమర్చి హేతుబద్ధంగా చెప్పే ప్రయత్నం చేసున్నారు నేటి రచయితలు (నవలాకారులు).

నేటి రచనలో రెండు అంశాలు ప్రధానంగా కనిపిస్తున్నాయి. మొదటి అంశంలో ఉండే అన్యాయాలను, అక్రమాలను, దోపిడీని, సామాజిక వ్యత్యాసాలను సవిమర్శకంగా ఖండిస్తూ చేసిన రచనలు. రెండవదానిలో సమాజంలో వస్తున్న చైతన్యానికి స్పందించి తన చుట్టూ ఉన్న భౌతిక స్థితులపై అంటే సామాజిక వ్యత్యాసాలపై ఆర్థిక అసమానతలపై తిరుగుబాటు చేసే సంఘటనలను చిత్రించడం కన్పిస్తుంది.

నవలలో దళిత, మైనారిటీ, స్త్రీ జీవిత చిత్రణ మరియు చారిత్రకాంశాలు, ప్రాంతీయతతోపాటుగా వృత్తుల చిత్రణ కూడా చిత్రించడం జరిగింది. వృత్తుల యొక్క నేటి జీవనస్థితి, సామాజిక విషయాలను నవల నేడు చిత్రించే ప్రయత్నం చేస్తుంది. అందుకే ఈ అధ్యాయంలో వృత్తుల సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంసకృతిక రంగాల అంశాలను విశ్లేషించాను.

## 4.1. సామాజిక సంబంధాలు

మానవుడు మిగత జీవరాశి కన్న పరిణితి చెందినవాడు. ఈ సామూహిక జీవనంలో మానవుడితోపాటుగా జంతువులు కూడా జీవనం కొనసాగిస్తున్నాయి. ఆహారం, నిద్ర, శారీరక అవసరాలు మొదలగు లక్షణాల కారణంగా జంతువులతో సామూహికంగా జీవనం గడిపినా, మానవుడు మాత్రం వాటికి భిన్నంగా అభివృద్ధి చెంది తనచుట్టూ ఉన్న పరిసరాలను, ప్రకృతిని తనకు అనుకూలంగా మార్చుకోవడానికి మరియు సుఖమయ జీవితానికి సంబంధాలు అవసరమని భావించి సంఘంగా ఏర్పడి సామాజిక జీవనం ప్రారంభించాడు.

మానవ సమాజం విశాలమైనది, పరిణామశీలమైది. కాలం మారుతున్న కొలది సమాజంలోని సంఘటనలలో, సన్నివేశాలలో మార్పు వస్తుంది. ఈ వైరుధ్యాలు సామాజిక సంబంధాలమీద ప్రభావాన్ని చూపుతాయి. ఈ సామాజిక సంబంధాలు కాలానుగుణంగా రూపొందుతూ, మార్పుకులోనై కొత్త అభిరుచిని కూడగట్టుకొని సంఘ పరిస్థితులమీద, మానవ సంబంధాలమీద ప్రభావాన్ని చూపుతాయి. మానవుడు తన చుట్టూ ఉన్న ప్రకృతిలోని జంతు వృక్షజాలంతో తమతోటి వారితో సంబంధాలను ఏర్పర్చుకొని జీవనం కొనసాగిస్తుంటాడు. ఈ సమాజంలో రచయిత కూడా అంతర్భాగమే కావున సామాజిక రూపాన్ని బహిర్గతం చేసే రచనలు అతని కలం నుంచి వస్తాయి. మానవ సమాజం పట్ల అభిమానం, మానవుల ఐక్యతపై అభినివేశం గల రచయిత తనంతట తానుగా సామాజిక పరివర్తనకు దోహదపడతాడు. తను సమాజంలో భాగస్వామి అయిన సమాజ పోకడను అర్థం చేసుకొని తన రచనలో ఆ సమాజాన్ని చిత్రిస్తాడు. సామాజిక హృదయాన్ని ప్రేరేపించగలిగేది రచయిత సృజనశక్తే. ఈ నవలా రచయితలు కూడా వృత్తులు, వృత్తులతో ఉండే సామాజికాంశాలను సృజించారు. కావున ఈ అధ్యాయంలో భాగంగా వృత్తి నవలల్లో ఉండే సామాజింకాశాలను ఈ భాగం కింద విశ్లేషించడం జరిగింది.

### 4.1.1. వృత్తి నవలల్లో కుటుంబ జీవన చిత్రణ

మానవుని జీవితం నిత్యం అనేక మార్పులకు లోనవుతూ ఉంటుంది. ఇలాంటి మానవ జీవనం సంక్లిష్టమైంది. ఈ సంక్లిష్టమైన మానవుని జీవితంలోని వివిధ అంశాలు సృజించడం సాహిత్యంలో సహజంగా కనిపిస్తుంది. ఈ నవలా రచయితలు మానవుని జీవితంతో ముడిపడివున్న సంబంధాలను ఆదర్శంగా తీర్చిదిద్దారు. ఆనందలక్ష్మి గారు కుటుంబాన్ని గూర్చి "కుటుంబ జీవితం కేవలం వంశాన్ని నిలిపే సాధనం మాత్రమే కాదు. తన నాటి సంస్కృతి సంప్రదాయాలను తరతరాలకు వ్యాపింపజేసే వాహిక కూడా. ఈ కారణం చేత కుటుంబ వ్యవస్థ స్థిరత్వం మీదనే సమాజ సుస్థితర ఆధారపడి ఉంది" (ఆనందలక్ష్మి. 1995: 5) అని అన్నారు.

మానవ జీవితాన్ని ప్రభావితం చేసే అంశాలలో మొదటిది కుటుంబం. దీని ద్వారా కుటుంబంలోని వివిధ వ్యక్తులతో సంబంధాలు ఏర్పడతాయి. వ్యక్తి సమాజంలో బతకడానికి కుటుంబ జీవనం ముఖ్యమైనది. వ్యక్తికి ఆత్మీయమైన సుఖసంతోషాలను చేకూర్చేది కుటుంబ వ్యవస్థ. ఇలాంటి విషయాల్ను తీసుకొని అనేకమంది వృత్తి నవలా రచయితలు స్పందించారు. జి. రాములు గౌడ వృత్తి కుటుంబంలో ఉండే ఆప్యాయతలను, అనురాగాలను 'పెరటి చెట్టు' నవలలో మన కళ్ళముందుంచారు. భర్త రాజాగౌడ్ దొరకు లంచం ఇచ్చి తీర్పు తనవైపు వచ్చేల చేయడంతో తండ్రి ఎల్లాగౌడ్ ఇబ్బంది పడడం నచ్చక గంగమ్మ "నాయనా! మనము పేదవాళ్ళ దొర మాటకు విరుద్ధంగా పోతిమా ఈ గ్రామములో ఉండుట కష్టమై పోతుంది. నీళ్ళలో ఉండి మొసలితో వైరం పనికిరాదు. నాయొక్క సుఖాన్నాశించి మీరు అగ్నిగుండంలో దూకడం నాకిష్టము లేదు. నా అదృష్టము మంచిదాయెనా అదే సంసారము బాగుపడుతుంది. మీ అల్లుణ్ణి పిలిచి నన్ను చక్కగా పంపించండి" (రాములు, జి. 1954: 9) అంది ఎల్లాగౌడ్‌తో.

ఎన్ని కష్టాలు వచ్చిన తనే భరించాలని అనుకుంటుంది. తన భర్త పని చేస్తే తన సంసారం బాగుపడుతుంది లేకపోతే కష్టాలు పడాలి అనుకుంటుది. ఈ విధంగా తన తండ్రి తనవల్ల కష్టాలు పడకూడదని భావిస్తుంది. ఇలాంటి సమయాల్లో గుండెల్లో ధైర్యం నింపేదే

కుటుంబం. గంగమ్మ మాటలలో తండ్రిపట్ల ప్రేమ, కుటుంబంలోని ఆప్యాయత బహిర్గమైంది.

ఇదే విధంగా చేనేత వృత్తిలో ఉండే కుటుంబ సభ్యులమధ్యగల అనుబంధాన్ని లోకమలహరి 'సంఘము' నవలలో వివరించారు. దుర్గాప్రసాద్ చిన్నతనంలో జాతరలో తప్పిపోతాడు. పెరిగిపెదాయ్యక మిత్రుడు జోగేంద్ర దావఖానాలో చేరిన చెల్లెను కలుసుకోవడం, ఆమె ద్వారా తల్లి చనిపోయిన విషయాన్ని తెలుసుకొని దుఃఖిస్తాడు. తల్లి మరణం అతనిలో విషాదాన్ని నింపుతుంది. కుటుంబ సభ్యుల బంధం విడదీయలేనిది. అది తల్లితో ఉన్న అనుబంధంగా గొప్పనైంది. "చెల్లీ! ఇక మనకు అమ్మ లేదా! పాపాత్ముడనగు దుర్గా నీ మలాలాన్నే గారాబుతల్లి కన్నుల పాడుజేసుకొని నానా బాధలనుభవించి తుదకు ప్రాణాలు సైతమర్పించింది. కాని నీవు మాత్రం శిలా విగ్రహం వలె చెక్కు చెదరకున్నావు" (మలహరి, లోక. 2017: 45) అని బాలునివలె బావురుమని ఏడ్చింది. శ్యామల కూడా ఏడుస్తూనే వుంది. కొడుకు తప్పిపోయినప్పుడు తల్లి వివిధ గ్రామాలు తిరిగి వెతకడం, కొడుకుమీదగ రందితో ఆరోగ్యం క్షీణించి కళ్ళు సరిగ్గా కనబడవు.

గౌడవృత్తికి చెందిన మరొక నవల నేరేళ్ళ శ్రీనివాస్ గౌడ్ రాసిన 'బతుకుతాడు'లో "తమ కొడుకు అక్కడ మోసగాళ్ళ చేతిలోపడి మోసపోతాడేమోననే భయం ఒకవైపు... తమకు దూరమవుతాడేమోనన్న భయం మరోదిక్కు ధర్మయ్య గౌడ్, లింగమ్మని వేదిస్తున్నాయి. గౌడ కులములో పుట్టిన తమ కొడుకు అక్కడెలా బతుకుతాడోననే భయం మరోవైపు వేదిస్తుంది" (శ్రీనివాస్ గౌడ్, నేరేళ్ళ. 2004: 16, 17). ఈవిధంగా కొడుకు దూరప్రాంతాలకు వెళ్ళినపుడు అక్కడ అతడు ఎలా భరిస్తాడనే బాధ వారిని వెన్నాడుతుంది. తల్లిదండ్రులకు పిల్లలపైగల ప్రేమను, వారు దూర ప్రాంతాలకు వెళ్తుంటే పడే మనో వ్యథను మనకళ్ళముందుంచారు రచయిత.

### 4.1.1.1. భార్య భర్తల సంబంధం

సమాజంలో అతి ముఖ్యమైన సంబంధాలలో వివాహ వ్యవస్థ ఒకటి. వివాహ వ్యవస్థలో భార్యాభర్తలవడం అనేది ఒక ముఖ్య ఘట్టం. వివాహ వ్యవస్థలో ప్రధాన

సూత్రధారులైన వారు భార్యాభర్తలుగా కట్టుబడి ఉండడమే ఈ బంధం యొక్క ముఖ్యోద్దేశ్యం. అందుకే భారతీయ వ్యవస్థకు చాలా ప్రాముఖ్యత ఉంది. ఈ భార్యాభర్తల మధ్య ఎలాంటి సమస్యలు రానంతవరకు ఆ సంసారం సాఫీగా సాగిపోతుంది. ఏ చిన్న సమస్యలు, అనుమానాలు కల్గిన ఇక ఆ సంసారం ఒడిదుడుకులను ఎదుర్కోవల్సి వస్తుంది.

భార్యాభర్తల సంబంధం గురించి ఆనంద లక్ష్మీ గారు "మానవ సంబంధాలన్నింటిలో మధురమైనది స్త్రీ పురుష సంబంధం. దీనికి పాశవిక స్థాయినుండి తప్పించేది ప్రణయం. దివ్యత్వానికే చేర్చేది ధర్మం ఇలాంటి ధర్మబద్ధమైన ప్రణయమే నిజమైన దాంపత్యానికి జీవం" (ఆనంద లక్ష్మి. 1979: 44) అని చెప్పారు. వృత్తి జీవనంలో భార్యాభర్తలు కష్టనష్టాలు పంచుకుంటూ పరస్పర ప్రేమానురాగాలు, సహాయసహకారాలు అందించుకుంటూ జీవితంను గడుపు న్న దృశ్యాలు మనకు కనిపిస్తాయి.

వృత్తి జీవనంలో ఉన్న భార్యాభర్తలు ఒకరికొకరు సహకరించుకొనే విధానం కుమ్మరి జీవితాలను చిత్రించిన 'సుషుప్తి' నవలలో చాలా చక్కగా వివరించారు రచయిత. ఈ నవల రాసింది మాదిరెడ్డి సులోచన. "ఎంకమ్మ గాడిద మీద గోనే సంచులు వేసుకొని మట్టికి బయలు దేరింది. కాస్త డబ్బున వారు చెరువునుండి బండ్లమీద తోలించుకుంటారు మట్టి. ఎంకమ్మకు గాడిద మీద తేవటమే గగనమవుతుంది. చిన్న మట్టి త్రవ్వే గునపం తీసుకుంది. తలమీదికి వచ్చిన సూర్యుడు ఆమెను చికాకు పరిచినా లెక్క చేయటం లేదు.... ఎంకమ్మ మన్నుదించి, మరో వరుస వెళ్ళలేక, నీళ్ళకు వెళ్ళింది. నీళ్ళు తెచ్చి మన్ను నాన బెట్టింది. బాలయ్య కునుకుతీసి మన్ను తొక్కటం మొదలు పెట్టాడు" సులోచన, మాదిరెడ్డి. 2017: 21, 22). ఈ విధంగా భార్య మన్ను, నీళ్ళు తీసుకు వచ్చి భర్తకు పూర్తి సహాయసహకారాలు అందిస్తుంది. అంతేగాక కుండలు కాల్చేటప్పుడు దానికి అవసమయ్యే కలపను తీసుకొని వచ్చి సిద్ధంగా ఉంచుతుంది. ఈవిధంగా కుమ్మరి జీవనంలో ఉండే భార్యాభర్తల మధ్య సహాయసహకారాలను చక్కగా వివరించిన విధానం మన కళ్ళకు కనబడుతుంది.

ఇదే విధంగా చేనేత వృత్తిలో భార్యాభర్తల సంబంధాన్ని వివరించే నవల 'గువ్వల చెన్నా'. దీనిని కాలువ మల్లయ్య రాశారు. దీనిలో "లింగమ్మ వాకిట్లో కూర్చొని రాట్నం

వడుకుతోంది. ఆ చుట్టు కండెల మండెలున్నాయి. ఆ వాకిలినానుకొనున్న పెంకుటిల్లు శిథిలావస్థలో ఉంది. ఆ ఇంట్లో గుంటుంది. మగ్గానికి అయిపోవడానికి సిద్ధంగా ఉన్న చీరుంది. మగ్గం గుంటలో కూచొని మగ్గం నేస్తున్నాడు వీరయ్య. నాడె అటూ ఇటూ వేగంగా పరుగులు తీస్తుంది. అతని కాళ్ళు, చేతులు, కండ్లు చురుకుగా పని చేస్తున్నాయి. నాడె కదుల్తూ పట్టుపట్టు అనే ధ్వని లయబద్ధంగా వినబడుతుంది. వీరయ్య కళ్ళు తెగుతున్న పోగులను నిశితంగా పరిశీలిస్తున్నాయి. ఒక చేత్తో మెచ్చును అటూ ఇటూ లాగుతూ మరో చేత్తో పటుకాను తన దిక్కు లాక్కుంటున్నాడు" (మల్లయ్య, కాలువ. 2005: 19). ఈ విధంగా భార్యాభర్తల మధ్య ఉన్న అనుబంధాన్ని గుర్తించవచ్చు. భార్య కండెలు చుడితే, భర్త చీరలు నేయడం. పరస్పర సహకారంతో వృత్తిని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇలా చేనేత వృత్తిలో భార్యాభర్తల మధ్య సహాయాల తీరును ఇక్కడ గమనించవచ్చు.

మరో వృత్తి అయిన గౌడ వృత్తిలో స్త్రీల సహకారాన్ని గురించి నేరేళ్ళ శ్రీనివాస్ గౌడ్ 'బతుకుతాడు' నవలలో "లక్ష్మి తాటి చెట్లకు నీల్లు పొయ్యడానికి నీల్ల బింద నెత్తిమీద పెట్టుకొని వచ్చింది. ఔ... ఇయల్ల ఏ చెట్లకు నీల్లు పొయ్యాలే...? అడిగింది లక్ష్మి. రెండొద్దులకు ఒక్కసారి నీల్లు పొయ్యాలే... ఇయ్యల్ల కిందిపక్క చెట్లకు నీల్లు పోసిపో... రేపు మీది పక్క చెట్లకు నీల్లు పొయ్యి. అన్నాడు నారాయణగౌడ్. లక్ష్మి నీళ్లు పొయ్యడానికి వెళ్ళింది" (శ్రీనివాస్ గౌడ్, నేరేళ్ళ. 2004: 5).

#### 4.1.1.1. స్త్రీలపై వేదింపులు

ఇవేకాకుండా వృత్తిజీవనంలో జీవిస్తున్న స్త్రీలపై అఘాయిత్యాలను మరియు హింసలను ఈ నవలల్లో గమనించవచ్చు. కుమ్మరి వృత్తి ఆధారంగా జీవించే కుటుంబంలో జరిగిన సంఘటనను మాదిరెడ్డి సులోచన చిత్రించారు. "ఏందీ! బాగున్నావా పిల్లా! ఎవలు! ఆయన ఆడు ఆముకాడున్నాడు అన్నది. ఆని కోసము ఎవలు వచ్చింద్రు? నీతో పనుంది. చీకటి పడ్డంక, మేకలు జారె బండ కాడికి వస్తవ? ఎందుకు? అది నేను చెప్పాల్నా? ఎత్తుగా కనిపించే ఆమె పొట్టకేసి చూచాడు. క్రూరంగా నవ్వాడు. నేను అసుంటి దాన్ని కాను. అశేయ్! నువ్వు ఎసుంటి దానివో నన్ను అడిగే శెప్తాను. ఒక్క శూపు సాలు ఆడదాని గోత్రం

చెప్త అన్నాడు. మరోసారి లుంగి విప్పి మళ్ళీ కట్టుకున్నాడు. రేపు వస్తావుగా? అంటి అంటనట్టు ఆమె భుజాలను తాకి వెళ్ళిపోయాడు. అతను వెళ్ళిన దిక్కే చూస్తూ చాలాసేపు నిలబడిపోయింది చుక్క" (సులోచన, మాదిరెడ్డి. 2017: 86, 87).

ఈవిధంగా స్త్రీలను హింసకు గురిచేసిన సంఘటన మనకు కనిపిస్తుంది. చుక్క తన భర్తకు చెప్పగా అతను వెళ్ళి దావూద్ భార్యతో విషయం చెప్పడంతో దావూద్‌ను భార్య చివాట్లు పెడుతుంది. దాంతో కొంత సర్దుమనిగిన చుక్క ఆర్థిక పరిస్థితి దిగజారడంతో ఒకపూట తినడానికి కూడా తిండిలేని సమయంలో భోజనం పెట్టి తనవైపు తిప్పుకోవాలనే ప్రయత్నిస్తాడు. చుక్క భర్త గోవిందుకు భార్యపట్ల అనుమానం కల్గించి చివరకు తన సొంతం చేసుకుంటాడు దావూద్. అంతకుముందే దావూద్‌కు ఇద్దరు భార్యలుంటారు. ఈవిధంగా స్త్రీని అంగడి వస్తువుగా భావించేవారు ఉన్నారనే విషయం మనముందుంచారు.

ఇదేవిధంగా మరొకవృత్తి చర్మకారుల కుటుంబంలోని సంఘటనలను మనముందుంచారు వేముల ఎల్లయ్య 'కక్క' నవలలో. "సూసినావక్కా మీ యారాలు ఏంజేత్తుందో? గా బర్రోలెల్లడు దినాం వొస్తుండు. ఏదోలే! మామర్ది కొడ్కుగా ఎల్లయ్య పక్కపక్క ఆసామి దగ్గర జీతమున్నోళ్ళాయే పోరడు సిన్నోడు తోడై ఆన్కి ఆసరైతుండేమో? గందుకోసం వొస్తుండేమో? మా యారాలు ఏ పాపమేర్గంది మొగుడు జచ్చిన కాన్నించి ఏ మాట రాకుంట సంసారం జేస్తుంది. అన్నువున్న మనమే ఎన్నో కట్టాలు బడ్తున్నమ్. దాన్ని మనమంటే కండ్లు బోతయ్. ఓమ్మా... మాయామ్మ మంచోడ్గాడు గాయన గిట్టె జెప్పెవ్ బత్లాడింది కలెమ్మ యారాలు" (ఎల్లయ్య, వేముల. 2000: 17).

సమాజంలో ఒక మగ, ఆడా మాట్లాడుకుంటే వారి మధ్య చెడు సంబంధాలు అంటగట్టే సందర్భాన్ని ఇక్కడ గమనించవచ్చు. అందులో భర్తలేని ఆడవారిని ఘోరంగా అవమానిస్తుంది సమాజం. ఎల్లయ్య, కక్కడు ఇద్దరు పక్కపక్కన ఉండే పటేల్ల దగ్గర జీతాలు ఉంటారు. కక్కనికి సహాయం చేసే పనిలో తల్లి కలెమ్మతో మాట్లాడడం జరుగుతుంది. ఒకానొక సందర్భంలో ఆమె ఇంటికి వెళ్తున్న ఎల్లయ్యను చూసి పక్కింటివారు ఆలోచించే చెడు ధోరణితోపాటు కలెమ్మ యారాలుకు చెప్పడం జరుగుతుంది. ఈవిధంగా స్త్రీలపై లేని అపవాదులు మోపి వారిని హింసిస్తారు.

గౌడవృత్తిలో స్త్రీలు ఎదుర్కొనే వేదింపులను కె. వెంకటేశ్వర్లు 'కల్లు మందువ' నవలలో చిత్రించారు. "ఒకరోజు సాయంత్రం వేల సీతమ్మ తన ఇంటి గుడిసె ముందు కూర్చొని వుంది. దారివెంట వస్తూ ఇంటి ముందు సీతమ్మకు దగ్గరకు వచ్చి నిలబడ్డారు కొంతమంది నడివయసు యువకులు. 'కల్లు పోస్తావా! రమ్మంటావా!? నీ బింకీలు పెద్దగా ఉంటాయట గదా?' అంటూ సీతమ్మ మెడకింద భాగం జాకెట్ సందులోకి దృష్టి నిల్పి నొసలు ఎగరవేస్తూ వెకిలి చేష్టలతో ద్వంద్వార్థం వచ్చే అన్నడొక వ్యక్తి. తర్వాత తెలిసింది వాడి పేరు రావణుడని. మరొక బడుద్దాయి సీతమ్మవైపు మింగేటట్లుగా చూస్తూ 'ఒరేయ్ రావణా! ఎల్లన్న ఇంట్లో ఎట్లాగూ జాగలేదు సీతమ్మ గుడిసె జరింత పెద్దగానే ఉంది. ఈమె ఊ అంటే ఈ రాత్రికి మనమంతా ఇక్కడనే ఉండొచ్చు. ఏమంటావు! అని సీతమ్మనుద్దేశించి పళ్ళికిలించి నవ్వాడు" (వెంకటేశ్వర్లు, కె. 2006: 48).

గౌడవృత్తిలో మగవారు తాళ్ళు ఎక్కి కల్లు తీస్తే, స్త్రీలు కల్లు తేవడం, అమ్మడం లాంటివి చేస్తారు. గౌడ స్త్రీలు అనేకమైన హింసలను ఎదుర్కోవల్సి వస్తుంది. భర్తలేని స్త్రీలు పడే బాధలు చెప్పలేము. ప్రతి ఒక్కరు ఆమెతో ప్రవర్తించే తీరు, ద్వంద్వార్థపు మాటలు వారినెంతో చిత్రహింసలకు గురిచేస్తాయి. ఆ వృత్తిని వదిలి బతికే స్థితిలో వారు ఉండలేరు. దాంతో ఎదుటివారు ఎన్ని మాటలు అన్న వారిని సోదర భావంతో పిలిచి కల్లు పోస్తారనే విషయాన్ని, వితంతు స్త్రీలు ఎదుర్కొనే వేదింపులను, అవమానాలను దృశ్యమానం చేసారు రచయిత.

### 4.1.1.2. తండ్రి, కొడుకల సంబంధం

ఈరోజు ఉన్న పరిస్థితులు భవిష్యత్తులో కూడా ఇలాగే ఉంటాయి అనుకోవడం హాస్యాస్పదమే అవుతుంది. అలాగే తండ్రి కాలంలో ఉన్న పరిస్థితులు కొడుకు తరంలో ఉంటాయనుకున్నప్పుడు కొడుకు కాలం వచ్చేసరికి కాలంలో వస్తున్న మార్పులతో తమ వృత్తిని కోల్పోయిన స్థితిని, కొడుకు తరం వచ్చేనాటికి కుమ్మరి జీవనంలో వచ్చిన మార్పులను మాదిరెడ్డి సులోచన 'సుషుప్తి' నవలలో వివరించిన తీరు అభినందించక తప్పదు. "ఏం బాలయ్యా, కుర్రాడి సంగతి బొత్తిగా పట్టించుకోవేం? రోజూ సాయంకాలము

మా ఇంటికి పంపవయ్యా అనేవాడు. సదువుకుని ఊల్లు ఏలాలా, ఉద్యోగం సెయ్యాలా? మాపని ఉంది. వాడొక్కడు బతక్కపోడు అనేవాడు. బాలయ్యేకాదు, ఆయనలాంటి యెందరో కులవృత్తి అంటూ అవకాశాలు ఉన్నా వినిపించుకోలేదు. వాళ్ళున్నది మరి పల్లెకాదు. హైస్కూలుంది. పట్టణంలో చదివించేవారికి బండి ఉంది. అరగంటకో బస్సుంది. సూర్యాపురం అవతలివైపు మిషన్ స్కూలు ఉంది. లేనిదల్లా ఉత్సాహమూ, ముందు ఎలా అన్న ఆలోచన.

ఇప్పుడు బీదవారు కూడా పగిలే కుండలెందుకు... అని సత్తు గిన్నెలు కొనుక్కుంటున్నారు. పెంకుటిళ్లు కూడా చాలా తగ్గాయి. వేసవిలో పదిరోజులకో చన్నీటి కూజాలు మార్చే ధనికులు కూడా రిఫ్రిజిరేటర్లు కొంటున్నారు. కుమ్మరి బాలయ్య తన సింహాసనము కోలుపోయినట్టు బాధపడతాడు. ఆ కసి భార్యమీద, కొడుకుమీద తీర్చుకుంటాడు" (సులోచన, మాదిరెడ్డి. 2017: 15). ఈవిధంగా తన కొడుకుతరం వచ్చేసరికి వచ్చిన మార్పులను కలిచివేసిన తీరు గమనించవచ్చు. తన తాతల, తండ్రులనుండి బతికిన స్థితిని బేరీజు వేసుకున్నాడు. తనకాలంలో తన క్రింద నలుగురు పని నేర్చుకోవడానికి వచ్చేవారు. అంతేగాక తను చేసే కూజాలు జిల్లాకే ప్రసిద్ధిగాంచినవి, పెరుగుతోడు ముంతలు, జాణీలుకోసం తన ఇంటికి వచ్చి మరీ తీసుకెళ్ళడం చూసిన బాలయ్య కొడుకు కాలానికి వచ్చేసరికి వృత్తి ధ్వంసమ్వుతున్న స్థితిని చూసి తట్టుకోలేక ఆ కోపాన్ని భార్య, కొడుకు మీద వెళ్ళదీస్తాడు. ఇలాంటి స్థితిని తెలియజేస్తూ వృత్తి జీవితాన్ని దృశ్యమానం చేస్తున్నాయి. బహుశ రచయిత్రి చెప్పదలుచుకుంది ఇదేనేమో. ఈవిధంగా కుమ్మరి జీవనంలోని కొడుకుతరం వచ్చేసరికి కష్టాల కడగండ్లను హృద్యంగా చిత్రించారు.

కుటుంబ సభ్యులలో తండ్రి ప్రధానమైనవాడు. కుటుంబంలో వచ్చే మార్పులు, మనుషులమధ్య ఉండే ఆపేక్షలు, మానసిక కల్లోలాలు కుటుంబంలోని జీవితానందాలకు దుఃఖాలకు కారణమయ్యే విధానాన్ని వాస్తవిక దృష్టితో సమాజం ముందుంచారు రచయిత్రి.

ఇందులో కొడుకు తండ్రి చేస్తున్న వృత్తిలో ఎదుగుదల లేకపోవడంతో తను దూర ప్రాంతాలకు వెళ్ళి సంపాదించాలనే ఆలోచించే ధోరణి ఇందులో కనబడుతుంది. "చిప్ప మల్లయ్య లింగమ్మ కదిలిస్తే చాలు వలవలా ఏడ్చేట్టున్నారు. రాజమల్లు! మీ అవ్వయ్యలను సూడొక్కసారి వాళ్ళ ముఖంల ఎంత ఏడ్పుందో సూడు. నీకిదేం బుద్ధి? అయిన వాళ్ళను,

కన్నవాళ్ళను, పుట్టిపెరిగిన భూమినిడ్సిపెట్టి భీవండికి పోవుడెందుకు చెప్పు? ఇక్కడ మేమంత బతుకుతలేమా? మీనాయిన బతుకత లేడా? దేశంగాని దేశంబోయి నువ్వు వేలు సంపాయించుకత్తవా? గా వెయిలు లేకుంటేబాయె? భీవండికి పోయినా బాగా సంపాయించుకచ్చినోల్లు మన కులంలెవ్వలున్నరో చెప్పు.... అక్కడయినా చేతికి మాతికున్నట్టే ఉంటుంది గద! అసలు నీకు గీ బుద్దెందుకు పుట్టింది? ఆదిలాబాద్ దిక్కుపోయినా పదిహేను రోజులకొకసారి ఇంటికచ్చెటోనివిగదా! అందర్నిడిసిపెట్టి గా మరాట దేశం పోతననవడ్తివి ఇదేం బిడ్డ? రాజమల్లును ఓదారుస్తున్నట్టుగా అన్నాడు రంగయ్య" (మల్లయ్య, కాలువ. 2005: 35, 36).

గ్రామాలలో నేటి వృత్తికారుల పరిస్థితికి నిదర్శనంగా చిత్రించారు రచయిత. బొంబాయి, భీవండి, సూరత్ లాంటి పట్టణాలలో మిషన్‌ల వస్త్ర ఉత్పత్తి ఉండటం అక్కడ పని దొరకడం అనేది ఇక్కడ ప్రదానంగా చెప్పుకోవాలి. తన తండ్రి ఎంతపని చేసినా సరైన ఆదాయం లేకపోవడం అనేది గమనించిన రాజమల్లు భీవండికి వెళ్ళి అక్కడ పనిచేసి డబ్బులు సంపాదించి కుటుంబాన్ని పోషించాలనుకుంటాడు. కాని తల్లిదండ్రులు దూర ప్రాంతాలకు వెళి బతకడం వద్దని చెప్తారు. చివరకు భీవండికి వెళ్తాడు. ఆరునెలల తరువాత అక్కడ మతకలహాలతో చనిపోవడం జరుగుతుంది. కొడుకు దూరంగా వెళ్ళి బ్రతుకుతాడని భావించిన తల్లిదండ్రులకు కన్నీరు మిగులుతుంది.

ఈ నవలలో తాము అనుభవిస్తున్న జీవితం కన్న తమ పిల్లలు ఉన్నత స్థితిలో జీవించాలనుకునే ఆతృత ఉన్నప్పటికీ తమ కళ్ళముందు ఉండాలనే ప్రేమ ఎక్కువగా ఉంటుంది. దూర ప్రాంతాలకు వెళ్ళి అక్కడ ఎలా బ్రతుకుతారో అనే బాధ, సందేహాన్ని కల్గి ఉంటారు. కొందరు ఆర్థికంగా స్థిరపడతారు. మరికొందరు అక్కడ జరిగే సంఘటనలకు బలైపోతారు.

### 4.1.2. ప్రకృతి — వృత్తి సంబంధం

మానవుని సుఖమయ జీవితానికి ప్రకృతి తోడ్పడుతుంది. మానవ స్వభావంపై మొదటగా ప్రభావం చూపేది ప్రకృతే. "మనిషి తాను జన్మించడంతోనే తనకు తెలియకుండానే ప్రకృతిలో, తాను నివసించబోయే సమాజంతో సంబంధాన్ని కలిగి

ఉంటున్నాడు. మనిషి ప్రకృతితో తోటి వ్యక్తులతో తన వ్యక్తిత్వంతో, సంస్కృతితో క్రమంగా సంబంధంలోకి వస్తున్నాడు" (వెంకటేశ్వరరెడ్డి, అన్నపురెడ్డి. 1991: 1). ఈవిధంగా తన చుట్టూ ప్రకృతి పరిసరాలు అనగా పశుపక్ష్యాదులు, గాలి, నీరు, మొదలైనవన్నీ కలిసి మానవుని స్వభావంలో మార్పు రావడానికి, సమగ్ర వ్యక్తిత్వంగల మనిషిగా గుర్తింపు పొందడానికి ప్రధాన కారణం ప్రకృతి అని చెప్పవచ్చు. ఇంతటి ప్రభావం కల్గిన ప్రకృతికి, వృత్తికిగల సంబంధాన్ని ఈ విభాగం కింద విశ్లేషించడం జరిగింది. ప్రకృతిలోని ప్రతీది వృత్తిగా పరిణామం చెందుతుంది. అందుకే ప్రకృతే వృత్తి, వృత్తే ప్రకృతిగా కనిపిస్తుంది. దీనికి మంచి ఉదాహరణగా వ్యవసాయం. వ్యవసాయానికి కావాల్సిన భూమి, నీరు, గాలి, వెలుతురు మొదలైనవి ప్రకృతిలోనివే. అందుకే ప్రకృతే వృత్తిగా పరిణామం చెందిందని చెప్పవచ్చు. ఇక మిగిలిన వృత్తుల విషయానికి వస్తే ప్రకృతితో సంబంధం కల్గినది గీతవృత్తి. "నేను మాణిక్యం (ఇది చెట్టు పేరు) ఎక్కి వత్త ఎవలన్న కల్లు కావాలని వత్తె ఆగుమనుండ్రి అని బుంగ తీసుకొని వెళ్ళినాడు నారాయణగౌడ్" (శ్రీనివాస్ గౌడ్, నేరేళ్ళ. 2004: 5), "మన గౌండ్లోల్లకు తాటి చెట్టు తల్లిలాంటిది. ఈతచెట్టు ఇల్లు లాంటిది. తాటిచెట్టు గాని, ఈతచెట్టుగాని మంచుగుంటనే మన జీవితాలు మంచుగున్నట్లే. అయినా మన పూర్వీకులు తాటిచెట్లను ఈతచెట్లను నమ్ముకొని బతుకినవాల్లే అన్నాడు నారాయణగౌడ్" (శ్రీనివాస్ గౌడ్, నేరేళ్ళ. 2004: 53). ఈవిధంగా తాటి, ఈత చెట్లతో ఉన్న అనుబంధాన్ని మన కళ్ళముందుంచారు రచయిత. చెట్లకు పేర్లు పెట్టడం, వాటిని మానవుని వలె భావించడం లాంటి విషయాలతో పాటుగా పూర్వంనుండి తాటి, ఈతచెట్లను గీతకార్మికులకు చేస్తున్న సహాయాన్ని వారు ఎప్పటికీ మర్చిపోలేనిదిగా ఉండడం గమనించవచ్చు.

ప్రకృతితో ముడిపడి ఉన్న మరో వృత్తి కుమ్మరి. ఈ వృత్తి వారు ప్రకృతిలో దొరికే మట్టి, కలప సేకరిస్తారు. మట్టిని తమకు అనుకూలంగా చేసుకొని దానికి నైపుణ్యం జోడించి వివిధ ఆకారాలతో తయారు చేసి, వాటిని వాములో పెట్టి కలప పేర్చి మంట పెడతారు. వాములో అవి కాలిన తరువాత వినియోగానికి సిద్ధమవుతాయి. వాటిని అమ్మి జీవనం సాగిస్తుంటారు. వివిధ రకాలైన ఆకృతిలో తయారు చేయడంలో చాలా శ్రమతో కూడిన ఓర్పు కావాలి. ఈ వృత్తి నేపథ్యాన్ని తీసుకొని రాసిన నవల మాదిరెడ్డి సులోచనదేవి 'సుషుప్తి'. "ఇంటి ఎదురుగా ఉన్న పెంటయ్య మామ పెట్టీనట్టున్నడు అనుకున్నాడు. తండ్రి

ఆము పెడదాము అన్న సంగతి గుర్తుకు వచ్చింది. గబగబ లేచి సారె దగ్గరకు వెళ్లాడు. యెంకమ్మ లేచి వచ్చి, నీళ్ళు పుక్కిలించి, తాడు తీసుకుని, చెప్పులు వేసుకుంది. కుమ్మరి స్త్రీలకు ప్రతిరోజు ఉండే కార్యక్రమే అది. జట్లు జట్లుగా అడవిలోకి వెళ్ళి కంపమోపులు తెస్తారు. ఆ కంప కుండలు, పెంకు కాల్చటానికి ఆములో పెడతారు. అలా పది, పదిహేను రోజులు కష్టపడితేగాని ఒక ఆము కాల్చే కర్ర దొరకదు" (సులోచన, మాదిరెడ్డి. 2017: 16).

ఈవిధంగా ప్రకృతిలో లభించే మట్టి, కలపను తీసుకెళ్ళి కుమ్మరులు కుండలు, కూజాలు మొదలగు వాటిని తయారుచేస్తా . ఇక్కడ ప్రకృతికి వీరి వృత్తికి ఉన్న అనుబంధం విడదీయరానిదని చెప్పవచ్చు.

ఇదేవిధంగా ప్రకృతితో ముడిపడివున్న మరొక వృత్తి చర్మకారులది. వీరి జీవితాలను చిత్రించిన నవల 'కక్క'. ఇది వేముల ఎల్లయ్య రాశారు. ఇందులో "నాల్గు దొడ్లను వొక్క దగ్గర్కి గుంపజేసి పండ్కోబెట్టిండు కక్కడు. అందరు ఖుషీగ అడ్వినంత తోర్నాలగట్టి తీర్తిరు పూలత్తి తిర్నాల బాట్జేసింద్రు. పుచ్చకాయ పొల్గల్ని పసుపన్నం ఎడ్ల పంతలగ్గొట్టి కుంక్మ పూలల్తోటి అడ్విని ముత్తైదుని జేసినట్టు జేసింద్రు. ఎండుతుమ్మకాయలు జనుంకాయలు పస్ల మెడల్ల దండలు గల్లు గల్లు మంటుంటె ఆనందంగ ఆవులు లేగ దూడలు గంతులేస్తుంటే కాలుగల్ని పసుల పోరగాళ్ళు పాటల్ పాడ్తుటే గుడ్డి గోరెంకల అర్పులు మేలతాలాలైనయ్. గొడ్లు తడ్తడి పచ్చగడ్డి కంచెంత కలెదిర్గి మేత్తుంటే ఊరు ముత్తాలమ్మకు బోనాలు జేర్సినట్టుగ పసుల వొర్సబంతులాయే!" (ఎల్లయ్య, వేముల. 2000: 4). ఇక్కడ దళితుల పిల్లలు ప్రకృతిలో మమేకం కావడం కనిపిస్తుంది. ప్రకృతిని, పశువులను ఆరాధించడం ప్రత్యేకంగ చెప్పుకోవాలి. పశుల పండుగ పేరుతో వివిధ ఉన్నత వర్గాల దగ్గర ఉన్న పశువులను కాచే దళితుల పిల్లలు ఐక్యమత్యంతో కలిసి పండుగ చేసుకోవడం చెప్పుకోదగిన విషయం. ప్రకృతిని ప్రకృతిలోని చెట్ల కొమ్మలతో, కాయలతో అలంకరించడం ఎంతో అద్భుతమైన సంఘటనగా పేర్కొనవచ్చు. పక్షుల అరుపులను మేళతాళాలుగా పేర్కొనడం మొదలు, ముత్యాలమ్మకు బోనాలు సమర్పించేవరకు చేసే ప్రతి పని ప్రకృతి ఆరాధ్యులుగా చిత్రించడం ఎంతో గొప్పగా ఉంది. ఇక్కడ రచయిత చిత్రించిన విధానం, ఆలోచన ధోరణి గమనించవచ్చు.

ఈ విధంగా రచయితలు వృత్తిదారులకు ప్రకృతితో విడదీయరాని సంబంధం కల్గి వుండడాన్ని నిశితంగా తెలిపిన విధానాన్ని అభినందించవచ్చు. కాని నేడు మనిషి ప్రకృతిని నాశనం చేస్తూ సమస్యలను కొని తెచ్చుకుంటున్నాడు. నేడు స్వచ్ఛమైన గాలి, నీరు కరువయ్యాయి. చివరికి ఆహారంలోనూ కల్తీయే. భూసారం కోల్పోయి భూములు బీడువారిపోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటడం, చెరువులు, బావులు నీళ్ళులేక ఎండిపోవడం, ఫ్యాక్టరీల వలన కాలుష్యం పెరగడంతో ఉష్ణోగ్రతలు ఎక్కువై మానవునికి వింత రోగాలు ఎన్నో వస్తున్నాయి. దీంతో భవిష్యత్తులో ఎదుర్కోబోయే ఆటుపోట్లకు, ఎన్నో వైపరిత్యాల ప్రత్యక్షంగానే కాక పరోక్షంగా కూడా కారణం అవుతున్నాడు. ప్రకృతి ఏ మాత్రం ప్రక్షేపించిన అనేక తీవ్ర పరిణామాలని ఎదుర్కోవల్సి వస్తుంది. దానిని రక్షించుకోవల్సిన అవసరం నేటి సమాజంపైన ఎంతైనా ఉంది. రచయితలు ప్రకృతితో మానవునికి ఉన్న అవినాభావ సంబంధాన్ని ఎంతో రమణీయంగా ఈ నవలల్లో చిత్రించారు.

### 4.1.3. గ్రామీణ వ్యవస్థ

'గ్రస్' అనే ధాతువుపై 'మన్' అనే ప్రత్యయం చేరి ధాతువులోని ఆకారం ఆదేశమై గ్రామ శబ్దం ఏర్పడింది. 'గ్రసనం' అంటే ఆహారం అని అర్థం. ఆహారానికి ఉత్పత్తి కేంద్రమైన ప్రదేశాన్ని గ్రామం అని అంటారు. ఈవిధంగా గ్రామమే మానవ జీవితానికి పునాది అనే విషయం అర్థమవుతుంది. పూర్వం రాజ్యాలను పరిశీలిస్తే అవి ఎక్కువగా నదుల దగ్గరనే స్థాపించబడినాయి. అదేవిధంగా గ్రామాలు కూడా నీటి లభ్యత ఎక్కడ ఉంటుందో అక్కడే అభివృద్ధి చెందుతాయి. గ్రామీణ ప్రజల ముఖ్య వృత్తి వ్యవసాయం, పశుపోషణ. వీటి ఆధారమైంది నీరు. అందుకే నీరు ఎక్కడ ఉంటుందో అక్కడి ప్రజలు జీవనం బాగుంటుంది. గ్రామాలలో ప్రజలు సాంప్రదాయకమైన వృత్తులను చేసుకుంటూ, ఒకరికొకరు పరస్పరం సహాయసహకారాలను అందించుకుంటూ జీవనం సాగిస్తుంటారు. కావున ఒకరివృత్తి మరొకరు స్వీకరించకుండా వారిలో వారు సహకరించుకుంటూ అన్యోన్యంగా సహకారాల్ని అందించుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈవిధంగా

వృత్తికులాల వారు తమ అభివృద్ధి కోసం పాటుపడుతుంటారు. ఇప్పటికీ ఆచారం, సంప్రదాయాలను పాటిస్తున్న గ్రామాలను చూస్తూనే ఉన్నాం.

ఈ నవలల్లో గ్రామీణ ప్రాంతాలలో జీవిస్తున్న వృత్తులగురించి స్పృశించిన విధానాన్ని పరిశీలించినట్లైతే గ్రామాలలో అనేకమైన వృత్తులవారు కలిసి ఉంటారు. వారి మధ్య ఉండే సహాయసహకారాలను నేరేళ్ళ శ్రీనివాస్ గౌడ్ 'బతుకుతాడు' నవలలో మనముందుంచాడు. "లక్ష్మి బియ్యంలేక అన్నం వండలేదనే విషయం గంగమ్మకు కూడా తెలుసు. గంగమ్మకు వారి ఇంటి పరిస్థితిని చూస్తుంటే జాలి కలుగుతుంది. గంగమ్మ కండ్లపెళ్ళి, హన్మాజిపేటలోని రైతులు, రైతు కూలీలతో పాటు పటేండ్ల ఇండ్లలో కూడా బట్టలు ఉతుకుతుంది. వారు ప్రొద్దున సాయంత్రం వేసే అన్నంలోంచి ఒక ఇంటి అన్నం శ్రీనివాస్ గౌడ్ మందం వేరే పేగుల తీసుకవచ్చి ఇయ్యాలనుకుంది. కాని గంగమ్మది తక్కువ కులం కావడంవల్ల తింటారో తినరొ అని అనుమానంగా ఉంది. గంగమ్మ ఇప్పుడు ఒక ఇంటి అన్నం వేరె తీసుకు వచ్చింది. ధైర్యం చేసి అడగాలనుకుంది. 'శీను పల్లెం తెచ్చుకో.... అన్నది గంగమ్మ. పల్లెమా...? పల్లెమెందుకు...? అడిగాడు శ్రీనివాస్ గౌడ్. నువ్వు ముందు పల్లెం తెచ్చుకుపో. శ్రీనివాస్ గౌడ్ గుడిసెలోనికి పోయి పల్లెం తెచ్చినాడు. గంగమ్మ ఒక పేగు ముల్లె ముడి విప్పి అన్నం పల్లెంలో వేసింది. లక్ష్మి చూస్తుంది. మాట్లాడలేదు. తన కుటుంబం పరిస్థితి అనుకుంది. కాంతారావు పటేలు భార్య మంచిది. ఉడుకుడుకు(వేడివేడి) బువ్వ ఏత్తది... రోజు ఆల్లు ఏసే బువ్వ వేరే పేగుల తీసుకు వచ్చి శీనుకు ఏసిపోత అనుకుంటు వెళ్ళిపోయింది గంగమ్మ. శ్రీనివాస్ గౌడ్‌కు కులాలు మతాలు తెలియవు. ఇంట్లోకి వెళ్ళి కారప్పొడి వేసుకొని అతని చెల్లెండ్లు తమ్ముడు కలిసి తిన్నారు" (శ్రీనివాస్ గౌడ్, నేరేళ్ళ. 2004: 29). ఇందులో రచయిత వృత్తి కులాల మధ్య ఉండే ఆప్యాయతలను, ఒకరికొకరు సహకరించుకునే విధానాన్ని మనకళ్ళముందుంచారు. దీనిని చదువుతున్నప్పుడు పాఠకునికి ఆ కుటుంబాల పరిస్థితి దృశ్యమానం అవుతుంది. వృత్తులను ఆధారంగా చేసుకొని జీవించే వారికి సరైన ఆహారం లభించదు. అలాంటి పరిస్థితుల్లో ఇతర వృత్తులవారు ఇచ్చే చేయూత ఎంతో గొప్పదిగా ఉంటుంది. ఇక్కడ గంగమ్మ సేవక కులవృత్తి అయినప్పటికీ తోటి వారికి చేసే సహాయం ఉన్నతమైనదిగా చెప్పవచ్చు. ఇక్కడ

వృత్తి కులాల మధ్య ఎలాంటి కుల పట్టింపులు, తారతమ్యాలు ఉండవు అనే విషయం మనకు అర్థమవుతుంది.

అలాగే మరొక గ్రామీణ వృత్తిని చిత్రించిన నవల 'కక్క'. ఈ నవలలో "సర్వొద్దులున్న నా కోడల్కి నిండు తోడున్న. ఆపతి పడుతున్న శివాంట నొప్పులకే జప్పున మంగలి నర్సమ్మ ఆకిట్లకి బోయి నా కోడలు ఆపతి పడ్తుందని జర ఎట్లన్న కాన్పు జెయ్యమని కాల్లేల్లబడ్డ నీ సేతిసల్లగుండ నీ సేత్ని బుట్నోడు కోట్కి పడ్గెత్తునంట ఆడు పియ్యి ముట్నా బంగారమగునంట అని సేత ఏ కాత్తై నా పిచ్చెకాత కాత్తదని మంగలి నర్సమ్మని బతిలాడిన ముచ్చట్లు యాది దెచ్చుకుంది ముసల్ది" (ఎల్లయ్య, వేముల. 2000: 1, 2).

ఈవిధంగా గ్రామాలలో ఒకరికొకరు సహకరించుకోవడం ఇక్కడ గమనించవచ్చు. చర్మకారులను ప్రధానంగా పైవర్గాల వారు అనగా ధనికులు, బ్రహ్మణులు దగ్గరికి రానివ్వరు. వారిని తక్కువ జాతిగా చూస్తారనేది సత్యం. ఇక్కడ వృత్తి కులాలవారు మాత్రం వారిని ఆదరించిన విధానాన్ని రచయిత మనముందుంచాడు. వృత్తి కులాల మధ్య ఎలాంటి తారతమ్యాలు లేవనే విషయం ఇక్కడ మనకు అర్థమవుతుంది.

### 4.1.4. వృత్తులకు మధ్యగల సంబంధం

మనిషికీ, మనిషికీ మధ్య అభిరుచులను, అవసరాలను ఇచ్చిపుచ్చుకోవండంతో ఇతరులతో సంబంధం ఏర్పడుతుంది. ఇలాంటి మానవ సంబంధాలలో విలువలు, అభిరుచులు ఉంటాయి. ఈ రెండు కూడా ఒకే బంధం కిందికి వస్తాయి. ఈ రెండు వివిధ సన్నివేశాలలో పని చేస్తాయి. అందుకే వీటిని సమాజానికి వర్తింపజేస్తూ కొనసాగితే సామాజిక విలువలతో కూడిన సంబంధాలు ఏర్పడతాయి. ఇదే విధంగా వృత్తుల సంబంధాలు కూడా వీటి మీదనే ఆధారపడి ముందుకు కొనసాగుతాయి. వృత్తులు ఒకదానికి ఒకటి గౌరవం ఇచ్చుకుంటూ తగిన ప్రాధాన్యతలతో అవసరాలను తీర్చుకుంటూ ఒకదానితో మరొకటి ఐక్యమై జీవన మనుగడను సాగిస్తున్నాయి.

మానవుడు సమాజంలో అంతర్భాగం. మానవుడు తనతోటి వ్యక్తులతో వివిధ రకాల అనుబంధాలు కల్గి ఉండడమే మానవ జీవితం. ఇదే విధంగా వృత్తులు కూడా మిగతా వృత్తులతో అనుబంధాన్ని కలిగి ఉంటూ ముందుకు సాగుతున్నాయి. నవలల్లో వృత్తుల

మధ్యగల సంబంధాలను గమనించినట్లైతే కుమ్మరి వృత్తికి మిగిలిన వృత్తులతో గల సంబంధాన్ని మాదిరెడ్డి సులోచన గారు 'సుషుప్తి' నవలలో వివరించారు. "కుమ్మరి యెంకమ్మనా, పూసిన తగేడులా ఉంటుంది అనుకునేవారు తోటి స్త్రీలు. పంటలేకోయినా వ్యవసాయదారులకు కుండలిచ్చి, తెచ్చిన ధాన్యం ఇంటినిండా ఉండేది. కట్టడి ధాన్యం వేరే వచ్చేది. డబ్బులు లేకుండానే రెండు ముంతల కల్లు వచ్చేది. సాయంత్రం భార్యా, భర్తలు ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ త్రాగేవారు" (సులోచన, మాదిరెడ్డి. 2017: 14).

ఈవిధంగా రైతులకు, గౌడ్ల మరియు ఇతర వృత్తిదారులకు కుండలు, కల్లుముంతలు చేసి ఇస్తారు. దానికి ప్రతిఫలంగా కట్టడిగా వడ్లు ఇస్తారు. గౌడ్ల వారు కల్లు పోయడం లాంటి విధానాన్ని గమనించవచ్చు. ఈవిధంగా వృత్తులు అవసరానికి సహాయపడుతూ, వృత్తులు సమన్వయం కలిగి ఉంటూ ఒకరికొకరు సహకరించుకుంటూ జీవనం సాగిస్తున్న వృత్తుల వాస్తవిక జీవనాన్ని స్పృశించారు రచయిత. అంతేగాకుండా వృత్తుల శ్రమకు తగిన ప్రతిఫలాన్ని నిష్పక్షపాతంగా ఇవ్వడాన్ని గమనించవచ్చు.

అదేవిధంగా మరొక వృత్తి చర్మకార వృత్తి. చర్మకారులకు వివిధ వృత్తుల వారితో ఉండే సంబంధాన్ని గురించి వేముల ఎల్లయ్య 'కక్క' నవలలో తెలిపాడు. "సెప్తా ఇనాకక్కా! ఆసాములిండ్లల్ల పెండ్దొక్కి పిడ్కెలు జేయ్యాలే! పొయ్యిలకు కట్టెలు తేవాలె! ఎంతమందుంటె అందర్కి సెప్పులు గుట్టియ్యాలె! పాత కొత్త సెప్పులకు గల్పి పదేలు మాన్కలు (ముప్పై సేర్లు) ఇగ ఇను కక్కా! ముత్తాం ఎన్మిది కుండలు గింత సేవజేస్తే వొచ్చేది గాల్ల సేనేరబోతె నీలకుండ నిండ కంకులు నింపిత్తరు! ఎన్కముందు వొడి మాదిగొని వొంచె నింపుకోవొచ్చు! నాగలిత్త నాన్కి రెండు పూటలుబోతె తవ్వెడు గింజలు కల్లం అల్కుపూతకు కల్లమడ్లు ఇత్తులు ఊకి ఎత్తుకోవాలె! సెల్కల కల్లమైన వొరికల్లమైనా వొచ్చేదంతే! ఏదుం (పది కుండలు) పందుం (ఇరవై కుండలు) పుట్టెడు (నలభై కుండలు) ఇగో దాన్నెంలెక్కొస్తే గిట్లుంటది ఆసామ్కి యే పంటైనా పండితె మనకు కల్లమడ్లు పెద్దమేతరి సాట కల్లంల దిప్పేశిన దిష్టికట్ట మనకొచ్చేది! ఇంటివా కక్కా! మంచిగిను జవాన్ల సేవ అవరకాలు సిన్నకారు సన్నకారు అంజుమాన్ బూమి శిస్తు పన్లు గివ్వన్నింటి గోసం ఊరంత దప్పు సాటింపు జెయ్యాలె" (ఎల్లయ్య, వేముల. 2000: 34, 35).

ఈవిధంగా భూస్వాములకు చర్మకారులు చెప్పులు కుట్టడం మొదలు, వ్యవసాయ పనులలో సహకరిస్తుంటారు. దానికి ప్రతిఫలంగా రైతులు ధాన్యాన్ని ఇవ్వడం జరుగుతుంది. చర్మకారులు అనగా మాదిగ కులాల వారు. ఈవిధంగా వృత్తులు అవసరానికి ఉపయోగపడుతూ వృత్తులు సమన్వయం ద్వారా ఉపాధి లభిస్తుంది. తద్వారా జీవనం సాగిస్తున్నారు.

ఈవిధంగా వృత్తుల మధ్య సంబంధాల్లోని వివిధ అంశాలను విశదీకరించిన తీరు బాగుంది. వృత్తికి మరో వృత్తికి ఉన్న సంబంధాన్ని రచయిత పరిశీలన దృష్టి నవలకి నిండుదనాన్ని ఇచ్చింది. అందువల్లన్నే వాస్తవికతతో కూడిన జీవనం దృశ్యమానం చేయడం రచయితలకు సాధ్యమైంది.

### 4.1.5. వృత్తులపై వివక్ష మరియు దౌర్జన్యాలు

వివక్షతకు భేదం, చూపు, వ్యత్యాసం, తక్కువగా చూడడం, Different అనే అర్థాలు ఉన్నాయి. పూర్వకాలం నుండి సమాజంలో వృత్తులపై వివక్ష నేటికి కొనసాగుతూనే ఉంది. తెలంగాణలో నిజాం పరిపాలన ఆనాటి దేశ్‌ముఖ్‌లు, దొరలు, పట్వారి మొదలగు వారు నిరంకుశత్వ పాలనతో పాటుగా వృత్తికులాలపై వివక్షతను, వెట్టిచాకిరి చేయించుకునేవారు. వృత్తికులాల కారణంగా ప్రజలు తక్కువగా చూడబడుతూ ఎన్నో దౌర్జన్యాలను, అవమానాలను పొందారు. ఈ వివక్షత, దౌర్జన్యాల కారణంగా జీవనం ధ్వంసమై నిస్సహాయంగా వెళ్ళదీసే అభాగ్యుల జీవితాలను స్పృశిస్తూ వాస్తవిక జీవితాన్ని కళ్ళముందు ఉండే విధంగా చిత్రించిన నవలలు మనకు దర్శనమిస్తాయి. వృత్తులపై వివక్షతను, దౌర్జన్యాలను అనుభవించిన వారు మరియు దగ్గర నుంచి చూసి వాళ్ళ జీవన విధానాన్ని గురించి సంపూర్ణ అవగాహనతో రాసిన రచయితలు ఎందరో ఉన్నారు. వృత్తి కులం అనే కారణంతో వివక్షతతో వెలివేయడం, బహిష్కరణ విధించడంతో పాటు దౌర్జన్యాలు చేయడం, హత్యల వంటి దారుణ సంఘటనలు కూడా ఈ నవలల్లో దృశ్యమానం చేశారు. ఈ అంశంలో భాగంగా లోక మలహరి రాసిన నవల 'సంఘము'లో "ఒకనాడూ మధ్య రాత్రి ఉన్నట్టుండి బర్రె పాకకు నిప్పంటుకొని దగ్గరున్న గడ్డివాము గూడా దగుల్కొన్నది. అంతలో నర్సయ్య బయటికి వచ్చి చూసేసరికి ఎవ్వరో దూరం నుండి

పరుగెత్తుతున్నట్ల ఆ వెలుగులో కనిపించింది. కాని దూరం నుండి ఉరుకుచున్న వారినెట్లు గుర్తుపట్టగలడు? గుర్తిపట్టినా ఏం చేశ్తాడు? ఎటూ తోచక లబలబ మొత్తుకున్నాడు. బర్రె, దాని దూడ 'అంబా' అని అతి దీనంగా అరిచినయి, వెంటనే పాకలోకి జొరబడి ఆరెండింటి మెడ త్రాళ్ళు తప్పించి బయటికి తరిమినాడు. దూడ గాబరపడి మరీ లోపలికే పరిగెత్తి అగ్ని దేవున్ని వొళ్ళో దాక్కుంది. గేదే మాత్రం బయటపడ్డది. అంతలో ఆ చప్పుడూ, వెలుగును చూచి ఇరుగుపొరుగువారు చాలామంది చేరి కడవలూ, బిందెలు, చేతికందిన వానితో నెల్లా నీళ్ళు తెచ్చి చల్లినారు. బర్రెపాక, గడ్డివాము రెండు కాలి కూలినయి...... నర్సయ్య భార్య ఆదుర్దాగా పక్కలో పండుకొన్న ఎడ పిల్లల్ని మాత్రం బయటికి తీసుకొచ్చింది. మంటలు చెలరేగినందుకు లోపల తొట్టెలో పరుండియున్న పసిపాపను తేజాలకపోయింది. పాప రోదనం వినగానే వెంకయ్య మండుచున్న గృహంలోకి ఉరికి అమాంతంగా బిడ్డను దీసి హృదయానికి హత్తుకొని అతివేగంగా బయటపడ్డాడు. కాని ఏమి లాభం మంటల వేడిమికి ఆ చిన్న ప్రాణి భరించలేదు. తటతటమని కొట్టుకొనుచున్న ఆ లేత గుండెకాయ కొన ఊపిరిని ఆపివేసింది. ఏడ్పుతో, అల్లరులతో తెల్లవారింది. అమాయకుడగు నర్సయ్య ఇల్లు ఆ పాపి భుజంగరాయుడే కాలపెట్టించినాడని చెప్పకనే పాఠక మహాశయులూహించగలరు" (మలహరి, లోక. 2017: 33, 34).

నర్సయ్య తన తండ్రి నుండి వచ్చిన డబ్బుతో పాటుగా తాను సంపాదించుకుంటాడు. ఇతనిది జాలి గుణం. తనతోటి వారికి సహాయం చేయాలనే ఆలోచనతో పాటుగా ఆచరించి చూపుతాడు. తనతోటి పద్మశాలులకు పనులు లేని సమయంలో నూలు తెప్పించి తన గ్రామస్థులకే కాక, పక్క గ్రామాల వారికి పని కల్పిస్తాడు. ఇతని నిస్వార్థ బుద్ధిని చూసి తోటి కులంవాళ్ళే దొర దగ్గర ఇతనిపై చెడుగా చెప్పుతారు. భుజంగరెడ్డి సాధారణంగా గ్రామంలోని ఎవరైనా మంచి బట్టలు వేసుకున్న, కొంత ఆదాయం సంపాదించుకున్న వారిని చూసి ఓర్వలేడు. వారిని ఎలాగైనా అణిచివేస్తాడు. ఇక్కడ నర్సయ్యను కూడా అదేవిధంగా చేస్తాడు. పదిమందిలో కర్రతో దెబ్బలు కొట్టడమే గాకుండా, ఇల్లు తగలబెట్టిస్తాడు. ఈ సంఘటనలో ఆస్తి, దూడతోపాటుగా తన కూతురును కూడా కోల్పోతాడు. ఈవిధంగా దొరలు వృత్తిదారులను హింసించిన సంఘటనలు అనేకం.

ఇలా కులవృత్తి దారులపై వివక్షతతో పాటూ దౌర్జన్యం చేసే విధానం వాస్తవికంగా కళ్లకుకట్టే ప్రయత్నం చేశారు రచయిత.

ఇదే విధంగా వృత్తిపట్ల వివక్షత మరియు దౌర్జాన్యంకు గురైన గౌడవృత్తికి చెందిన మరో నవల 'బతుకుతాడు'. "లక్ష్మన్‌రావు పటేలు ఇంట్లోకి వెళ్ళి తాడు తెచ్చినాడు. నారాయణ గౌడ్‌ను పందిరి గుంజ దగ్గరికి లాక్కువెళ్ళి కట్టేస్తున్నాడు. బుద్ధి గడ్డి తిన్నది పటేల... పిల్లలగలోణ్ని నన్నేం జేయ్యకుండ్రి.. నీ కాల్మొక్త.. అని కాళ్ళమీద పడిపోయాడు. గాడ్డి కొడుక కాళ్ళమీదపడ్తావు..లే... అని రెండు చేతులు అందుకొని వెనుకకు గుంజి తాడు పెడుతున్నాడు. నారాయణ గౌడ్ తప్పించుకొని ఉరుకుదామనుకున్నాడు. ఈలోపు రెండు చేతులకు తాడుపెట్టి గుంజ దగ్గరకు గుంజి కట్టెసినాడు. గరీబోన్ని పటేల నన్నిడిసిపెట్టుండ్రి... ప్రాధేయపడ్డాడు. ఇంకేడి కోతవురా...? నాకే కల్లు లేదంటావా...? ఎవడత్తాడో రాని.... అని కుర్చీలో కూలపడ్డాడు. పటేల నన్నిడిసి పెట్టుండ్రి. ఇంకేప్పుడు కల్లు లేదన అంటు ఏడ్చాడు. లక్ష్మన్‌రావు పటేలు కుర్చీలో కూర్చోని నారాయణ గౌడ్‌ను చూస్తూ పళ్ళు కొరుకుతున్నాడు" (శ్రీనివాస్ గౌ, నేరేళ్ళ. 2004: 8). నారాయణ గౌడ్ గతంలో లక్ష్మన్‌రావు పటేల్‌కు కల్లుపోస్తాడు. డబ్బులు ఇవ్వడు లక్ష్మన్‌రావు పటేలు. దాంతో ఈసారి కల్లు కావాలని పెద్ద భూమయ్య పంపుతాడు. గత అనుభవం దృష్టిలో ఉంచుకొని కల్లు లేదంటాడు నారాయణ గౌడ్. కల్లు పోయలేదనే కోపంతో లక్ష్మన్‌రావు పటేలు తన ఇంటి ముందునుంచి వెళ్తున్న నారాయణ గౌడ్‌ని కేవలం కల్లుపోయలేదనే ఉద్దేశ్యంతో తిట్టుకుంటూ తీసుకొచ్చి కట్టివేస్తాడు. ఈ సంఘటన నాటి కాలంలోని పట్వారీల దౌర్జన్యానికి నిదర్శనంగా ఉంది. నారాయణ గౌడ్‌ను విడిపీయడానికి తల్లిదండ్రులు, తమ్ముడు, భార్య ఇలా అందరూ వచ్చి బ్రతిమిలాడినా వదిలిపెట్టడు.

ఇదే వృత్తికి సంబంధించిన మరొక నవల 'కల్లు మండువ'. ఇందులో కె. వెంకటేశ్వర్లు దొరల దౌర్జన్యాన్ని మన కళ్ళముందుంచారు. "కల్లుకుండలు పగిలి ఉన్నాయి. కల్లు మండవలు ధ్వంసమయ్యాయి. రాత్రి చెట్లకు కట్టిన లొట్లు పఘిలి వేలాడుతున్నవి. చెట్లకింద నేలమీద చెట్టు గొలలు కల్లు పైనుండి బొట్లుబొట్లుగా కారుతుంది. కార్మికుల గుండె ఝుల్లుమంది. ఏదో కీడు శంకించింది. మారయ్య తన ఒక్కడి మండవనే ఎవరో దొంగ వెధవలు ఇట్లా చేశారనుకున్నాడు. అయినా ఆయనలో ఎదో ఒకమూల అనుమానం.

అప్పయ్యకు ఇదే పరిస్థితి ఎదురైంది. భానుపురిలో వెంకటికి, తన వెంట వచ్చిన వాళ్ళు కూడా ఈ చేదు అనుభవమే రుచి చూడాల్సి వచ్చింది. ఉదయం పదిగంటలకు అసలు విషయం తెల్సింది. దొరవారి ఎంగిలి మెతుకులు గతికే దొంగ వెధవ ఒకడు రాత్రి మారయ్య ఇంటికాడ జరిగిన రహస్య సమావేశం గురించి ముస్తాదర్‌కు ఆ రాత్రే సమాచారం చేరచేశాడు. గ్రామాలలో తమ పెత్తనాన్ని ఎదురించి గీత సంఘం ఏర్పాటు చేసుకునేందుకు గీత కార్మికులు ఒకటయ్యి సమావేశం పెట్టుకున్నారనే వాస్తవం తెలిసి హడలిపోయి, ఆదిలోనే వీళ్ళను అణగకొట్టాలని బెదరకొట్టి తమ చెప్పు చేతుల్లో ఉంచుకోవాలని ముస్తాదర్ తన రౌడీలతో రాత్రికి రాత్రే ఈ పని చేయించాడని వెంకటి తెల్సుకున్నాడు" (వెంకటేశ్వర్లు, కె. 2006: 25).

దొర ఆధ్వర్యంలోని ముస్తాద్‌దార్లు జిల్లా వేలం పాట ద్వారా మామూలను తమ కైవసం చేసుకుంటారు. గీత కార్మికుల మీద అధిక పన్నులు విధించడం, వారు నిర్ణీత సమయంలో పన్నులు చెల్లించకుంటే వారి ఇండ్లను జప్తు చేసేవారు. ఇలాంటి విధానానికి స్వస్తి పలకాలని ధర్మభిక్షం అందరిని చైతన్య పరుస్తాడు. ఈ విషయం తెలిసిన దొర, ముస్తాదర్లు తమ రౌడీలతో దౌర్జన్యంగా తాటి చెట్ల మీద కల్లు లొట్లు పగలగొట్టడం, కల్లుమండువలు లేకుండా ధ్వంసం చేస్తారు. ఈవిధంగా వృత్తిదార్లను పైవర్గంవారు హింసించే తీరు మనకళ్ళముందుంచారు. అంతేగాకుండా వృత్తికారులలో వస్తున్న చైతన్యాన్ని అణిచివేయాలనే దృక్పథం కల్గిన ముస్తాదర్ల కుటిల బుద్ధిని బహిర్గతం చేశారు రచయిత.

మరొక వృత్తి చర్మకారులది. వీరు దళితులు. దళితులపట్ల దొరలు ప్రవర్తించే తీరును వేముల ఎల్లయ్య 'కక్క' నవలలో చిత్రించారు. "ఒరోరీ గాడ్డి ముండా గొడ్కా! ఇంటి ముంగల ఆసన బట్న కుక్కను బెట్కొని సూత్తరేంరా! సచ్చిన గొడ్లదినే లంజగొడ్కులకి ఆసనేమొస్తది? బోసిడికేగా కుక్కను గుంజ్కపొయి పెరట్ల బారాశిరాపో అనంగనే కక్కడు ఓర్నియమ్మ ఏందిరో తెల్లార్టప్పటికి మా ఆడకట్టు కొచ్చి కుక్క జస్తె ఈల్లకేంది? ఆసన మాకొత్తుందిగని అని మతిల అనుకుండు. సరే పారెయ్యకుంటె దప్తదా? మంచిదయ్య పారెత్తం అని గింత తాడుతుంప దెచ్చి కుక్క కాలుగ్గట్టి ఆడ కట్లకెల్లి గుంజ్క పోతుండు కక్కడు, ఊర్లె జనాల్నందర్ని బిల్చి కుక్కల కక్కడు కుక్కను గుంజ్క పోతుండు సూర్ర ఊల్లె

కుక్కేడ జచ్చినా గింతోనే గుంజిపియ్యాలని అన్నడు ఎంకరెడ్డి పటేలు. ఎన్కకు జూడకుంట రోండు చేతుల్తోని సచ్చిన కుక్కను గుంజుకుపోతుంటే పటేలు పిల్శే కుక్కల పిల్పు బూమికి రాపిడై సప్పుడాసనకు పిల్పినబడ్డలే, ఓరి కుక్క కక్కా అని లాశిగ బిల్శిండు పటేలు. గిప్పట్నుంచి ఇల్లేమ్దుల ఇంటి పేర్దేశి కుక్కల కక్కడని పేరు దక్కొలయింది" (ఎల్లయ్య, వేముల. 2000: 108).

దొర ఇంటిపేరు, దళితుల ఇంటి పేరు ఒక్కటిగా ఉన్నప్పుడు దొరల వేదింపులులను మనముందుంచారు రచయిత. దళితులను ఇంటిపేరుతో కాకుండా, వారిని హీనంగా పిలిచే విధానం ఇక్కడ కనబడుతుంది. కుక్కను చంపి కక్కని ఇంటిముందు వేయడం, దళితుల ఇంటి వైపుకే రాని దొరలు వచ్చి కుక్కని తియ్యమని, కక్కడు కుక్కను తీసుకెళ్తున్న సందర్భంలో కుక్కల కక్క అని పిలుస్తూ, అందరిని అలాగే పిలవమని చెప్తూ, కుక్కల కక్కగా పేరు పడిపోయేలా చేస్తారు. దళితులపట్ల దొరలకుండే దృక్పథాన్ని మనముందుంచారు రచయిత.

ఇదే నవలలో మరొక సందర్భంలో "నీ అవ్వ మన బాధల మనముంటే గీలదేందిర కందిలి సుట్ట గుడ్డ దియ్యి అని ఎంకులాడుకుంట పోతున్న కొద్ది తొవ్వల గాని సాయితోటి బాగోతం రంగ ప్రవేశం పాట ఇనబడుతుంది. ఈసుమియ పుట్టమన్ను గడ్డకేయ ఇంక జెర్ర ఉర్రడ్ల ఇనబడుతుంది పాట. బూతలంబున మహక్యాతికెక్కిన సూర్యక్యాతిని రచ్చస రాజుడరా అహ రచ్చసరాజుడరా పాట బుక్క మింగుతున్న కొద్ది గాలి బీల్చి ఒదిలి రాగం గుంజి పాడుతుంటె లాసిగ ఇనబడుతుంది. పాటతోటి గాలి సాయెంబటి కందిని ఒత్తి పెద్దగా జేసి పుట్టగడ్డ కాడ్కి పోయె తొవ్వెంబడి ఎల్గును జూసి ముస్కు గప్పుకున్న దొంగలు పిక్కెలు జీరి కాళ్ళను తిత్తిలెక్కజేసి ఉర్కింద్రు జనాన్ని చూసి. రక్తం మడ్గుల నడ్వలేక పుట్టమన్ను మట్టినంత కల్గెం బిల్గం బిస్కి ఒర్రెల ఒదెల సిన్నప్పుడు పచ్చి ఉస్కెను పిట్టగూడు కట్టినట్టు రక్తం మట్టిన ఇల్లు గట్టిండు పడిపోయి మాటెళ్ళుత లేదు మైసాసూరుడైన కక్కని అందరు గల్సి ఎత్తుకొచ్చింద్రు ఆనాత్రి గొర్కోల్లు బొడ్సి మొగులు మీన పర్రెలు బడ కాళ్ళ పిక్కెలు దెగి రక్తం కారుతుంటె ఆకులు ఆలములతోటి నాటు వైద్గం కట్టు గట్టింద్రు" (ఎల్లయ్య, వేముల. 2000: 115).

ఈ విధంగా దళితులపై సాగుతున్న దుర్మార్గాలను నేటి స్థితికి ప్రతిబింబంగా రచించిన నవల. ఈ నవలలో ఒక దళితుని పెళ్ళిలో పుట్టమన్ను తెచ్చే సందర్భంలో మొదలైన గొడవను మనసులో పెట్టుకున్న దొర ఆ కక్కనితోపాటుగా అందరిని హింసించడం, బహుజనులను పాములుగా వాడుకోవడం, ఎవరైనా ఎదురుతిరిగితే వారిని అణిచివేయడం, దౌర్జన్యాలను వాస్తవికతతో కళ్లకు కట్టె ప్రయత్నం చేశారు రచయిత.

ఈ విధంగానే మరొక వృత్తి చేనేత. చేనేత వృత్తిదారులను దొరలు ఏవిధంగా అవమానానికి గురిచేస్తున్నారో ఆ విధానాన్ని కాలువ మల్లయ్య 'గువ్వల చెన్నా' నవల్లో దృశ్యమానం చేశారు. "మా చెప్పినవ్ తియ్యి సాలయినె. ఎక్కువ పెడతట. దసురప్పుడు నీ దగ్గర్నే ధోతీ తీసుకున్నానా? చింగులు మంచిగ ముడుసుటానికి గూడ సాలలేదు పొడుగు. గుంజి గోచి పెట్టడే కష్టమైంది. మల్లగట్లనే గోచి తిరుకుట మాయెటట్టు జెయ్యకు. అట్ల జేత్తే కట్టుకున్నంక నీది నీకు పారేత్త. గందుకనేమొ సాలె సంకుటం గోచి అరుకుటం అన్నరు హహహహ అంటూ నవ్వాడు రాజారావు. దొరతోపాటు అక్కడున్న వాళ్ళంతా గొల్లుగొల్లున నవ్వారు" (మల్లయ్య, కాలువ. 2005: 28).

ఈవిధంగా చేనేత వారితో బట్టలు తెప్పించుకోవడం, దోతికి ఉండాల్సిన పొడవు కన్న ఎక్కువ ఉన్న తక్కువైందని అనడం లాంటి వాటితోపాటు వృత్తిని అపహాస్యంగా చేసి మాట్లాడడం లాంటి సంఘటనలు మనముందుంచారు రచయిత. ఈవిధంగా పదిమందిముందు ఒక వృత్తిదారున్ని అవమానించడం మొదలు తక్కువ ధరకే డబ్బులు చెల్లించడం లాంటివి జరుగుతాయి. వృత్తిదారున్ని దొరలు అవమానపర్చడం, అక్కడ ఉన్నవారు కూడా అవహేళన చేయడం లాంటి సందర్భాన్ని, వృత్తిదారుడు బాధపడడం లాంటి దృశ్యాలను వాస్తవికతతో మనముందుంచారు రచయిత.

ఈ నవలలో వృత్తిదారులపై చూపుతున్న వివక్షత, దౌర్జన్యాల వలన కలిగే కష్టాలు, కన్నీటి కడగండ్లతో విసిగి వేసారిన జీవితాలు ప్రతిబింబించాయి. వీటిలో ప్రధానంగా తెలంగాణలో ఉన్నటువంటి దొరల పాలన, పట్వారీ వ్యవస్థ వలన వృత్తిదారులు అనుభవించిన వివక్షతను, అమానుషాలను, దాడులు సామాజిక సమస్యలకు చెందినవిగా కనబడుతాయి. తెలంగాణలోని దొరల దోపిడి విధానానికి వృత్తికారుల నిస్సహాయతకి నిదర్శనాలు ఈ నవలలు.

### 4.2. వెట్టి

తెలంగాణలో వెట్టి అనేది నిర్బంధంగా ఉండేది. వెట్టి అనగా నిర్బంధ చాకిరి. ఎలాంటి ప్రతిఫలం లేకుండా నిర్బంధంగా పనిచేయటాన్ని వెట్టిచాకిరి అంటారు. ఈ వెట్టి చాకిరి అన్ని వర్గాల ప్రజలకు వర్తించేది. ఈ వెట్టిచాకిరికి అప్పుడప్పుడు నామమాత్రంగా కొంత డబ్బు ఇచ్చేవారు. నిర్బంధ వెట్టి అనేది వంతులు వారిగా ఉంటుంది. వెట్టి చేసే వారిలో హరిజనులే ఎక్కువగా ఉండేవారు. గ్రామాలలో మాలమాదిగ, చాకలి, మంగలి, కమ్మ, కుమ్మరి మొదలగు వృత్తి పనివారంతా వెట్టిచాకిరి చేయవల్సి వచ్చేది. వంతు సమయంలో ఇంటి పెద్ద లేకుంటే అతని తల్లిగాని, భార్యగాని కుటుంబంలోని ఎవరైనా ఒకరు ఆ వెట్టి చేయాల్సింది. ఈ పద్ధతినే బేగారి(వెట్టి) అంటారు.

ఇంతేగాక అధికారులు గ్రామాలలోకి వచ్చినప్పుడు ఈ వెట్టి మరింత ఎక్కువగా ఉండేది. వీరు గ్రామాలకొస్తే కోళ్లు, గొర్రెలు కోసి పెట్టేవారు. దుకాణాలనుంచి సామాను అధికారులకు ఉచితంగా వచ్చేది. దొరలు బంగ్లాలు కట్టిన, వారి ఇండ్లల్లో పెండ్లిల్లు జరిగిన నవాటి ఖర్చును గ్రామ ప్రజలు మాముళ్ల పేరుతో కట్టవల్సిన పరిస్థితి. గ్రామంలోని ఎవరి ఇండ్లల్లో పెళ్ళిళు జరిగినా, పిల్లలు పుట్టినా, తగాదాలు వచ్చిన దొరకు బహుమానంగానైనా, అపరాధంగానైనా కొంత డబ్బు చెల్లించాల్సిందే లేకపోతే వారిమీద కేసు పెట్టడం లేదా మరో విధంగానైనా వసూలు చేసేవారు. అంతేకాగ చనిపోయిన బూడిద పన్ను పేరుతో డబ్బు వసూలు చేసేవారు.

తెలంగాణలో దొరలు ప్రయాణం చేసేటప్పుడు బండి ముందు పరిగెత్తించడం లాంటిది జరిగేది. “ఈ వెట్టిని స్త్రీలు కూడా అనుభవించారు. స్త్రీలకు మంచి బట్టలు కట్టుకోవడానికి, పూలు పెట్టుకోవడానికి ధైర్యం చాలేది కాదు. దొరైనా దొరసానైనా పిలిస్తే కంచం ముందు కూర్చున్నా లేచి వెళ్ళాల్సిందే. ఆడబాపలుగా, బానిస స్త్రీలుగా భూస్వామి అవసరాలను, అతని కుటుంబం అవసరాలను, తమ చాకిరితో తీర్చేవా . పొలాల్లో పనిచేస్తున్నంతసేపు ఆడవాళ్ళను చంటి పిల్లలకు పాలిచ్చేటందుకు కూడా వెళ్ళనిచ్చేవారు కారు. ఆడవాళ్ళను చెరచడం ఆనాటి భూస్వాములకు సర్వసాధారణం. దీన్ని ఎదురించే,

అడిగే ధైర్యం ఎవరికి ఉండేది కాదు. నిజాం ప్రభుకు వీటి గురించి తెల్సినా పట్టించుకునేవారు కాదు” (మాణిక్యరావు, వెల్దుర్తి. .....).

ఈవిధంగా తెలంగాణలోని ప్రజలు దొరలకు, పెత్తందార్లకు ఊడిగం చేయడమే తమ విధిగా భావించేవారు. అందుకే వెట్టి బానిసత్వంగా మారి 'నీ బాంచెన్ కాల్మొక్తా దొర' అనేది తెలంగాణ ప్రజలకు ఊతపదంగా మారింది. ఇలాంటి తెలంగాణ ప్రజల జీవితాలను దృశ్యమానం చేస్తూ రచయితలు తమ నవలల్లో చిత్రించారు.

వృత్తిదారులు దొరలకు చేసే వెట్టిని అందులో పద్మశాలీలు పడిన బాధను లోక మలహరి 'సంఘము' నవలలో చిత్రించారు. “వెలమ దొరల ప్రతాపాలు మొన్నటి రాజాకారుల దొరల కంటె కొంచెం మించే వుండేవని చెప్పుట అసత్యం కాదనిపిస్తోంది. అది భుజంగరావు దొర వారి కాలము. మాలీ, కొత్వాలీ రెండు వతన్లు ఆయనకే ఉన్నాయి. అతని తండ్రి కొండల్‌రావు దొర వుండగానే అన్ని యేర్పాట్లు జేసిపోయినాడు. తొందరగా ప్రసవంకాని గర్భవంతులకు ఈ కొండల్‌రావు పేరు చెప్పితేనే ప్రసవించేవారట. అంటే అతని దర్పం ఆవిధంగా వుండేదట. అన్ని కులాలతోపాటు పద్మశాలీలకు గూడా కొన్ని యేర్పాట్లు జేసినాడు. వేంకటేశ్వర సేవ వెల్లినప్పుడు దొరల ఇండ్లల్లో పెండ్లిల్లకు దివిటీలు పట్టట, వారి ఒక్క ప్రొద్దులకు, పండుగలకు, చుట్టపక్కాలు వచ్చినప్పుడు కోళ్ళు గ్రుడ్లు తెచ్చి వాటిని పొతం జేసి యిచ్చుట, సర్కారు వాళ్ళు అనగా తహశీల్‌దారు, పోలీస్ అమీన్ నుండి కానిస్టేబుల్ చప్రాశీల వరకు గ్రుడ్లు, కోళ్ళు సప్లై జేయుట, ఇంతేకాక వాళ్ళ పక్కకు చాపలు, బొంతలు, కప్పు కొనుటకు దుప్పట్లు ఇవన్నీ ఈయవలిసిందే. ఇందుకు ఏమిలోటైనాగాని చావు బ్రతుకు లెరుగని దెబ్బలు పడవలిసిందే. తండ్రి ఏర్పాట్లన్ని కొడుకు భుజంగరావు నడిపిస్తున్నాడు” (మలహరి, లోక. 2017: 30, 31).

తెలంగాణలో వెట్టిని మనముందుంచారు రచయిత. దొరల పెత్తనం, దోపిడి విధానంతో పాటుగా వారు బలవంతంగా చేయించుకునే వెట్టిచాకిరి వలన వృత్తిదారులు అనుభవించే కష్టాలు ఘోరంగా ఉన్నాయి. దొరల ఇండ్లల్లో జరిగే శుభ, అశుభ కార్యాలకు వృత్తిదారులంతా వెళ్ళి పనిచేయడం జరుగుతుంది. పని చేసినందుకు వారికి ఎలాంటి ప్రతిఫలం ఇవ్వరు. వృత్తిదారులలో పద్మశాలీలు (చేనేత) ప్రతి వారం దొర వెంకటేశ్వరుని సేవ చేసిన రోజు ఒక కోడినివ్వడం, వారి కార్యాలలో దివిటీలు పట్టడం, అధికారులు

వచ్చినప్పుడు వారికి కావల్సిన దుప్పట్లతోపాటు కోళ్ళు, కోడిగుడ్లను అందించాల్సిన పని పద్మశాలీలది. ఇందులో పొరపాటు జరిగితే శిక్షలు ఘోరంగా ఉండేవి. భుజంగరావు దొర తండ్రి కొండల్‌రావు పేరు చెబితే ప్రసవంకాని గర్భవంతులు ప్రసవించేవారు అనే మాటలోనే ఎంత కౄరత్వం కల్గి ఉంటారో అర్థమవుతుంది. ఈవిధంగా ఆనాటి వెట్టిచాకిరి విధానాన్ని వాస్తవికంగా దృశ్యమానం చేశారు రచయిత.

ఇదేవిధంగా మంగలి (క్షురక) వృత్తికి చెందిన నవల్ 'సంకెళ్ళు తెగాయి'లో ముదిగంటి సుజాతారెడ్డి వెట్టీ చేస్తూ జీవించే క్షురకుల జీవితాల్ని మనముందుంచారు. "ఈరయ్య కొద్దిగా ముందుకుపోయి వీధి మలుపు తిరిగాడు. ఎదురుగా దొర గడి గుట్టలాగా కనిపించింది. పెద్దమేడ, చుట్టూ ఎత్తైన గోడలు, పెద్దగేటు, గేటుకు అటుపక్క ఇటుపక్క విశాలమైన అరుగులు వున్నా . ఉదయం సాయంకాలం వేళల్లో దొర అక్కడ తన జనంతో కొలువుదీరి కూర్చుంటాడు. దొర అక్కడ వున్నప్పుడు ఆ వీధి గుండా జనం పోవడానికి భయపడ్తారు. ఎప్పుడైనా సరే ఆ వీధి గుండా పోవల్సి వస్తే కాళ్ళకున్న చెప్పులు విడిచి చేతిలో పట్టుకొని దండాలు దొర, నీ బాంచను దొర అని జపిస్తూ పోవాలి. అది అనాదిగా వస్తున్న ఆచారం" (సుజాతారెడ్డి, ముదిగంటి. 1994: 5, 6).

ఆనాటికాలంలో దొరల వైభవాన్ని తెలుపుతూ, వారి ఇంటి ముందు నుండి ఎవరినా వెళ్ళాలంటే ఉండే భయం, కాలి చెప్పులు తీసి చేతిలో పట్టుకోవడం వంటి విషయాలను మనముందుంచారు. అంతేగాక నీ బాంచన్ దొర అనే పద్ధతిని, తరతరాలుగా తెలంగాణ ప్రజలు ఇంకిపోయిన వెట్టిచాకిరి మనకళ్ళముందు దృశ్యమానం చేశారు రచయిత. ఇవేగాక నాడు వృత్తిదారులు దొరల ఇండ్లల్లో పండుగలకు, కార్యాలకు వెట్టిచేయడాన్ని గురించి ఇదే నవలలో వివరించారు. "దప్పులు వాళ్ళు తమకు పెట్టిందాన్ని బంగారంగా తలుచుకొని నిశ్శబ్దంగా తింటున్నారు..... ఏందీ నర్సయ్యా! ఈల్లు బిర్యాని కావాలని నా మీదికి ఎగబడ్తున్నరు అని వెంకయ్య వంటలు చేసిన నర్సయ్యతో చెప్పాడు. అసలు బిర్యాని ఏదని మల్లయ్యకు కూడా మనస్సులో పీకుతూనే వున్నది. మిగిలినదంతా ఇక్కడ పెట్టిన.. పట్టినంత తినుండ్రి.. మిగిలింది కావాల్సినంత మూటలు గట్టుకపోండ్రి. గంతె నాకెరుక అని నర్సయ్య పెద్దగా అందరికి వినప్డేటట్లు అరిచాడు... మాంసం ముక్కయినా మనదాకా రాలేదే అని ఆశ్చర్యపోయాడు మేకలను కోసి కోసి అలిసిపోయిన చాకలి అంజయ్య. మేకల

పొట్టపేగులు, బొక్కలు వేసి కాచిన చారును గిన్నెలో తెచ్చి ఇగో మాంసం కావలసినంత తినుండ్రి అని తలా ఇంత గుమ్మరించాడు నర్సయ్య. అప్పుడు అందరి ముఖాలు వికసించాయి" (సుజాతారెడ్డి, ముదిగంటి. 1994: 12, 13).

దొర కూతురు, కొడుకు పుట్టు వెంట్రుకలు తీసే కార్యక్రమంలో సబ్బండ వర్ణాల వారు వెట్టీ చేయడం ఇక్కడ కనబడుతుంది. మాదిగవారు డప్పులు కొట్టడం, చాకలి, కుమ్మరి వాళ్ళు దొర ఇంటిలో పనిచేయడం, మంగలివారు పిల్ల వాని వెంట్రుకలు తీయడం జరుగుతుంది. ఉదయం నుడి సాయంత్రం వరకు పని చేస్తే కూలీ ఇవ్వరు సరికదా సరైన భోజనం కూడా లభించదు. దొర ఇంటికి వచ్చిన బంధువులంతా తిని వెళ్ళాక మిగిలిన ఆహారం వృత్తిదారులకు ఇస్తారు. అందులో కూడా ఉండాలి న పదార్థాలు ఉండవు, తలా ఇంతా పులుసు పోసుకొని తింటారు. అదే తమకు లభించిన మహా పదార్థంగా భావించడం వారి అమాయకత్వాన్ని తెలుపుతుంది. ఇలాంటి అమాయకుల్ని దొరలకు ఏవిధంగా వెట్టిచాకిరి చేయించుకుంటున్నారనే విషయాలను వాస్తవిక దృష్టితో మనముందుంచారు రచయిత్రి.

మరొకవృత్తి గౌడవృత్తి. వారి జీవితాలతోపాటు ఆనాటి వెట్టిని గురించి చిత్రించిన నవల కె. వెంకటేశ్వర్లు రాసిన 'కల్లు మడువ'. ఇందులో "ఒరేయ్ గౌండ్ల నా కొడుక! ఈ ఊర్లో నా మాటకు ఎదురులేదని తెలువదురా? ఇక్కడ చాకలోడు, మంగలోడు, వడ్లోడు, కమ్మరోడు, కుమ్మరోడు, గౌండ్లోడు ఎవడైనా నేను గీసిన గీత దాటినా, చెప్పిన మాట తప్పినా, వాడి బతుకును నా తుపాకికి ఆహారంగా పెడ్తా, వాడి కుటుంబంలోని పెండ్లాము, పిల్లల్ని నా పశువుల కొట్టం పాల్జేస్తా. లమ్డీ కొడుకా, నేను దయ తలిస్తే, మేము తినంగ మిగిలిన మెతుకులుంటే బయట పడేసి తినమంటే తినాలిరా, నా అనుమతి లేకుంటే కాకు కూడ నోటితో ముట్టవు. నా మాటగ పటేలు వచ్చి కల్లు పంపించమంటే కాసుల దొరసానికి కల్లు తీసుక రాకుండా ఎవడో కోనుకిస్కా వైద్యుడికి పోస్తావ్ అని దొర కండ్లెర్ర జేసాడు" (వెంకటేశ్వర్లు, కె. 2006: 4, 5).

దొరల దౌర్జన్యానికి ప్రతీకగా ఈ దృశ్యం మనకు కనబడుతుంది. కల్లు దొర ఉంపుడుగత్తె కాసుల దొరసాని ఇంటికి తీసుకపోకుంటే దొర పెట్టె హింసలు మనముందుంచారు రచయిత. కొడుకు ప్రాణం కాపాడిన వైద్యునికి కల్లు పోస్తాడు.

అందువల్ల, కాసుల దొరసాని ఇంటి దగ్గరికి కల్లు తీసుకపోడు. ఆ విషయం తెలిసిన దొర వీరన్నకు ఇరవై కొరడా దెబ్బలు, వందరూపాయల జరిమానా విధిస్తాడు. నాటికాలంలో దొరల దౌర్జన్యాన్ని, వారి కౄరత్వాన్ని వాస్తవిక దృష్టితో చిత్రించారు రచయిత.

ఇదే నవలలో కేవలం గౌండ్ల వృత్తిదారులే కాక అన్ని వృత్తులవారి వెట్టి గురించి వివరిస్తాడు. "ఒక్క వీరన్న మాత్రమేకాదు అన్ని వృత్తుల వాల్లు దోరోడికి ఊడిగం చేస్తున్నారు. ఈ మధ్యనే చినదొర పెండ్లికి ఆకాశమంత పందిరి వేయాలంటే గౌండ్లోల్లు వడ్లొల్లు కల్సి ఆకాశమంత పందిరేశారు. గీత కార్మికులకు పెండ్లికి సరిపడా కల్లును తేవాలని దొర మాటగా హుకూం జారీ చేస్తే చుట్టు ప్రక్కల పది ఊర్లనుండి పెద్దపెద్ద కుందల్లో, బండ్ల మీద, గుర్రాలమీద కల్లు తెచ్చి దొరగారింట్లో పెట్టారు. మన సాలోల్లు మంచి మంచి బట్టలు నేసి పంపారు. మాదిగ మట్టయ్య బంధువులంతా రెండు వారాలు దొరల గడీలో కట్టెలు కొట్టారు. ఇంకా చాలలోల్లు, కుమ్మరోల్లు అన్ని వృత్తుల వాల్లు రేయిపగలు కష్టపడి పనిచేశారు" (వెంకటేశ్వర్లు, కె. 2006: 5, 6). దొరల ఇండ్లల్లో జరిగే శుభ, అశుభ కార్యాలకు గ్రామాలలోని వృత్తిదారులంతా చేసే వెట్టిని మనముందుంచారు రచయిత. ఈవిధంగా వెట్టి చేయించుకోవడమేగాక వారికి ఆహారం కూడా పెట్టరు. అంతేగాక వృత్తిదారులు చేసే పనులలో తప్పిదం జరిగిన, ఆలస్యమైన వారిని ఘోరంగా శిక్షించడం మొదలైనవాటిని మనకళ్ళముందుంచారు రచయిత.

ఈ నవలలు దొరలకు వృత్తిదారులు చేసే వెట్టిచాకిరితో పాటుగా దొరలు విధించే శిక్షలను ప్రతిబింబించాయి. తెలంగాణలో ఉన్నటువంటి నిర్బంధ వెట్టిచాకిరి వలన వృత్తిదారులు అనుభవించిన కష్టలతోపాటూగా, శిక్షలు సామాజిక సమస్యలుగా ఉన్నాయి. తెలంగాణలో ఉన్న వెట్టి విధానాన్ని వాస్తవిక దృష్టితో చిత్రించినవిగా ఈ నవలలను పేర్కొనవచ్చు.

### 4.3. ఆర్థిక వ్యవస్థ

నేటి సమాజం అనేక మార్పులకు లోనవుతూ వస్తోంది. అయితే ఈ మార్పు అనే విభిన్న వర్గాల వారికి మేలు కలిగే విధంగా ఉంటే అది ఆర్థికాభివృద్ధితో పాటుగా సామాజికాభివృద్ధి జరుగుతుంది. ఒక ఆర్థిక వ్యవస్థను కలిగి ఉంటుంది. దాని మీదనే ఆ

దేశ అభివృద్ధి ఆధారపడి ఉంటుంది. దేశ ఆర్థికాభివృద్ధి పునాది గ్రామాభివృద్ధి. గ్రామాలే దేశాభివృద్ధికి పట్టుకొమ్మలని అంటారు. ఇలా కానప్పుడు అభివృద్ధి ఫలితాలు కేవలం గణాంకాలకో లేదా కొన్ని వర్గాల మేలుకోసమే పరిమితమవుతాయి. ఇలా పరిమితమైన సమాజ చరిత్రను పరిశీలించినట్లైతే ఎప్పుడూ ఒక వర్గం పీడించేదిగాను, మరొక వర్గం పీడింపబడేదిగాను ఉంటుంది. కొంతకాలానికి పీడితులలో చైతన్యం వచ్చి సమాజంలో మౌలిక మార్పును తీసుకొస్తారు.

భారతదేశ ఆర్థిక వ్యవస్థ మొదటి నుండి గ్రామీణ వ్యవస్థగా ఉంది. ఇందులో అన్ని సామాజిక వర్గాలైన వృత్తుల యొక్క పాత్ర ఉంది. ఈ సామాజిక వర్గాలన్నీ పరస్పర ఆధారితాలు. ఇలా ఉన్నాయి కాబట్టే ఇన్ని వేల సంవత్సరాలుగా భారతీయ సామాజిక వ్యవస్థ ఎలాంటి అవాంతరాలు లేకుండా కొనసాగుతుంది. ప్రపంచంలో ఎప్పుడైతే ప్రైవేటీకరణ, ప్రపంచీకరణకు స్థానం ఏర్పడిందో అప్పుడే భారతదేశంలో పారిశ్రామికీకరణకు చోటు ఏర్పడింది. అప్పటినుండి వృత్తిదారుల సామాజిక, ఆర్థిక వ్యవస్థలో మార్పులు వచ్చాయి. దేశం ఆర్థికంగా పుంజుకుంటుంది. ఈ మార్పు నగరాలలో, పట్టణాలలోకి పారిశ్రామిక వర్గాలకే మేలు చేయగా, వృత్తిదారులకు చేయలేదు కదా వారి జీవనాధారాల మీద దెబ్బ తీసింది. నవలలోని వృత్తిదారుల యొక్క ఆర్థిక పరిస్థితులను ఈ విభాగం కింద గమనించవచ్చు.

వృత్తిదారుని కుటుంబ జీవనంలో ఉండే కనీస అవసరాలు తీర్చుకోలేని పరిస్థితులు, వలసలు, అప్పులు వంటి నేపథ్యాన్ని తీసుకొని లోక మలహరి 'సంఘము' నవల రాశారు. ఈ నవలలో వెంకన్న అనే పద్మశాలి నూలు కొనడానికి డబ్బులు లేక నాగనాథం అనే కోమటి దగ్గర ఇరవై రూపాయలు అప్పుగా తెస్తాడు. కాని గిరాకి లేకపోవడంతో డబ్బులు చెల్లించడు. దంతో నాగనాథం గఫ్రూసాబ్‌ను ఇంటికి పంపుతాడు. అప్పుడు అటువచ్చిన నర్సయ్య అనే మరో పద్మశాలి "అయ్యో! నాగనాథం దగ్గెర బాకీ దెచ్చినావు? ఒకటీ రెండు జేసి పెడ్తడు. ఆయన శ్రీమంతమంతా మన పద్మశాలీలను దోచిందె. ఇవి మిక్కిలి పాపపు దినాలు. ఈ కరువు మనకే వచ్చినట్టుంది. నాదగ్గర కూడా రెండు వేయిల నూలు పడున్నది. బావా! గిరాకులు పూర్తిగా నల్లబడి పోయినయి. నూలిచ్చిన ఆసామీలంత సన్నులు బారేసి తలా యిన్ని రూపాయలు దీసుకుపోయినారు. ఏదో ఇంత పతారమీద నడిపిస్తామంటే

సాగకుంటొచ్చింది. ఇక మన పద్మశాలీలకైతే 'అన్నమో రామచంద్రా'కు వచ్చింది. పని వరుస సావుకార్ల దినా బావా!" (మలహరి, లోక. 2017: 26).

పద్మశాలీలకు (చేనేత కార్మికులకు) సరైన గిరాకీలు లేకపోవడంతో కుటుంబం గడవడం కష్టంగా ఉంతుంది. దాంతో వెంకన్న తన కొడుకులను బొంబాయికి పంపించాలనుకుంటాడు. తమ ప్రాంతంలో నుండి అక్కడికి చాలా మంది వెళ్ళి బట్టల మిల్లులో పని చేస్తున్నారు. తన కొడుకులు పని నేర్చుకొని సంపాదిస్తే బతకవచ్చనే ధీమా కల్గుతుంది.

కుమ్మరి వృత్తిలో సంభంవించిన ఆర్థిక గడ్డు పరిస్థితులను, ప్రపంచీకరణ ప్రభావంతో చెదిరిన వారి జీవితాలను నేటి వాస్తవికకు ప్రతిబింబంగా చిత్రించారు. కుమ్మరి వృత్తిలో శ్రమ మరియు ఎంతో ఓపిక, నైపుణ్యం ఉండాల్సిన వృత్తి. ఈ వృత్తి రోజురోజుకు దిగజారిన ఆర్థిక పరిస్థితిని మాదిరెడ్డి సులోచన 'సుషుప్తి' నవలలో దృశ్యమానం చేశారు. "గంపనిండుగా పిడతలు పేర్చుకుని అండగి వెళ్ళింది. ఆమె గంప దింపుతుండగానే ఎదురుగా స్టీలు గిన్నెల కొట్టు కనిపించిది. కసిగా తిట్టుకుంది. ఈటి ఇంట్ల దుమ్మువడ. ఇవ్వి వచ్చినంక బేరాలు లేవు. సాయంత్రం వరకు కూర్చుంటే పది గురుగులు అమ్మగలిగింది. న్యాయంగా అర్థరూపాయికి అమ్మాల్సినవి. కొడుకు అభ్యర్థన గుర్తుకు తెచ్చుకుని ముప్పై పైసల్కే అమ్మింది. ఆకుల బుచ్చీ జరగంప ఎత్తు బిడ్డ్యా. ఆకులు అమ్ముతున్న అమాయి వచ్చి గంప ఎత్తింది. తలమీద బరువుతో అటు ఇటు చూడలేకపోయింది. దూరంగా ఉన్న రెండు ప్రక్కల కొట్లు కనిపించాయి. ఆ కొట్ల వారందరూ తమ జీవనోపాధి లాక్కుపోవటానికి వచ్చినంత బాదపడింది" (సులోచన, మాదిరెడ్డి. 2007: 17).

కుమ్మరి వృత్తిలోని జీవితాలను మనముందుంచారు రచయిత్రి. గతంలో కుమ్మరుల ఇంటికి వచ్చి కుండలు కొనేవారు. అలాంటిది నేడు సంతలల్లో ఎవరు కూడా కొనని పరిస్థితి ఏర్పడింది. 50 పైసలకు అమ్మాల్సిన పిడతలను ముప్పై పైసలకు అమ్మాల్సి రావడం. వీటికి ప్రధాన కారణం ప్రపంచీకరణ. ప్రపంచీకరణతో వచ్చిన స్టీలు గిన్నెలతోపాటుగా ప్లాస్టిక్ వస్తువులు కుమ్మరులకు జీవనోపాధి లేకుండా చేశాయి. కేవలం కుమ్మరులకే కాదు బజ్జీలు అమ్మే గంగమ్మతోపాటుగా గాజులు అమ్మే బంగారు వీధి వీధి తిరిగినా గాజుల అమ్మిన

కొనని పరిస్థితి నేడు ఏర్పడింది. ఇలా కువృత్తిని నమ్ముకున్న జీవితాలు పారిశ్రామి కరణ ప్రభావం బలంగా ఉండడంతో జీవించడమే భారంగా మారిన జీవితాలను 1975లోనే రచయిత్రి చిత్రించారు.

మరొక వృత్తి క్షురక(మంగలి) వృత్తి కుంటూపడిన పరిస్థితిని, మంగలుల జీవితాలను ముదిగంటి సుజారారెడ్డి 'సంకెళ్ళు తెగాయి' నవలలో చిత్రించారు. "ఊర్లోని చిన్నలూ పెద్దలూ 'హేర్ కట్టింగు'కని బాలయ్య షాపుకు ఎగబడడంలో ఊర్లో మిగతా మంగలి వాళ్ళకు పని పడిపోయింది. మారిన కాలాన్ని తిట్టుకూంటూ వాళ్ళు చాలామంది వ్యవసాయ కూలీ పనుల్లోకి దిగారు. మరికొందరు కూలికని రిక్షాతొక్కుతామని అక్కడైతే నాలుగు పైసలు డబ్బున సంపాయించుకోవచ్చునని పట్నానికి వెళ్ళారు" (సుజాతారెడ్డి, ముదిగంటి. 1994: 23). గ్రామాలలోని కులవృత్తులు పతనమై పట్నానికి పోతున్న విధానాన్ని, వేరే వృత్తులను ఆశ్రయిస్తున్న తీరును వివరించారు రచయిత్రి. ఇందులో బాలయ్య పట్నంలో కొత్త మెలకువలు నేర్చుకొని ఊర్లో మంగలి షాపు పెడతాడు. షాపునిండా అద్దాలు బిగించి సినిమా బొమ్మలు అతికిస్తాడు. అంతేకాకుండా పేపర్, రేడియో లాంటి మాధ్యమాలతో గ్రామ ప్రజలను ఆకర్షించడంతో అందరూ ఇతని షాపుకే రావడం గ్రామంలోని మిగతా క్షుర వృత్తిదారులకు గిరాకే లేకుండా పోతుంది. దాంతోవారు వ్యవసాయ కార్మికులుగా, పట్నాలకు వెళ్ళి రిక్షా కార్మికులుగా మారిన జీవితాలను దృశ్యమానం చేసారు రచయిత్రి.

నేటి గీత వృత్తిదారుల వాస్తవిక జీవితాన్ని దృశ్యమానం చేశారు నేరేళ్ళ శ్రీనివాస్ గౌడ్ 'బ్రతుకుతాడు' నవవలో. "కుటుంబం కష్టాల్లో మునిగి తేలుతుంది. ఆలోచించిన కొద్ది పిచ్చెక్కి ంది లక్ష్మికి. లక్ష్మి దుఃఖించని రోజు లేదు. లక్ష్మికి కడుపునిండ తిండిలేదు. కంటినిండ నిద్రలేదు. ఒంటినిండ బట్టలేదు. లక్షిమ్కే కాదు పిల్లలకు ఒంటినిండ బట్టేలేదు. అనేక సందర్భాల్లో ఊల్లో వారిని పాతబట్టలు అడిగి తొడిగింది. కొన్నిసార్లు లక్ష్మి తల్లి లాలవ్వ బట్టలుకొని ఇచ్చింది. తినడానికి బియ్యం తీసుకవచ్చింది లాలవ్వ. ఈవిధంగా రోజులు గడుపుక వస్తున్న లక్ష్మికి ఏమి తోచడం లేదు. భవిష్యత్తు గురించి ఆమెకు భయమేస్తుంది. పిల్లలను ఎలా బతికించాలని ఆలోచిస్తుంది. ఎక్కడ మార్గం కనిపించక పిచ్చెక్కినట్లు ఏడుస్తుంది. శ్రీనివాస్‌గౌడ్ తల్లి దగ్గరికిపోయి అవ్వ..! ఎందుకు ఎందుకు

ఏడుత్తునావు..? అడిగినాడు. ఇంట్లో బియ్యం లేకపాయె... నూనె లేకపాయె...ఉప్పు....పప్పు ఏది లేకపాయె... మీరు ఏందిని బతుకుతారు... ఎట్ల పెద్దపెరుగుతారు...? అన్నది లక్ష్మి" (శ్రీనివాస్ గౌడ్, నేరేళ్ల. 2004: 28).

ఈవిధంగా గౌడవృత్తిదారుల కుటుంబ జీవన స్థితి రోజురోజుకు దిగజారుతున్న విధానం వృత్తినే నమ్ముకొని జీవించడం వల్ల పడే వేదనను నేటి వాస్తవిక జీవితానికి ప్రతిబింబంగా చూపించాడు. కనీస అవసరాలైన బట్ట, తిండితోపాటుగా ఇల్లు కూడా సరిగ్గా ఉండవు. అప్పటికే అప్పులు తెచ్చుకోవడంతో ఎవరిని అడగలేని పరిస్థితి. అంతేగాక ఎన్నికల నియమాళితో పట్నంలో కల్లు అమ్మకూడదు అని అబ్కారీలు అనడంతో కష్టంగా మారుతుంది నారాయణ గౌడ్‌కు. ఎంత కష్టం చేసిన ఎదగలేకపోవడం కనబడుతుంది. చివరకు కల్లు ఖాతాదారుల దగ్గర బియ్యం తెచ్చి జీవనం గడుపుతాడు. గ్రామంలో సరైన జనాలులేక కల్లు అమ్ముడు పోకపోవడం, పక్కన ఉన్న జగిత్యాలకు తీసుకెళ్ళి అమ్మేవారు. అక్కడ ఎన్నికల నియమావళితో కల్లు అమ్ముడుపోక గీతవృత్తిదారుల కుటుంబాలు అనుభవించే బాధలను దృశ్యమానం చేశారు రచయిత.

ఇదేవిధంగా ప్రపంచీకరణ ప్రభావంతో చేనేత వృత్తిలో వచ్చిన విధ్వంస మార్పులను, ఆత్మహత్యలు, ఆర్థిక దుస్థితిని కాలువ మల్లయ్య 'గువ్వల చెన్న' నవలలో చేనేత వృత్తి బతుకులు కొట్టుకుపోయిన స్థితిని బహుళ పార్శ్వాలుగా స్పృశించారు. పారిశ్రామీకరణ ప్రభావంతో వృత్తిలో వస్తున్న మార్పులు వలన వృత్తిదారులకు కలిగిన నష్టాలను తెలియజేశా . చిప్పమల్లయ్య అనే చేనేత కార్మికుడు మొగ్గం గుంటల ద్వారా వృత్తిని నిర్వహిస్తే, అతనికి ముగ్గురు కొడుకులు, రెండోవాడు భీవండిలో సాంచెలు నడపడానికి వలసవెళ్ళి, అక్కడ జరిగిన మత ఘర్షణలో చనిపోతాడు. మనవడి కాలం వచ్చేసరికి సాంచెన్లు అందుబాటులోకి వస్తాయి. పెద్దకొడుకు వీరయ్య. వీరయ్య కొడుకు లక్ష్మిరాజం సాంచెన్లు కొని నడుపుతాడు. కాని పోటీతత్వ ప్రపంచంలో ముందుకు వెళ్ళలేక అప్పులు ఎక్కువై ఆత్మహత్య చేసుకుంటాడు. ఆ సందర్భంలో "మొగ్గం గుంటలను నమ్ముకుంటే లాభం లేదని సాంచెలను నమ్ముకున్నరు. సాంచెలచ్చి మొగ్గం గుంటలన్ని పూడుక పెయినయి. పోటి ఇంకా ఆధునిక మిల్లులచ్చి సాంచాల పినగూడ పంటది. అందుకే గీ ఘోరాలు. బియ్యం పండిత్తె చాలదని పత్తికి, చేపల చెరువులకు పొయ్యి రైతులు చచ్చినట్టే

యంత్రాలెంటపడి పోటీల తట్టుకోలేక సాలీలు సత్తున్నరు. పోటీపేరుతో చావులు తప్పుత లేవు" (మల్లయ్య, కాలువ. 2005: 103).

ప్రపంచీకరణ ప్రభావంతో వచ్చిన మార్పులు, పోటీతత్వంగా ఆత్మహత్యలు చేసుకుంటున్న వృత్తిదారుల వాస్తవిక జీవితాలను స్పృశించాడు రచయిత. నేడు వచ్చిన మార్పులకు అనుగుణంగా చేనేత జీవితాల్లోని లోటుపాటులను, ఆర్థిక లేమి స్థితిని వాస్తవికతను బలంగా చిత్రించడమే కాకుండా వృత్తి దైన్యాన్ని కండ్లకుకట్టే ప్రయత్నం చేశారు.

మరొక వృత్తి గీత వృత్తి. గీత వృత్తిదారులను దోచుకుంటున్న ముస్తాదారులు, వేలంపాట విధానాలన్ని గీతవృత్తిదారులను ఎంత దయనీయ స్థితికి తీసుకెళ్ళాయనే విషయాన్ని కె. వెంకటేశ్వర్లు 'కల్లు మండువ' నవలలో చిత్రించారు. "బాబు యేండ్లు గడిచినయ్. కడుపునిండా మెతుకులు తినలేదు. కంటినిండా నిద్రపోలేదు. వంటికి బట్టలేదు, చేసిన అప్పులు తీరలేదు. అంతెందుకు ఈ యేడు రకాలు పూస్తిగా కట్టనందుకే పెద్ద ముస్తాదర్ నిన్న మా ఊర్లొల్లందరిని పిలిపించిండు, రకాలు కట్టినందుకు అమ్మను, పెండ్లాలను తిట్టిండు" (వెంకటేశ్వర్లు, కె. 2006: 17).

ఇదేవిధంగా దళిత వృత్తులలో చర్మకారుల జీవనాన్ని అందున మాద్గిర్కం చేసే వారి గురించి వేముల ఎల్లయ్య 'కక్క' నవలలో దృశ్యమానం చేశాడు. గ్రామాలలో ప్రధానంగా మాద్గిర్కం అనేది వంతుల వారిగా వస్తుంది. ఆ వంతు అయిపోయిన తరువాత వారి జీవితాలలోని ఏర్పడే ఆర్థిక ఇబ్బందులను మన ముందుంచారు రచయిత. "బాకున్న వొక్కొక్క సెప్పుల జతను వొప్ప జెప్పి ఎన్కకు దిర్గిండు పకీరు తాత. ఇంటికొచ్చి. లస్మక్కా ఓ బుద్దమా. గిటురమ్మని దగ్గర్కి తీస్కొని, తెల్లార్నించి మేకలని నేనే మేప్కొత్క నువ్వింటికాదుండి గింతోండి పెడ్తె అయిపోతది. తాతన్న మాటలిని కర్వు కాలమొచ్చినట్లైంది. ఎండ్కే తాత మన తేగమైయిపోయిందా? ఎట్టా బత్కాలె మనం నేను కల్వ గొయ్యబోయి పూట గడ్పిత్త.

ఎందుకురా లస్మిగా ఉన్ననాడ్తిందాం లేన్నాడు ఉపాసం బందామ్ నేనెన్ని కట్టాలు బడైనా నిన్ను ఉపాసం సంప్తానా! బిడ్డా! గసుంటి తక్లీబొత్తే నేజ్జచ్చినంక గిట్ల విత్తదేమో?

నేనున్నని దినాలు గటవంటిది రానియ్యా ఏడేండ్ల కాలంబోయిన్నాడె తిండికి జావలె! గిప్పుడేమైతది బిడ్డా పండ్కో సీకటైతుంది” (ఎల్లయ్య, వేముల. 200: 44, 45).

దళితులలో వారసత్వంగా వచ్చే మాదిర్కం వలన వారు జీవితాలను గడుపుతారు. ఈ మాదిర్కంలో ప్రధానంగా చెప్పులు కుట్టడం మొదలు భూస్వాముల వ్యవసాయ పనులలో సహాయం చేయడం వంటివి ఉంటాయి. మాద్గిర్కం పోతే వారి పరిస్థితి ఆగమ్యగోచరంగా మారుతుంది. ఇలాంటి పరిస్థితులలో ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించి పనులు చేసుకుంటారు. కాని వారి కుటుంబం పోషణ కష్టంగా మారుతుందనే దానికి వాస్తవిక దృక్పథంతో మనముందుంచారు రచయిత.

నేడు ప్రపంచంలో ఆర్థిక వ్యవస్థ జన సమూహాలు నిర్వహించే పాత్రను బట్టి వర్గాలుగా ఏర్పడింది. కాని మనదేశంలో అనేక చారిత్రక కారణాలవల్ల వృత్తి కులంరూపంలో సమూహాలుగా విభజించబడ్డాయి. మొదట కొంత నిలదొక్కుకున్న ఆధునిక కాలంలో సంక్లిష్టతకు గురయ్యాయి. వీటికి కారణం ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో వస్తున్న మార్పులు ప్రధానం. ఆర్థిక రంగంలో వచ్చిన మార్పులు పెత్తందార్లకు, భూస్వాములకు, కార్పోరేటర్లకు తివాచి పరిచాయి. పెట్టుబడీదారులకు ఎలాంటి నియమ నిబంధనలను పాటించాల్సిన అవసరం లేకుండా పోయింది. వారిని ప్రశ్నిస్తే దౌర్జన్యాలు, అక్రమ అరెస్టులు చేస్తారు. ఇలా అనేక సంఘటనలతో వృత్తిదారులు ఆర్థిక దోపిడికి గురవుతారు. వృత్తిదారులు గతంతో అనేక పోరాటాల ద్వారా భూపంపిణి, వ్యవసాయ పనిముట్లు, వృత్తిదారుల సబ్సిడీలు సాధించుకున్నారు. కాని నేడు ప్రభుత్వాలు లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలు జరగడంతోపాటు వాటిని తొలగించే ప్రయత్నాలు చేస్తున్నాయి.

ఆర్థిక వ్యవస్థ మానవ ప్రగతిని అత్యంత ప్రభావితం చేసే అంశం. ఇటువంటి ఆర్థిక రంగంలో వృత్తిదారులు తీవ్రమైన కష్టాలను ఎదుర్కొంటున్నారు. ఆర్థిక రంగంలో వృత్తిదారులు ఎలాంటి అభివృద్ధిని సాధించకుండా ప్రభుత్వం అవలంభిస్తున్న చర్యలతో మరింత దిగజారింది. దీంతో ఒకప్పుడు చేతినిండా పని ఉండి తిండికి, బట్టకు, లోటులేని వృత్తిదారులకు నేటి సరళీకరణ విధానాల వల్ల పనిలేకుండా పోయింది. దీంతో ఆర్థిక స్థితి కుంటుబడి వలసబాటలు ఏర్పడడం అక్కడా దోపిడికి గురికావడం లేదా అక్కడ జరిగే సంఘటనలలో మరణించడం జరుగుతుంది. ప్రధానంగా వృత్తిదారులకు పని లేక,

కుటుంబాన్ని పోషించగల్గడం కష్టంగా మారింది. దాంతో అప్పులు చేయడం అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుంటున్న దారుణాలను వృత్తిదారుల స్థితిగతులను, చితికిన జీవితాలతోపాటు సూక్ష్మమైన అంశాల్ని కూడా విదశీకరించిన తీరు అబ్బురపరుస్తుంది. ప్రతి చిన్న విషయాన్ని లోతుగా విశ్లేషించడం ఈ నవలల్లో కనిపిస్తుంది. వృత్తిలో ఉండే నైపుణ్యాన్ని రచయిత పరిశీలన దృష్ట్యా నవలకు నిండుదనాన్ని చేకూర్చింది. అందువలనే నవలను నేటి స్థితికి ప్రతిబింబంగా దృశ్యమానం చేయడం రచయితలకి సాధ్యమైంది.

### 4.3.1. వ్యాపార వ్యవస్థ

ప్రపంచంలో కొందరు శారీరకంగా శ్రమ చేస్తే మరికొందరు మేథోపరంగా శ్రమిస్తారు. మేథస్సు పరంగా శ్రమించే వాళ్ళు ఇతరులని పరిపాలిస్తున్నారు. కాయకష్టం చేసేవారు ఇతరులచే పరిపాలించబడుతున్నారు. పాలితులు తమ పాలకుల్ని పోషిస్తున్నారు. పాలకులు తాము పాలించే ప్రజల పోషణ మీద బతుకుతారు. పారిశ్రామిక విప్లవంతో అనేక దేశాలు అభివృద్ధి చెందాయి. అభివృద్ధి చెందిన దేశాలలో దేశ అవసరాల కంటె ఎక్కువ ఉత్పత్తి కావడంతో వాణిజ్యం కోసం వలస దేశాలు అవసరమైనాయి. వలస దేశాలలో పెట్టుబడులు పెట్టి అక్కడ పరిశ్రమలు స్థాపించి, అధిక లాభాలు గడించి చివరికి రాజ్యాధికారాలను చేపట్టారు. భారతదేశం కూడా అలాగే బ్రిటీషు వారి చేతిలోకి వెళ్ళి తిరిగి స్వాతంత్ర్యాన్ని సంపాదించుకున్నది. నేడు అగ్రరాజ్యాలతో పాటు, అభివృద్ధి చెందుతున్న దేశాలు కూడా వెనుకబడిన దేశాలకు సహాయసహకారాలను అందిస్తున్నాయి. వృత్తిదారుల జీవితాల్లో ఈ అగ్రరాజ్యాల సూత్రాన్ని కూడా వ్యాపారస్తులు పాటించడం లేదు.

సాధారణంగా గ్రామాలలో కోమటి వారు వ్యాపారం చేస్తారు. వ్యాపారంతో పాటుగా అప్పులు ఇవ్వడం కూడా జరుగుతుంది. ఈ విధంగా వారు వ్యాపారంలో చేసే ఆర్థిక దోపిడిని 'సంఘము' నవలలో లోక మలహరి దృశ్యమానం చేశారు. "ఆ బుక్కరావు పేటలో ధనశెట్టి నాగనాథమను సాహుకారుంటాడు. అతడు సుమారు ఇరవై సంవత్సరాల క్రితం చిన్న పంచె భుజాన వేసుకొని భార్యాయుక్తంగా నంది గ్రామం నుంచి ఇచ్చటికి వచ్చినాడు. ఇప్పుడాతడు లక్షాధికారియని పిలువబడుతున్నాడు. అందుకే అంటారేమో 'కొటిపెట్టి కోమటిని కొనాలె'నని. వచ్చినప్పుడు ఏదో ఇంత పేలాలు, పుట్నాలు చేసి నెత్తిన

పెట్టుకొని తిరిగి అమ్మినవాడు. కాలం కలిసివచ్చింది. ఇట్లే చిన్న చిన్న వ్యవహారాలు చేస్తూ రెండేండ్ల వరకింత బుట్టి దుకాణం పెట్టగలిగినాడు. లోభాగ్రేసర చక్రవర్తియని కొందరు తుంటరి బాలురు గేలి చేస్తూ కల్లు త్రావిన కోతివలె మార్చేస్తారు సేటుగారిని. అతని భార్య గూడా అతనికి తగిన సతిమణియే. మొండి ఫకీరు వాడొచ్చి గుమ్మం ముందు చేయూ, కాలూ కోసికొని రక్తం చల్లి హఠయోగం సాధించినా వొక్క పైసాకంటె ఎక్కువ ఇయ్యననే వ్రతం మాత్రం చెరచలేదు. మన నాగనాథం ఎక్కువ వడ్డీ పట్టించినా ఎందరినో ఆపత్కాలల్లో ఆదుకుంటాడనే పేరు మాత్రం సపాదించినాడు. ఈ విధంగా వడ్డికి రూపాయలిస్తూ మూడేండ్లలోనే లక్షాధికారియని పిలిపించుకోగలిగినాడు" (మలహరి, లోక. 2017: 24, 25).

ఎలాంటి ఆదాయం లేని ఒక కోమటి ఊరిలోకి వచ్చి 2 సంవత్సరాలలో ధనవంతుడిగా మారడం అనేది వ్యాపారం ద్వారా అతడు ప్రజలను మోసం చేసి సంపాదించిందిగా చెప్పవచ్చు. వ్యాపారంలో ఉండే దోపిడికి ఉపయోగించే చిట్కాలే అతని అభివృద్ధికి కారణంగా చెప్పవచ్చు. అమాయక ప్రజల్ని దోచుకోవడమే వీరికి ప్రధాన లక్ష్యంగా ఉంటుంది. అధిక వడ్డీలకు అప్పులు ఇవ్వడం, ప్రజల అవసరాలను తనకు అనుకూలంగా మార్చుకొని ధనవంతుడిగా ఎదగడం కనిపిస్తుంది. వ్యాపారస్తులు ప్రజలను దోచుకొని ఎదుగుతున్న వాస్తవికతను మనముందుంచారు రచయిత.

ఇదేవిధంగా మరొక వృత్తి నవల 'సుషుప్తి'లో మాదిరెడ్డి సులోచన కోమటుల దోపిడి విధానాన్ని దృశ్యమానం చేశారు. "ఏదో శుభకార్యం పెట్టుకుని వస్తువు. పాపం నాకెందుకు తీసుకో నూనె పోసింది. పావు కొలతతో కాస్త వెలితిగానే పోసింది. పప్పు, బెల్లం ఇచ్చింది. సరిగ్గా పదిరూపాయలు, తొందరగా తేవాలి. ఫయితినాడు (ఫస్ట్ న) తెస్త బాంచను అన్నది. చూస్తగదా. మరోసారి రావాలి. నూనె కిల యెంత బాంచన్! ఇంట్లో ముసలోడు అడుగతడు అన్నది. పదకొండు రూపాయలు అన్నది చిటపటలాడుతు. మాదేడి పెండ్లప్పుడు ఏడురూపాయలె. నా పెండ్లికి రూపాయికి మూడు కిలోలు వెక్కిరించింది రంగమ్మ. ధర ఎక్కువే అనిపించింది. అవి తీసుకుని ఇంటికి వచ్చేసరికి రాముల ఎదురు వచ్చింది. యాడ్కి బోయినవే? జరంత నూనె, పప్పు తెచ్చాను. నూనె అగ్గువయింది (చవక) ఎట్ల తెచ్చినవు? పదకొండు రూపాయాకు కిల. ఓయమ్మో! ఎవడే ఆడు? పట్టపగలే దోపిడు చేసిండు?

రంగమ్మ అన్నది నోరు తడి చేసుకుంటూ. ఎంత ఉద్దెర అయినా మూడు రూపాల్ తీసుకుంటాడే! దీని అమ్మకడుపు కాల. బజార్ల ఎనిమిది రూపాలకు కిలో ఉందే” (సులోచన, మాదిరెడ్డి. 2017: 45).

ఇక్కడ కోమటివారి దోపిడి విధానం స్పష్టంగా కళ్ళముందుంచారు రచయిత్రి. మార్కెట్‌లో ఎనిమిది రూపాయలు ఉంటే పదకొండు రూపాయలకు అమ్మడం జరిగింది. ఈవిధంగా అమాయకపు ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకోవడం, వారిని ఆర్థిక దోపిడి చేయడం తేటతెల్లమైంది. బహిరంగ మార్కెట్‌లో తక్కువ ధరకు సామాన్లు లభిస్తున్నప్పటి వృత్తిలో ఎదుగుదలలేక కనీస అవసరాలైన వస్తువులను కొనలేని స్థితిలో ఉన్నారు. దుకాణంలో ఉద్దెర తెచ్చుకోవడం తరువాత బాకీ తీర్చడం, దుకాణుదారులు ఏ ధర చెబితే ఆ ధరకే తెచ్చుకోవల్సిన స్థితిలో ఉన్న వృత్తి కుటుంబాల జీవితాలను దృశ్యమానం చేశారు రచయిత్రి.

మరో నవల ‘సంకెళ్ళు తెగాయి’ నవలలో ముదిగంటి సుజాతారెడ్డి మంగలి వృత్తి జీవితాలను చిత్రిస్తూనే వాటిలో భాగంగా పద్మశాలీల గురించి చెప్పింది. “నాకు చీర నేయడమే తెలుసు. దాన్ని బజార్లో ఎంతకమ్ముకోవాలో, ఎట్ల అమ్ముకోవాలో ఎవరికి అమ్ముకోవాలో నాకు తెల్వదమ్మా! నేను నేసిన చీరలు అందరూ గన్ని పైసలు పెట్టి కొనుక్కోలేరు. అందుకే దొరసాని చీరలు తీస్కపోయి పట్నంలో తన దోస్తులకు అమ్ముతది. ఆమె దయవల్ల అంతమాత్రం అమ్మకం జర్గుతున్నది అని రెండు చేతులెత్తి దానయ్య గాలిలో ఆ దొర్సానినుద్దేశించి నమస్కరించాడు.

రాజ్యలక్ష్మమ్మ ఆ చీరెలను తీసుకెళ్ళి పట్నంలో ఎంత ఎక్కువ ధరకమ్ముతుందో తన తల్లి చీరలను గురించి తెలిసిన అనల ఊహించగలిగింది. నేసిన చీరలకు కళాత్మకమైన డిజైన్లతో కూడిన జరి చీరలను పట్నంలో ఎంత గిరాకీ వున్నదో ఆమెకు తెలుసు! వీళ్ళిట్లా మోసపోయి బీదతనంలో మగ్గిపోతున్నారే! అని అనల మనస్సు బరువెక్కిపోయింది” (సుజాతారెడ్డి, ముదిగంటి. 1994: 113). వృత్తిదారులు వస్తువులను ఉత్పత్తి చేయడం తప్ప వాటిని సరైన ధరకు అమ్ముకోలేని అమాయకులుగా ఉంటారు. ఇలాంటి వారిని మోసం చేసే దళారీలు చాలా మంది ఉంటారు. ఇక్కడ దొర భార్య వీరి దగ్గర చీరలు తీసుకొని పట్నం వెళ్ళి అక్కడ ధరకు అమ్ముకోవడం జరుగుతుంది. నాలుగు, ఐదువేలకు

చీరను అమ్మి వీరికి నాలుగు వందలు మాత్రమే ఇస్తుంది. ఈవిధంగా మధ్య దళారీలుగా ఇక్కడ వీళ్ళు కనబడతారు. వృత్తి కుటుంబం మొత్తం కలిసి పని చేస్తే నెలకు ఒక చీర అది డిజైన్‌తో నేసేది. దానికి లభించి నెలకు నాలుగు వందలు మాత్రమే. అది దొర భార్య దయవలనె తమ చీరల్ అమ్ముడుపోతున్నాయనే భ్రమలో ఉంటారు తప్ప మోసపోతున్నామనే ఆలోచన కూడా కలుగదు. ఈవిధంగా వృత్తిదారులను మోసగిస్తున్న నయా దళారీ వ్యవస్థను వాస్తవికంగా స్పృశించారు రచయిత్రి.

### 4.3.2. ముస్తాజుదారులు (కాంట్రాక్టర్లు)

ముస్తాజుదార్లు అనే పదం గౌడ వృత్తికి సంబంధించింది. ముస్తాజుదార్లు అనగా కాంట్రాక్టర్లు. తెలంగాణలో నిజాం రాజు పాలనలో ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరులుగా వ్యవసాయం తర్వాత అబ్కారీ వ్తవస్థ ఉండేది. దీనికై తెలంగాణలో ఒక్కో జిల్లాను రెండు లేదా మూడు ప్రాంతాలుగా విభజించి కల్లు దుకాణాల్ని వేలంపాటలు వేసేవారు. ఈ వేలం పాటల్లో చిన్న భూస్వాములు పాల్గోనే అవకాశం లేదు. పెద్ద భూస్వాములు అనగా వేలాది ఎకరాలు కలిగిన వారు. వీరు మాత్రమే పాల్గొనే వారు. వరంగల్ జిల్లాలో పింగలి దొరలు ఎక్సైజ్ కాంట్రాక్టర్లుగా చాలా సంవత్సరాలు ఉన్నారు. వీరినే వడ్డేపల్లి దొరలు అని పిలుస్తారు. వీరు పెద్ద భూస్వాములు. ఈ వడ్డేపల్లి దొరలు గౌడ వృత్తి వారిని హింసించేవారు. వీరు నిజాంకు చెల్లించాల్సిన పన్నుకు రెండింతల పన్నును గౌడ వారి నుండి నిర్బంధంగా వసూలు చేసేవారు. "కల్లుగీత కార్మికులు రకాలు(శిస్తులు) కట్టమంటే గీత కార్మికుల మోకులు లాగుకు పోయేవారు. అప్పటికి రొక్కం రాకపోతే దొరగడీలకు జవానులు గీత కార్మికులను లాక్కువెళ్ళేవారు. గడీలలో గీత కార్మికులను వంగబెట్టి వీపులపై బండలు ఎత్తేవారు. మరికొన్ని సంబర్భాల్లో గీత కార్మికుల జుట్టు ముడివేసి గోడచిలక కొయ్యలకు వేలాడ దీసేవారు. ఇంటువంటి నిర్బంధాన్ని గీత కార్మికులు భరించలేక గ్రామాలు విడిచిపెట్టి వెళ్ళేవారు. గీతకార్మికులకు కొందరికి 1, 2 ఎకరాల భూమి ఉంటే దొర బలవంతంగా లాక్కునేవాడు. ఈ దుర్మార్గమైన నిర్బంధం, అణచివేత నల్గొండ, వరగల్, కరీంనగర్, మెదక్, రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాలో

అమలులో ఉంది. తెలంగాణ జిల్లాలో గడీలులే గ్రామాలు చాల పరిమితం” (వెంకటయ్య, కె. 2012: 19). ఈవిధంగా తెలంగాణలో దొరలు కల్లుగీత కార్మికులని దోచుకునేవారు. ఈ దోపిడీ విధానం మొదట్లో ఇలా ఉన్నప్పటికీ తర్వాతి కాలంలో కులంలో కుల పెద్దలు ఏర్పడ్డారు. ఈ కుల పెద్దలే గ్రామాలలో, గీతవృత్తిలో కూడా పెద్దలుగా అనగా పెద్ద గౌడ్ అని పిలువబడేవారు. ఈ పెద్ద గౌడులు ఆర్థికంగా బలపడి కొంత పలుకుబడి కల్గి ఉండేవారు. వీరిలో ఎక్కువమంది గ్రామాలలో ఉండే భూస్వాములు, పటేలు, పట్వారీలకు అనుచరులుగా ఉండేవా . భూస్వాములు వేలం పాటల్లో కల్లు దుకాణాలు పట్టి పెద్ద గౌడ్స్ ఆధ్వర్యంలో దుకాణాలు నడిపేవారు. తరువాతి కాలంలో అందులో ఎక్కువ సొసైటీలు ఏర్పడ్డాయి. ఆందులో ఎక్కువ సొసైటీలు ఈ పెద్దగౌడ్స్ ఆధ్వర్యంలో కొనసాగాయి. ఇందులో దొరలకు లేదా వరి అనుచరులైన ముస్తాజుదార్లకు ప్రతినిధులుగా ఉండి లాభార్జనే ధ్యేయంగా పని చేసేవారు. ఇలాంటి దోపిడీని చిత్రించిన నవలలు గీతవృత్తికి సంబంధించినవిగా ఉన్నాయి.

ముస్తాజుదార్ల దోపిడిని మొదటగా గుర్తించి వారి దోపిడిని వ్యతిరేకించినది జి. రాములు రాసిన ‘పెరటి చెట్టు’ నవల. “కుల సోదరులారా! మన సంఘము నానాటికి క్షీణించి పోతుంది. విద్యా విజ్ఞానాదులలో ఎంతో వెనుకబడిపోయినాము. ఆర్థిక దుస్థితి వర్ణించరాకుండా ఉన్నది. ఎందరో కులసోదరులు పస్తులుంటున్నరు. మరెందరో పరదేశాలకు వెళ్ళి పోతున్నారు. దీనికంతకూ ప్రభుత్వము యొక్క తప్పుడు విధానమే కారణము. దోపిడి వర్గానికి కల్లు మాములాలు యిస్తున్నారు. మనవారు తాతలనాటి నుండి చెమటోడ్చి శ్రపడ్డాగాని బట్టాపొట్టకే దినగండం లాంటి పరిస్థితిలో ఉంటున్నారు. అదే మధ్యన మాములాలు పట్టుక వచ్చే ముస్తాజర్లను చూడండి ఒకే ఒక సంవత్సరములో ఒక జీపు కారు, బంగారు ఉంగరాలు, మిద్దెలు మేడలు, విందులు వింతలు వినోదాలతో తుల్తూగిపోతున్నారు. ఇదంతా ఎక్కడి నుండి వస్తుంది వీరికి. దీని రహస్యం మీకు తెల్వదనుకుంటాను. ఒకవైపు గొప్పలాభాలపైన మాములాలు పొందుబాటు జేస్తూ మన బీద గౌండ్ల వారిని పీల్చిపిప్పిజేస్తారు. మరోవైపు ప్రభుత్వం యొక్క ఇంటి దొంగలను కలుపుకొని పాపము మన గ్రుడ్డి ప్రభుత్వాన్ని పట్టపగలే దోచుకొంటుంటారు ఈ మధ్యవర్తులు” (రాములు, జి. 1954: 31, 32).

ముస్తాజుదార్లు చేసే దోపిడి విధానం మనకు ఇక్కడ స్పష్టంగా అర్థమవుతుంది. గీత వృత్తిదారులు ఎంత కష్టపడినగాని వారికి కనీసం సరైన ఆహారం లభించదు. అధిక మెత్తాలలో పన్నులు చెల్లించాలి. ముస్తాజుదార్లు వేలం పాటల ద్వారా మాములును చేజిక్కించుకుని తమ ఇష్టానుసారంగా పన్నులు విధించడం జరుగుతుంది. ఈవిధంగా తక్కువకాలంలో ఎక్కువ డబ్బును సంపాదిస్తున్నారు. దీనికి కారణం వృత్తిదారులు అజ్ఞానం, నిరక్షరాస్యత వలన అనే విషయం ఇక్కడ స్పష్టంగా అర్థమవుతుంది. ముస్తాజుదార్లకు ప్రభుత్వం ఉద్యోగులు కూడా సహకరించడంతో వారి దోపిడి విధానానికి హద్దులేకుండా పోయిందనే విషయాన్ని వాస్తవిక దృష్టితో మనముందుంచారు రచయిత.

ముస్తాజుదార్ల దోపిడిని, వృత్తిదారుల కష్టాలను మనముందుంచారు నేరేళ్ళ శ్రీనివాస్ గౌడ్ 'బతుకుతాడు' నవలలో. "మాముల గురించి మాట్లాడుతు ఈ సంవత్సరం ప్రభుత్వం సారాను నిషేధించడం వల్ల గీత కార్మికులకు అధికంగా పన్ను విధించింది. మరోపక్క అబ్కారోల్లు లంచాలు కూడా పెంచుకున్నారు. ఇంతకు ముందు సంవత్సరానికి ఈ సంవత్సరానికి పన్ను విషయంలో చాలా తేడా ఉంది. అందుకని మీరు ఈ సంవత్సరం డెబ్బయి వేయిలు ఇవ్వండి అన్నాడు నారాయణ గౌడ్. పోయిన సంవత్సరం నలుపయి నాలుగు వేయిలేనాయే.. ఇప్పుడు ఒకేసారి గంతగనమంటే మాకు ఎల్లుద్దా...? కనీసం మాకు కైకిలి మందమన్న మిగులుద్దానే... అన్నాడు నారాయణ గౌడ్. మీరు మా ఇంట్లగ్గిన ఇత్తుండ్ర ఏంది అన్నాడు రాజం. గవన్ని మాకు తెలువదిగాని మాకు వేయిలకు వేయిలు మిగులక పోని కనీసం ఉప్పు నూనే మందమన్న మిగులకుంటెట్లనే అన్నాడు నారాయణ గౌడ్" (శ్రీనివాస్ గౌడ్, నేరేల్ల. 2004: 93).

జగిత్యాల దాని పరిసర ప్రాంత గ్రామాలకు కలిపి ఒక్కటే దుకాణం ఉంటుంది. దీనికింద గ్రామాలలోని గీతకార్మికులు వారి మాములలు మాట్లాడుకునేవారు. ప్రతి సంవత్సరం వారు డబ్బులు చెల్లించాలి. ఈ పన్ను అనేది పెరుగుతుంది గాని వారి జీవితాలలో అభివృద్ధి అనేది జరగడం లేదు. ఈ ముస్తాజుదార్లు లేదా గౌడ సంఘ నాయకులు కూడా గీతకార్మికులను దోచుకోవడం జరుగుతుంది. గత సంవత్సరం నలుభై నాలుగు వేయిలు పన్ను కట్టితే ఈ సంవత్సర డెబ్బై వేయిలు అడగడంతో గీతకార్మికులు ఆందోలనలో పడతారు. వారు కష్టపడితే ప్రతిఫలం లభించకపోగ వారి కనీస అవసరాలు

తీరేలా లేదని, పన్ను తగ్గించమని అడగుతారు. కాని ఫలితం లేకుండా పోతుంది. ఆ డబ్బులు కట్టలేక వారి వృత్తిని వదిలే వేరే పనికి వెళ్ళాల్సి వస్తుంది. ఈవిధంగా పన్నులు పెంచడం ద్వారా గీతకార్మికులు వారి వృత్తికి దూరమయ్యే సంఘటనలను మనముందుంచారు రచయిత.

ముస్తాజుదార్ల దోపిడిని వాస్తవికంగా దృశ్యమానం చేశారు కె. వెంకటేశ్వర్ల 'కల్లుమండువ' నవలలో. వేలంపాటల ద్వారా కల్లు మామూలు పట్టడం. ఈ వేలం పాటలు ధనికవర్గం, దొరల అండదండలు కల్గినవారే సొంతం చేసుకోవడం జరుగుతుంది. "బాబు మా బతుకులు వేలం బతుకులు బాబు. ఈ తాళ్లు, ఈదులను దొరగారి దగ్గర కుక్కలా పడివుండే కొద్దిమంది పెద్ద ముస్తాదర్లు ఉన్నారు. వాళ్ళు జిల్లాలకు జిల్లాలను వేలం పాటలు పాడి ఈ వృత్తిని వాళ్ళ చేతుల్లో పెట్టుకున్నారు. వాళ్ళ ఎంత కిస్తు కట్టమంటే అంతకట్టి తీరాల్సిందే వాళ్ళ మాటలకు ఎదురు చెప్పినోడికి భూమ్మీద నూక చెల్లినట్టే" (వెంకటేశ్వర్లు, కె. 2006: 16).

కులపెద్దలుగా ఉండి దొరలకు ఏజెంట్లుగా కొంతమంది ఉండడం గ్రామాలలో కనబడుతుంది. ఇలాంటి వారికి లాభాపేక్ష ప్రధాన ధ్యేయం. తోటి గీతకార్మికుల కష్టాలు వీరికి అనవసరం. ఇలాంటి ముస్తాజుదర్ల వలన గీతకార్మికులు పడిన కష్టాలు ఇక్కడ రచయిత మాన ముందుంచారు. ముస్తాజుదార్లు ఎంత పన్ను విధించిన కట్టితీరాల్సిందేనని, వారికి వ్యతిరేకంగా ఎవరైనా మాట్లాడితే వారు బ్రతకడం కష్టంగా ఉండేది. గీతకార్మికుల శ్రమను దోచుకునే వారు ముస్తాజుదార్లు. కనీసం వారి అవసరాలను కూడా తీర్చుకోలేని పరిస్థితి. పన్నులు చెల్లించకుంటే గీతకార్మికుల ఇండ్లను వేలంపాట పాడి తద్వారా తమ పన్నులు రాబట్టుకునేవారు. ఇలాంటి దారుణమైన సంఘటనలను వాస్తవిక కోణంలో చిత్రించారు రచయిత.

ఈవిధంగా తెలంగాణలో గీతకార్మికులు అనుభవించిన కష్టాలను మనముందుంచారు రచయితలు. పెద్దభూస్వాములు, దొరలు, పెద్ద గౌడ్‌లుగా పిలువబడే ముస్తాజుదార్లు వేలంపాటల ద్వారా గీతవృత్తిని తమ ఆధీనంలోకి తీసుకుంటున్నారు. గీత కార్మికులకు అధిక పన్నులు విధించి, వారిని హింసించడం జరిగింది. గీతకార్మికులు ఎంత కష్టపడినా వచ్చే ఆదాయం వృత్తి పన్నులు కట్టడానికి కూడా సరిపోకపోవడంతో తమ

ఇండ్లను కూడా కోల్పోయారు. పన్ను సకాలంలో కట్టకుంటే దొరలు గీతకార్మికులను హింసించిన సంఘటనలు అనేకం. గీతవృత్తిలో పెద్దగౌడ్‌లుగా పిలువబడే వారు దొరలకు అనుచరులుగా ఉండడం, తమతోటి గీత కార్మికులను హింసించడం, వేదింపులకు గురిచేయడం జరిగింది. కనీసం మానవత్వం లేనివారిగా ఉంటారు. ఇలా గీతకార్మికుల ఛిద్రమైన జీవితాలను మనముందుంచారు రచయితలు.

### 4.4. సేవకులు (జవానులు, బంట్రోతులు)

దొరలు లేదా పటేలు, వ్యాపారస్తుల (కోమటి) దగ్గర ఉండి వారు చెప్పే పనులు చేసేవారు ఈ జవాను అనేవారు. వీరికి పూర్వం నిజాం పరిపాలనలో భూమి, భవంతులు కల్గి ఉన్నారు. కొందరు నిజాం ప్రభుత్వం ఇచ్చిన భూములు దొరల దోపిడితో పోగొట్టుకున్నవారు కొందరు ఉన్నారు. ఇలాంటి సేవకులు లేదా జవానులుగా పిలువబడే వారి గురించి ఈ నవలల్లో వాస్తవికంగా చిత్రించారు రచయితలు. సేవకులు దొరలు, కోమటిల దగ్గర పనిచేస్తూ తమ జీవితాన్ని గడిపేవారు. వీరు ఈ నవలలో ముస్లిం పాత్రలుగా ఉన్నారు.

సేవకులుగా పనిచేసేవారి గురించి, వారి స్వభావాన్ని గురించి లోకమలహరి 'సంఘము' నవలలో చిత్రించాడు. "అరె గఫ్రూ! శాలె యెంకని వద్దకి పోయి ఆసామి యుక్తంగా రూపాయిలి తీస్కరావే, మూన్నెల్లాయె. ఇంకా రూపాయిలి తెచ్చియ్యపాయె. తాత సొమ్మనుకున్నడేమొ. తీస్కపోయెటప్పటి మాట ఇచ్చెటప్పుడుండొద్దా. అచ్చా మారాజ్! ఆన్నేగాదు ఆన్కే అబ్బాకీ గూడ బట్కస్తా. తాకీదులో భత్తా లిఖ్వా ఆరాజ్. రోజ్కీ వోక్క రూపాయి ఇసాబులోని" (మలహరి, లోక. 2017: 24).

నాగనాధం అనే కోమటి(వ్యాపారస్తుడు) దగ్గర గఫ్రూ అనే జవాను ఉంటాడు. గఫ్రూ ముస్లిం నాగనాధం గ్రామంలోని ప్రజలకు అప్పులు ఇచ్చేవాడు. ఆ అప్పులను వసూలు చేసేవాడు గఫ్రూ. గఫ్రూ అప్పులు తీసుకున్న వారి ఇంటికి వెళ్ళిన రోజు మొదలు అప్పు తీర్చే రోజు వరకు ప్రతిరోజు ఒక్కరూపాయి బత్తెం ఇవ్వాలి. గఫ్రూ అప్పులు వారిని చులకన భావంతో పిలవడమే కాకుండా, అవసరమైతే వారితో పంచాయితి చేయడం, వారి మీద

చేయి వేసేవాడు. ఈవిధంగా అప్పుల వారిని బెదిరించి డబ్బులు వసూలు చేసేవాడు. ఇలాంటి వారి గురించి వాస్తవికంగా దృశ్యమానం చేశారు రచయిత.

మరొక వృత్తి నవల మాదిరెడ్డి సులోచన రాసిన 'సుషుప్తి'లో జవానుల గురించి వివరించారు. "దావూద్‌కు షావుకారు ఇచ్చే పాతిక రూపాయల జీతం అతని సిగరేట్లకే సరిపోదు. షావుకారు గారు ఊరంత అప్పులు పెడతాడు. అదోవరం దావూద్‌కు. కూరలు, బియ్యం, పాలు ఒకటేమిటి అన్నీ బేరగా వస్తాయి. అప్పుడప్పుడు డబ్బులు ముడతాయి. కొందరు భారీ ఎత్తున అప్పులు తీసుకునే ఆసాములున్నారు. వారి దగ్గరకు వాయిదా ఉన్నప్పుడు పెడితే, ఓ రెండు రూపాయలు చేతిలో పెట్టి 'ఇంట్లో లేనని చెప్పు' అని బ్రతిమాలుకుంటారు. త్రాగుడు దొరుకుతుంది. అందుకే ప్రభుత్వ ఉద్యోగం వచ్చినా వెళ్ళలేదు" (సులోచన, మాదిరెడ్డి. 2017: 47).

దావూద్ వ్యాపారి దగ్గర జవానుగా పని చేస్తుంటాడు. అతనికి ఇద్దరు భార్యలు. అప్పుల వారి వద్దకు వెళ్ళినప్పుడు రెండు రూపాయలన్న లేదా సీసా కళ్ళు పోయిస్తారు. బాలయ్య దగ్గరికి వచ్చిన ప్రతిసారి కల్లు తెప్పించేవాడు. అంతేగాక స్త్రీలపట్ల వ్యామోహం ఉన్న వ్యక్తిగా దావూద్ ఇక్కడ కనబడతాడు. దావూద్ కూడా వడ్డీకి డబ్బులు ఇస్తూ ఆదాయం పెంచుకుంటారు. ప్రభుత్వ ఉద్యోగం వద్దని ఉన్నాడంటే జవానుగా పని చేయడంలో ఎంత లాభం ఉందో అర్థం చేసుకోవచ్చు. గోవిందు భార్య చుక్క మీదను సొంతం చేసుకోవాలని గోవిందుకు కల్లు త్రాగించే భార్య పట్ల ద్వేషాన్ని పెంచుతాడు. ఇలా భార్యభర్తల మధ్య గొడవలు పెట్టి చుక్కను సొంతం చేసుకుంటాడు. ఇలాంటి వారి వల్ల మానవ విలువలు పడిపోయాయి అని చెప్పవచ్చు. ఈ విధంగా జవానులు చేసే పనితోపాటుగా, వారిలో ఉండే నీచమైన స్వభావాన్ని బహిర్గతం చేసారు రచయిత్రి.

జవానునే మస్కరుగా పిలువబడుతున్న వారి గురించి వేముల ఎల్లయ్య 'కక్క' నవలలో దృశ్యమానం చేశారు. "గీ ఊల్లే మీ ఇండ్లు మూడొందల గడ్పుగా లెక్కలన్ని నాకెర్కె పటేండ్లయి నాల్గిండ్లు. సూదరోల్లయ్ వొంద గడ్ప తిప్పి గోడ్తె గాల్లన్ని కులాల్లోళ్ళు పటేండ్లయ్ గల్పి నూట నాల్గిండ్లు. ఇగ మిగ్లినయ్ మియ్యేగ! గింతమంది మీరుండి గోడ్తే ఊకుంటారు? మల్సిదంచుడు బెడ్తె మల్ల మొకం జూత్తర? నీయవ్వా రండ బన్కివా బారెద్దు మాతుర్కిండ్లు మీయ్యన్నుంటె గీ ఊరెమాదందుమ్ సెందు సెండాట ఆడ్కో – బోయినాయ్

గియ్యన్ని సెప్తున్న గబాపేర్గిట్ట సెప్పేర్రో! గీమస్కూరి బజ్జెయ్యకుంట జేస్తర్రో! నైజామప్పుడు ఇర్వై ఎకరాల బూమ్కి ఆస్తిపరున్ని నాదె గుంజుకుంటె నేనెంబీకి పగ్గాల్బేనుకున్నగా కతంత గిప్పుడైతాదిగని రచ్చబండ కాడ్కి అందర్గల్సి రాండ్రి" (ఎల్లయ్య, వేముల. 2000: 69). దళితులె ఇంటిలో జరిగిన పెండ్లి ఊరేగింపు సమయంలో దళితులను చూసి ఓర్వలేని దొర, సూదరివాళ్ళతో అనగా మిగతా కులాల వారిని రెచ్చగొట్టడంతో పెద్ద గొడవ అవుతుంది. ఆ పంచాయితి పోలీస్ స్టేషన్ వరకు వెళ్ళడం, ఎస్.ఐ. వచ్చి దళితులను పిల్చుకొని రమ్మనే సందర్భంలో నాజర్ అనే మస్కూరు వచ్చి దళితులలో చైతన్యాన్ని నింపే ప్రయత్నం చేస్తాడు. అంతేకాక తాను తన భూమిని కోల్పోయిన విషయం తెలుపుతాడు. ఇక్కడ దొరలు భూమిని ఆక్రమించడానికి, అధికారాన్ని చేజిక్కించుకునే విధానం తెలుపుతూ వారివి నాలుగు ఇండ్లేనని, వారిని అధిక సంఖ్యలో ఇండ్లున్న దళితులు ఎదిరించాలని చెప్పుతూనే, ఈ విషయం దొరకు తెలిస్తే తన పరిస్థితి ఏమవుతుందనే భయాన్ని కూడా వ్యక్తం చేస్తాడు.

ఈ విధంగా తనతోటి వారిని చైతన్యపరిచే వ్యక్తిగా నాజర్ కనిపిస్తాడు. ఈ నవలల్లో జవాన్లు, మస్కూరుగా పిలువబడే సేవకులు ముస్లింలుగా ఉన్నారు. ఆయా కాలాల్లో ఆయా సామాజిక పరిస్థితులను బట్టి వారిలో వ్యత్యాసం కనబడుతుంది. సంఘం, సుషుప్తి నవలలో గఫ్రూ, దావూద్‌లు వ్యాపారస్తులకు సేవకులుగా ఉండటంలో వారు అజమాయిషి ఎక్కువగా చెలాయించారు అని చెప్పవచ్చు. అంతేకాకుండా స్వభావమే ఆవిధంగా ఉందనుకోవచ్చు. కక్క నవలలోని నాజరు పరిస్థితి పైవారికి విరుద్ధంగా ఉంది. దానికి కారణం దొరచేత దోపిడి చేయబడి అణచివేత వ్యక్తిగా మనకు కనబడతాడు. అంతేగాక తోటి మానవులపట్ల జాలి ఉన్నదనే విషయం తెలుస్తుంది. గఫ్రూ, దావూద్‌ల విషయలో మానవీయ దృక్పథం కనబడదు. ఈవిధంగా రచయితల భిన్నమైన ప్రవర్తనలను కల్గిన ఒకే వర్గానికి చెందిన జవానుల జీవితాలను దృశ్యమానం చేశారు.

## 4.5. రాజకీయ రంగం

నాడు మనదేశంలో రాజకీయ రంగం అస్తవ్యస్తంగా తయారైంది. పార్టీల మధ్య పోటీలు, తీవ్రస్థాయిలో ఉండడం, పార్టీ నాయకులు తమ అవసరాలకు పార్టీలు మారడం, ఒక పార్టీ తరపున గెల్చిన వారు అధికారంలో ఏ పార్టీ ఉంటే ఆ పార్టీలోకి మారడం లాంటి సంఘటనలు సర్వసాధారణమై పోయాయి. ఇలా అనేక కారణాలతో అస్తవ్యస్తమైపోయిన సమాజాన్ని చూస్తూనే ఉన్నాం. ఏ రంగంలో ఊసినా చెప్పే మాటలకు, చేసే చేతలకు పొంతన లేకుండా పోయింది. ఈ విషయాలు రాజకీయ రంగానికి అతికినట్లుగా ఉంటాయి. సమాజంలో నిజాయితి లేకుండా పోతుందని చెప్పవచ్చు. వృత్తులను రక్షించాల్సిన పాలకుల విధానాలు వాటిని నాశనం చేసేలా ఉన్నాయి.

ఈ విధంగా మారుతున్న సమాజంలో మార్పును రచయిత ఆశించగలడేగాని, వ్యక్తిగతంగా తానే ముందుకు వచ్చి చక్కదిద్దలేడు గదా! రచయిత సామూహికంగా మార్పును కోరుకుంటాడు. రచన మానసికమైంది. మార్పు భౌతికమైంది. ఈ మార్పును తేవాల్సింది పాలకులు, ఆశించి దారిని చూపించేది రచయితలు లేదా మేధావులు.

ఈ నవలల్లో అవినీతుపరులు నీతులే చెప్పే విధానం, విద్యార్థుల ఎన్నికలు, కుల పంచాయితిలో విధించే దారుణ శిక్షలతో పాటుగా రాజకీయ కక్ష్య , హత్యలు మొదలగు దారుణాలను దృశ్యమానం చేశారు రచయితలు.

ఇందులో గ్రామస్థాయిలో జరిగే పంచాయితీలను, కుల పంచాయితీల గురించి పరిశీలించిన తరువాత విద్యార్థి ఎన్నికల గురించి విశ్లేషించడం అయింది.

### 4.5.1. గ్రామ / కుల పంచాయితీలు

జి. రాములు రాసిన 'పెరటి చెట్టు' నవలలో భార్యాభర్తల పంచాయితి గురించి వివరించారు. ఇందులో భర్తైన రాజాగౌడ్ పనిచేయకపోవడం, ఉన్న ఆస్తులను అమ్ముకోవడంతో మామ అయిన ఎల్లాగౌడ్ కూతురిని కులంలో పంచాయితి పెట్టి తీసుకెళ్తాడు. దాంతో రాజాగౌడ్ ఏమి చేయలేక తిరిగి భార్యను తనకు కావాలని గ్రామ

సర్పంచ్ అయిన దొర దగ్గరికి వెళ్తాడు. అక్కడ సర్పంచ్ లంచం గురించి చెప్తూ "అదే మరి నీవు నన్నే అన్యాయం అంటె కాస్త కోపము వచ్చి ఈ రామాయణమంతా వల్లే వేయవలసి వచ్చింది. అట్లుగాకపోతే, ఏదో నన్ను గ్రామానికి సర్‌పంచ్ జేశారు గదాయని ఊరకనే ప్రొద్దస్తమానాలు పంచాయితీలు చెప్పుకుంటూ కూర్చుంటె, నా సంసారమూ నేనూ సన్యాసం బుచ్చుకోవలసిందేనా?" (రాములు, జి. 1954: 3). ఇక్కడ పంచాయితి పరిష్కారానికి లంచం ఇవ్వాలని, అది ఇస్తేనే రాజాగౌడ్ వైపు తీర్పు అనుకూలంగా ఉంటుందని చెప్తాడు. రాజాగౌడ్ దగ్గర ఉన్న దున్నపోతునిచ్చి తీర్పు, తనకు అనుకూలంగా మార్చుకుంటాడు రాజాగౌడ్. ఈవిధంగా లంచంతో పంచాయితీ తీర్పులను చెప్పే విధానాన్ని వాస్తవికంగా దృశ్యమానం చేశారు రచయిత.

ఇతర కులస్తుల ఇండ్లల్లో పనిచేయడం అవమానంగా భావించే కులపెద్దలు ఒక స్త్రీపై విధించే శిక్షల గురించి లోకమలహరి 'సంఘము' నవలలో చిత్రించారు. బుచ్చమ్మ అనే పద్మశాలి స్త్రీ భర్త చనిపోవడంతో కొడుకు, కూతురిని పోషించడం కోసం బ్రాహ్మణుల, కోమటి వారి ఇండ్లలో పని చేస్తుంది. ఇతర కులస్తుల ఇండ్లలో పని చేయడం కులానికంతటికి అవమానంగా భావిస్తారు కులపెద్దలు. ఈ సందర్భంలో నర్సయ్య అనే ఇంకో పద్మశాలి భర్తలేని స్త్రీలపై శిక్షలు వేయడం సరికాదని, వారిని ఆదుకోవల్సిన అవసరం కులానికి ఉన్నదంటాడు. "ఇరవై రూపాయల దండుగ వేయ సంకల్పించిరి గదా! అది ఎంత మాత్రమూ తప్పు లేదు. మళ్ళీ దానికి పూర్వపు ఉద్యోగమనుకున్న గత్యంతరమే లేదాయే. మనబోటి వాళ్ళకే పొట్టగడుచుటకు కష్టంగా వున్న ఈ రోజుల్లో పాపము ఆ విధవ అందులో సగము అంధురాలు మరే పని జేసుకొని బెఅతకాలెనో చెప్పండి?" మలహరి, లోక. 2017: 28).

కులపెద్దలు జరిమానా ఇరవై రూపాయలు వేయడంతో గ్రామంలోని కోమటివద్ద అప్పు చేసి కడుతుంది. ఈవిధంగా వచ్చిన డబ్బును త్రాగడానికి ఉపయోగిస్తారే తప్ప దానిలో ఎలాంటి మంచి పనులు చేయరు. భర్తలేక ఇబ్బందులు పడుతున్న స్త్రీలను ఇంకా హింసించే కులపెద్దల తీరును మనముందుంచారు రచయిత.

కుల పంచాయితీల గురించి అందులో విధించే శిక్షల గురించి వాస్తవికంగా చిత్రించాడు వేముల ఎల్లయ్య 'కక్క' నవలలో. కలెమ్మ భర్త చనిపోయిన నిండు గర్భిణి.

కొడుకు పుడతాడు. కొడుకు కక్కడు. కక్కని జీతముంచుతుంది అక్కడ పటేలు పెట్టే ఇబ్బందులు చూడలేక ప్రక్కన ఉండే ఎల్లయ్య అనే మరో పటేల్ జీతగాడు కలెమ్మకు సలహాలు ఇస్తాడు. దాంతో కక్కడు సమయానికి పనికి రావడంతో కక్కడికి దెబ్బలు తప్పుతాయి. అదే చొరవతో అప్పుడప్పుడు ఎల్లయ్య కలెమ్మ ఇంటికి వచ్చి మాట్లాడి వెళ్తాడు. కలెమ్మ బావ ఆగమయ్యకు కలెమ్మ మీద మనసుపడి, ఆమెను బలత్కరించటానికి ప్రయత్నిస్తాడు. కలెమ్మ తప్పించుకుంటుంది. దాంతో ఆగమయ్య కలెమ్మ మీద పగ పెంచుకుంటాడు. ఎల్లయ్య కలెమ్మ ఇంటికి రావడం చూసి వారి మధ్య చెడు సంబంధాన్ని అంటగట్టి కుల పంచాయితి పెడతాడు. చెరో వేయిరా ఎకర్నం అంతే కాకుండా అబద్ధాలు ఆడైన కలెమ్మను గ్రామం నుండి వెల్లగొటాలని చూస్తాడు. చివరికి పెద్దమనుషులతో కలిసి కలెమ్మ మీద నిందమోపుతాడు. "ఓరారి! నీరటికాడి ఈరయ్య! చిల్ల చిల్ల పల్లెగ్తున్నగా జీడిగింజలు చెప్పుల దండ గుచ్చిగా కలెమ్మ ఇంటి ముంగల యాప కొమ్మకు కట్టుండ్రి! రేక్కంప ఊడుగు మండల ఎట్టందెచ్చి ఇంటి సుట్టు గొట్టుండ్రి! కులంల కెల్లం ఎలేసిండ్రని సుట్టొర్లకు డబ్బు సాటింపు చెయ్యిండ్రి! గదిరిచ్చిండు పెద్దమాద్గె. పంచాయితికొచ్చిన పెద్దల్తో ఆగమయ్య చేతులు కలిపి క్కక్కని కలెమ్మని సావట్ల నుంచి ఆమింటిదాక తర్మి ఇంటిసుట్టు ఉచ్చబోసిండ్రు" (ఎల్లయ్య, వేముల. 2000: 22).

ఈవిధంగా కులపెద్దమనుషులు కలెమ్మ కుటుంబాన్ని శిక్షించింది. ఇక్కడ భర్తలేని స్త్రీల జీవితాలతో బావ, కులపెద్ద మనుషులు ఆడుకోవడం స్పష్టంగా కనబడుతుంది. కులం నుండి వెలివేయడం, ఇంతికి చెప్పులు కట్టడం, ఇంటి ముందు మూత్ర విసర్జన చేసే నీచమైన పనులు చేయడాన్ని వాస్తవిక దృష్టితో మన ముందుంచారు రచయిత.

భర్త చనిపోయిన స్త్రీని సొంత భర్త అన్న కోరుకోవడం, వ్యతిరేకించిందని ఆమెను అన్యాయంగా అందరిలో విలువలేని వ్యక్తిగా మార్చిన సంఘటనలో మానవ విలువలు నశించాయా అనిపిస్తుంది.

ఈ నవలలో గ్రామ/కుల పంచాయితీలలో జరిగే తీర్మానాలు ప్రధానంగా డబ్బు ఆశించిన జరిగినవిగా, భర్తలేని స్త్రీలపట్ల ఉండే నీచధోరణి, కుల మర్యాదల పేరుతో హింసించడం జరిగింది. ఇలాంటి విషయాలను రచయితలు వాస్తవికంగా చిత్రించారు.

### 4.5.2. ఎన్నికలు

కళాశాలలో జరిగే విద్యార్థి ఎన్నికల గురించి ముదిగంటి సుజాతారెడ్డి 'సంకెళ్ళు తెగాయి' అనే నవలలో దృశ్యమానం చేశారు. నారాయణ ఉత్తమ విద్యార్థి తన చదువు ఏదో తను చదువుకుంటూ ఉండేవాడు. కళాశాల ఎన్నికల్లో రామేశ్వరరావు ప్రెసిండెంట్‌గా పోటీ చేస్తాడు. రామేస్వరరావుది నారాయణ ఊరే. రామేశ్వరరావు నారాయణని హీనంగా చూసేవాడు. తోటి విద్యార్థుల ప్రోద్బలంతో ప్రెసిడెంటుగా నామినేషన్ వేస్తాడు. గాని ఎన్నికల్లో ఓటమి చెందుతాడు. ఆవిషయం నారాయణకు తెలుసు. "నారాయణ ఓటమికి హాస్టల్విద్యార్థుల పాత్ర ఎక్కువగా వుందని నారాయణ పక్షాణ కాన్వాస్ చేసిన మనోహర్ తేల్చాడు. ఎలక్షన్లకు మూందు హాస్టల్‌లో రోజూ పార్టీలు జరిగేవని ఆ పార్టీల్లో తాగడం దగరినుంచి అన్నీ సప్లై అవుతాయని అందుకే హాస్టల్ విద్యార్థులందరూ రామేశ్వరరావుకు ఓటు వేసారని మనోహర్ లాగిన సమాచారం" (సుజాతారెడ్డి, ముదిగంటి. 1994: 68).

ధనవంతుల చేతిలో కింది వర్గాలవారు ఎలక్షన్‌లలో ఓటమి చెందడానికి ప్రధాన కారణమైనది ధనం. ఈ ధన ప్రభావం కాలేజి స్థాయిలోని ఎలక్షన్‌లో ప్రారంభమైన విషయాన్ని ఇక్కడ మనం గుర్తించాల్సిన విషయం. కాలేజీల స్థాయిలో ఇలంటివి జరిగినప్పుడు సమాజంలో దీని తీవ్రత ఎలా ఉంటుందో మనం అర్థం చేసుకోవాలి. నారాయణకు ముందే తెలుసు తను ఓడిపోతానని అందుకే ముందు పోటీ చేయడానికి ఇష్టపడడు. ఓడిన తర్వాత రామేశ్వరరావును అభినందిస్తాడు. ఇక్కడ రామేశ్వరరావును ధనిక భావజాలానికి, నారాయణని ఉత్తమ పౌరునికి ప్రతీకలుగా మనకు కనబడతారు. ఈవిధంగా వాస్తవికతను మన ముందుంచారు రచయిత్రి. అంబేద్కర్ సిద్ధాంతాలు కల్గి నూతనంగా పార్టీలు వచ్చినప్పుడు వృత్తిదారుల జీవితాలు బాగు పడుతాయని వాటి ఆవశ్యకతను ననుమాసస్వామి 'మోహిని' నవలలో దృశ్యమానం చేశారు.

దేశంలో కొత్తగా అంబేద్కర్ పార్టీ ఏర్పడుతుంది. దాని సిద్ధాంతాలు దళితుల(వృత్తిదారుల) జీవితాలకు దగ్గరగా ఉండడంతో మోహిని ఆ పార్టీలో చేరితే తమ లక్ష్యం నెరవేరుతుందని భావిస్తుంది. అసెంబ్లీ ఎన్నికల్లో అంబేద్కర్ పార్టీ తరపున పోటీ చేస్తుంది. ప్రచార సందర్భంలో జరిగిన దాడిలో "నేను బాగానే ఉన్నాను. గెలువలేని

సన్యాసులు ఈ దాడికి పూనుకున్నారు. పిరికిపందలు ప్రజల భావాలు అర్థం చేసుకొని, అవసరమైతే వాళ్లకోసం జీవితాన్నే త్యాగం చేసేవాళ్ళే నిజమైన ప్రతినిధులు. ధనబలంచేత, పశుబలంచేత దాడికి దిగి, ప్రజలను భయకంపితులను చేసేవాళ్ళు ప్రజా ప్రతినిధులవుతారా? గూండాయిజంతో చట్టసభల్లో ప్రవేశించాలనుకోవడం అవివేకం. శాసన సభాగౌరవానికే భంగకరం. రాజులు, భూఆక్రమణదారులు, పైవర్గాల వారు చేసే కుట్ర ఇది. దీనికి భయపడాల్సిన పనే లేదు. మన ప్రచారాన్ని కొనసాగిద్దాం" (స్వామి, ననుమాస. 1994: 62).

ఎన్నికల సమయాలలో జరిగే సంఘటనలు ఇక్కడ రచయిత మనముందుంచారు. దాడులు, హత్యప్రయత్నాల వంటి సంఘటనలు జరిగినప్పటికీ మోహిని గెలిచి మంత్రి పదవిని కూడా చేపట్టుతుంది. మోహిని గెలుపు మహిళల గెలుపుగా చెప్పవచ్చు. మహిళలు, బహుజనులు రాజ్యాధికారం చేపట్టాలనే విషయాన్ని వాస్తవికంగా దృశ్యమానం చేశారు రచయిత.

గ్రామపంచాయితి ఎన్నికల సమయంలో గ్రామంలో ఉండే దొరల వ్యవస్థ గురించి, వారే సర్పంచులుగా ఉండి గ్రామాన్ని అభివృద్ధి చేయని విషయంతోపాటు, యువకులు ఎన్నికల్లో పోటీ చేయడాన్ని మనముందుంచారు నేరేళ్ళ శ్రీనివాస్ గౌడ్ 'బతుకుతాడు' నవలలో. "లక్ష్మన్ గౌడ్ వార్డ్ మెంబర్ నామినేషన్ వేసినాడు. ఇది లక్ష్మన్ గౌడ్ కుటుంబ సభ్యులకు నచ్చలేదు. దొరలమీద తిరుగుబాటు చేయడం వారికి భయంగాను, ఆందోళనగాను ఉంది. నామినేషన్ వేసిన రోజే లక్ష్మన్ గౌడ్‌ను అందలించాలనుకున్నారు. పోటీ నుండి విరమింప చేయాలని అనుకున్నారు. అవుర లచ్చువన్న యెనుకటి నుంచి వాల్లె దొరలు రంగయ్య పటేలు ఉల్లె నుంచి పోతుంటే అందరు ఇంట్లకు పోయి తలుపు లేసుకునెటోల్లు... లేకుంటే వాల్లు ఎవలను బతకనిచ్చిండ్రు. వాల్లకు ఎదురు తిరగవద్దు అన్నాడు ధర్మయ్యగౌడ్" (శ్రీనివాస్ గౌడ్, నేరేళ్ళ. 2004: 34).

దొరల దౌర్జన్యం గ్రామాలలో ఏవిధంగా ఉన్నది అనే విషయం ఇక్కడ తెలుస్తుంది. పూర్వం దొరలుగా, నేడు సర్పంచులుగా వారే ఉంటూ ప్రజలను దోపిడీ చేయడం జరుగుతుంది. ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు గ్రామం. గ్రామ ప్రజలందరికి దొరలపై వ్యతిరేకత ఉంటుంది గాని వారిని ఎదురించే శక్తి లేక అణిగిమణిగి ఉంటారు. లక్ష్మన్ గౌడ్

వార్డుమెంబర్‌గా గెలిచి ఉపసర్పంచ్ అవుతాడు. కాని చివరకు లక్ష్మన్ గౌడ్ మీద కాంతారావు దగ్గరి నుండి వేయి రూపాయలు తీసుకున్నట్లు నింద మోపుతారు. దాంతో కలత చెందిన లక్ష్మన్ గౌడ్ అన్నతో బొంబాయికి వెళ్తాడు. వృత్తికులాలవాళ్ళు ఎలక్షన్‌లలో గెలిచినా, దొరలు ఏవిధంగానైనా వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడే వాస్తవిక సంఘటనను స్పృశించారు రచయిత.

స్వాతంత్ర్యానంతరం కూడా రాజకీయ నాయకులలో దుర్మార్గాలు, దురాచారాలు, అవినీతి ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. విద్యార్థి దశలోనే ధన, మద్య ప్రభావం మొదలు దొరల దౌర్జన్యం, రాజకీయ దాడులలాంటి సంఘటనలు నేటి రాజకీయ వ్యవస్థను ప్రభావితం చేస్తున్నాయి. ఈ నవలల్లో రాజకీయాల్లో స్త్రీల ఎదుగుదలను ఓర్వలేని రాజకీయాలు మొదలు వ్యవస్థలోని లోసుగుల్ని ఎక్కడికక్కడ రాజకీయ పాలకులు ఉపయోగించుకుంటూ లబ్ధిపొందే ధోరణిని తేటతెల్లం చేశాయి. సమాజంలో భిన్న స్థాయిలో అల్లుకొని ఉన్న భూస్వామిక లక్షణాలు ఇంకా బలంగా ఉన్నాయనే అంశాలతోపాటు ఎన్నో వైరుధ్యాలని స్పృశించడంవల్ల ఈ నవలలకు మరింత స్పష్టతనిచ్చారు రచయితలు.

### 4.6. అధికారుల వేదింపులు

వృత్తిదారులకు ఎదురవుతున్న సమస్యలలో అధికారుల వేదింపు సమస్య మరి ఎక్కువగా ఉంటుంది. అధికారులు ప్రభుత్వంచే ప్రజలకు సేవలను అందించడానికి నియమించబడతారు. ఆ అధికారులు ఆ విషయాన్ని విస్మరించినప్పుడు, ధనానికి దాసోహంగా మారి తమ వద్దకు వచ్చే వృత్తిదారులను, ప్రజలను హింసిస్తుంటారు. ఇలా జరిగినప్పుడు ప్రభుత్వ అధికారులు సహాయకులుగా కాక దోపిడీదారులుగా కనబడతారు. అధికారులు వేదింపులను లేదా మోసాలను రచయితలు జాగ్రత్తగా పట్టుకున్నారు. వారు చిత్రించిన విధానాన్ని పరిశీలిద్దాం.

అబ్కారి అధికారుల ధనదాహం, లంచగొండి గురించి జె. రాములు 'పెరటి చెట్టు' నవలలో దృశ్యమానం చేశారు. రంగారావు పంతులు జిల్లా కేంద్రానికి వెళ్తూ రాజా గౌడ్‌ని వెంట తీసుకొని వెళ్తాడు. రంగారావు బంధువైన మెహతీమ్ అబ్కారి అధికారి. ముగ్గురు

కూర్చొని మాటాడుకునే సందర్భంలో ఖర్చులు బాగా పెరిగాయి, రెండు సంవత్సరాలనుండి కారుకొనలేకపోయాను అనడంతో రాజాగౌడ్ ఒక్కసారి తమ పరిధిలోని ఊర్లకు వెళ్తే సగం డబ్బులు వస్తాయంటాడు. "అవన్నీ తానీషా కాలపు మాటాలోయ్! ఇప్పుడు ప్రజలు ఎంతో ముందుకు వచ్చినారు. ఆ లంచాల కాలము పాతబడి పోయిందిప్పుడు. అసలు దొర వెళ్ళితే ఉల్లిగడ్డ కూడా కొనవలసి వస్తుంది నేడు రేపు అన్నాడు మెహత్మీంగారు. ఎందుకు దొరా! పదండి రేపే నేనొక చోటికి తీసుకుపోతాను మీ కారుకు ఎట్లా రూపాయలు రావో చూస్తాముగా అన్నాడు రాజాగౌడు" (రాములు, జి. 1954: 13). తెల్లారి ఉదయమే ఒక గ్రామంలోనికి వెళ్ళి అక్కడ నెంబరు వేయని చెట్లను పట్టుకుంటారు. ఇక్కడ ముస్తాజుదార్లు కొన్ని చెట్లకు పన్ను కట్టి, మిగతావి ఎన్ని ఉంటే వాటికి గీసుకునేవారు. అలాంటి విషయాలు తెలిసిన రాజాగౌడ్ వాటిని బహిర్గతం చేయడంతో అబ్కారి అధికారి కారు కోరిక తీరుతుంది. ఇక్కడ అబ్కారి అధికారి లంచగొండితో పాటు, ముస్తాజుదార్లు ప్రభుత్వానికి చేసే మోసం రెండింటిని స్పృశించరు రచయిత.

న్యాయాన్ని కాపాడాల్సిన పోలీసులు దొరలు, పటేల్లు ఇచ్చే డబ్బులకు ఆశపడి వారివైపు మాట్లాడే, దళితులను హింసించిన సంఘటనలను వేముల ఎల్లయ్య 'కక్క' నవలలో వాస్తవికంగా చిత్రించారు. దళితులైన కక్క, లక్ష్మిల పెళ్ళి సమయంలో పుట్టమన్ను దగ్గర మొదలు ఊరేగింపు వరకు దొర సూదరివాళ్ళను దళితులపైకి ఉసిగొల్పి దళితులను కొట్టిస్తాడు. ఒకసారి దళితులు తిరగబడడంతో దొర పంచాయితిని పోలీసు స్టేషన్‌లో కేసు పెడతాడు. దాంతో ఊరిలోకి వచ్చిన పోలీసు అధికారి కంప్లేయింట్‌లో ఘనేరు సర్పంచెగా అని సంతకం ఉండడం చూసి దొరను అడిగే సందర్భంలో "ముద్రచ్చయో పకీరయ్య అనుంది సంత్కమేమో ఎంకటరెడ్డి అనుంది ఏందయ్యాగిది? గుండెల రాయిపడ్డ పటేలు అమీస్సావ్ సెవ్ల మూతిబెట్టి మూత్బెట్టి ఇంతకు ముందు జెప్పింది మర్సినవా? సచ్చినోడె సర్పంచిగని, గిన్ని నోట్ల కట్టల్దీసి అమీస్సావ్ లాగుల నూకిందు ఊల్లె ఇంతమందికి సెర్పంచి అని దెల్వద ఏంది? ఒక్కన్కి నోర్లేదా? ఏందీ! అన్కున్న అమీన్సావ్ సర్కారోండ్ల మాటలోగీ ఊరు మాద్గులదాయె మజ్జులను వ్వేందయ్య ఎంకటిరెడ్డి? నీ స్తాన్తనమేంది? ఇంకా పైసల్ రాబట్టే దాన్కి తకురాంచి అడ్గిండు అమీస్సాబ్" (ఎల్లయ్య, వేముల. 2000: 80).

దళితుడైన ఫకీరయ్య మనవరాలి పెండ్లి నుండే గొడవలు జరుగుతాయి. గొడవలు జరిపించేది పటేలు దళితులనే చులకన భావం అణిచివేయాలనే ఆలోచన కల్గిన వ్యక్తి పటేలు. దళిత స్త్రీలంతా ఫకీరయ్యను నీ మనవరాలి పెండ్లి వలన గొడవలు అయ్యాయి అనడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుంటాడు. ఆ సందర్భంలో పోలీసు అధికారి అసలు సర్పంచ్ ఫకీరయ్య అనే విషయం తెలిసి దానిని కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్న వెంకటరెడ్డి పటేలు దగ్గర లంచంగా డబ్బులు తీసుకుంటాడే తప్ప అసలు విషయం ఎవరికి చెప్పడు. ఇక్కడ పోలీసు అధికారి చేయాల్సిన పనులు చేయకుండా డబ్బు ఉన్న దొరల దగ్గర లంచంగా డబ్బు తీసుకుని అన్యాయంగా దళితులను హింసించిన సంఘటనలను మన కళ్లముందుంచారు రచయిత.

నక్సలైట్(దళం) ఉద్యమంలోకి వెళ్ళిన వ్యక్తి చనిపోయినపుడు అతని తల్లిదండ్రులను, అత్తమామలను పోలీసులు వేదించడాన్ని 'సంకెళ్ళు తెగాయి' నవలలో ముదిగంటి సుజాతారెడ్డి చిత్రించారు. నారాయణ బావ రాజయ్య బొగ్గుగనుల్లో ఉద్యోగం కోసం మధ్యవర్తులకు డబ్బు ఇచ్చి మోసపోతాడు. తరువాత దళంలో చేరి పోలీసు కాల్పుల్లో చనిపోతాడు. రాజయ్య చనిపోయాకే అతడు దళంలో చేరిన విషయం కుటుంబ సభ్యులకు తెలుస్తుంది. పోలీసులు రాజయ్యకు సంబంధించిన అత్తమామలను వేదించడాన్ని గూర్చి బాలయ్య నారాయణతో చెప్తూ తల్లిదండ్రులను పట్నంకు తీసుకెళ్ళమంటాడు. "ఆల్లు గిక్కడపడే బాధలు చూస్తే ఆల్లు నీతో పట్నంలో వుంటే మేలనిపిస్తుంది. రాజయ్య పోనే పోయిండు. కాని రాజయ్య గురించి అతని స్నేహితులెవరని సుట్టాలెవరనీ! ఆరాలు తీయడానికి పోలీసోళ్ళు వందసార్లు వచ్చిండ్రనుకో పోలీసోళ్ళు ఆని తల్లిదండ్రులను కూడా గది అడిగి గిది అడిగి పాపం! సతాయించుతుండ్రట. మన వూరికి వచ్చి అత్తను మామను చివరకు సక్కంగా సంసారమైనా చేయని పూలమ్మను పోలీసోళ్ళు ఏందో ఏందో అడ్గుతుంటారు. పోలీసోళ్ళు అనేసరికి అత్తమామలు గజగజ ఒనికి పోతుండ్రనుకో! గిదంతా చూస్తుంటే ఆల్లు పట్నంలో వుంటేనే మంచిదని నాకనిపిస్తుంది. అని తన అభిప్రాయాన్ని చెప్పాడు బాలయ్య" (సుజాతారెడ్డి, ముదిగంటి. 1994: 167, 168).

బ్రోకర్ చేతిలో మోసపోయిన రాజయ్య విషయం కుటుంబ సభ్యులకు తెలియదు. పోలీసులు పలుమార్లు వచ్చి వేదించడంతో గ్రామాలలో నివసించే వారికి భయందోళనలు

కల్గి ప్రశాంతంగా ఉండలేరు. సాధారణంగా పోలీసులు ఇంటికి వచ్చారంటే భయం కల్గుతుంది. అలాంటి అనేకసార్లు రావడంతో ఇంకా ఎక్కువ ఆందోళనకు గురవుతారు. చివరకు నారాయణ చదువుకుంటున్న హాస్టల్‌కి కూడా వెళ్తారు. ఇలాంటి సంఘటనలు వృత్తిదారులను భయందోళనలకు గురి చేస్తున్నాయనే విషయాన్ని మన కళ్ళముందుంచారు రచయిత్రి.

అబ్కారి అధికారుల అవినీతిని గీత వృత్తిదారులను వేదించే సంఘటనలను నేరేల్ల శ్రీనివాస్ గౌడ్ 'బతుకుతాడు' నవలలో మనముందుంచారు.

హన్మాజిపేట గీతవృత్తిదారులు మొదటిసారిగా మామూలుకు సంబంధిచిన చలాన్ కట్టడానికి వెళ్తారు. చలాన్ రాసే అధికారి దగ్గరికి వెళ్ళి చలాన్ రాయమని అడుగుతారు. అతను ఆగమని చెప్పి వీరికన్న వెనుక వచ్చిన ఇతర గ్రామాల చలాన్లు రాస్తుంటాడు. "సార్ మాకంటె వెనుక వచ్చిన వాళ్ళకు రాసిత్తరు మాకు రాసిత్త లేరు అడిగాడు వెంకట గౌడ్. వాళ్ళు నెల నెల మాముళ్ళిత్తరు. మాముళ్లంటేంది? అడిగాడూ అర్థం కానట్టు. మీరు మీ ఊళ్లో గంగిరెద్దుల వారికి తుపాకు రామన్నకు పండుగలప్పుడు పైసలిత్తరా...? ఇత్తాం... అది వాళ్ళ సంప్రదాయం. వాళ్ళూ మీకు ఏ పని చేయకపోయిన వాళ్ళకు పైసలిత్తరు... మరి మేము ఎంతో పని చేసినప్పుడు మాకెందుకియ్యరు?! అదేంటి సార్ మీకు గవర్నమెంట్ జీతం ఇస్తుంది కదా....? గవర్నమెంటు జీతం ఇస్తుంది. కాని పండగ ఖర్చులియ్యది" (శ్రీనివాస్ గౌడ్, నేరేళ్ళ. 2004: 119).

అబ్కారి ఆఫీసులో ప్రతి పనికి ఒక రేటు ఉంటుంది అనే విషయం ఇక్కడ స్పష్టమవుతుంది. చలాను రాయడానికి ప్రతి పండుగకు గీతవృత్తిదారులనుండి డబ్బులు వసూలు చేసే విధానం ఇక్కడ కనబడుతుంది. డబ్బులు ఇస్తేనే చలాను రాయడం జరిగింది. ఇలా ప్రభుత్వ కార్యాలయాలు అవినీతికి కేంద్రాలుగా మారాయి అనే విషయాన్ని వాస్తవికంగా దృశ్యమానం చేశారు రచయిత.

గీతకార్మికులు తాటి చెట్టు మీది నుండి పడి వికలాంగులైన లేదా మరణించిన ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుంది. భర్త మరణించిన స్త్రీలు దరఖాస్తు చేసుకుంటే సంవత్సరాలు గడిచిన నష్టపరిహారం అందక, దానికితోడు అధికారుల అవినీతి వల్ల గీతకార్మికులు పడే బాధలను కె. వెంకటేశ్వర్లు 'కల్లు మండువ' నవలలో చిత్రించాడు.

స్వరాజ్యం భర్త వివాహమైన పది సంవత్సరాలకు తాటిచెట్టు మీది నుండి పడి మరణిస్తాడు. ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ఇస్తుందని దరఖాస్తు పెట్టుకుంటుంది. రెండు సంవత్సరాలు దాటినా ఎలాంటి ఫలితం లేకుండా పోతుంది. దాంతో జిల్లా కేంద్రమైన నల్గొండలోని ఆఫీసుకు వెళ్ళి అక్కడ ఉన్న గుమాస్తాను అడుగగా అతను హెడ్ క్లర్క్ వద్దకు తీసుకెళ్తాడు. “సార్.... ఈమెకు అంటుండగానే అర్థమయ్యింది కానీ.... అంటూ నాకున్న ఈ అరచేతిలో దురద ఉట్టిగానే ఎట్లపోతదీ. దీనికి మందో మాకో కావాలి కదా అని అరచేతిని రుద్దుకుంటూ నా విషయం అర్థమయ్యిందనుకుంటా డబ్బులు లేందే పని కాదమ్మ అని చెప్పకనే చెప్పడు హెడ్ క్లర్క్.

స్వరాజ్యానికి గొంతు తడారిపోయింది. గుమస్తా సుగుణమూర్తికి మాత్రం హెడ్ క్లర్క్ అలవాటే అసహ్యంగా అనిపించింది. మనసులోనే ‘పీనుగల మీద డబ్బులేరుకుని తినే బాపతు గాల్లు వీళ్ళేనని చీదరించుకుండు. మణిబాబు! వీళ్ళ ఫైలు ఎంతవరకు వచ్చిందో చూసి పంపించవయ్యా హెడ్ క్లర్క్ అన్నాడు. సార్ బొత్తిగా రెండు రోజుల్నుండి జేబులు ఖాళెగున్నాయి. ఏమన్నా ఇప్పించండి సార్” (వెంకటేశ్వర్లు, కె. 20006: 52). ప్రభుత్వ ఆఫీసులో పనిచేసే అధికారులు అవినీతికి (లంచం) అలవాటు పడి ప్రతి చిన్న పనికి కూడా వారికి డబ్బులు ఇవ్వాల్సిందే లేకపోతే దాని గురించి ఎలాంటి సమాచారం చెప్పరు. స్వరాజ్యం భర్త చనిపోయిన దగ్గర నుండి అతికష్టం మీద తన జీవితాన్ని గడుపుతుంది. ఫైలు చూసినందుకే లంచం ఇవ్వాల్సిన పరిస్థితి. ఎక్స్‌గ్రేషియా డబ్బులు వచ్చినప్పుడు ఎంత ఇవ్వాలో అని అనుకుంటుంది. అవినీతికి, లంచంగొండితనంకు కేంద్రాలుగా మారిన కొందరి ఉద్యోగస్తుల వలన ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందకుండా పోతున్నాయి. ఇలాంటి విషయాలను వాస్తవికంగా స్పృశించారు రచయిత.

ఈ నవలలో ప్రధానంగా ప్రభుత్వ ఉద్యోగులలో ఉండే అవినీతి, లంచం అనేవి వృత్తిదారులను ఇబ్బందులకు గురిచేసిన సంఘటనలు వాస్తవికంగా మనముందుంచారు రచయితలు.

## 4.7. సహకార సంఘాలు

సహకార సంఘాలు వృత్తిదారులకు చేయూతనిచ్చేవి. వారి వృత్తికి సంబధించిన పరికరాల నుండి, ముడి వస్తువులను సబ్సిడీకి అందించడంతోపాటూగా, వారు ఉత్పత్తి చేసిన వస్తువులను సరైన ధరకు అమ్ముకునేలా తోడ్పడేవి. ప్రభుత్వం అందించే సహాయాన్ని నేరుగా వృత్తిదారునికే అందిచేలా సహకార సంఘాలు పనిచేశాయి. అంతేగాకుండా వృత్తిదారులను ఎలాంటి దోపిడిదారులు, భూస్వాములు, దొరలు దోచుకోకుండా వృత్తిదారునికి శ్రమకు తగిన ప్రతిఫలం వచ్చేలా చేశాయి. ఈ సహకార సంఘాలు గౌడ, చేనేత, మత్స్యకార మొదలగు వృత్తులకు సంబంధించి ఉన్నాయి. ఈ సహకార సంఘాల గురించి రచయితలు చిత్రించిన విధానాన్ని పరిశీలిద్దాం.

గీతవృత్తిదారులకు సహాయం అందిస్తున్న గౌడజన సంఘాల గురించి జి. రాములు 'పెరటిచెట్టు' నవలలో దృశ్యమానం చేశారు. "పల్లెటూరిలోని పేద గౌండ్లవారిని జూచినప్పుడు అతనికి ఎంతో జాలికలిగేది. మెల్లమెల్లగా అందరి కులస్థులతో పరిచయము కలిగించుకొన్నాడు. అప్పుడప్పుడు వారి ఇండ్లల్లోఖి వెళ్ళి నాగ్పూర్ ఆ ప్రాంతంలో గౌడజన సంఘాలు ఏపాటై గౌండ్లవారి అభివృద్ధికై ఏ తీరుగా పని చేస్తున్నాయో తెలిపేవాడు. దీనిక్తో అక్కడి గౌండ్లవారిలో ఇంతో అంతో చైతన్యం కలుగుతూ వచ్చింది. మెల్లమెల్లగా చుట్టుపట్ల గ్రామాల గౌండ్ల వారందరికి గూడా పరిచయమయి పోయినాడు బాలగౌడు. కొన్ని దినములకు కొత్తూరిలో 'గౌడజన సంఘం' శాఖనొకదానిని స్థాపించినాడు" (రాములు, జి. 1954: 30, 31). సంఘం ఏర్పాటు ద్వారా గౌడ వారికి కలిగే ప్రయోజనాలలో ప్రధానంగా మస్తాజుదార్ల దోపిడి నశిస్తుంది. అబ్కారి వారి అవినీతి పోయి గౌడవృత్తివారి జీవితాలు బగుపడతాయనే విషయాన్ని మనముందుంచారు రచయిత.

సహకార సంఘాల ఆవశ్యకత గురించి చేనేత వారికి కలిగే ప్రయోజనాల గురించి లోక మలహరి 'సంఘము' నవలలో స్పృశించారు. గ్రూపు ఏజేంట్లు, డిపోవాళ్ళ ద్వారా నూలు సరఫరా జరిగేది. ఈ విధానంలో సరిపడే నూలు లేదని, ఎక్కువ ధర చెప్పడం, అధికారులు తనిఖికి వచ్చినప్పుడు ఖర్చు అయిందని, వివిధ రకాల సాకులు చెప్పి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేసేవారు. దాంతో చేనేత కార్మికుడికి ఫలితం లేకుండా

పోయిద్ది. ఇలాంటి వాటిని వ్యతిరేకిస్తూ సహకార సంఘాలు వచ్చాయి. "అయ్యో! నీవు చేనేత పారిశ్రామిక సోదరుడవా? నాయినా! అట్లా నిరాశ పీడితుడవు గావద్దు సుమా! మా వెంట నడూ! మేం గూడా చేనేత సహకార సంఘానికే పోతున్నాము. ఏం సంఘమో! సంఘాలేమైనా అన్నం పెడతారా, గుడ్డలిస్తారా ప్రపంచంలో సానుభూతి అనేది చచ్చిపోయిందని ఏడుస్తున్నారు.

లేదు నాయినా! సానుభూతి చావలేదు. మన జాతి సానుభూతిపరుల ప్రయత్నాల చేతనే క్రొత్తగా చేనేత పారిశ్రామిక సహకార సంఘాలు స్థాపించబడ్డాయి. వాని ద్వారా నీవనే పిశాచాల అఘాయిత్యాలు భస్మమై పోతాయి. ఇక మనం క్రమంగా బాగుపడే సూచనలు కనిపిస్తున్నాయి" (మలహరి, లోక. 2017: 53). డిపోదార్ల దోపిడి వలన నష్టపోయిన చేనేత కార్మికులకు నేరుగా నూలు అందించడం కోసం ఏర్పాటు చేసుకున్నవి సహకార సంఘాలు. వృత్తి పరికరాలను కూడా సరసమైన ధరలకు అందిస్తాయి. ఈవిధంగా ఎలాంటి దోపిడిలేని చేనేత వృత్తిదారులకు చేయూతనిచ్చే సహకార సంఘాల గురించి వాస్తవికంగా దృశ్యమానం చేశారు రచయిత.

చేనేత వృత్తికి సంబంధించిన సహకార సంఘం గురించి ముదిగంటి సుజాతారెడ్డి 'సంకెళ్ళు తెగాయి' నవలలో చిత్రించారు. "మా ఊర్లో రామయ్య అని హుషారు పోరడు ఉన్నాడు. ఆడు కో ఆపరేటివు దుకణం పెడ్త నంటున్నడు. సూడాలి ఎట్ల నడుస్తదో అని దానయ్య చెప్పుకోచ్చాడు.

అవునయ్యా! యువకులైనా ఇటువంటి పనులు చేయడానికి ముందుకు రావాలి. ఇటువంటి కో ఆపరేటివ్ దుకాణాలు పెట్టుకుంటే మీరు చేసే పని మధ్య దళారీలు దోచుకోఖుండా సరైన డబ్బు మీకు దొరుకుతుంది" (సుజాతారెడ్డి, ముదిగంటి. 1994: 114). నారాయణతో పాటుగా వారి గ్రామానికి వెళ్ళిన అనల అక్కడ చేనేత కార్మికుడితో మాట్లాడినప్పుడు, వారు మధ్యదళారీలతో ఎంత మోసపోతున్నారనే విషయం తెలుస్తుంది. ఆ గ్రామ యువకుడు సహకార సంఘం పెట్టే ప్రయత్నంలో ఉన్నాడని తెలిసి సంతోషిస్తుంది. ఇక్కడ కూడా సహకార సంఘాల ఆవశ్యకతను వాస్తవికంగా మనముందుంచారు రచయిత.

గీతవృత్తికి సంబంధించిన సహకార సంఘాల గురించి, అవి అందించే ఫలాల గురించి నేరేళ్ళ శ్రీనివాస్ గౌడ్ 'బతుకుతాడు' నవలలో చిత్రించారు. గంగరాజం గౌడ్, శ్రీనివాస్ గౌడ్ ఇద్దరు మల్లేశం గౌడ్ దగ్గరికి వెళ్ళి వారి గ్రామానికి మామూల చేయించుకోవాలని అని అడిగినప్పుడు గీత పారిశ్రామిక సహకార సంఘం గురించి వారికి చెప్పుతాడు. "ఆ సంస్థ ఉద్దేశం గీత కార్మికుల సహకార సంఘంలోని సభ్యులను ఆదుకునేందుకు వారికి ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు ఋణాలు ఇవ్వడం, ప్రమాదవశాత్తు తాటిచెట్టుపైనుండి పడిపోయిన సందర్భంలోను లేదా గాయపడిన సమయంలోను ఆ గీత కార్మికుని కుటుంబాన్ని ఆదుకొనేందుకు కొంత మొత్తం ఆర్థిక సహాయం ఆ సంస్థ అందిస్తుంది. అలాగే సంఘంలోని సభ్యులందరు కలిసి తాటిచెట్లు, ఈతచెట్లు పెంచుకోవడానికి నేరుగా ఆయా గీతకార్మిక సంఘాలకే నిధులు కేటాయిస్తుంది. అయితే ఆ సంస్థ నుంచి లబ్ధిపొందాలంటే అందులో సభ్యత్వం పొందాలి" (శ్రీనివాస్ గౌడ్, నేరేళ్ల. 2004: 95).

ఈవిధంగా సహకార సంఘంలో సభ్యత్వం కలిగి ఉంటే పొందే ప్రయోజనాలు వివరణాత్మకంగా చెప్తాడు మల్లేశం గౌడ్. శ్రీనివాస్ గౌడ్ గ్రామంలోని ఆరుగురికే సభ్యత్వం ఉందని, అందులో ఇద్దరు చనిపోయారని, మిగిలిన నలుగురు వృద్ధులు కావునా ముందుగా గీతకార్మికులు సంఘంలో సభ్యత్వం తీసుకుంటే మంచిదని, తరువాత మాములా చేసుకోవచ్చని చెప్తాడు. ఇలా సహకార సంఘాల ఆవశ్యకతను మనకళ్ళముందుంచాడు రచయిత.

చేనేత వృత్తిలో సహకార సంఘాలు అందించే సహాయాన్ని గురించి కాలువ మల్లయ్య 'గువ్వల చెన్న' నవలలో వివరించారు. "చేనేత సహకార సంఘాల వల్ల మనవాళ్లు కొంత అభివృద్ధి చెందారు. వీటికి ఆద్యులుగా గుంటుక నరసయ్యగారిని చెప్పుకోవచ్చు" (మల్లయ్య, కాలువ. 2005: 107). చిప్పమల్లయ్య చనిపోయిన తర్వాత శంకరయ్య ఏర్పాటు చేసిన సభలోని వక్తలు మాట్లాడే సందర్భంలో వృత్తిలో పోటీ గురించి, ప్రపంచీకరణ ప్రభావం, కుల సమస్యల గురించి చర్చిస్తున్నప్పుడు ప్రపంచీకరణ ప్రభావంతో చేతి వృత్తుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని, ఈ సమయంలో సహకార సంఘాలు అనేవి చేనేతకారుల అభివృద్ధికి తోడ్పడుతున్నాయి అనే విషయాన్ని కొక్కుల భాస్కర్

చెప్తాడు. ఈవిధంగా సహకార సంఘం అవసరం ఎంతైనా ఉన్నదనే విషయాన్ని వాస్తవికంగా స్పృశించారు రచయిత.

గీతవృత్తి మీద జరుగుతున్న దోపిడీలను నిర్మూలించే క్రమంలో అనేక పోరాటాలు చేశారు, విజయాలు సాధించారు. ఈ పోరాట క్రమంలో సాధించిన విజయాల గురించి కె. వెంకటేశ్వర్లు 'కల్లు మండువ' నవలలో చిత్రించారు. "దున్నేవారికి భూమి కావాలనే నినాదంతో పాటు గీసేవానికే చెట్టు కావాలని మహత్తర పోరాటాలు, త్యాగాలు చేయడం ద్వారా గీసేవానికే చెట్టు సాధించుకోగలిగాము. ఇది ఆంధ్రప్రదేశ్ అవతరణకు ముందు విషయం. జిల్లా స్థాయి వేలంపాటలను రద్దు చేసి గ్రామస్థాయి వేలంపాటలు పెట్టాలని పోరాడాము. గ్రామస్థాయి వేలంపాటలను సాధించుకోగలిగాము. 'హక్కే మాలిఖనను విపరీతంగా పెంచితే తగ్గించాలని నిరసనగా సదస్సులు, ధర్నాలు, ప్రదర్శనలు నిర్వహించాము. హక్కే మాలిఖనను తగ్గించుకోగలిగాము. 1959వ సంవత్సరంలో బకాయిల సమస్యమపై ప్రభుత్వం గీతకార్మికుల పట్ల ఒకరకంగా, కాంట్రాక్టర్లకు మరోరకంగా వ్యవహరిస్తున్న తీరుపట్ల, ద్వంద్వవైఖరిపై పోరాటాలు జరిపాము. ప్రభుత్వ ద్వంద్వవైఖరిని ఎండగట్టగలిగాము. అనేక గ్రామాలను పెద్ద గ్రూపుగా చేసి వేలంపాటలు నిర్వహించి ప్రభుత్వం బడా కాంట్రాక్టర్లకు ఈ కల్లు దుకాణాలను కట్టబెట్టే పద్ధతిపై యుద్ధం ప్రకటించాం. కాంట్రాక్టర్ల మోసాలను తిప్పికొట్టాం. గీతకార్మికులకే దుకాణాలు కావాలని.... గ్రూపు పద్దతిని రద్దు చేయాలని పోరాడాం. సొసైటీలు కావాలన్నాం. గ్రూపు పద్దతిని రద్దు చేయించి, గ్రామ సొసైటీలను సాధించుకోగలిగాం" (వెంకటేశ్వర్లు, కె. 2006: 56).

గీతకార్మికులు నాటి వెట్టి విధానంలో దొరలకు కల్లుపోసే దగ్గరి నుండి వేలంపాటలు, ముస్తాజుదార్ల దోపిడిని, గ్రూపు పద్ధతులపై పోరాటంచేసి చివరకు సహకార సంఘాలను సాధించారు. ఇక్కడ వీరి పోరాటంలో అంతిమంగా సహకార సంఘాలు గీత కార్మికులకు ఎంతో మేలు చేస్తున్నాయి. కావున వాటిని సాధించారు అని చెప్పవచ్చు. సహకార సంఘాల ప్రాధాన్యత గుర్తించిన గీతకార్మికులు వాటిని సాధించిన విధానాన్ని వాస్తవికంగా దృశ్యమానం చేశారు రచయిత.

ఈ నవలల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన విధానాలు, గతంలో ఉన్న దోపిడి వర్గాల నుండి వృత్తిదారులకు మేలు కలగజేసినవిగా సహకార సంఘాలను పేర్కొన్నారు

రచయితలు. ఈ నవలల్లో ప్రధానంగా గౌడ, చేనేత వృత్తికి సంబంధించిన నవలలు మాత్రమే సహకార సంఘాల గురించి చిత్రించాయి.

ఈ నవల్లల్లో దొరల దోపిడి, కాంట్రాక్టర్ల దోపిడి నుండి వృత్తిదారులను రక్షించినవి సహకార సంఘాలు. అందుకే రచయితలు సహకార సంఘాల ఆవశ్యకతను గూర్చి వాస్తవికంగా స్పృశించారు.

## 4.8. విద్యావ్యవస్థ

విద్య అనేది ఏ జాతి అయినా, సమూహమైనా అభివృద్ధి చెందడానికి అవసరం. నేటి ఆధునిక సమాజంలో వస్తున్న మార్పులను, జరిగే సంఘటనలను అవగాహన చేసుకోవడానికి విద్య ఎంతైనా అవసరం. సమానత్వాన్ని సాధించడానికి, నూతన అంశాలను వినియోగించుకోడానికి విద్యను మించిన సాధనం మరొకటీ లేదు. నిర్బంధ రాజరిక వ్యవస్థలో పరాయి దేసస్తుల పాలనలో దేశం అభివృద్ధి చెందదని దానికి పరిష్కారం స్వాతంత్ర్యమేనన్న వివేచను కల్గించి ముందుకు నడిపి బానిస సంకెళ్ళు తెంపినది కూడా విద్యయే. డా.బి.ఆర్. అంబేద్కర్ ప్రపంచంలోని అన్ని రాజ్యాంగాలను క్షుణ్ణంగా చదివి భారత రాజ్యాంగాన్ని రాశారు. ఈ రాజ్యాంగం దేశంలోని పీడిత, వెనుకబడి సమాజాన్ని అభివృద్ధికి దోహదం చేసేదిగా ఉంది. అంతేగాకుండా నేడు 14 సంవత్సరాలలోపు విద్యార్థినివిద్యార్థులకు నిర్బంధ విద్యను అమలు చేస్తుంది. విద్య యొక్క ప్రాముఖ్యతను నవలా రచయితలు చిత్రించిన విధానాన్ని పరిశీలిద్దాం.

స్త్రీ విద్య ఆవశ్యకతను గురించి లోక మలహరి 'సంఘము' నవలలో చిత్రించారు. డా. జోగేంద్ర, దుర్గాప్రసాద్ ఇద్దరు మిత్రులు. దుర్గాప్రసాద్ పద్మశాలీల కుటుంబాల పరిఇస్థితులను మెరుగు పర్చడానికి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుంటాడు. వాటి గురించి జోగేంద్రతో చర్చించే సందర్భంలో స్త్రీవిద్య అవసరమని జోగేంద్ర అన్నప్పుడు "అయ్యో డాక్టర్! తామింకా నిద్రయందే ఉన్నారూ? మొన్నటి మహిళా సమావేశంలో స్త్రీ విద్యావశ్యకతను గురించి గొప్పగొప్ప ఉపాన్యాసాలైనాయి. అందు శ్యామలాదేవి, ఉషాదేవి ఉపన్యాసాలు చాలా బాగున్నాయి. ఈ ప్రజాస్వామ్య ప్రభుత్వకాలంలో ప్రతి యువతీ

యువకులు ఓటు విలువను గ్రహించి సరియైన విధంగా వ్యయం చేసే కొరకు స్త్రీపురుషులంతా విద్యాధనాన్ని సంపాదించాలి. యువతీయువకులు కూడా తీరిక సమయాల్లో కొంత విద్యనార్జిస్తే రాబోవు సంతానం కూడా విద్యాఫలవంతమై ఉంటాదని తెలిపినారు" (మలహరి, లోక. 2017: 51).

విద్యయొక్క విలువను అందులో స్త్రీవిద్య గురించి చర్చించిన విధానం బాగుంది. విద్య ద్వారా ఓటు విలువ తెలిసి సరైన నాయకుడిని ఎన్నుకోగల జ్ఞానం కలుగుతుందనే విషయాన్ని స్పష్టం చేశారు. అంతేగాకుండా విద్యతో భవిష్యత్ తరాలు కూడా అభివృద్ధి పథంలోకి వస్తాయనే విషయాలను వాస్తవికంగా దృశ్యమానం చేశారు రచయిత.

విద్య అభ్యసించకపోతే కలిగే, ఛిద్రమైన జీవితాలతోపాటు, జీవితాన్ని సరైన మార్గంలో నడిపించుకోల్గిన వ్యక్తులను మాదిరెడ్డి సులోచన 'సుషుప్తి' నవలలో చిత్రించారు. బాలయ్య, ఎంకమ్మలకు ఒక్కడే కొడుకు. పేరు గోవిందు. స్కాలర్‌షిప్ వస్తుందని బడికి పంపుతారే కాని అతని గురించి పట్టించుకోరు. బజార్లో మాస్టారు కనిపించి "ఏం బాలయ్యా, కురాడి సంగతి బొత్తిగా పట్టించుకోవేం? రోజూ సాయంకాలము మార్నింటికి పంపదయ్యా అనేవాడు. సదువుకుని ఊల్లు ఏలాలా, ఉద్యోగం సేయ్యాలా? మాపని ఉంఇ. వాడొక్కడు బతక్కపోడు అనేవాడు. బాలయ్యే కాదు, ఆయనలాంటి యెందరో కులవృత్తి అంటూ అవకాశాలు ఉన్నా వినిపించుకోలేదు" సులోచన, మాదిరెడ్డి. 2017: 15).

వృత్తులకు ఉపాధి ఉన్నకాలంలో విద్య అవసరం లేదని భావించారు. ప్రపంచీకరణ ప్రభావంతో వృత్తిని కోల్పోవడంతో బతకడం కూడా కష్టమవుతుంది. గోవిందుకు జీవితంపట్ల, సమాజంపట్ల అవగాహన లేకపోవడంతో చివరకు తన జీవితమే ఛిద్రం చేసుకుంటాడు. అదే విద్యనభ్యసిస్తే ఆ పరిస్థితి తెచ్చుకోకపోవునేమో. ఇదే నవలలో విద్యావంతురాలైన టీచరు ఉద్యోగం చేస్తున్న దేవకి, తన పెళ్ళి కొంత ఆలస్యంగా చేసుకుంటుంది. దానికి కారణం అడుగగా "ఎందుకు ఆలస్యంగా పెండ్లి జేసుకుంటున్నారు. వారికో చెల్లెలుందిరా, ఆమెది మొదట కావాలన్నారు. ఆ తరువాత ఆయన ఆరునెలలు ట్రైనింగ్‌కు వెళ్లారు. నీ జీతం సరిపోదా? ఒహూ. అన్నే ఒక పెఅణాళిక, పద్ధతి ప్రకారం నడువాలంటారు ఆయన అన్నది సిగ్గుపడుతూ" (సులోచన, మాదిరెడ్డి. 2017: 80). ఇక్కడ విద్యవలన ఉద్యోగమే కాదు జీవితంలో ఎలా బతకాలనే ఒక ప్రణాళికను వేసుకొని,

ఎలాంటి ఇబ్బందులు ఎదురుగాకుండా ఉండేలా ఆలోచించారు. గోవిందు, దేవకి జీవితాలలో జరిగిన సంఘటనలే విద్యయొక్క ప్రాముఖ్యతను తెలుపుతాయి. ఈవిధంగా రచయిత్రి వాస్తవికంగా దృశ్యమానం చేశారు.

క్షురక వృత్తికి చెందిన కుటుంబం నుండి వచ్చిన వ్యక్తి విద్య ద్వారా ఉన్నత స్థాయికి ఎదిగిన పరిణామ క్రమాన్ని ముదిగంటి సుజాతారెడ్డి 'సంకెళ్ళు తెగాయి' నవలలో చిత్రించారు. నారాయణ తండ్రి వీరయ్య క్షురక వృత్తి చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. నారాయణ విద్య పట్ల ఆసక్తితో ఉన్నత చదువులు చదువుతాడు. వేద ప్రకాష్ సార్, అనల ప్రోత్సాహం వల్ల సివిల్స్‌కి ప్రిపేర్ అవుతాడు. పరీక్ష ఫలితాలు వెలువడే సందర్భంలో "చివరకు ఫలితాలు ప్రకటింపబడినాయి. నారాయణ పేరు ఐ.ఎ.ఎస్.కు సెలెక్టు అయిన వాళ్ళ లిస్టులో వుంది. నారాయణ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి" (సుజాతారెడ్డి, ముదిగంటి. 1994: 184). వృత్తిదారుని కుటుంబం నుండి వచ్చిన వ్యక్తి క్రమశిక్షణతో, ఆసక్తితో విద్యను అభ్యసించి చివరకు ఐ.ఎ.ఎస్.కు ఎదగడం జరుగుతుంది. విద్య అనేది మనిషికి జ్ఞానంతోపాటు ఉన్నత స్థాయిని కల్పిస్తుందని వాస్తవికంగా స్పృశించారు రచయిత్రి.

నిరక్షరాస్యత కారణంగా దళితులను మోసగించిన సంఘటనలను వేముల ఎల్లయ్య 'కక్క' నవలలో దృశ్యమానం చేశారు. దళితుడైన ఫకీరయ్య ఆ గ్రామ సర్పంచ్ అనే విషయం అతనికి తెలియదు. రిజర్వేషన్ ప్రకారం దళితులకు అవకాశం వస్తుంది. ఆ ఊరి పటేలు వెంకటరెడ్డి ఫకీరయ్య వేలిముద్ర వేయించుకొంటాడు. కాని విషయం చెప్పకుండా తానే సర్పంచిగా గ్రామ వ్యవహారాలు చూసుకూంటాడు. ఫకీరయ్య మనవరాలి పెండ్లి సమయంలో జరిగిన గొడవల కారణంగా పోలీసు అధికారి వచ్చినప్పుడు "గిదంతెందె నాజరన్న? నన్ను సర్పెంచి అంటుంద్రు పిరాద్జేసిండంటుర్రు గదంత నాకుదెల్వదు. పటేలైతే ఏల్ గుద్దిచ్చిండు. తెల్లకాయితంల నాకు దెల్వదు పటేలు గింత జేపన్జేస్తాడే నమ్మికం గుంటె మావోల్లనే గొట్టిచ్చె పటేలు తిరిగి నాతోనె పిరాజ్జేయ్యించె. గా పంచాతి మా పోరగాల్ల పెండ్లినాడె అయ్యింది. గిది నాయమైతద నాజరన్న?" (ఎల్లయ్య, వేముల. 2000: 72)

ఇక్కడ దళితుడైన ఫకీరయ్య నిరక్షరాస్యుడు కావడంతో అతనితో వేలిముద్ర వేయించుకొని దళితుల మీద కేసు పెడతాడు పటేలు. కనీసం సర్పంచ్ అనే విషయం

తెలియదు ఫకీరయ్య. నిరక్షరాస్యులైన దళితులను పటేల్లు ఏ విధంగా మోసం చేస్తున్నారనే దానిని వాస్తవికంగా చిత్రించాడు రచయిత.

చేనేత కుటుంబాలలో విద్యా వ్యాప్తి గురించి కాలువ మల్లయ్య 'గువ్వల చెన్నా' నవలలో చిత్రించాడు. చిప్పమల్లయ్యకు ముగ్గురు కుమారులు. చేనేత వృత్తి ఆధారంగా జీవిస్తుంటారు. మొదటి ఇద్దరు చేనేత వృత్తి చేస్తుంటే చిన్నకొడుకు శంకరయ్య చదువుకుంటాడు. శంకరయ్య వారి కుంటుంబ పరిస్థితులపై అవగాహన కల్గి వుంటాడు. "తల్లిదండ్రుల మాటల్లోన్ని విషాదాన్ని, ఆత్మీయయతను శ్రద్ధగా వింటున్నాడు శంకరయ్య, క్రమక్రమంగా నేత పనులు కొంతకొంతగా దెబ్బతినడం గమనిస్తూనే ఉన్నాడు. చేనేత ఇతర సహకార సంఘాల పేరు మీద కొందరు తెల్లబట్టలవాళ్ళు తయారు కావడమూ చూస్తున్నాడు. ఆ సొమ్మును కొందరు తింటూ పైకొస్తున్నారని అనుకోవడమూ వింటున్నాడు. తాను చదువుకొని కుంటుంబ గౌరవాన్ని పెంచాలని, ఆర్థిక పరిస్థితిని బాగుపరచాలని తనలో తానే అనుకుంటున్నాడు శంకరయ్య" (మల్లయ్య, కాలువ. 2005: 25).

చేనేత వృత్తిదారుల కుటుంబంలోని విద్యార్థి తన కుటుంబ పరిస్థితులను, వృత్తిలో తల్లిదండ్రులు పడుతున్న బాధలను చూసి తను చదువుకొని స్థిరపడి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలనే ఆలోచనల్ని కల్గించింది కుటుంబం. తరువాతి కాలంలో శంకరయ్య ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం సంపాదించి స్థిరపడతాడు. అంతేగాకుండా ఆధునిక భావజాలాన్ని కలిగి అందరికి సహాయం చేసే వ్యక్తిగా ఎదుగుతాడు.

### 4.౨. సాంస్కృతిక సంబంధాలు

మానవుడు సంఘజీవి. సంఘంలోని అలవాట్లు, ఆచార వ్యవహారాలను అనుకరిస్తూ జీవనం సాగించడమే సంస్కృతి. సంస్కృతిని ఆంగ్లంలో 'Culture' అనే పదానికి సమానార్థకంగా వాడుతున్నారు. నేటి వ్యవహారంలో సంస్కృతి, సంప్రదాయం, నాగరికత అనే మూడు పదాల్ని ఇంచుమించు ఒకే అర్థంలో వాడుతున్నారు. సంస్కృతిని ఒక రకంగా జాతి సర్వతోముఖ ఔన్నత్యంగా కూడా గ్రహించవచ్చు. అంటే ఒక జాతి వైజ్ఞానిక, నైతిక

ప్రగతిని నిరూపించే సమయాలు, సంప్రదాయాల సమాహార స్వరూపాన్నే సంస్కృతిగా చెప్పవచ్చు. ఇదే అంశాన్ని టేలర్ "సమాజంలోని ఒక సభ్యునిగా మానవుడు సంపాదించిన తెలివి, నమ్మకం, కళ, నీతులు చట్టం, ఆచారం, అలవాట్లు, శక్తి సామర్థ్యాలతో కూడిన ఒక మిశ్రమ సమస్తమే సంస్కృతి" (పద్మావతి, కె. 1990: 6) అని తెలిపాడు. ఈ నిర్వచనం ఆమోదయోగ్యమైందిగా ఉంది. అంటే ఈ సంస్కృతి సమాజం యొక్క ఆచార వ్యవహారంలోనూ, వేషభాషలలోనూ, భౌతిక జీవనంతో ముడిపడి ఉంటుందని తెలుస్తుంది. సంస్కృతికి సంస్కరింపబడేది, అమర్చుకునేది, నిత్యనూతనత్వాన్ని పొందేది అనే అర్థాలు కూడా నేడు ప్రాచుర్యంలో ఉన్నాయి.

ప్రపంచ దేశాలను పరిశీలించినపుడు ప్రతిదేశం తనదైన సంస్కృతిని కలిగి ఉంటుంది. కేవలం వేషధారణ, ఆచార వ్యవహారాలే కావు, ప్రజల యొక్క సంపూర్ణ జీవన విధానమే సంస్కృతి. సమస్త మానవ సంబంధాల సారమే సంస్కృతి. ఈ సంస్కృతి సంఘంతో ముడిపడి ఉంటుంది. మానవుడు సాంఘిక, ఆర్థిక రంగాలలో కొన్ని కట్టుబాట్లు నిర్ణయించుకొని ఒక ప్రత్యేకమైన వ్యక్తిత్వంతో సమాజంలో జీవిస్తాడు. ఈ సమాజంలోని వివిధ వృత్తుల ఆచార వ్యవహారాలను, పండుగలు మొదలైన అంశాలను ఈభాగం కింద విశ్లేషించడం జరిగింది.

### 4.౨.1. వివాహం

సమాజంలో వివాహానికి ప్రముఖ స్థానం ఉంది. స్త్రీపురుషులిద్దరినీ జీవితాంతం కలిపే పవిత్రమైన బంధమే వివాహం. ఇంతటి పవిత్రమైన వివాహం గురించి విద్యాచౌహాన్ గారు 'సృష్టి వికాసానికి ఒక ధార్మిక సాధనమే కాని కేవలం శారీరక వాంఛలను తీర్చుకోవడమే కాదు' అంటారు. కావున స్త్రీపురుషుల మధ్య సన్నిహిత సంబంధాన్ని నెలకొల్పడమే వివాహం ప్రధాన లక్ష్యం. వధువు, వరుడు గృహస్థాశ్రమాన్ని స్వీకరించి ధర్మార్థకామమోక్షాలను సాధిస్తారు. అందుకే వివాహాన్ని షోడశ సంస్కారాల్లో ముఖ్యమైందిగా భావిస్తారు. వివాహ వరుని గృహానికి వధువు వెంట తీసుకొని పోవు తంతునే వివాహం అనవచ్చు.

పూర్వకాలం నుండి వివాహం ఉన్నత భావాన్ని కలిగి ఉంది. వివాహ సందర్భాలల్లో జరిగే ఆచార సంప్రదాయాలను పాటించడం నేటికి కొనసాగుతూనే ఉంది. ఇంతటి ప్రాముఖ్యతగల వివాహ ఆచార సంప్రదాయంలో వృత్తులకు కూడా ప్రముఖ స్థానం కల్పించారు. వివాహ తంతు అవసరానికి తగినట్లుగా వృత్తులకు స్థానాన్ని కేటాయిస్తూ వివాహాలు జరగడం నేటికి మనం గమనిస్తూనే ఉన్నాం. వివాహ ప్రారంభం నుండి ముగింపు వరకు వృత్తుల ప్రస్థానాన్ని గమనిస్తే ఇంటిని శుభ్రం చేయడం, సున్నం వేయడం, పెండ్లి పత్రికలు పంచేవారు రజకులు. పెండ్లిలో మైలపోలు రాయడం, గోళ్ళు తీయడం, ఇంట్లో తోరణాలు కట్టేవారు మంగలులు. కంసాలి వాళ్ళు పుస్తెలతాడు, ఇతర ఆభరణాలు తయారు చేస్తారు. పెండ్లి వేడుకలో పెళ్ళికూతురి మెట్టెలు సరిచేయడం లాంటి పని చేస్తారు. ఈవిధంగా వివిధ వృత్తికారుల సహకారంతో వివాహం జరుగుతుంది.

వివాహ వేడుకలో పెళ్ళికూతురుకి కడియాలు, దిద్దులు మెట్టెలు పెట్టడంలో ఉండే కంసాలి పాత్రను మాదిరెడి సులోచన 'సుషుప్తి' నవలలో చిత్రించారు. "ఇదిగో సొమ్ములు బాలయ్య దిద్దులు, కడియాలు అందించాడు. ఆమె తృప్తిగా తల పంకించింది. చెవులకు దిద్దులు పెడుతుంటే అమాయి కెవ్వమంది. ఉండే పిల్ల కసురుకుందో ముసలమ్మ. కడియాలు సాగదీసి కాళ్ళకు పెట్టాడు అగళసూత్రం తెచ్చిన కంసలి" (సులోచన. మాదిరెడ్డి. 2017: 32). ఈవిధంగా వివాహ సమయంలో కంసాలి పాత్రను గమనించవచ్చు. ఇది పూర్వకాలం నుండి వస్తున్న ఆచారంగా చెప్పవచ్చు. ఈ సందర్భంలో కంసాలికి కొంత డబ్బు కట్నంగా ఇస్తారు. బియ్యం, కుడుక కూడా ఇస్తారు.

వివాహంలో మంగలివారి, కుమ్మరి వారి పాత్రను గురించి వేముల ఎల్లయ్య 'కక్క' నవలలో స్పృశించారు. "దెబ్బలు మర్సి దప్పు సాటింపు జేసింద్రు అవిరేని కుండల్దెచ్చి ఇంట్ల బెట్టింద్రు మంగలి పోశాల్ని బిల్సి మైలపోలు రాయించి పిల్లను పిలగాన్ని పొరన్కి బావొర్సైనోల్లు ఎవ్వరన్న ఉంటే ముగ్గుర్ని రమ్మన్నడు మంగలి పోశాలు. బావలేడ్లని తాతొర్సకు నేవున్న అని ఒక ముసలోడొచ్చిండు. ముగ్గురు మైలపోల్మీద గూసుంద్రు. మంగలి పోశన్న మైలపోలు దీసి గవన్ని గింజల్ని రుమాల్లుగ్డల మూట గట్టుకుండు" (ఎల్లయ్య, వేముల. 2000: 63). ఈ నవలలో కుమ్మరి పాత్రను సూచనప్రాయంగా తెలిపాడు రచయిత. అంతేగాక మంగలివారు వివాహంలో మైలపోలు రాయడంవంటి

కార్యక్రమాన్ని మనముందుంచారు రచయిత. ఈవిధంగా కుమ్మరి, మంగలి వృత్తులవారు వివాహంలో పని చేసే ఆచారాలను స్పృశించారు రచయిత. ఈ ఆచారాలు ప్రాచీన కాలం నుండి వస్తున్నాయి. ఇందులో ఏదేని లోపం జరిగితే వధూవరులకు ఏదైనా విపత్తు జరుగుతుందో అని ఇప్పటికీ ఇలాంటి కార్యక్రమాలు జరుగుతుండడం గమనిస్తుంటాం. దీనికి అనుగుణంగా రచయితలు వివాహంలో వృత్తుల ప్రాముఖ్యతను వివరించడమే గాక, వాటి గౌరవాన్ని, పవిత్రతను ఇనుమడింపజేసిన విధానం పేర్కొనదగింది. ఇతర నవలలో వివాహం అనేది కులాంతర వివాహాలుగా, ఆదర్శప్రాయంగా దండలు మార్చుకునే స్టేజి వివాహాలుగా 'సంఘము', 'సంకెళ్ళు తెగాయి' 'గువ్వల చెన్నా' 'మోహిని' నవలలో చిత్రించారు రచయితలు. నేటి ఆధునిక కాలంలో వస్తున్న మార్పులకు ప్రతిరూపంగా ఈ నవలలు కనబడతాయి.

### 4.౨.౨. పండుగలు

మానవుడు ప్రతి దినం కాలంతో పోటీపడుతూ మానసికంగా, శారీరకగా శ్రమిస్తూ తన మనుగడ కొనసాగించడం జరుగుతుంది. ప్రతిరోజు చేసే శ్రమకు మధ్యలో ఆటవిడుపు కలిగినప్పుడే మరింత ఉత్సాహం కల్గి తన పనిని మరింత ఉత్సాహంగా చేసుకోగలుగుతాడు. ఆ ఉద్దేశ్యంతోనే కొన్ని ప్రత్యేక సమయాలు, సందర్భాలు పెట్టుకొని వాటిని 'పండుగలు' అని పేరు పెట్టుకున్నాం. వాటిని మన సంస్కృతి సంప్రదాయాల్లో మిళితం చేసుకొని ఆయా సందర్భాల్లో వాటిని ఆచరిస్తూ మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటూ ఆయా పండుగల ఆనందాలు అనుభవిస్తున్నాం. "తరతరాలుగా జన సమూహంలో నిల్చి ఉన్న నమ్మకాలు, సంప్రదాయాలు క్రియా రూపాన్ని దాల్చగా పండుగలేర్పడ్డాయి. మొదట ప్రకృత్యారాధనగా ప్రారంభమై, వ్యవసాయ సంస్కృతికాలంలో స్పష్టమైన రూపాన్ని పొంది, తర్వాతికాలంలో ఇంకా క్లిష్ట స్వరూపం సంపాదించి, చివర ప్రాచీన ఆచారల సూచ్యగుణాన్ని మాత్రం కలిగి ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని కలిగించేవిగా పండుగలు రూపొందాయి" (సుందరం, ఆర్వియస్. 2004: 296) అని పండుగ గురించి అభిప్రాయపడ్డారు.

ఏ ప్రాంతంలో నివసించే వారైనా వారివారి ప్రాంతాలకనుగుణంగా వారి సంప్రదాయాల ప్రకారం పండుగలు జరుపుకుంటారు. పండుగలు వేరైనా పరమావధి ఆనందం మాత్రమే.

వినాయకచవితి భాద్రపద శుక్ల చతుర్దశి నాడు ప్రారంభమై, చవతిరోజు (తొమ్మిదోరోజు) నిమజ్జనంతో ముగుస్తుంది. ఇది పెద్ద పండుగగా దేశం మొత్తం చేసుకుంటున్నారు. ఈ పండుగకు చేనేత కుటుంబాలలో ప్రాముఖ్యతను కాలువ మల్లయ్య 'గువ్వల చెన్నా' నవలలో చిత్రించాడు. "మనకు పెద్ద పండుగ ఇగో గీ వినాయకచివితే. ఇయ్యాల మనం మన పనిముట్లన్ని కడుగాలె. వినాయకుని దగ్గర పెట్టాలె. దండం బెట్టాలె. వినాయక పూజ చెయ్యాలె. మనకులపోల్లదమేమో జోరుదారుగ వినాయక చవితి పండుగ జేసుకుంటుంటే నువ్వేమో బతుకమ్మ పాట పాడవద్దివే నవ్వుతూ అన్నాడు చిప్పమల్లయ్య. మగ్గం విప్పుతున్నాడు ఆ పనిముట్లు తీసుకెళ్ళి బతుకమ్మ వాగులో కడుక్కొని రావడానికి సిద్ధం చేస్తున్నాడు. తమకు అన్నంబెట్టె పనిముట్లను శుభ్రం చేసి పూజించడం ఆ పండుగ ప్రత్యేకత" (మల్లయ్య, కాలువ. 2005: 43, 44). వినాయక చవితి పండుగ రోజున పద్మశాలీలు (చేనేత) కుటుంబాల వారు, వారి వృత్తి పనిముట్లను శుభ్రపరిచి వినాయకుని దగ్గర పెట్టి పూజించడం చాలా ప్రాముఖ్యతతో కూడినదిగా ఉంది. ఈవిధంగా రచయిత వినాయకచవితి దేశంలో అందరూ చేసుకునే చేనేతకారులకు ప్రీతిపాత్రమైన పండుగగా భావించే వినాయకచవితి గురించి చిత్రించాడు.

### 4.౨.3. బతుకమ్మ పండుగ

బ్రతుకు+అమ్మ=బ్రతుకమ్మ, బ్రతికించే అమ్మ కావున బ్రతుకు అమ్మ అయిందని చెప్పవచ్చు. బ్రతుకమ్మ వ్యవహారంలో బతుకమ్మగా మారింది. "మహిషాసుర మర్ధిని, భీకర స్వరూపిణి అయిన దేవిని బతుకమ్మగా నవరాత్రుల సమయంలో తెలంగాణ సుకుమార సుందరమైన పూలరూపంలో సందర్శించి గీతనృత్యాలతో ఆరాధించే విధానమే బతుకమ్మ పండుగ" (సుజాతశేఖర్, బండారు. 2005: 34). తెలంగాణలో పెద్ద పండుగ బతుకమ్మ. ఈ పండుగను పూల పండుగ అంటారు. ఇందులో తంగేడుపూలతో త్రికోణ ఆకారంలో

పేరుస్తా . బతుకమ్మను జంటగా పేరుస్తారు. ఒకటి తల్లి బతుకమ్మ, చిన్నది 'పిల్ల బతుకమ్మ'. మొదటిరోజు ఎంగిలి బతుకమ్మ మొదలు తొమ్మిదిరోజుల సద్దుల బతుకమ్మతో పండుగ ముగుస్తుంది. అశ్వయుజ పాడ్యమికి ముందు వచ్చేది పితృ అమావాస్య రోజు. ఆ రోజు 'పెత్రామాస్య'గా ఆ రోజే పేర్చే బతుకమ్మను 'ఎంగిలిపూవు బతుకమ్మ'గా పిలుస్తారు.

బతుకమ్మ పండుగ గురించి రచయితలు చిత్రించిన విధానం పరిశీలిస్తే మాదిరెడ్డి సులోచన 'సుషుప్తి' నవలలో "యువతులు, స్త్రీలు, పిల్లలు రాములు వాకిట్లో బతుకమ్మ ఆడుతున్నారు. తీరిన వేళ సంధ్యా సమయములోనే ఆడి, పూలు నదిలోనో, బావిలోనో వేస్తారు. శ్రమజీవులు తమ పనులన్నీ తీరాక రాత్రి తీరికగా ఆడుకుంటారు. అశ్విజ అమావాస్య నుండి, విజయ దశమి వరకు ఆడతారు. కొందరు వినాయక చవితి నుండే ఆడతారు.

జంగమయ్యను చూసి జడుసుకోలేదు ఉయ్యాలో
జడల నెట్టిని చూసి పారిపోలేదు ఉయ్యాలో
అమ్మ పార్వతమ్మ ఆ అయ్యను చూసి ఉయ్యాలో
వయ్యారంగ ఒరగ చూసింది ఉయ్యాలో
ప్రేమ మీరంగా పక్క సూపులు సూచే ఉయ్యాలో" (సులోచన, మాదిరెడ్డి. 2017: 60, 61).

ఈవిధంగా పూలతో బతుకమ్మను పేర్చి పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ జరుపుకుంటారు. ఇక్కడ స్త్రీలలో ఐకమత్యం పెంపొందేలా ఈ పండుగ ఉంటుందని, అంతేగాక వారిలో ఉత్సాహాన్ని, ఆనందాన్ని కల్గించే విధంగా ఉంటుందని రచయిత్రి స్పృశించారు.

అదేవిధంగా గీతవృత్తికి చెందిన నవల 'బతుకుతాడు' నవలలో నేరేళ్ల శ్రీనివాస్ గౌడ్ బతుకమ్మ పండుగ నేపథ్యాన్ని ఈ విధంగా చిత్రించారు. "తెలంగాణలో అత్యంత ప్రతిష్టాత్మకమైన పండుగ బతుకమ్మ పండుగ. బతుకమ్మ పండుగ రోజున ఊళ్లోని ఆడపిల్లలు బతుకమ్మ ఆడుకున్నారు. పార్వతికి ఆడపిల్లలు లేరు. ఆడపిల్లలు లేని ఇల్లు అమావాస్య చీకటి అని భర్తను తనకొక ఆడపిల్లను కావాలని పార్వతి వేడుకొంది" (శ్రీనివాస్ గౌడ్, నేరేళ్ళ. 2004: 123). ఈవిధంగా పార్వతి, శంకరుల సంతానంగా

రేణుక ఎల్లమ్మ పుడుతుంది. ఎల్లమ్మ బతుకమ్మ ఆడి, తోటిస్త్రీలకు బొట్టు పెట్టబోతే వారు అవివాహరాలితో పెట్టించుకోము అనడంతో రేణుక ఎల్లమ్మకు వివాహం జమదగ్ని మునితో జరగడం, అతన్ని కార్తీకరాజు చంపడం, అతని రక్తం నుండి ఐదుగురు కొడుకులు జన్మించడం జరుగుతుది. పెద్దకొడుకు తమ తండ్రి ఎవరనే విషయాన్ని చెప్పమని తల్లిని అడిగే సందర్భంలో వివిధ కులాల ఇండ్లలోకి వెళ్ళి తప్పించుకునే సందర్భంలో ఆమె దాహాన్ని ఒక గౌండ్ల వృత్తిదారుడు తీర్చుతాడు. అప్పటినుండి అతను ధనవంతుడు కావడం జరుగుతుంది. దాంతో గౌడ కులస్తులు ఎల్లమ్మకు గుడి కట్టి పూజిస్తారు. ఈవిధంగా బతుకమ్మ పండుగ నేపథ్యంతోపాటుగా, గౌడ కులస్తులకు ఆరాధ్యంగా మారిన రేణుక ఎల్లమ్మ గురించి చిత్రించాడు రచయిత.

ఈవిధంగా రచయితలు చేనేత (పద్మశాలి) వారికి ఎంతో ప్రాముఖ్యమైన వినాయక చవితి పండుగను, తెలంగాణ పండుగైన బతుకమ్మను, బతుకమ్మ పండుగకు సంబధించిన పౌరాణీక కథను స్పృశించారు. ప్రకృతిని ఆరాధించే ఔన్నత్యంతోపాటుగా స్త్రీని ఆదిశక్తిగా గౌరవించే సంస్కృతికి బతుకమ్మ ప్రతిబింబంగా నిలుస్తుంది.

### 4.౨.4. కులపురాణాలు

ఒక కులంవారు వేరొక కులం వారి ఇండ్లకి వెళ్ళి, అందులోని వారికి హక్కు ఉన్న వారికి ఇండ్లకు వెళ్ళి కులపురాణాలు చెప్పి, గోత్రాలు చదివి పారితోషికం గ్రహించే సంప్రదాయం ఉన్న కులాలు కొన్ని ఉన్నాయి. ఈవిధంగా ఒక కులం వాళ్ళకే కథలు చెప్పే కులాలను, ఒక వ్యవస్థగా ఇతర కులాలతో సంబంధం ఉన్న వారిని ఆశ్రిత కులాలు అని అంటారు.

ప్రతి ఊరికో కథ, ప్రతి దేవుడికో కథ ఎట్లా ఉంటుందో అలాగే ప్రతికులానికి కూడా ఒక కథ ఉంటుంది. వృత్తి ఆధారంగా ఏర్పడిన కులాలలో హెచ్చుతగ్గులవలన వృత్తికులాల వారు తమ కుల కథకు సమాజంలో గౌరవాన్ని కల్పించుకోవడంకై పురాణ స్థాయిని కల్పించుకున్నారు. వారే అష్టాదశ పురాణాలకు సమాంతరంగా కులపురాణాలు ఏర్పాటు

చేసుకున్నారని పులికొండ సుబ్బాచారి తన 'జానపద విజ్ఞానంలో ఆశ్రిత సాహిత్యం' అనే సిద్ధాంత గ్రంథంలో సుమారు 40 కులాల కథలు బాగా ప్రచారంలో ఉన్నాయి.

కులపురాణం – కుల కథలు

| క్ర.సం | పోషక కులం / కుల పురాణం కథ | ఆశ్రిత కులం | ప్రదర్శన |
|---|---|---|---|
| 01 | రజకులు | మఠం చాకలి,పటం వారు, గంజి కుటివారు | మడేల్ పురాణం |
| 02 | పద్మశాలి(సాలె) | కూనపులి, పగడి రాజులు, సాధనా శూరులు | మార్కండేయ పురాణం |
| 03 | జాంబవులు(మాదిగ) | చిందు, చిందుమాదిగ, దక్కలి, మూష్టి,బైండ్లవారు, బవనీలు, నులక చందయ్యలు, సంగడి,ఆసాది, పంబాల | జాంబపురాణం |
| 04 | నాయీబ్రాహ్మణ(మంగలి) | అద్దంవారు/అద్దం సింగాలు | నాయీబ్రాహ్మణ పురాణం |
| 05 | ముది రాజులు(ముత్రాసి) | కాకి పడగలోళ్ళు/పాండవులవారు | ముదిరాజు పురాణం |
| 06 | గౌడులు | గౌడజెట్టి, ఏనూటి | గౌడపురాణం |
| 07 | యాదవ(గొల్లకురుమ) | తెల్లచీరల వారు, గొల్లభాగవతులు, మందెచ్చులవారు,కొమ్ముభవారు,ఒగ్గోల్లు, బీరన్నలు, దేవినోళ్ళు, తగురు జోగులు | యాదవపురాణం, కాటమరాజు కథ, మల్లన్నకథ, బీరప్ప కథ |
| 08 | శాలివాహనులు(కుమ్మరి) | పెక్కింంద్రు,పెక్కింంటివారు | గుండ బ్రహ్మ పురాణం |
| 09 | వైశ్యులు | వీరముష్టి, వీరభద్రీయులు | కన్యకా పురాణం |

| | | | |
|---|---|---|---|
| 10 | విశ్వకర్మ(విశ్వ బ్రహ్మణ, పంచానంవారు) | రుంజలు,రుద్రాంగులు,ఆదిపనసలు, కోమటి పనసలు | విశ్వకర్మ పురాణం |
| 11 | మాల | గుర్రం వారు, మాల జంగాలు, బుడిగ జంగాలు, మల్లన్నలు, మాల మాష్టి, మాల భోగం | భేతాళ పురాణం, (గుర్రం మల్లయ్య కథ), శివకంఠ మాల కథ |
| 12 | రెడ్డి | పిచ్చుకకుంట్ల వారు | బసవ లింగ పురాణం, భక్త మల్లారెడ్డి పురాణం |
| 13 | దేవాంగులు | సింగంవారు, జాతి బిడ్డలు | దేవాంగ పురాణం (దేవాంగుల కథ) |
| 14 | క్షత్రియులు | భట్టులు | వంధి మాగధులు (స్తోత్రం) |
| 15 | బ్రహ్మణులు | విప్రవినోధి | వినోద కథలు / ప్రదర్శనలు |
| 16 | మేదరి వారు | ఆది కొడుకులు | మేదరి కథ |
| 17 | కోయ | పట్టెడ డోలి వారు | కోయ , దొర పురాణం |
| 18 | నాయకపోడు | పూజారి, కొర్రాజు | పూజారి కథ |
| 19 | గోండులు | తోటి, పార్ధన్లు | పాండవుల కథ |
| 20 | సుగాలి | లంబాడీ, గోత్రాలోల్లు | గోత్రాలు |

ఈ పురాణాల్లో సృష్టి క్రమం, కుల మూల పురుషుని పుట్టుక, ఆచార వ్యవహారాల పుట్టుక, కుల ఔన్నత్యం, వృత్తి పరికరాల పుట్టుక మొదలైన అంశాలుంటాయి. ఇందులో ప్రతి వృత్తి లేదా కులం దేవతల కొరకో, దేవతల అవసరార్థం కోసం సృష్టించబడిందనో పేర్కొనడం వల్ల గౌరవం అధికమవుతుంది.

ఈ నవలల్లో ఆశ్రిత, పోషక కులాల మధ్య ఉన్న సంబంధాన్ని ఏ విధంగా రచయితలు స్పృశించారో చూద్దాం.

'సంఘము' నవలలో పద్మశాలి వారికి సంబంధించిన ఆశ్రిత కులాల గురించి లోక మలహరి చిత్రించారు. "మనపై ఎన్ని దండగులు పడుతున్నాయి చూడు! వానికై ఖర్చు చేస్తే యెంత బాగుండు? భాగోతుల పన్ను, బహురూపుల పన్ను, ఈరముష్టివాళ్ళు కూనపులీల (ఇంటికో పూట చొప్పున పద్మశాలీల యిండ్లలో మొక్కుచు కాలం గడిపే మహాశయులు) గ్రామంలో గత్తర (మహమారి) పశువుల తెగుళ్ళలో గ్రామదేవర్లకు పండుగల పన్ను, ఇన్నింటిని మించి పటేలు, కరణాలిండ్లల్లో పెండ్లి, పేరంటాలకు గొప్పగొప్ప కట్నాలు, కరక్కాయలూ గావాలె గదా అవన్నింటికి ఈ ప్రోగు జేసిన ధనాన్ని వ్యయపరచొచ్చును గదా?" (మలహరి, లోక. 2017: 28). ఈవిధంగా కులపంచాయితీల ద్వారా వచ్చే ఆదాయాన్ని తమ కులమైన పద్మశాలీలను ఆశ్రయించుకొన్న వారైన బహురూపుల, కూనపులీలు మరియు గ్రామంలోని జరిగే ఇతర పండుగలకు వినియోగించవచ్చు అనే విషయాన్ని నర్సయ్య పాత్ర ద్వారా రచయిత చిత్రించాడు.

ఇదే కులానికి సంబంధించిన ఆశ్రిత కులం సాధనాసురులకు ఆదరణ తగ్గిపోతున్న విషయాన్ని గురించి కాలువ మల్లయ్య 'గువ్వల చెన్నా' నవలలో చిత్రించాడు. చిప్పమల్లయ్య, సాధనసూరులతో మాట్లాడే సందర్భంలో "నువ్వు గూడ గిట్లంటవానే చిప్ప మల్లన్న! మెల్లెమెల్లెగ మా అసొంటోల్లకు ఆదరణ లేకుంటయి పోవట్టె. మీ తరమోల్లున్నంత వరకే గిప్పుడున్నదయినా. నీ కొడుకుల తరమోల్లు కొంచెం కొంచెం చూస్తరు. నీ మనుమల తరం వరకయితె మమ్ముల దేకటోల్లే ఉండరు. ఇప్పటికే తోలుబొమ్మలాటలసోంటియి పోయినట్టే అయింది" (మల్లయ్య, కాలువ. 2005: 48). కాలప్రవాహంలో సాధనసూరులతో పాటుగా మిగతా ఆశ్రిత కులాలకు ఆదరణ తగ్గుతుండడం, ఆ కళలు అదృశ్యమవుతున్న విషయాన్ని మనముందు దృశ్యమానం చేశారు రచయిత.

గౌడ కులస్థులను ఆశ్రయించే గౌడజెట్టీల గురించి నేరేళ్ళ శ్రీనివాస్ గౌడ్ 'బతుకుతాడు' నవలలో చిత్రించాడు. "నారాయణ గౌడ్ దగ్గరికి గౌడ్‌శెట్టి రాజన్న వచ్చి నారాయణ నిన్ను మీ గౌండ్లొల్లు రమ్మన్నారు అని చెప్పి వెళ్ళినాడు. నారాయణ గౌడ్‌కు నొసలు ముడిపడింది. తన కుటుంబం దీన స్థితి వుంది. ఇటువంటి సమయంలో

గౌడజెట్టిలు రావడమా...? గౌడశెట్టిలు వచ్చినారంటే కనీసం రెండువందల రూపాయలైన కావాలి. మానెడు బియ్యం కావలెను. ఇక పప్పు, ఉప్పు, చింతపండు, నూనె, ఎల్లిగడ్డ, ఉల్లిగడ్డ వారికి అవసరమైనన్నీ ఇయ్యాలి. ఇప్పుడు బియ్య ఉన్నాయి. పైసలు లేవు. కనీసం కల్లు బాగా పారుతున్న సమయంలో వచ్చినా ఏదో విధంగ సరిపెట్టవచ్చు. ఇప్పుడు కల్లు బాగా పారడం లేదు" (శ్రీనివాస్ గౌడ్, నేరేళ్ళ. 2004: 58). గౌడశెట్టిలు వచ్చినప్పుడు వారికి ఇచ్చే ధనం, వస్తువుల గురించి చెప్తూనే గౌండ్ల వారి ఆర్థిక పరిస్థితిని దృశ్యమానం చేస్తాడు. తమ పరిస్థితి ఎలా ఉన్న తమను ఆశ్రయించిన వారిని, కులపురాణాలను ఆదరిస్తారు. అందుకు నారాయణ గౌడ్ సొంత ఖర్చుతో (ఆవును అమ్మగా వచ్చిన డబ్బు) గౌడపురాణం ఆడిపిస్తాడు. ఈవిధంగా కులపురాణాలను ఆదరించడాన్ని స్పృశించాడు రచయిత.

ఇదే గౌడ కులస్థులకు సంబంధించిన మరో నవల కె. వెంకటేశ్వర్లు రాసిన 'కల్లు మండువ'లో గౌండ్ల వారి పమ్డుగైన కాటమయ్య పండుగ గురించి చిత్రించాడు రచయిత. "గీత కార్మికులు మోకు, ముస్తాదు, కత్తులు, కుందలను, కావడిని పసుపు పూసి కుంకుమ బొట్లు పెట్టి, కంకణాలు కట్టి పూజలు చేసారు. ఆడవాళ్ళు స్నానాలు చేసుకుని ఇంట్లో కొత్త కుండల్లో బోనాలు వండి, పసుపు, కుంకుమ వేపాకుల అలంకరించి పిల్లలకు కొత్త బట్టలు కుట్టించి, కుటుంబ సభ్యులతో కల్సి కాటమయ్యకు బోనాలు పెట్టి, వనం మైసమ్మకు కోడి కోయటానికి వనానికి వస్తున్నారు" (వెంకటేశ్వర్లు, కె. 2006: 20). కాటమయ్య పండుగ సందర్భంగా గీతవృత్తిదారులు తమ వృత్తికి సంబంధించిన పనిముట్లను, వస్తువులను దేవుని ముందు పెట్టి పూజించడం, బోనాలు సమర్పించడం, దైవ ఆరాధన మొదలగు ఆచారవ్యవహారాలను వాస్తవికంగా దృశ్యమానం చేశాడు రచయిత.

వేముల ఎల్లయ్య 'కక్క' నవలలో మాదిగవారి ఆశ్రితకులాలైన చింధు, డక్కలి కులాల చిత్రణ ఉంది. డక్కలి కులంవారు గవ్వలతో పంచాంగం చూసి మంచిచెడులు మాదిగవారికి చెప్తారు. "ముసలోడు డక్కలి ముత్తిగాని దగ్గరకి బోయి పంచాంగం దీపిచ్చి గవ్వలు యేసి మంచి దినం చూసిండు. అట్టం నయం లెదు పదుకొండొద్దుల కుందల్ల గల్పుకొర్రని పెద్దమద్సులతొని జెప్పిండు ముత్తయ" (ఎల్లయ్య, వేముల. 2000: 39). కక్క, లస్మి పెళ్ళి సందర్భంలో ముహూర్తం కొరకు డక్కలి ముత్తయ్య దగ్గరికి వెళ్తారు. గవ్వలను

వేసి, ఎండు మాంసాన్ని ఇద్దరికి తినిపించి పటంలో ఉన్న ఎండుమాంస ముక్కలను చూసి "పిలగాడు గాడ్డి పిల్ల గుర్రం గీల్ల వొర్గులిట్ట గల్సినయ్. బుదారం పొద్దు సూరుడు కర్రకర్ర బొడ్వంగ పుస్తె గట్టియ్యాలె పొద్దు మొకమిచ్చుకున్న కొద్ది ఎండ ఎదురైతది తాగినొల్లు దడ్పినొల్లు పంచాతులు జేస్తరు. సల్లబూటనె పెండ్లి అయిపోవాలె ఇగ బోయి రాండ్రయ్యా" (ఎల్లయ్య, వేముల. 2000: 58). ఈ విధంగా మాదిగ ఇండ్లల్లో జరిగే రజస్వల, పెళ్ళిసందర్భాలలో ముహుర్తాలు చూసి చెప్తారు.

మాదిగ వారి మరొక ఆశ్రిత కులమైన చిందువారు బాగోతాలు వేస్తారు. "సిందాయన అయ్యా సారు మా ఇన్నపం ఇనండి. మాకా గీళ్ళు మమ్ముల జాదేది మాద్గులు తరతరాలనించి మా వొతను బాగోతులాడేది తొమ్మిదాటలాడి ఎల్లమ్మ ఏసమేసి గోసంగాట తోటి అయిపోతది తిండితో సహ గీల్లే మమ్ముల సాదేది పుట్టి పందుంవొడ్లు.... ఇచ్చి ఆడిచ్చెటోళ్ళు" (ఎల్లయ్య, వేముల. 2000: 118). ఈవిధంగా మాదిగవారు తమను ఆదరించేదని చిందు అతను చెప్తాడు. ఈవిధంగా మాదిగ వారిని ఆశ్రయించిన డక్కలి, చిందు కులాల గురించి వాస్తవికంగా దృశ్యమానం చేశారు రచయిత.

### 4.10. ముగింపు

వ్యక్తికి సంతోషాలను, ఆత్మీయతను పంచేది కుటుంబం. అదుకే సమాజంలో బతకడానికి కుటుంబమే ప్రధానం. కుటుంబ సభ్యులందరూ తాము చేయగల్గిన పనులు చేస్తూ, ఆర్థికంగా కుటుంబానికి చేయూతనిస్తూ సమాజంలో మనుగడ సాగిస్తుంటారు. ప్రకృతి వీరి సుఖమయ జీవితానికి తోడ్పాటును అందిస్తుంది. ప్రకృతిలో అందరూ సమానమే. ప్రకృతిని కాపాడుకుంటే అది మనల్ని కాపాడుతుంది. సమాజంలో ప్రతి ఒక్కరు మరొకరిపై ఆధారపడి ఉంటారు. వారి అవసరాలకు అనుగుణంగా ఒక్కొక్క వృత్తిని స్వీకరించి జీవనం కొనసాగిస్తారు. ఆ వృత్తిని చేసే వారిని ఆ పేరుతో పిలవడంతో వారు అదే పేరుతో స్థిరపడిపోయారు. కుమ్మరిపని చేసేవారు కమ్మరులుగా, నేత నేసేవారు చేనేతగా, కల్లుతీసేవారు గౌండ్లవారిగా ఇలా ఏ పనిచేసే వారు ఆ పని పేరుతో పిలవడం జరుగుతుంది. సమాజంలో ఒక వృత్తికి మరొక వృత్తికి మధ్య సత్సంబంధాలు కల్గి

ఉండాల్సిన అవసరం ఉంది. అందుకే వృత్తి వారంతా ఒక ప్రాంతంలో స్థిరనివాసం ఏర్పర్చుకున్నారు. తర్వాతి కాలంలో అది గ్రామంగా రూపాంతరం చెంది ఉంటుంది.

ఈవిధంగా గ్రామంలో ప్రతి వృత్తి మరొక వృత్తిపై ఆధారపడుతుంటాయి. ఇందులో ఏ వృత్తిని కూడా ఎక్కువ కాదు, తక్కువ కాదు. వృత్తులన్ని పరస్పర పోషకాలే. కావున వృత్తులపై ఎలాంటి వివక్ష, నిరాదరణ లేకుండా జీవన విధానంలో భాగస్వామ్యం కల్గినప్పుడే సమాజాభివృద్ధితో పాటు దేశాభివృద్ధి జరుగుతుంది.

ఈ నవలల్లో వృత్తుల్లో ఉండే రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిణామాలతో పాటు , సహకార సంఘాల తోడ్పాటు, వెట్టిచాకిరితో మగ్గిన వృత్తిదారుల జీవితాలను మనముందుంచారు రచయితలు. వృత్తిదారుల్లో ఉండే బాహ్య ప్రవర్తనతోపాటు అనేక వైరుధ్యాలతో ముడిపడి ఉన్న వృత్తి జీవనంలోని వాస్తవికతను ప్రభావవంతంగా తీర్చిదిద్దారు రచయితలు. తెలంగాణ పండుగైన బతుకమ్మ, వృత్తుల గౌరవాన్ని పెంచే పురాణాలను చిత్రించారు. ఈ రచయితలు సాహిత్య ప్రస్థానంలో తమ ప్రత్యేకతను చాటుతూ విలక్షణంగా ఈ నవలలను తీర్చిదిద్దారు. వృత్తి మనుగడను, జీవనంలో వస్తున్న మార్పులను, సమస్యలను కూడా వీరు ఆకలింపు చేసుకొని చిత్రించారు. ఈవిధంగా నేటి వృత్తిదారుల వాస్తవిక జీవిత చిత్రణను మనముందుంచారు.

# ముగింపు

ఆధునిక కాలంలో అనేక వృత్తుల జీవితాలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రపంచంలో ఏ మూల ఉన్న మానవ జీవితం గురించి తెలుసుకోవడానికైనా ప్రధాన ఆధారం సాహిత్యం. సాహిత్యం జీవితలోతుల్లోకి వెళ్ళి వారి సాధక బాధకాలను సమాజానికి అందిస్తుంది. కాలం మనిషిని నిర్ణయిస్తుంది. కానీ మనిషి కాలాన్ని నిర్ణయించలేడు. కాలానుగుణంగా మనిషి నడవాల్సిందే. ఆ క్రమంలోనే జీవితాన్ని తనకు కావాల్సిన విధంగా తీర్చిదిద్దుకుంటాడు. ఆ విధానంలో జీవితాన్ని మలుచుకోవడానికి కొన్ని సమస్యలను ఎదుర్కోవల్సి వస్తుంది. ఆ సమస్యలు సాహిత్యపరంగా సృజనీకరించుకోవడానికి రచయితలకు ముడిసరకుగా ఉపయోగపడుతుంది.

జీవిత చిత్రణ అంటే మనిషి పుట్టుక మొదలు మరణం వరకు అతడు అనుసరించే కట్టుబాట్లు, ఆచారాలు, వేషధారణ, మానవ సంబంధాలు మొదలైనవన్నీ వస్తాయి. తెలంగాణ నవలల్లో వృత్తిజీవిత చిత్రణ అంటే తెలంగాణ ప్రాంతంలోని వృత్తులకు సంబంధించిన సమస్త విషయాలను విశ్లేషణ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందుకే ఇందులో భాగంగా నవలా నిర్వచనాలు, లక్షణాలతోబాటుగా తెలంగాణలో నవల పరిణామ క్రమాన్ని తెలుపుతూ తెలంగాణ రచయితల నవలలను, తెలంగాణ చారిత్రక, ఉద్యమ, మాండలిక నవలలను పరిచయం చేశాను. తెలంగాణ వృత్తి నవలలు ఇతివృత్తంలో కుల, వర్ణ నిర్వచనాలతోపాటుగా నవలల ఇతివృత్తాన్ని పరిచయం చేశాను. తెలంగాణ వృత్తి నవలలు పాత్రచిత్రణలో పాత్రల ఆధారంగా ఎనిమిది రకాల పాత్రలుగా విభజించి వాటి కింద ఆయా పాత్రల గుణ, రూప స్వభావాలను విశ్లేషించాను.

## పరిశోధన ఫలితాలు

నవలల ద్వారా వృత్తులు ప్రకృతిమీద ఆధారపడి జీవిస్తున్న విధానాన్ని, ప్రకృతిలో భాగమైన తాటి చెట్లకు మనుషుల పేర్లు పెట్టి వాటిని మనిషిగా భావించే విధానం కనబడుతుంది. కుటుంబ జీవనంలో భార్యాభర్తల మధ్య ఉండే ప్రేమానురాగాలతో పాటు వృత్తిలో సహకరించుకోవడం, స్త్రీలపై జరిగే హింసలో ప్రధానంగా భర్తలేని స్త్రీల పరిస్థితిఎంతఘోరంగా ఉంటుందో కనబడుతుంది.

ఆర్థిక సంబంధాల విషయానికి వస్తే ఏ తరగతికి చెందిన వ్యక్తి జీవితాన్ని శాసించేది ఆర్థిక సంబంధాలే అనే విషయాన్ని ఈ నవలల ద్వారా తెలుస్తుంది. ఈ నవలల్లో వృత్తికి సంబంధించిన జీవిత సంఘర్షణ కనబడుతుంది. వృత్తికి ఆదరణ లేనప్పుడు అప్పులు చేయడం, వలసలు పోవడం

జరుగుతుంది. వలసలు వెళ్ళినచోట జరిగే మత సంఘర్షణలో చనిపోవడం, అక్కడ కూడా అప్పులు చేసుకొని వాటిని తీర్చలేక ఆత్మహత్య చేసుకుంటున్న దృశ్యాలు కనబడతాయి. వృత్తుల్లో ఉండే పోటికి ఆధునిక యంత్రాల కొనుగోలుతో అప్పులై ఆత్మహత్యలు చేసుకుంటున్న సిరిసిల్ల ప్రాంతం ఒకనాడు 'సిరిశాల'గా ఉండి నేడు 'ఉరిశాల'గా మారిన విషయాన్ని మనముందుంచారు.

గ్రామాలలో మనషుల మధ్య ఉండే ఆప్యాయతలు, సహాయసహకారాలు కనిపిస్తాయి. వృత్తుల మధ్య ఉండే సహకారంతో పాటుగా దొరల దౌర్జన్యాలు, వృత్తిదారులు చేసే వెట్టి కనబడుతుంది. వృత్తిదారులను దోచుకునే వ్యాపారవర్గం కోమటి వారితోపాటు దొరలు, ముస్తాజుదార్లు అనే వీరు గీతవృత్తికి సంబంధించినవాళ్ళు. వీరు జిల్లా వేలం పాటలను తమ సొంతం చేసుకొని గీతవృత్తిదారులను పీడించే దోపిడి వర్గంగా కనబడుతుంది. అబ్కారీ మరియు పోలీసు అధికారుల అవినీతి మనకు కనబడుతుంది.

సేవక వర్గాలుగా ఉండే ముస్లింలు తోటి దళితులను చైతన్యపరిచే వారిగా ఉండగా, సుషుప్తి నవలలో దావూద్ అనే సేవకుడు భార్యాభర్తలైన గోవిందు, చుక్కలను విడదీసి చుక్కను తన సొంతం చేసుకుంటాడు. కులపంచాయితీలో కులానికి అవమానం కల్గించిన వారికి (సంఘము నవలలో బుచ్చమ్మ అనే పద్మశాలీ స్త్రీ వేరే కులం వారి ఇంట్లో పనిచేస్తుంది) జరిమానాలు విధించడం, ఎన్నికల విధానంలో విద్యార్థి దశలోనే ధన, మద్యపాన ప్రభావం కనబడుతుంది. మోహిని నవలలో అంబేద్కర్ సిద్ధాంతాలను ఆచరించే రాజకీయ పార్టీ గురించి తెలుస్తుంది.

సహకార సంఘాలు వృత్తిదారులకు అందించే సహకారం, ఆవశ్యకత గురించి, గీత, చేనేత వృత్తి నవలల్లో ఆవిష్కరించబడింది. 'గువ్వల చెన్నా' నవలలో కొంతమంది దళారులు సహకార సంఘాల్లో చేరి వాటి ఫలాలను వృత్తిదారులకు అందకుండ చేస్తున్నారనే విషయం తెలుస్తుంది. ఈ నవలల్లో విద్య ఆవశ్యకత కనబడుతుంది. విద్యలేక జీవితాల్ని కోల్పోయిన విధానాన్ని, విద్యతో ఉన్నతస్థాయికి ఎదిగిన విషయాల్ని ఈ నవలలు చర్చించాయి.

సాంస్కృతికాంశాల్లో వివాహం జరిగే సందర్భంలో వృత్తిదారుల పాత్రను, పండుగల సందర్భంలో వృత్తి పనిముట్లను పూజించే విధానం, తెలంగాణ పండుగైన బతుకమ్మ గురించి, వృత్తి పురాణాల గురించి రచయితలు దృశ్యమానం చేశారు.

ఈ నవలల వల్ల వృత్తి జీవన విధానంలో వైవిధ్యం కనిపిస్తుంది. ఈ వైవిధ్యాన్ని కూడా సాహిత్యం ద్వారా అర్థం చేసుకొని పరిశోధన చేసే అవకాశం ఉందని గ్రహించాను. ఈ పరిశోధనవల్ల ప్రతి వృత్తిలో సంఘర్షణ ఉందని, దానికి కారణం సామాజిక, ఆర్థిక, రాజకీయ

విధానాలేగాక నేటి ఆధునిక విధానాలలో ఉండే పోటీతత్త్వం అనగా ప్రపంచీకరణ ప్రభావం ఉందని గ్రహించాను. నేడు వృత్తులకు ఆదరణ తగ్గుతున్న విషయాన్ని గ్రహించవచ్చు.

ఈనవలల్లో మోహిని నవల తప్పా మిగతా నవలలు సంభాషణాత్మక మాండలికాన్ని కల్గిఉండగా కక్క నవల మాత్రంపూర్తిగా మాండలికంలో ఉంది.

ఈవిధంగా వృత్తి జీవనంలోని ఒడిదుడుకులను తెలుసుకోవడానికి భవిష్యత్తులో ఒక వృత్తిని తీసుకొని సాహిత్యం మొత్తంగా అధ్యయనం చేయడం, ఒక అంశాన్ని, ఒక ప్రక్రియ తీసుకొని వృత్తులపై ఇంకా లోతుగా పరిశోధన జరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ఉపయుక్త గ్రంథ సూచి


1. అంబేద్కర్, బి.ఆర్. 1978. *"కుల నిర్మూలన"*. మహారాష్ట్ర: లీమ్ పబ్లికేషన్స్.
2. ఆంజనేయులు, గుడికాడి. 2009. *"కుల పురాణం – గౌడ పురాణం పటం కథలు"*. హైదరాబాద్: త్రివేణి ప్రచురణలు.
3. ఆనందరామం, సి. 1994. *"నవలా విమర్శ"*. హైదరాబాద్: పద్మావతి ప్రింటర్స్.
4. ఆనందలక్ష్మి, సి. 1979. *"తెలుగు నవలల్లో కుటుంబ జీవన చిత్రణము"*. విజయవాడ: నవజ్యోతి పబ్లికేషన్స్.
5. ఉదయ, మారంరాజ్. 1991. *"తెలుగు నవలల్లో తెలంగాణ జన జీవనము"*. హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయం.
6. ఎల్లయ్య, వేముల. 2000. *"కక్క"*. నల్గొండ: గోసంగి నీలి సాహితి.
7. కాత్యాయని, విద్మహే. 1995. *"తెలుగు నవలా కథానిక – విమర్శ పరిణామం"*. హైదరాబాదు: చరిత్ర ప్రచురణలు.
8. చెన్నయ్య, జె. (సంపా.). 2013. *"తెలంగాణలో తెలుగు సాహిత్య వికాసం"*. హైదరాబాదు: ఆంధ్ర సారస్వత పరిషత్తు.
9. త్రివేణి, పి. 2012. *"ముదిగంటి సుజాతారెడ్డి రచనలు సమగ్ర పరిశీలన"*. నిజామాబాదు: తెలంగాణ విశ్వవిద్యాలయం.
10. దేవకీ దేవి, తిరునగరి. 2008. *"తెలంగాణ విమోచనోద్యమ నవలల్లో స్త్రీ చైతన్యం"*. హైదరాబాదు: తిరునగరి ప్రచురణలు.
11. నరసింహం, పుప్పల. 2017. *"సబ్బండ వర్ణాల సారస్వతం"*. హైదరాబాద్: జ్ఞానం పబ్లికేషన్స్.
12. నరసింహం, వుప్పల. 2017. *"సబ్బండ వర్ణాల సారస్వతం"*. హైదరాబాద్: జ్ఞానం పబ్లికేషన్స్.
13. నాగభూషణశర్మ, మొదలి. 1971. *"తెలుగు నవలా వికాసం"*. హైదరాబాద్: నాట్య కళా ప్రెస్.
14. ప్రతాపరెడ్డి, కాసుల. 1990. *"తెలుగు నవల – వ్యాపార ధోరణి"*. హైదరాబాద్: మానస ప్రచురణలు.
15. ప్రసన్నాంజనేయులు ఎమ్. 2007. *"విశ్వనాథ నవలా శిల్పము"*. నెల్లూరు: స్వీయ ప్రచురణలు.

16. బలరామమూర్తి, ఏటుకూరి. 1992. *"భారతీయ సంస్కృతి".* హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

17. బుద్ధప్రసాద్, మండలి. 2007. *"వజ్ర భారతి".* కృష్ణ: కృష్ణా జిల్లా రచయితల సంఘం.

18. మధుసూదనరావు, త్రిపురనేని. 1997. *"సాహిత్యంలో వస్తు శిల్పాలు".* హైదరాబాదు: పర్‌స్పెక్టివ్ పబ్లిషర్స్.

19. మలహరి, లోక. 2017. *"సంఘము".* హైద్రాబాద్: తెలంగాణ ప్రచురణలు.

20. మల్లయ్య, కాలువ. 2005. *"గువ్వల చెన్నా".* హైద్రాబాద్: చతుర.

21. మల్లారెడ్డి, తూర్పు. (సంపా.). 2007. *"తెలంగాణ సాహిత్యం – జీవిత చిత్రణం".* భువనగిరి: తెలుగుశాఖ శ్రీలక్ష్మీనరసింహస్వామి కళాశాల.

22. మల్లేశ్, మంత్రి. 2018. "తెలంగాణ మాండలిక నవలలు: భాషా పరిశీలన". హైదరాబాద్: హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి సమర్పించిన పిహెచ్.డి. పరిశోధన గ్రంథం.

23. ముత్యం, కె. (సంపా.). 2011. *"ఉత్తర తెలంగాణ సంస్కృతి చరిత్ర".* కరీంనగర్: తెలుగు విభాగం శాతవాహన విశ్వవిద్యాలయం.

24. మృణాళిని, 1988. *"తెలుగు సాంఘిక నవలల్లో కథాకథన శిల్పం".* హైదరాబాదు: తెలుగు పరిశోధన ప్రచురణలు.

25. యోహన్‌బాబు, జి. 2001. *"బలివాడ కాంతరావు నవలలు పరిశీలన".* విశాఖపట్టణం: దీప్జేజ పబ్లికేషన్స్.

26. రామకృష్ణ, వకుళాభరణం. 2008. *"చరిత్ర సంస్కృతి వ్యాసావళి".* హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

27. రాములు, జి. 1954. *"పెరటి చెట్టు".* సిరిసిల్ల: తెలంగాణ రచయితల సంఘం.

28. రాసాని, వి.ఆర్. (సంపా.). 2012. *"తెలుగు కథ – దళిత, మైనారిటీ, గిరిజన, బహుజన జీవితం".* తిరుపతి: బాలవినాయక గ్రాఫిక్స్

29. విద్వేశ్వరి, డి. 1980. *"తెలుగు నవల మనోవిశ్లేషణ".* హైదరాబాద్: నితిన్ ఎంటర్ ప్రైజెస్.

30. వెంకట సుబ్బయ్య, వల్లంపాటి (అను.). 1992. *"నవల ప్రజలు".* హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

31. వెంకట సుబ్బయ్య, వల్లంపాటి. 1994. *“నవలా శిల్పం”.* హైదారాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
32. వెంకటయ్య, కె. 2012. *“గీత కార్మికోద్యమం నిన్న – నేడు – రేపు”.* హైదరాబాద్: ప్రజాశక్తి బుక్ హౌస్.
33. వెంకటేశ్వరరెడ్డి, అన్నపురెడ్డి. 1991. *“సంస్కృతి విన్యాసం”.* హైదరాబాద్: తెలుగు అకాడమి.
34. వెంకటేశ్వర్లు, కె. 2006. *“కల్లుమండువ”.* సూర్యపేట: అభ్యుదయ రచయితల సంఘం, గీత పనివారల సంఘ రాష్ట్ర యువజన విభాగం.
35. వెంకటేశ్వర్లు, పంతంగి. (సంపా.). 2014. *“తెలంగాణ తెలుగు నవల”.* వరంగల్లు: తెలుగు విభాగం కాకతీయ విశ్వవిద్యాలయం.
36. వెంకటేశ్వర్లు, పుల్లాభొట్ల. 1974. *“తెలుగు నవల సాహిత్య వికాసము”.* ఖమ్మం: స్వీయ ప్రచురణలు.
37. వెంకట్రావు, ఎస్. 2004. *“పండుగలు ప్రజాదృక్పథం”.* హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
38. వేంకట కుంటుంబరావు, బొడ్డపాటి. 1971. *“ఆంధ్ర నవలా పరిణామము”.* హైదరాబాద్: ఉస్మానియా విశ్వవిద్యాలయం.
39. శరత్ జ్యోత్స్నా రాణి, ఎస్. (సంపా.). 2007. *“తెలుగు కథా సాహిత్యం – ఆధునిక దృక్పథాలు”.* హైదరాబాదు: జ్యోత్స్నా కళాపీఠం ప్రచురణలు.
40. శర్మ, ఆర్.యస్. 1992. *“శూద్రవర్ణం ఎలా పుట్టింది?”.* హైదరాబాద్: హైదరాబాద్ బుక్ ట్రస్ట్.
41. శ్రీనివాస్ గౌడ్, నేరేళ్ళ. 2004. *“బతుకుతాడు”.* హైద్రాబాద్: యూనివర్సిటి ఆఫ్ సోషల్ ఫిలాసఫి విశాల సాహిత్య అకాడమి.
42. శ్రీనివాస్, సంగిశెట్టి. 2017. *“తెలంగాణ నవలా చరిత్ర”.* హైదరబాదు: తెలంగాణ ప్రచురణలు.
43. సంజీవమ్మ, పి. 1985. *“తెలుగు నవలల్లో సామాజిక చైతన్యం”.* విజయవాద: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

44. సహవాసి(రచన), వెంకట్రామయ్య, డి. (సంపా.). 2015. *“నూరేళ్ళ తెలుగు నవల (1878 - 1977)”.* హైదరాబాదు: పర్‌స్పెక్టివ్స్ ప్రచురణ.

45. సాంకృత్యాయన్, రాహుల్. 1986. *“ఋగ్వేద ఆర్యులు”.* హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

46. సిధారెడ్డి, నందిని. 2008. *“కుల వృత్తులు తెలంగాణ సాహిత్యం”.* హైదరాబాద్: తెలంగాణ రచయితల వేదిక.

47. సుందరం, ఆర్వీ.యస్. 2004. *“ఆంధ్రుల జానపద విజ్ఞానం”.* హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

48. సుజాతారెడ్డి, ఎం. 1994. *“సంకెళ్ళు తెగాయి”.* హైద్రాబాద్: రోషణమ్ ప్రచురణలు.

49. సుజాతారెడ్డి, ముదిగంటి. 2011. *“తెలంగాణ నవలలు – తెలియని చరిత్ర”.* హైదరాబాదు: సాహితీ స్రవంతి – సాహిత్య పత్రిక.

50. సుజాతాశేఖర్, బండారు. 2005. *“తెలంగాణ బతుకమ్మ పాటలు పౌరాణిక, సామాజిక, సాంస్కృతిక భాషా పరిశీలన”.* దేవరకొండ: దాచేపల్లి మాధురి, మనోజ్ పబ్లికేషన్స్, సాంస్కృతిక సాహిత్య సమాఖ్య.

51. సుదర్శనం, ఆర్వీ. యస్. 1972. *“సమాజం – సాహిత్యం”.* రాజమండ్రి: శ్రీరత్నా ప్రింటర్స్.

52. సుబ్బలక్ష్మి, ఇంగువ. 2007. *“తెలుగు నవలల్లో పాత్ర చిత్రణ – విధానాలు”.* హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయం.

53. సుబ్బాచారి, పులికొండ. 2000. *“తెలుగులో కుల పురాణాలు ఆశ్రిత వ్యవస్థ”.* హైదరాబాద్: స్వంత ప్రచురణలు.

54. సురేష్ కుమార్, కె. 2001. *“బసివిని సాహిత్యం – సామాజిక విశ్లేషణ”.* హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయం.

55. సులోచన, మాదిరెడ్డి. 2017. *“సుషుప్తి”.* హైద్రాబాద్: తెలంగాణ ప్రచురణలు.

56. స్వామి, ననుమాస. 1994. *“మోహిని”.* సికిందరాబాద్: ఉదయశ్రీ ప్రచురణలు.

57. స్వామి, ననుమాస. 2008. *“జానపద పురాణాలు”.* హైదరాబాద్: ఉదయశ్రీ పబ్లికేషన్స్.

## ఆంగ్ల గ్రంథాలు


1. Edger Thurston. 1909. *"The Caste and Tribes in south India".* Delhi: Cosmo publication.
2. Hutton, J.H. 1997. *"Caste in India".* Bombay: Oxford University Press.


## విజ్ఞాన సర్వస్వం


1. కృష్ణారావు, వై.వి. 1998. *"ఆంధ్రప్రదేశ్ దర్శిని".* హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. రెండవ సంపుటి.



జ్యోత్స్నా కళాపీఠం హైదరాబాదు
చిత్కళా వాహిని హైదరాబాదు
సంయుక్త నిర్వహణలో

**తెలుగు సాహిత్యం - దేశభక్తి భావన**
**జాతీయ సదస్సు**

2018 జనవరి 19, 20 శుక్ర, శనివారాలు
వేదిక : కాన్ఫరెన్స్ హాల్, హ్యుమానిటీస్, గచ్చిబౌలి, హైదరాబాదు విశ్వవిద్యాయలం, హైదరాబాదు

**ధ్రువీకరణ పత్రం**

శ్రీ / శ్రీమతి / డా॥ / ఆచార్య జి. జనార్ధన్
జాతీయ సదస్సుకు హాజరై ఏటూ చంద్రయ్య 'వల్లి భారతి' నవల – దేశభక్తి భావన
అనే అంశంపై పరిశోధనా పత్రాన్ని సమర్పించారు.

ఆచార్య ఎస్. శరత్‌జ్యోత్స్నారాణి
సదస్సు కో-ఆర్డినేటర్

డా॥ వల్లి సుబ్బలక్ష్మి
సదస్సు కో-ఆర్డినేటర్

## DEPARTMENT OF TELUGU STUDIES, TELANGANA UNIVERSITY

Dichpally, Nizamabad -503 322 Telangana State

&

## TELANGANA STATE HIGHER EDUCATION COUNCIL

Hyderabad - 500028, Telangana State

with Collaborations

## 3 DAY - INTERNATIONAL CONFERENCE

### తెలంగాణ సాహిత్యం - జీవనాధార వృత్తులు : సాంస్కృతిక అధ్యయనం

### Telangana Sahithyam - Jeevanadhara Vruttulu : Samskrutika Adhyayanam

Date : 5,6 & 7 March 2019, Tuesday, Wednesday & Thusday

Venue : Computer Science College, Telangana University

# CERTIFICATE

Prof. / Dr. / Sri / Smt. జి. జనార్ధన్

has presented a research pepar entitled 'సుద్దాల చెన్నా' నవల - పద్మశాలీల జీవన చిత్రణ

in Department of Telugu Studies, Telangana University & Telangana State Higher Education Council with Collaborations conducted a 3 Day - International conference " Telangana Sahithyam - Jeevanadhara Vruttulu : Samskrutika Adhyayanam " held on 5,6 & 7 March 2019, Tuesday, Wednesday & Thusday at Telangana University, Dichpally, Nizamabad.

**Prof. D. Balaramulu**
Registrar, Telangana University

**Dr. V. Triveni**
Seminar Director & Head, Dept. of Telugu Studies


వ్యాస దీపిక
(సాహిత్య వ్యాసాలు)
ప్రధాన సంపాదకులు :
పి. ఉషారాణి
సంపాదక వర్గం :
డా॥ కాకాని సుధాకర్,
కె.వి. పద్మావతి,
డా॥ విజయకుమార్ బండారు,
డా॥ రత్నశేఖర్ కట్టెపోగు,
డా॥ శ్రీనివాసరావు గుండెమెడ.

# వ్యాస దీపిక

( సాహిత్య వ్యాసాలు)

ప్రధాన సంపాదకులు

**పి. ఉషారాణి,**

ప్రిన్సిపాల్, యస్.జి.వి.ఓ. కళాశాల, తిమ్మసముద్రం.

సంపాదక వర్గం

**డా॥ కాకాని సుధాకర్**

తెలుగు శాఖ, యస్. యస్. యన్. కళాశాల, నరసరావు పేట.

**కె. వి. పద్మావతి,**

తెలుగు శాఖ, వి.యస్.ఆర్. & యన్.వి.ఆర్. కళాశాల, తెనాలి.

**డా॥ విజయ కుమార్ బండారు,**

పోస్ట్ డాక్టోరల్ ఫెలో, హెచ్.సి.యు., హైదరాబాద్.

**డా॥ రత్న శేఖర్ కట్టెపోగు,**

ప్రిన్సిపాల్, యస్.వి.కె.పి. కళాశాల, పొదిలి.

**డా॥ శ్రీనివాసరావు గుండెమెడ,**

తెలుగు శాఖ, ఆంధ్ర ముస్లిం కళాశాల, గుంటూరు.

ప్రచురణ:

రోషన్ పబ్లికేషన్స్

2018

# VYASA DEEPIKA(Essays)

First Edition : @ 2018

Copy Right : Chief Editor

Copies : 500

Price : 350/-

**Books Available at :**
All Leading Book Shops,
*www. vyasasudha2017.org,*
*www. kinige.org*

**ISBN : 978-93-87540-42-2**

**For Communications :**
P. Usha Rani, Principal,
S.G.V.Oriental College, Thimmasamudram,
Prakasam (D.t).
Dr. B.Vijay Kumar - 9866703130.

Published by : **ROSHAN PUBLICATIONS,**
Visakhapatanam.

Cover Design : Narasimha, Navya Sai Graphics, Chirala.

Printed at : Sri Sri Printers. vja@ gmail.com
9490634849.

ISBN:978-93-87540-42-2

27. ఆధునిక కవిత్వంలో అమ్మ - డా॥ మోకా ప్రతాప్ 206
28. స్త్రీవాద సాహిత్యం - విమర్శక వ్యాసాలు
- డా॥ లింగాల మంగమ్మ 213
29. తెలంగాణ కవిత్వం-గిరిజన జీవితం - డా॥ నూనావత్ రాంబాబు 220
30. స్త్రీ ఉనికిని స్త్రీకి పరిచయం చేసిన సాహిత్య ప్రక్రియ "స్త్రీవాదం"
- డా॥ ఈతకోట ఈశ్వరరావు 228
31. వెంగమాంబ బాలభాష - భానుపావని వట్టెం 233
32. కరీంనగర్ జిల్లా జానపద కథలలో ప్రతిఫలించిన భక్తిభావన
- తాటికాయల భోజన్న 237
33. ప్రపంచ తెలుగు మహాసభలు - చేబ్రోలు జఖరయ్య 244
34. 'సావుకారి కోడలు' జానపద కథలో స్త్రీ చాతుర్యం
- మాడిశెట్టి అభిషేక్ 251
35. 'చెంచు' గిరిజనుల సామాజిక సాంస్కృతిక జీవన విధానం
- ముడావత్ వెంకటేష్ 260
36. సలీం 'కాలుతున్న పూల తోట' ఇతివృత్తం - పాత్ర చిత్రణ
- బానోత్ మోహన్ 267
37. గురుస్సాక్షాత్ పరబ్రహ్మ - ఆచంట మారుతీ శ్రీహరిరావు 272
38. శ్రీనాథ యుగ సాహిత్యం - ద్విపద కావ్యాలు
- రాంభట్ల వేంకటరాయశర్మ 279
39. తెలంగాణ నవలలు - గౌడ వృత్తి జీవన చిత్రణ
- గౌడిచర్ల జనార్దన్ 288
40. దళిత రచయితల కథల్లో దళిత స్త్రీ - డా॥ వారాది చిన్నారావు 294
41. కాంచనమాల "మాయామహితరూప రామచంద్ర " శతకంలో నవవిధ
భక్తి మార్గాలు - డా॥ లక్ష్మణ రావు ఆదిమూలం (అరసి శ్రీ) 300
42. తెలుగు సాహిత్యం - పశ్చిమగోదావరి జిల్లా కథారచయిత్రుల సేవ 20 వ
శతాబ్ది ఆధారంగా - ఉషారాణి బత్రాజు 308

# తెలంగాణ నవలలు - గౌడ వృత్తి జీవన చిత్రణ

- గౌడిచర్ల జనార్దన్,

గౌడకులం వారి జీవనాధారం కల్లు గీత వృత్తి. ఈ వృత్తి భాతదేశ మంత లేదు. కల్లు గీత వృత్తి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, గుజరాత్ మొదలగు రాష్ట్రాలలో మాత్రమే ఉంది. కల్లుగీత వృత్తిలో ఉన్నవారు ఒకేకులం పేరుతోలేరు. వీరిని తెలంగాణలో గౌడ్ అని ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా, గుంటూరు, నెల్లూరు, పశ్చిమగోదావరి జిల్లాలో గౌడ్స అని, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని కొంతభాగంలో వీరిని శెట్టిబలిజ అని, విశాఖ, విజయనగరంలో యాత, శెట్టిబలిజగా శ్రీకాకుళంలో సిగడిలు, శ్రీశైనయాంధ్ర పేర్లతో మరియు రాయలసీమలో ఈడిగ అని పిలుస్తారు.

సాహిత్యం సమాజానికి ప్రతిబింబం. అలాంటి సాహిత్యానికి లిఖిత రూపాన్ని ఇచ్చింది తాటియాకు. తాటిచెట్టు ప్రస్థావన వాల్మీకి రామాయణంలో, ఎర్రన హరివంశంలోనూ ఉంది. 17వ శతాబ్దంలో మల్లిఖార్జున సిద్ధయోగి ద్విపదలో రాసిన 'గౌడపురాణం' ను గౌడులకు సంబంధించిన తొలి గ్రంథంగా పేర్కొనవచ్చు. 1632లో పులిగడ్డ నారయమంత్రి గారి 'సురాభండేశ్వర యక్షగానం', 1915లో గట్టు ప్రభువుగారి 'సురాభండేశ్వర పద్యనాటకం', 1960లో అంబేద రాజప్పగారు రాసిన 'కంఠమహేశ్వర చరిత్ర' అనే యక్షగానంతోపాటు అనేకమైన గ్రంథాలు తెలుగు సాహిత్యంలో వచ్చాయి. ఆధునిక సాహిత్యంలో కొంపెల్లి వెంకట్ రాసిన 'ముస్తాదులు కదులుతున్నాయి' అనే కవిత్వం ఎంతో ప్రాచుర్యాన్ని సంతరించుకుంది. కథా రచయితలైన కె.

సభా, గూడూరి సీతారాం, నేరెళ్ల శ్రీనివాస్ గౌడ్, కాలువ మల్లయ్య లాంటి వారు తమ కథలలో గౌడ వృత్తివారి జీవితాలను ప్రతిబింబింపజేశారు.

తెలుగు సాహిత్యంలో నవలకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. నేటి ఆధునిక నవలలు స్త్రీలు, దళిత, ప్రాంతీయ ఉద్యమాలను, విలువల, మానవ సంబంధాల, ఉమ్మడి కుటుంబాల విధ్వంసాలను, అమానవీయతను, గ్రామీణ జీవితాలలో వస్తున్న మార్పులను, నగర జీవిత సంక్షోభాలు మొదలైనవాటితోపాటు వివిధ వృత్తుల చిత్రీకరణను మునుపెన్నడు లేని విధంగా గాఢంగా స్పృశిస్తున్నాయి. వృత్తి జీవిత చిత్రణలో గౌడకుల వృత్తి జీవితాలను చిత్రించిన పెరటిచెట్టు, మోహిని, బతుకుతాడు, కల్లుమండువ నవలలు తెలంగాణ నుండి వచ్చాయి.

1954లో జి.రాములు గారు రచించిన 'పెరటిచెట్టు' నవల గౌడకుల వృత్తిదారుల జీవితాలను చిత్రించిన మొదటి నవల. ఈ నవలలో ప్రధానపాత్ర రాజాగౌడ్. రాజాగౌడ్ తండ్రి ఉన్నప్పుడు ఆర్థికంగా మంచిగా ఉంటారు. తండ్రిమరణంతో ఆర్థికంగా నష్టపోతారు. రాజాగౌడ్ మామ ఎల్లగౌడ్ కులపంచాయితీలో గంగమ్మని హింసిస్తున్నాడని పుట్టింటికి తీసుకెళ్తాడు. దీంతో రాజాగౌడ్ గ్రామదొర (సర్పంచ్) రామారావుకి లంచం ఇచ్చి పంచాయితిలో తనకు అనుకూలంగా తీర్పు చెప్పిస్తాడు. దాంతో భార్య గంగమ్మ తిరిగి ఇంటికి వస్తుంది. ఇక్కడ లంచాలు ఇచ్చే విధానంతో పాటు దొరల నిరంకుశ ధోరణి కనబడుతుంది.

రాజాగౌడ్ వృత్తిలో అభివృద్ధి చెందకుండా చేసే వారిలో శివలింగం సేటు ఒకరు. ఇలాంటి సమయంలో ఊరిపంతులుకు చుట్టమైన మెహాత్మిం అనే అబ్కారి అధికారి ద్వారా కల్లు వ్యాపారంలోకి తిరిగి ప్రవేశించి బాగా సంపాదిస్తాడు. తన వ్యాపారాన్ని మహారాష్ట్రలోని చాందా, నాగపూర్ ప్రాంతాలకు విస్తరించి అక్కడ పెద్ద వ్యాపారిగా ఎదుగుతాడు. ఇప్పటిహెూదాకు, అంతస్తుకు భార్య గంగమ్మ నిరక్షరాస్యులైనందున రాజాగౌడ్ తన గౌరవానికి ఆటంకం కలుగుతుందనుకొని, కొడుకు బాలాగౌడ్‌ని మాత్రమే నాగపూర్ కి తీసుకెళ్ళి అక్కడే చదివిస్తాడు. అక్కడే చదువుకున్న అమ్మాయిని పెళ్ళి చేసుకుంటాడు రాజాగౌడ్. చిన్నమ్మ ప్రవర్తన నచ్చక బాలాగౌడ్ కొంతకాలానికి తిరిగి తల్లి దగ్గరకు చేరుతాడు.

బాలాగౌడ్ గ్రామంలోని గౌడ కులస్థుల కుటుంబ, వృత్తి పరమైన సమస్యలు తెలుసుకుంటాడు. నాగపూర్ లోని 'గౌడ సంఘం' పనితీరును దాని ద్వారా కలిగే లాభాలను తెలిపి వారిలో చైతన్యంనింపి కొత్తూరులో 'గౌడ జన సంఘం' ఏర్పాటు చేస్తాడు. తర్వాత బాలాగౌడ్ ఒక కరపత్రాన్ని విడుదల చేస్తాడు. గీత కార్మికుల కష్టాలకు కారణమైన పెద్ద ముస్తాదర్లు, ప్రభుత్వం మరియు అబ్కారి అధికారుల విధానాలను పేర్కొని 'దున్నేవాడికి దుక్కి' లాగా 'గీచే వాడిదే చెట్టు' అనే విధంగా సాధించాలనేది ఆ కరపత్రంలోని సారాంశం. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పని చేస్తున్నాడని బాలాగౌడ్‌ని పోలీసులు అరెస్టు చేస్తారు. కేంద్ర గౌడ సంఘం ఒత్తిడితో బాలాగౌడ్ విడుదల అవుతాడు. గ్రామ ప్రజలు ఊరేగింపుగా తీసుకొస్తారు. రాజాగౌడ్ రెండోభార్య ఇంట్లో ఉన్న నగలు, డబ్బుతో ప్రియుడితో పారిపోతుంది. దాంతో రాజాగౌడ్ ఇంటికి చేరుతాడు. బాలా గౌడ్ 'గీచేవానిదే చెట్టు' అమలుచేసేంత వరకు పెళ్ళి చేసుకొను అనడంతో ఈ నవల ముగుస్తుంది. ఈ నవలలో ప్రధానంగా ఆనాటి గ్రామీణ వ్యవస్థతోపాటు పెద్ద ముస్తాదర్లు, అబ్కారి అధికారుల దోపిడీలను మనముందుంచారు. గౌడ కుటుంబాల జీవితాల్ని చిత్రించడంతోపాటు గౌడ సంఘాల ఆవశ్యకతను వివరించాడు.

నముమాసస్వామి గారు 1994లో 'మోహిని' అనే నవలలో గీత కార్మికుల జీవితాలను చిత్రించారు. ఈ నవలలో ప్రధాన పాత్ర మోహిని. మోహిని డిగ్రీ వరకు చదువుకొని 'గీత పరిశ్రమ' పత్రిక సంపాదకురాలుగా పనిచేస్తుంది. గ్రామంలోని నీటి సమస్యను పరిష్కరించిన సందర్భంలో మోహినిని చూసిన కలెక్టర్ చైతన్య ఆకర్షితుడవుతాడు. ప్రభుత్వం మద్యపాన నిషేధ ప్రకటన జారీ చేసినప్పుడు గీత వృత్తిదారుల సభలో మోహిని ఉపన్యాసం అందరిని ఆకర్షిస్తుంది. గౌడ నాయకులు తమ సమస్యల పరిష్కారానికి రాజ్యాధికారమే సాధనం అన్నప్పుడు తమ జాతికి మేలు జరిగేలా కొత్తపార్టీలో చేరుతుంది మోహిని. ఇక్కడ ఆమె రాజకీయ దృక్పథాన్ని అర్థంచేసుకోవచ్చు. ఎన్నికల ప్రచారంలో మోహినిని సంరక్షిస్తూ, ఆమెకు రాజకీయాలపై అవగాహన కలిగిస్తాడు చైతన్య. మోహిని తండ్రి కాటమయ్య గౌడ వృత్తి చేస్తూనే సమాజ సేవ చేస్తుంటాడు. అంతేగాక కూతురి అభిప్రాయాలను గౌరవించే వ్యక్తిగా కనబడుతాడు.

మోహిని ఎన్నికల్లో గెలిచి మంత్రిగా పదవి చేబడుతుంది. మద్యపాన నిషేధ చర్చలో మల్లాది వెంకట సుబ్బమ్మ, వాలిలాల గోపాలకృష్ణయ్య లాంటి వారిని ఒప్పించి కల్లును మినహాయించేలా చేస్తుంది. చైతన్యను ఆదర్శ వివాహం చేసుకొని సమాజానికి ఆదర్శ మహిళగా నిలబడుతుంది.

ఈ నవలలో గీత కార్మికుల సమస్యలపై పోరాటంతో పాటుగా రిజర్వేషన్లు, క్రిమిలేయర్ లాంటి విషయాలను చర్చించి బహుజనులు రాజ్యాధికారాన్ని చేపట్టాలనే ఆవశ్యకతను తెలుపుతుంది.

'బతుకుతాడు' నవలను 2004లో నేరెళ్ల శ్రీనివాస్ గౌడ్ గారు రచించారు. ఈయన స్వయంగా గీత కార్మికుడు. ఇందులోని కథ ప్రధానంగా మూడు కుటుంబాల మధ్య నడుస్తుంది. ధర్మయ్యగౌడ్, లింగమ్మల సంతానం భూమయ్య గౌడ్, నారాయణ గౌడ్, లక్ష్మణ్ గౌడ్.

భూమయ్య గౌడ్ బొంబాయిలో కల్లు దుకాణం పెట్టుకొని ఆర్థికంగా స్థిరపడుతాడు. నారాయణ గౌడ్, లక్ష్మణ్ గౌడులు గ్రామంలోనే ఉంటూ కల్లు గీత వృత్తి చేస్తూ జీవిస్తారు. గ్రామంలోని దొరలకు కల్లు పోయకుంటే వారు పెట్టే హింసలను లక్ష్మణరావు పటేల్ పాత్ర ద్వారా మనముందుంచారు రచయిత. ఇందులో ప్రధాన పాత్ర నారాయణ గౌడ్. నారాయణగౌడ్ భార్య లక్ష్మి. సంతానం శ్రీనివాస్ గౌడ్, తిరుపతి గౌడ్, గంగవ్వ, మంగవ్వ. ఆర్థికంగా వెనుకబడి ఉంటాడు నారాయణగౌడ్. గీత కార్మికుల సమస్యలపై స్పందించే గుణం కలిగి, వాటిని సాధించడానికి చేసే పోరాటంలో పాలుపంచుకుంటాడు నారాయణ గౌడ్. ఈ నవలలో తాటి, ఈతచెట్లలోని రకాలను, వాటిని గౌడులు పంచుకునే విధానం మరియు జిల్లా, మండల స్థాయిలో సొసైటీల వల్ల గ్రామీణ గీత కార్మికులకు జరిగే నష్టాలను మనముందుచుతారు రచయిత.

శ్రీనివాస్ గౌడ్ బొంబాయికి వెళ్ళి అక్కడ తన పెదనాన్న కల్లు అమ్మే విధానానికి, తన తండ్రి అమ్మే విధానానికి మధ్యగల తేడాని గమనిస్తాడు. అన్యాయంగా సంపాదించడం మంచిదికాదని ఇంటికి తిరిగి వచ్చి కుల వృత్తి నేర్చుకుంటాడు.

లక్ష్మణ్ గౌడ్ గ్రామ పంచాయితీ ఎన్నికల్లో వార్డు మెంబర్‌గా గెలిచి ఉపసర్పంచ్ అవుతాడు. తర్వాత అవినీతి ఆరోపణలు రావడంతో అన్న భూమయ్య గౌడ్ వెంట బొంబాయి వెళ్ళి అక్కడ కల్లు దుకాణం పెట్టుకుంటాడు. అక్కడ ఆర్థికంగా నష్టపోయి అనారోగ్యంతో మరణిస్తాడు. జగిత్యాల నుంచి

సొసైటీని వేరు చేయడంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారు గీత కార్మికులు. ముఖ్యంగా నారాయణ గౌడ్ తన ఆవుల్ని అమ్మి వచ్చిన డబ్బును సొసైటీ కొరకు వినియోగిస్తాడు. సొసైటీ వచ్చిన తర్వాత తోటి గౌడ కులస్థులు నారాయణ గౌడ్ శ్రమని గుర్తించరు. ఈ నవలలో మూడు తరాల జీవితాలు కనబడుతాయి. గ్రామాల వారీగా సొసైటీల ఆవశ్యకతను తెలుపుతుంది. గ్రామీణ రాజకీయాలు, పెత్తందార్ల దోపిడీలను, కులపురాణాల సంస్కృతిని మనముందుంచింది.

కె. వెంకటేశ్వర్లు రచించిన 'కల్లు మండువ' (2006) నవల గీత వృత్తి కుల మూలాలను ఆవిష్కరించింది. నవల తొలి భాగంలో స్వాతంత్ర్యానికి పూర్వం గౌడ కులస్థుల సామాజిక స్థితిని, తెలంగాణలోని దొరల దౌర్జన్యాలను తెలుపుతుంది. దొర ఉంపుడుగత్తె 'కాసుల దొరసాని' ఇంటికి చుట్టాలు వచ్చినప్పుడు వీరన్నకు విషయం తెలియక కల్లు పంపడు. దీంతో దొర ఇరవై కొరడా దెబ్బలు, వంద రూపాయలు జరిమాన విధిస్తాడు. బర్రెను అమ్మి, అప్పు చేసి జరిమాన కడుతుంది వీరన్న భార్య. ఈ సంఘటన చూసిన వీరన్న తండ్రి దుఃఖంతో, నిర్వేదంతో నాటి దొరల నుండి వారి ఇండ్లల్లో కింది కులాల వారు చేసే వెట్టి చాకిరిని గుర్తు చేసుకొని దొరలను ఎదిరించాలంటూనే మరణిస్తాడు. ఈ నేపథ్యంలో ధర్మబిక్షం ప్రవేశిస్తాడు. ధర్మబిక్షం ఈ నవలలో ప్రధానపాత్ర. అవిద్య, అజ్ఞానం వల్ల తమ వర్గాలన్నీ అణిచివేతకు గురవుతున్నాయని వారిని చైతన్య పర్చాలనే భావాలతో ఇంటి నుండి బయలుదేరుతాడు ధర్మబిక్షం.

దొరలకు అనుచరులుగా ఉన్న కొందరు ముస్తాదర్లు జిల్లా స్థాయిలో వేలంపాడి ఈ వృత్తిని, వృత్తి దారులను వారి చేతుల్లో పెట్టుకుంటున్నారు. వారు ఎంత శిస్తు వేసినా కట్టాల్సిందే, లేకుంటే హింసించి ఆస్తులను జప్తు చేస్తారు. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కోవడానికి గీత కార్మికులను ఐక్యంచేసి రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేస్తాడు ధర్మబిక్షం. దీంతో గీత కార్మిక సంక్షేమంతో పాటు దళారి వ్యవస్థను రద్దు చేయడం లాంటివి ప్రభుత్వం ఒప్పుకుంటుంది. స్త్రీ, పురుషులు సమానంగా కష్టించే కులవృత్తిగా పేర్కొంటాడు. ప్రమాదంలో భర్తలను కోల్పోయి నిరాశ్రయులైన భార్యలకు ఫించన్ ఇవ్వాలని కోరటంలో ధర్మబిక్షం నిబద్ధత కనబడుతుంది.

ఈ నవల మొత్తం గీత కార్మికుల ఉద్యమంతోపాటు వారి జీవితాలను ఆవిష్కరిస్తుంది. ఇందులోని పాత్రలు వృత్తిదారులే కావడంతో మొత్తం కథనిండా వృత్తి చైతన్యం కనిపిస్తుంది.

ఈ నవలలను పరిశీలించాక గీత కులవృత్తి దారులకు ఉపయోగపడే గౌడ సంఘాల ఆవశ్యకతను, తెలంగాణలో ప్రధానంగా ఉన్న దొరల దౌర్జన్యాన్ని మనముందుంచారు రచయితలు. సమస్యల పరిష్కారానికి ఉద్యమాలతో పాటుగా, రాజ్యాధికారాన్ని సాధించగలిగినప్పుడే అవి పరిష్కారమవుతాయనే భావన వీటిలో ఉంది. నాటి గ్రామీణ, కుటుంబ వ్యవస్థల గురించి చక్కగా వర్ణించారు. నేటికీ పరిష్కారం కాని ఎన్నో సమస్యలు గీత కార్మికులకు ఉన్నాయి. కల్లును ఆధునిక విజ్ఞానం ద్వారా నిలువ చేయగలిగితే గీత కార్మికులకు ఎంతోమేలు కలుగుతుంది.

**గౌడిచర్ల జనార్దన్,**

**పరిశోధక విద్యార్థి,**

**హైదరాబాద్ విశ్వవిద్యాలయం,**

**9949930903.**

janardhan.goudicharla@gmail.com


RNI No. APTEL/2003/12253

# భావవీణ

అంతర్జాతీయ తెలుగు సాహిత్య సాంస్కృతిక & భాషాధ్యయన మాసపత్రిక

# BHAVA VEENA

International Journal of Telugu Literary, Culture & Language Study

Vol : 15 Issue No. 12 (1) Monthly December 2018 ISSN No. : 2456-4702 Rs. : 15/-

ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC Approved Journal
No. 42500

## ధర్మవరం రామకృష్ణమాచార్యులు



మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

International Journal of Telugu Literary, Culture & Language Study

(అంతర్జాతీయ తెలుగు సాహిత్య, సాంస్కృతిక, భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao

E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482
Rohini Towers,
2/11 Brodipet, GUNTUR-2.

**Vol. 15 - Issue. 12 (1) - December 2018 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-**



**EDITORIAL BOARD**

*Chief Editor*
**PITTA SANTHI**
***M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,***
**C/o. Dr. Busi Venkataswamy**
Holy Homes Apartment
Postal colony ,4 Th Line,- 522 002, Guntur Dist., A.P.
Cell no : 7386529274, 7989781963.

**ADVISORY COMMITTEE**

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Dept. of Telugu,
Sri Padmavathi Mahila University, Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
HOD & Research Guide
Dept. of Telugu
PAS College, Pedanandipadu.

**ASSOCIATE EDITORS**

1. **Dr.N. R. SADASIVA REDDY,** M.A.,M.Phil,PhD.
Asst. Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **Dr.V.SANKARA RAO,** M.A.,M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu, Madras University, CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU,** M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Board of Studies Chairman, Telangana University,
Dichpally, Nizamabad, Telangana.
5. **Dr. N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Kakatiya University, Warangal District. Telangana.
7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai, Tamilnadu.

BHAVAVEENA
Vol. 15, Issue. 12 (1), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# Contents (విషయ సూచిక)


| | | |
|---|---|---|
| 1. రొంపిచెర్ల - పీలేరు మండలాలలోని సామెతలు | - ఆవుల గిరిబాబు | 5 |
| 2. ఆరడుగుల నేల ఆహ్వానించిన వేళ - మానవతావాద పరిశీలన | - ఆళ్ళ సుబ్బారెడ్డి | 9 |
| 3. మహి నవల - పురుష పాత్రల చైతన్యం | - బి.అరుణ | 13 |
| 4. ఒక విలక్షణ విద్య 'భ్రూకళావధానం' | - డాక్టర్ కప్పగంతుల మధుసూదన్ | 15 |
| 5. ఆధునిక యువతి ఆంతర్యానికి అద్దం పట్టిన "కలవరమాయే మదిలో" | - అల్లు గణేష్ | 17 |
| 6. మంతెన నాటికలు-హాస్యం | - డా. దార సుమన్ | 20 |
| 7. 'సాహితీ రత్న' మల్లవరపు రాజేశ్వరరావు సాహిత్యం - సామాజిక దర్శనం | - దిట్టకవి తిరుమల శ్రీనివాస్ | 25 |
| 8. కాలువ మల్లయ్య 'భూమిపుత్రుడు' నవల - రైతు జీవితం | - గడ్డం లింగరాజు | 28 |
| 9. ఖాదర్ మొహియుద్దీన్ 'పుట్టుమచ్చ' - ముస్లిం మైనారిటీవాద తాత్త్వికత | - డా॥ షేక్ ఇబ్రహీం | 30 |
| 10. 'సంకెళ్ళు తెగాయి' నవల - మంగలి వృత్తి జీవిత చిత్రణ | - గౌడిచర్ల జనార్దన్ | 35 |
| 11. బడబాగ్నిని దాచుకొన్న కడలి - కుంతి | - డా॥ నల్లపనేని విజయలక్ష్మి | 37 |
| 12. రాయప్రోలు కవిత్వం - దేశభక్తి | - సోనబోయిన సతీష్ | 40 |
| 13. అడుగు'జాడ'లు | - డా. ఇడికోజు శ్రీనివాసాచారి | 43 |
| 14. తెలుగు సాహిత్యములో నవలా రచయిత్రిగా శ్రీమతి డా॥ కె.శ్రీదేవి | - జె. సంజమ్మ | 45 |
| 15. హృద్యమైన బాలకథా రచయిత డా॥ గంగిశెట్టి శివకుమార్ | - ఎం. రామలింగయ్య | 50 |
| 16. వాడుక భాషోద్యమ పితామహుడు-గిడుగు రామమూర్తి | - డా॥డి. సత్యలత | 53 |
| 17. శిఖామణి-నల్లాగేటూ నంది వర్ధనం చెట్టు - "స్మృతి" కవితలు | - సుంకర గోపాలయ్య | 58 |
| 18. "తెనుగులెంక" తుమ్మల సీతారామమూర్తి రచనలు - సామాజిక సందేశం | - డా॥ పి. విజయకుమార్ | 60 |
| 19. అనువాదము - తీరుతెన్నులు | - డా॥ కె. పుష్పమ్మ | 63 |
| 20. నల్లదీగ శ్రీనివాసాచార్యుల కవిత్వం - వ్యక్తిత్వం | - బొలుగాని శోభన్‌బాబు | 66 |
| 21. లంబాడి రాందాసు నాటకం - గిరిజన సామాజిక జీవన విధానం | - మూడావత్ వెంకటేష్ | 70 |
| 22. సిక్కోలు సాహితీ నిర్దేశకులు | - డా॥ పప్పుల వెంకటరమణ | 72 |
| 23. ఉత్తమ కథా సాహిత్యంపై నమ్మకాన్ని ప్రోది చేస్తున్న రచయిత | - యం. మునే నాయక్ | 75 |
| 24. తెలుగులో స్త్రీల ఆత్మకథలు - పరిచయం | - డా. గిన్నారపు ఆదినారాయణ | 77 |
| 25. బొబ్బిలి యుద్ధ చారిత్రక ప్రాశస్త్యం | - డా॥ కె.వెంకటరమణ | 81 |
| 26. పత్రికల ద్వారా వెలుగులోకి వచ్చిన యువకవి | - డా॥ కోడూరు స్వతంత్రబాబు | 84 |
| 27. దళిత రచయిత్రుల కథా సాహిత్యం - పరిశీలన | - ఇరుగు. మధుకర్ | 87 |
| 28. "ఇప్పపూలు" కథా సంకలనం - గిరిజన సంచార తెగల జీవితం | - డా.పి.భగ్గు నాయక్ | 90 |
| 29. వర్తమాన సమాజానికి అద్దం పట్టిన - 'నిశ్శబ్ద యుద్ధం' | - డా॥ చిలకా అనిత | 95 |
| 30. తెలుగు దినపత్రికలలో సాహిత్య పుటలు:ఆధునిక కవితాభివ్యక్తి పద్ధతులు | - జోగు చిరంజీవి | 97 |
| 31. చాగంటి సోమయాజులు (చాసో) బొండు మల్లెలు - మానవతా విలువలు | - జి. శ్రీనివాస్, - డి.సుశీల్ ప్రత్యూష | 101 |
| 32. ఒద్దిరాజు సోదరుల 'రుద్రమదేవి' నవల చారిత్రక నేపథ్యం | - తాడూరి స్రవంతి | 104 |
| 33. ఉదంకుని ప్రతీకార రీతి - నేటి సమాజానికి అన్వయం | - వెంకట నరేంద్ర ప్రసాద్ | 107 |
| 34. భక్తి: పుట్టుక, ప్రస్తానం, ఉద్యమం | - నందిగామ నిర్మలకుమారి | 109 |
| 35. చెంచుల సాహిత్యం-సాంస్కృతిక జీవనం | - డా॥ బిర్రు అశోక్ | 111 |

BHAVAVEENA
Vol. 15, Issue. 12 (1), December - 2018.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# 'సంకెళ్ళు తెగాయి' నవల - మంగలి వృత్తి జీవిత చిత్రణ

- గౌడిచర్ల జనార్దన్, పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

తెలుగు సాహిత్యంలోని భిన్నప్రక్రియలలో రచనలు చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి ముదిగంటి సుజాతారెడ్డి గారు. ఈమె ప్రామాణికంగా ఆరు సాహిత్య విమర్శ గ్రంథాలు, నాలుగు సాహిత్య చరిత్ర గ్రంథాలు, మూడు నవలలు, నాలుగు కథా సంపుటాలు మరియు యాత్రా కథా రచనల్ని రచించారు.

సుజాతారెడ్డిగారు తెలంగాణ జీవితాన్ని చిత్రించే కథలు రాశారు. రైతుల జీవితాలను, సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేస్తున్న వారి జీవితాలను, మానవ సంబంధాలను, విచ్ఛిన్నం అవుతున్న కుటుంబ వ్యవస్థను గూర్చి విశ్లేషిస్తూ కథలు రాసారు. తెలంగాణ కథ 1910వ దశకంలోనే గురజాడ వారి తొలికథతోనే తెలంగాణ కథ వచ్చిందని, పరిశోధన పూర్వకంగా నిరూపిస్తూ తెలంగాణ తొలితరం కథలు అచ్చు వేసి తెలంగాణ కథ అస్తిత్వాన్ని, గౌరవాన్ని నిలిపారు.

సుజాతారెడ్డి గారు కథలతోపాటు నవలలు కూడా రాశారు. వీరు 'మలుపు తిరిగిన రథచక్రాలు' (1994) నవలలో తెలంగాణ సాయుధ పోరాటాన్ని, 'ఆకాశంలో విభజన రేఖల్లేవు' (1995) నవలలో స్త్రీల సమస్యలను, 'సంకెళ్ళు తెగాయి' (1994) నవలలో మంగలి వృత్తి జీవితాన్ని చిత్రించారు. వీరు 'తెలుగు నవలాను శీలనం' (1990) అనే విమర్శనాత్మక గ్రంథాన్ని మనకు అందిం చారు.

మనిషి పుట్టుక మొదలు మరణానంతరం వరకు జరిగే కార్యక్రామాల దాకా మంగలిరికం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. మంగలి వారినే నాయి బ్రాహ్మణులు అని కూడా పిలుస్తారు. మంగలులు కేవలం మంగలిరికం కాక శుభాశుభ కార్యక్రమాలలోనూ, దేవాలయాలలోనూ భజంత్రీలుగా సేవలు చేయడం లాంటివి కూడా కుల వృత్తుల్లో భాగంగా చేస్తున్నారు. వీటికి తోడుగా స్త్రీ ప్రసవ సమయంలో సహాయకారిగా ఉండి, పుట్టే బిడ్డ సంక్షేమాన్ని, స్త్రీ క్షేమాన్ని ఇద్దరిని కంటికి రెప్పలా కాపాడే మంత్రసానులుగా మంగలి స్త్రీలు ప్రసిద్ధి చెందారు. అందుకే " మంగలి వారిని మనదేశంలో మొట్టమొదటి సామాజిక వైద్యులుగా భావించవచ్చు. తమిళనాడులో ఇవాల్టికీ మంగలిని 'మరుతువార్' అనే అంటారు. దీనికి వైద్యుడని అర్థం. ఈ సామాజిక వర్గంలోని స్త్రీలు సంప్రదాయంగా గ్రామాల్లో మంత్రసానులుగా పని చేశారు. ఉత్తర భారతదేశంలో వీరిని 'దాయీ' లంటారు. వీళ్ళు ఒకరకంగా ఆధునిక నర్సుల వంటివారు" (పద్మారావు, కత్తి. పుట: 81,82: 2007). అంతేగాక దేశంలో కొన్ని ప్రాంతాలలో పెళ్ళి, చావు, దినాలు వంటి వార్తలను బంధువర్గానికి చేరవేయడంలో, కార్యక్రమాలలో పని చేయడం జరుగుతుంది. నేటి కమ్యూనికేషన్ వ్యవస్థ అభివృద్ధి చెందడంతో వార్తలను చేరవేసే పని మంగలివారికి తగ్గిపోయింది. ఈ విధంగా సామాజిక సేవకులుగా ఉన్నటువంటి మంగలి వృత్తిదారుల జీవితాల్ని ముదిగంటి సుజాతారెడ్డి సంకెళ్ళు తెగాయి నవలలో చిత్రించారు.

ముదిగంటి సుజాతారెడ్డి గారు రచించిన 'సంకెళ్ళు తెగాయి' నవల మొత్తం పదిహేను భాగాలుగా ఉండి ధారాళమైన శైలితో అందరిని చదివించే గుణం కలిగి ఉంది. మారుమూల గ్రామాలలో మంగలి వృత్తిచేసుకుంటూ జీవితాన్ని గడుపుతున్న కుటుంబ పరిస్థితులను మన ముందుంచుతుంది ఈ నవల. పల్లెలోని వివిధ కులవృత్తుల ఆవిష్కరణను, వారిని ఇతరులు దోపిడి చేసే విధానాన్ని తెలుపుతూ విద్య అనేది వారిలో మార్పుకు సంకేతంగా మారుతుందన్న అభిప్రాయాన్ని సుజాతారెడ్డి గారు మనముందుంచారు.

"ఈరయ్య మంగలి పెట్టె చంకన పెట్టుకొని దొర రాజేశ్వర రావు గడివైపు నడిచాడు" అనే ప్రారంభ వాక్యంలోనే కులవృత్తి ప్రస్తావన కనిపిస్తుంది. ఈరయ్య కులవృత్తి ఆధారంగా జీవిస్తుంటాడు. భార్య రంగి, కొడుకు నారాయణ, కూతుర్లు పూలమ్మ, చంద్రమ్మ, పద్మమ్మలు. ఈరయ్య ఆస్తి నాలుగు ఎకరాల మడి చెలక, ఒక మంగలి పెట్టె. రాజేశ్వరరావు ఈ గ్రామానికి దొర. రాజేశ్వరరావు కూతురు సుశీలకు కొడుకు పుడితే పుట్టు వెంట్రుకల కార్యక్రమం ఉంటుంది. ఒక భూస్వామి ఇంట్లో ఆర్భాటంగా జరిగే కార్యక్రమాలతో పాటు, ఆ కార్యక్రమాల్లో చాకలి, మంగలి వంటి వివిధ కులాల చాకిరి విధానం కూడా ఈ నవలలో కనిపిస్తుంది. సాయంత్రానికి గాని పనిచెయ్యడానికి వచ్చిన వివిధ వృత్తులవాళ్ళకు భోజనాలు పెట్టరు. అదికూడా వచ్చిన బంధువులు తిని పోయాక మిగిలిన ఆహారాన్ని వీళ్ళకు పెట్టడం జరుగు తుంది.

ఈరయ్య కొడుకు నారాయణ. నారాయణది ప్రధానపాత్ర. తన తండ్రితోపాటు మిగత కులాల వారు చేస్తున్న ఊడిగానికి బాధపడుతాడు. నారాయణకు చదువు మీద ఆసక్తి ఎక్కువ. నారాయణ మెట్రిక్ పాసైన తర్వాత వెంకట్రామయ్య పంతులు ప్రోత్సాహంతో ఇంటర్‌లో చేరి పాసవుతాడు. నారాయణ, దొర కొడుకు రామేశ్వరరావు డిగ్రీ చదవడానికి ఒకే కాలేజిలో చేరుతారు. రామేశ్వరరావు నారాయణను ఎప్పుడూ హీనంగా చూస్తాడు. నారాయణ మాత్రం చదువులో శ్రద్ధను కనబరుస్తూ ఉత్తమ విద్యార్థిగా ఉంటాడు. కాలేజి ప్రెసిడెంట్‌గా మిత్రుల ప్రోత్సాహంతో రామేశ్వరరావుపై నారాయణ పోటీ చేస్తాడు. కాని ధనబలం ముందు ఓడిపోక తప్పలేదు.

నారాయణ చదివే కళాశాలలో వేద ప్రకాశ్ చరిత్ర అధ్యాపకుడు. నారాయణ కష్టపడి చదవడం చూసి ముగ్ధుడై నారాయణకు ప్రోత్సాహాన్ని అందిస్తాడు. నారాయణ స్నేహితురాలు అనల. ఆమె డిగ్రీ రెండో సంవత్సరం విద్యార్థిని. అనల తల్లి దండ్రులు అభ్యుదయ భావాలుగలవారు. ఒక రోజు అనల నారాయణతో వారి ఊరికి వెళ్తుంది. ఊరిలోని దొర భార్య రాజ్య లక్ష్మమ్మ చేనేతకారుల దగ్గర తక్కువ ధరకు చీరెలు కొని, ఆ చీరలను పట్టణంలో ఎక్కువ ధరకు అమ్ముకొని డబ్బులు సంపాదిస్తుంది. ఇలా శ్రమ జీవులను దోపిడి చేయడాన్ని గమనించిన అనల చేనేత కార్మికులను సహకార సంఘాలుగా ఏర్పడాలని చైతన్యపరుస్తుంది. స్టీలు, ప్లాస్టిక్ వస్తువుల రాకతో కుమ్మర్ల జీవితాలు అగమ్యగోచరంగా మారడాన్ని చూసి బాధ పడుతుంది. కమ్మరి, వడ్రంగి, కంసాలి వృత్తిపనిలో దాగివున్న కళాత్మకతను పరిశీలిస్తుంది. ఇలా అనేకమైన కుల వృత్తుల వారి జీవన విధానాన్ని ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతికాది కోణాల్లో అధ్యయనం చేస్తుంది. రాజేశ్వరరావు గడికి చేరుకున్నప్పుడు అక్కడ అతని ఇంటి వైభవంతోపాటు, ప్రజల్ని కొల్లగొట్టే ఆధిక్యతను గుర్తిస్తుంది.

బాలయ్యది నారాయణ ఊరే. వరసకు బావవుతాడు. బాలయ్య చిన్నప్పటినుండి అల్లరి చేస్తు పనిచేయకుండ తిరిగేవాడు. ఒకరోజు ఎవరికి చెప్పకుండ పట్టణం వెళ్ళి అక్కడ మంగలి షాపులో పని నేర్చుకొని ఊరికి తిరిగి వచ్చి స్టేషన్ దగ్గర్లో షాపు పెడతాడు. బాలయ్య పని విధానం చూసి అందరు ఇతని దగ్గరికే రావడంతో ఊరిలోని మిగత మంగలివాళ్ళు వ్యవసాయ కూలీలుగా మారుతారు. బాలయ్య షాపుకు వార్తా పత్రికలు తెప్పిస్తాడు. దాంతో ఊరి ప్రజలకు సినిమాలు, ఎరువులు, విత్తనాలు మొదలుకొని రాజకీయ విషయాలు పరిచయమవుతాయి. ఈ విధంగా గ్రామ ప్రజలకు కొత్త విషయాలను నేర్పిన ఘనత బాలయ్యకే దక్కుతుంది.

ఈరయ్య సంప్రదాయంగా వస్తున్న తన వృత్తిలో ఎలాంటి మార్పులు లేకపోవడంతో ఆదాయం లేక కుటుంబాన్ని పోషించడం కష్టతరంగా ఉంటుంది. గ్రామంలోని దొరలకు ఎంత సేవ చేసినప్పటికి ఒక పూట భోజనం తప్పా ఆదాయం రాదు. బాలయ్య మాత్రం పట్టణంలో నేర్చుకున్న నూతన పని విధానంతో పాటుగా షాపులో అద్దాలు బిగించడం, సినిమా చిత్ర పటాలు అతికించడం మరియు వార్తా పత్రికలను తెప్పించడంతో గ్రామ ప్రజలను ఆకర్షిస్తాడు. దాంతో వృత్తిలో కొంత ఎదుగులను పొందుతాడు బాలయ్య. ఇక్కడ ప్రధానంగా వృత్తికారులు నేటి తరానికి అనుగుణంగా తమ వృత్తులలో నూతన పోకడలు తీసుకరాగలిగినప్పుడే వారు ఎదుగుతారనే విషయాన్ని గమనించవచ్చు. మారుతున్న కాలానికి అనుగుణంగా వృత్తులలో వస్తున్న మార్పుల్ని, గొప్పతనాన్ని, వృత్తి గౌరవాన్ని గ్రహించిన ఉన్నత కులాలవారు వాటిని సొంతం చేసుకోవడం మొదలుపెట్టారు. ఇలా వృత్తుల్ని తమ ఆధీనంలోకి తెచ్చుకొని మరొక పేరుతో విలువైన జీవన అవసరంగా, వనరుగా సృష్టించి పేదవాడికి ఉపాధి లేకుండా చెయ్యడం సమాజంలో మనకు స్పష్టంగా కనబడుతుంది.

నారాయణ సివిల్స్ రాయటానికి ప్రయత్నిస్తుంటాడు. అతనికి స్ఫూర్తినివ్వటానికి అనల కూడా కోచింగ్ సెంటర్‌లో చేరుతుంది. నారాయణ చెల్లె పూలమ్మ భర్త రాజయ్య ఐటిఐలో ఎలక్ట్రీషియన్ కోర్స్ చేసి సింగరేణి గనుల్లో ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తుంటాడు. సింగరేణిలో ఉద్యోగం ఇప్పిస్తానని బ్రోకర్ ఐదువేలు తీసుకుంటాడు. కాని ఉద్యోగం ఇప్పించడు. దీంతో తన బాధను అన్నలకు చెప్పుకుంటాడు. రాజయ్యకు వారి సిద్ధాంతాలు నచ్చి దళంలో చేరి బ్రోకర్‌ను చంపడం జరుగుతుంది. తర్వాతి కాలంలో పోలీసుల కాల్పుల్లో రాజయ్య మరణిస్తాడు. దాంతో పూలమ్మ పుట్టింటికి వస్తుంది. పోలీసులు విచారణ పేరుతో ఈరయ్య కుటుంబాన్ని వేధిస్తుంటారు. ఈ సంఘటనలు నారాయణను కలచివేస్తాయి. అనల, వేద ప్రకాశ్‌లు నారాయణలో మనోధైర్యాన్ని నింపుతారు. నారాయణ సివిల్స్ పరీక్షలు రాసి పాసవుతాడు. నారాయణ ఐఏఎస్ ట్రైనింగ్ కోసం వెళ్ళినప్పుడు అతని కుటుంబం వేదప్రకాశ్ ఇంట్లో ఉంటుంది. అనల నారాయణల స్నేహం కాస్త ప్రేమగా మారడంతో నవల ముగుస్తుంది.

ఈవిధంగా ఒకే వృత్తి కుంటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు, వారి జీవితంలో ఎదురైన సంఘటనలను, వాటిని ఎదుర్కొన్న విధానాన్ని మన కళ్ళముందుంచారు రచయిత్రి. బాలయ్య తన కులవృత్తిలో ఆధునికతను జోడించి, ప్రజలను ఆకర్షించడంతో వృత్తిలో ఎదుగుదలను చూస్తాడు. రాజయ్య ఉద్యోగం కొరకు ప్రయత్నం చేసి చివరికి బ్రోకర్ మాటలు నమ్మి మోసపోవడంతో దళంలో చేరి చివరకు పోలీసు కాల్పుల్లో మరణిస్తాడు. అనల వేదప్రకాశ్ లాంటి విద్యావంతుల సహకారంతో నారాయణ ఐఏఎస్ అయి జీవితంలో స్థిరపడతాడు. నిమ్న కులంలో పుట్టిన నారాయణ కథే "సంకెళ్ళు తెగాయి" నవల ఇతివృత్తం. ఈనవలకు మరొకపేరు "నారాయణ విజయం". విద్య అనేది ఒక వ్యక్తిని ఉన్నతస్థానంలో నిలబెడుతుందనే విషయానికి నాందిగా ఈ నవలను పేర్కొనవచ్చు. మంగలి వృత్తి జీవితాలను చిత్రించిన తొలి నవల ఇది.

❀❀❀